# ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్.

## భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 5 - Spl. Edition - May 2022 - ISSN No. : 2456-4702


# కాళీపట్నం రామారావు సాహిత్యం - సమాలోచన

## అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

13- 14 మే 2022




నిర్వహణ :

డా॥. పి. సురేఖ, ప్రధాన సంపాదకులు,

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం.




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 19 - Special Issue 5 - May 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

## ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

**శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్.**

# కాళీపట్నం రామారావు సాహిత్యం - సమాలోచన

# అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

**తేది : 13 - 14 మే 2022.**

నిర్వహణ :

తెలుగు విభాగం

# కాళీపట్నం రామారావు సాహిత్యం - సమాలోచన

# అంతర్జాతీయ అంతర్జాల సదస్సు


**భావవీణ** ప్రత్యేక సంచిక

**ISSN No. : 2456-4702**

**RNI No. APTEL/2003/12253**
**UGC CARE - Journal - Arts & Humanities**

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | **13 మే 2022** |
| ప్రతులు | : | **500** |
| కాపీలకు | : | **ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు – 522 002.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |

# కాళీపట్నం రామారావు సాహిత్యం - సమాలోచన

## అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

ప్రదాన సంపాదకులు :

**డా॥. పి. సురేఖ**

ప్రిన్సిపాల్

సంపాదకవర్గం :

**డా॥. పి. వి. రమణ**

**డా॥. జి. వి. యస్. జయపాలరావు**

**డా॥ ఢిల్లీశ్వరరావు సనపల**

**శ్రీ పి. నారాయణరావు**

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# ముందుమాట

కాళీపట్నం రామారావు రచనా శక్తి, సాంద్రత, సాహిత్యంలో విభిన్న దృక్పథాలు, సామాజిక సంఘర్షణలు, భావ వ్యక్తీకరణ వ్యత్యాసాలు తెలిపే స్థాయి మాకు లేకపోయినా ఆయన రచనలు సరళంగా హృదయ రంజకంగా సగటు మనిషిని ఆలోచింపజేసేవిగా ఉంటాయని చెప్పవచ్చు. సమాజంలోగల సాంస్కృతిక, సాంఘిక పరిస్థితులను ప్రతిధ్వనిస్తూ తెలుగు కథ ఉన్నంతకాలం కారా మాస్టారు కథలు నిలుస్తాయి. ఆయన పేరు మీద ఈ వెబినార్ నిర్వహించడం సంతోషదాయకం. ఈ అంతర్జాల అంతర్జాతీయ సదస్సుకు కాళీపట్నం రామారావు సాహిత్యం సమాలోచన అంశంగా తీసుకోవడానికి ఇదే కారణం.

కొడవటిగంటి కుటుంబరావుగారన్నట్టు, గొప్ప కథలు గొప్ప కథకులు రాస్తే తప్ప రావు. గొప్ప కథలు రాసిన ఘనత అతి కొద్దిమంది తెలుగు కథకులకు మాత్రమే దక్కుతుంది. అటువంటి వారిలో కాళీపట్నం రామారావు ఒకరు అనేది అక్షరసత్యం.

ఒకవేళ దేవుడే మానవుడయితే అప్పుడు అతనయినా సరే శ్రీ కాళీపట్నం రామారావుగారికి నమస్కరించి తీరవలసిందే! పురుషులలో పుణ్యపురుషులు వేరయా అని వేమనగారు రామారావు వంటి వారిని చూసి చెప్పి ఉంటారు అని అంటారు రావిశాస్త్రి .

కాళీపట్నం రామారావు నుండి ప్రేరణ పొంది అతన్ని గురువుగా భావించానని ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు.

ఇంతటి మహోన్నతమైన వ్యక్తి, సుప్రసిద్ధ కథకుడు, కథానిలయం వ్యవస్థాపకుడు, రెండవ తరం తెలుగు కథకుల్లో ప్రముఖుడైన కాళీపట్నం రామారావు శ్రీకాకుళం జిల్లా వాసి. నాగావళి తీరంలో ఎందరో వర్ధమాన వ్యక్తులను సృజించి ప్రోత్సహించడం, ఉత్తరాంధ్రలో అనేక సాహితీ కార్యక్రమాల్లో పాల్గొడం, ప్రత్యక్షంగానో పరోక్షంగానో, ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపక, విద్యార్థులకు ఆయనతో సన్నిహిత సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండడం గొప్ప మధురానుభూతి. మన మధ్య మెలిగిన సాహితీ శిఖరాన్ని మననం చేసుకోవడం సముచితం. ఆయన విడిచిన అనుభూతులను ప్రపంచానికి పరిచయం చేయాలనే సంకల్పంతో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ అంతర్జాల అంతర్జాతీయ వెబినార్ నిర్వహించడం జరుగుతుంది.

ముగ్గురు మిత్రుల సహకారంతో నా జీవన గమనాన్ని మార్చుకున్నానని అంటారు కారా మాస్టారు. అందులో ఒకరు నన్ను పుస్తకాల ప్రపంచంలోనికి, భావ ప్రపంచంలోనికి క్రమంగా లౌకిక ప్రపంచానికి తీసుకు వచ్చాడని పేర్కొన్నారు. ఒక మిత్రుడు మార్క్సిస్టు దృక్పథంతో నిరంతరం చర్చించి ఎలాంటి పత్రికలను చదవాలి, ఎవరెవరు వ్యక్తులు జీవితంలో వెలుగునిస్తారో చెప్పి నన్ను రచనావ్యాసంగం లోకి దూకే టట్టు చేశాడని స్వయంగా మాస్టారే పేర్కొన్నారు. ఏ ఇజాలు జోలికి పోకుండా, రచయితల సంఘాల్లో మమేకం కాకుండా, చుట్టూ ఉన్న సమాజంలోగల అసమానతలు, దుర్భర సాంఘిక పరిస్థితులను అధ్యయనం చేస్తూ ఉపాధ్యాయుడిగా సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ, సామాన్యుల జీవితాల్లో వెలుగు నింపే వైపుగా తన దృక్పథాన్ని మలుచుకున్న మానవతావాది కారా మాస్టారు. అటువంటి గొప్ప వ్యక్తి సాహిత్యం మీద నిర్వహిస్తున్న అంతర్జాల అంతర్జాతీయ సదస్సును కవులు, రచయితలు, ఆచార్యులు, అధ్యాపకులు పరిశోధక మిత్రులు, విద్యార్థులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

– డాక్టర్ జి.వి.ఎస్. జయపాలరావు

# సదస్సు ఉద్దేశ్యం

ఆధునిక తెలుగు సాహిత్యంలో కథానికా రచయితగా లుప్రతిష్ఠులై, శ్రీకాకుళం ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేసిన సాహితీ ప్రముఖులు శ్రీ కాళీపట్నం రామారావుగారు. కారా మాష్టారుగా కథల మాస్టారుగా ఖ్యాతిని గడించిన కారాగారు శ్రీకాకుళం జిల్లా పొయారు గ్రామంలో 1924 నవయర్ 9వ తేదీన భద్రమాణ సేర్భాజు దంపతులకు జన్మించారు. బహుముఖ ప్రతాశాలైన మాస్టారుగారు చిన్నతనం నుండి గ్రామీణ వాతావరణంలో పెరగడం కారణంగా గ్రామీణ సమాజానికి అత్యంత చేరువగా ఉండి గ్రామీణ పరిస్థితులు నొత పరిశీలన చేయడం అలవాటైంది.

తదనాంతరకాలంలో అది వెనకై విస్తరణ పొందింది. ఎస్.ఎస్.ఎల్సి పూర్తి చేసిన మాస్టారు 1948 నుండి 1979 వరకు సెయింట్ ఆంథోస్ స్కూల్లో లెక్కల మాస్టారుగా పనివేసి ఉద్యోగ విరమణ చేశారు. 1943 నుండి రచనా వ్యాసంగం ప్రారంభించిన కారా మాష్టారు జీవిత చరమాంతం వరకు కథా సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు అనేక రాష్ట్రస్థాయి పురస్కారాలు మరియు కానపీఠ పురస్కారం మొదలైన అనేక పురస్కారాలను పొందడం కారాగారి ప్రతిభకు నిదర్శనం. కాళీపట్నం రామారావుగారి రచనల్లోని రచనా శిల్పం కాన ప్రకటన. సామ్యత, దృక్పథానగాహన మార్క్సిస్ల భావణాల తీరుతెన్నులు విప్లవోద్యను స్పూర్తి మొదలైన అంశాల పేట్ల సమాలోచనం చేయడం కోసం వేదికను ఏర్పాటు చేయడం ద్వారా విశ్వవిద్యాలయ ఆచార్యులు. అధ్యాపకులు. దేశ విదేశాల్లోని సాహితీ ప్రముఖులు వర్ణమాన రచయితలు, పరిశోధకులు. సాహిత్యాభిమానులు అదరినీ ఒక వేదిక మీదకు తీసుకొచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయడం కారా మాస్టారు సాహిత్యంపై లోతైన సమాలోచనం జరుగుతుందని ఆశిస్తున్నాం.

గొప్ప కథకులు రాస్తే తప్ప గొప్ప కథలు రావు. అటువంటి గొప్ప ప్రయత్నం చేసి గొప్ప కథలనందించిన అతి కొద్ది మంది కథకుల నరసిన స్థానం సంపాదించిన వ్యక్తి రారా మాష్టారు. రాధాగారి రచనా విధానం. జీవన విధానం ఎందరికో ఆదర్యం. కారా మాస్టారు రచనా విధానంలో నూతనత్వానికి మార్గదర్శి గురుతుల్యుడు రావిశాస్త్రిగారు.

మాస్టారి వ్యక్తిత్వాన్ని అనేక విధాల కొనియాడారు. కాళీపట్నం రామారావుగారి రచనా స్పూర్తి వ్యక్తిత్వ స్ఫూర్తి ఎందరో వర్ధమాన రచయితలకు మార్గదర్శి. రెండవ తరం కథకుల్లో అల్లు ప్రతిష్టలైన కారా మాస్టారు ఉత్తరాంధ్రవాసి అందునా శ్రీకాకుళం వాసి నాగావళి తీరాన వెలసిన సాహితీ ప్రవాహం కారా మాస్టారు ఆధునిక తెలుగు కథకు పుట్టినిదైన ఉత్తరాంధ్రలో కథా సాహిత్యానికి ఎనలేని సేవలందించిన కారా మాస్టారు జన్మించిన శ్రీకాకుళంలో గల మా కళాశాల తెలుగు విభాగం కారాగారి సాహిత్యం పై అంతర్జాతీయ అంతర్జాల సదస్సు ఏర్పాటు చేయడం ఎంతో సమచితమని భావిస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇవాల జోలికి పోకుండా విశాల ప్రపంచ దృక్పతం. గొప్పదైన భావస్ఫూర్తి శ్రీకాకుళం గ్రామీణ మండలిక భాషా ప్రవాహం. సరళమైన పదాలతో ధానగర్భితమైన రచన కారా మాట్లాడి సొంతం. వర్గ సమాం మూలాలను అన్వేషిస్తూ 'కు' ఎక్కడ ఏవిధంగా జరిగిందో వివరించడంలో ఆర్థికవేత్తలకు తీసిపోని ఆలోచనా శక్తి మాస్టారిది. అన్నమరానులకి అతలి మంటలకి మధ్య వ్యత్యాసాన్ని 'జీనధార'గా మలిని చెప్పగలిగిన నేర్పరితనం కారాగారికి చెల్లుతుంది. సమాన ప్రాతినిధ్యం

కలిగిన సందర్భంలో న్యాయం ఎవరిదని 'తీర్పు చెప్పగల గొప్ప న్యాయ కోవిదుని తలపిస్తుంది వారి నేర్పరితనం. తారా మాట్లారి రచనల్లో ప్రపంచీకరణ నేపథ్యం గ్రామీణ వాతావరణం. సమకాలీన ఆర్థిక రాజకీయ సామాజిక విషయాలు కళ్ళుకు కట్టినట్లు కనిపిస్తాయి. సమన్యాయ సాధన ఎప్పటికీ ఎండమానే ఒకరికి లాభసాలైంది మరొకరికి తీరని నష్టాన్ని కలిగిస్తుందని తెలియజేప్పడంలో 'యజ్ఞం' తలపెట్టిన కర్మయోగి రాశారు. మనిషిలో నిగూఢంగా నిలిచిన 'భయం'ను బయల్పరిచే మనస్తత్వ శాస్త్రవేత్త మాస్టారు. బెంజ్ కారు సుఖం ఒకరిది గంటి కూడు వెతు మరొణచని సమారాను నితాస్వరూపాన్ని చాను' కబురు చల్లగా అన్నట్లు నెమ్మదిగా చెప్పగలిగిన నేర్పరి మాస్టారు.

సాహిత్య ప్రక్రియల్లో ఒకటైన కథా సాహిత్యానికి సంబంధించి కథానిలయం పేరుతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం కారాగారికి వెల్లింది. కారా మాస్టారు ఏర్పాటుచేసిన ఝానిలయం తెలుగు కథకు కోసం జీవం పోయడంతో పాటు సాహిత్య పరిశోధనలకు కేంద్రటించువైంది. కథ కంచికి అనే నానుడిని తిరగరాస్తూ కథ కథానిలయానికి అనే విధంగా నేడు కథానిలయం సుస్థిరత పొందింది. దీనికంతటికీ మార్గదర్శి కర్త, కర్మ, క్రియ కారా మాస్టారు. అటువంటి కారా మాస్టారు సాహిత్యం పైన 'కాళీపట్నం రామారావు సాహిత్య సమాలోచన' పేరుతో రెండు రోజులు అంతర్జాతీయ సదస్సుకు మా కళాశాల తెలుగు విభాగం అంతర్జాల వేదికగా రారా సాహిత్యం పై లోతైన పరిశోధనలు జరగాలనే ఆలోచనతో ఈ సదస్సు నిర్వహిస్తున్నాం. మా ప్రయత్నం సఫలీకృతం చేయాలని ఆకాంక్షిస్తూ..

– డాక్టర్ ఢిల్లీశ్వరరావు సనపల,
తెలుగు అధ్యాపకులు, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల
(పురుషులు), శ్రీకాకుళం

# Contents (విషయసూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | కారాపై రావిశాస్త్రి ప్రభావం | - ఆచార్య వెలమల సిమ్మన్న | 1 |
| 2. | కారా కథల్లో స్త్రీ పాత్రలు | - డా॥ బి. నాగశేషు | 7 |
| 3. | యజ్ఞం - సమకాలీన సంబంధాలు | - డా॥ బూర్గుల స్వరూప<br>డా॥ జంపులు తిరుపతయ్య | 10 |
| 4. | చావు కథ ఒక పరిశీలన | - డా॥ చాగంటి నాగరాజేశ్వరి | 13 |
| 5. | కా.రా. మాష్టారి కథలు - ప్రాంతీయ అస్తిత్వం | - డా॥ దార్లపూడి శివరామకృష్ణ | 16 |
| 6. | 'భయం' కథ సామాజిక సందేశం | - డా॥ కిలారి గౌరినాయుడు | 19 |
| 7. | భావనా లోకంలో బ్రతుక్కి అర్థం చెప్పిన స్నేహం | - డా॥ మెండా దేవానంద్ కుమార్ | 22 |
| 8. | ఆధునిక తెలుగు సాహిత్యంలో కాశీపట్నం రామారావు స్థానం | - డా॥ పుట్ట శ్రీనివాసులు | 26 |
| 9. | నీటి సమస్యకాధారమేదని ప్రశ్నించిన కా.రా. జీవధార | - డా॥ పులపర్తి శ్రీనివాసరావు | 28 |
| 10. | కా.రా. ఆర్థిక సంబంధమైన కథలు - పరిశీలన | - డా॥ యస్.సి. సంజీవరెడ్డి | 33 |
| 11. | కథా మాస్టారు | - జంధ్యాల శరత్‌బాబు | 36 |
| 12. | యజ్ఞం - సమిధలౌతున్న శ్రమజీవులు | - కోష్టు గోవిందరావు | 40 |
| 13. | దాహం తీరని ఆర్తి' | - ఎస్. లలిత | 44 |
| 14. | "యజ్ఞం కథ అప్పలరాముడు పాత్ర వైశిష్ట్యం" | - షేక్ షానాజ్ బేగం | 48 |
| 15. | తెలుగు కథా సాహిత్యానికి దిక్సూచి యజ్ఞం | - తంగి ఓగేశ్వరరావు | 53 |
| 16. | 'భయం' కథ - సామాజిక విశ్లేషణ | - తేలు వెంకట కుమారి | 58 |
| 17. | కారా కథలలో సామాజిక దృష్టి- ఒక పరిశీలన<br>డా॥ బి. వేణుగోపాలరావు | - డా॥ జి.వి.యస్.జయపాలరావు | 62 |
| 18. | అభిమానాలు నవలిక : ఒక పరిశీలన | - డా. సిహెచ్. సావిత్రి | 65 |
| 19. | కారా మాస్టారు కథలు - వర్గ సమాజ నిర్మాణం తీరుతెన్నులు | - డా॥ ఢిల్లీశ్వరరావు సనపల | 70 |
| 20. | కా.రా. గారి కథలు - మానవ సంబంధాలు | - డా॥ బి.శ్రీనివాసరావు | 75 |
| 21. | కాళీపట్నం రామారావు జీవితం - కథల్లో సమాజ చిత్రణ | - బి.క్యాథరీన | 78 |
| 23. | కారా వారి 'ఇల్లు' కథ - సామాజికాంశాలు | - శ్రీమతి నెమ్మలూరి భవాని | 84 |

| | | |
|---|---|---|
| 24. 'భయం' కథ ద్వారా రచయిత సమాజానికిచ్చిన సందేశం | - డా॥ ఒ. రామారావు | 86 |
| 25. కా.రా. కథల్లో కుటుంబ విలువలు | - డా॥ బి. చక్రవర్తి | 92 |
| 26. కాళీపట్నం రామారావు కథలు - సామాజిక దృష్టి | - డా॥ ఎల్. కస్తూరి | 96 |
| 27. కాళీపట్నం రామారావు గారి కథల్లో సామాజిక సందేశం | - డా॥ పి. కమలసుధారాణి | 99 |
| 28. కారా కథలు - చైతన్య చంద్రికలు | - డా॥ సూరపరాజు వసంత కుమారి | 102 |
| 29. కారా వారి 'భయం' కథ - పరిశీలన | - డా॥ పి. వెంకటరమణ | 106 |
| 30. కా.రా. శ్రామిక వర్గ జీవిత కథలు - పరిశీలన | - ఆర్.యన్. రవి కుమార్ | 109 |
| 31. యజ్ఞం కథ - పాత్రల పరిశీలన | - డా॥ ఎం.లక్ష్మయ్య | 112 |
| 32. కారా కథలు-సామాజిక దృక్పథం | - డా॥ మల్లెపోగు మాదన్న | 116 |
| 33. ఫలించని 'సంకల్పం' | - శీ బండారి ప్రేమ్ కుమార్ | 120 |
| 34. అనురాగాల రాగమయి | - యం. ప్రదీప్ | 123 |
| 35. చావు కథ - సామాజిక పరిశీలన | - శ్రీమతి ఇ.కల్యాణి | 126 |
| 36. కారా గారి కథలు - కుటుంబ విలువలు | - యస్. రజిత | 130 |
| 37. కాళీపట్నం రామారావు కథలు - సాంఘింకాంశాలు | - లలిత మేరి దాసరి | 133 |
| 38. కా.రా. సాహిత్యంలో "యజ్ఞం" - పరిశీలన | - కె. రంగనాయకులు | 136 |
| 39. కారా కథాసాహిత్యం - సమాలోచనం | - డా. పెద్దింటి ముకుందరావు | 139 |
| 40. కారా సాహిత్యం - కథాంశం | - శ్రీమతి సుభాషిణి ప్రత్తిపాటి | 143 |
| 42. కాళీపట్నం రామారావు కథలు - సామాజిక స్పృహ | - డా॥ కడియాల వెంకటరమణ | 145 |
| 44. కాళీపట్నం రామారావు కథల్లో మానవ సంబంధాలు | - శ్రీ పి. నారాయణరావు | 150 |
| 45. కారా మాస్టారి సంకల్పం కథ - ఒక పరిశీలన | - నందూరి అనంతలక్ష్మి | 153 |

# కారాపై రావిశాస్త్రి ప్రభావం

**- ఆచార్య వెలమల సిమ్మన్న,** విశ్రాంతాచార్యులు, ఆంధ్రవిశ్వ కళాపరిషత్, విశాఖపట్నం, చరవాణి : 9440641617

"రాచకొండ విశ్వనాథశాస్త్రిని గురువుగా భావించాను. ఆయన మార్గంలోనే, కథను సమాజికీకరించడానికి ఆనాడు ముందడుగు వేసిన రచయితలతో పాటు కలిసి, నేనూ ఒక అడుగు వేశానని అనుకుంటాను. రావిశాస్త్రితో పరిచయం ఏర్పడిన తర్వాత, రచయితకు ఒక ప్రాపంచిక దృక్పథం ఉండాలనే అభిప్రాయం నాకు ఏర్పడింది. రావిశాస్త్రితో నా పరిచయం నలభైయేళ్ళది. ఈ నలభై యేళ్లలో వారి నుండి నేనెన్నో గ్రహించాను. కొన్నాళ్ళు వారి నిత్య సహచర్యం వల్ల, ఎన్నెన్నో తెలుసుకొన్నాను." - కాళీపట్నం రామారావు కారాగా, మాష్టారుగా, కారా మాష్టారుగా "కారా" మాష్టారుగా, కథల మాష్టారుగా, దేవుడు మాష్టారుగా, కథా నిలయం వ్యవస్థాపకులుగా, స్నేహశీలిగా, సహృదయులుగా పేరు ప్రఖ్యాతులు గడించిన విఖ్యాత కథకులు "కళాప్రపూర్ణ" కాళీపట్నం రామారావుగారు.

వీరు 9 నవంబరు 1924లో శ్రీకాకుళం జిల్లా "మురపాక" గ్రామంలో జన్మించారు. కారాగారికి సాహిత్యం మీద ఆసక్తి కలగడానికి తల్లిదండ్రులు భ్రమరాంభ, పేర్రాజు గార్లు కారణం. విశాఖపట్నంలో మాష్టారు అంటే కాళీపట్నం రామారావు మాష్టారే. శాస్త్రి గారంటే రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారే. సాహితీ లోకానికి సంబంధించినంతవరకు ఇద్దరూ విశాఖపట్నానికి పెద్ద వెలుగు.

కారాగారు 1948లో విశాఖపట్నంలో సెయింట్ అంథోని స్కూల్లో ఉపాధ్యాయులుగా జీవితం ప్రారంభించారు. పదవీ విరమణ వరకు అదే స్కూలులో పని చేశారు. ఆ కాలంలోనే 1953లో రావిశాస్త్రి గారితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కారా గారి జీవితంలో పెద్ద మలుపుగా మనం చెప్పవచ్చు. స్థానికమైనటువంటి కారా దృష్టి చాలా విశాలమైయింది. క్రమక్రమంగా సాహిత్యం గూర్చి, సాహిత్య ప్రయోజనం గూర్చి, సాహిత్య విలువలు గూర్చి, కారాగారు అవగాహన పెంచుకున్నారు. వీరు "కథా నిలయం" స్థాపించడానికి పెద్ద చారిత్రక నేపథ్యం వుంది. జీతం తప్ప ఇతరత్రా వచ్చిన డబ్బులు ఒక దగ్గర దాచి వుంచే అలవాటు కారాగారికి వుంది. సాహిత్యం మీద రెమ్యూనరేషన్ల ద్వారా, సన్మానాల ద్వారా, అవార్డుల ద్వారా, ప్రచురణల ద్వారా వచ్చిన ప్రతీ పైసాను కారాగారు చాలా జాగ్రత్తగా వుంచేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వచ్చినా ఆ డబ్బును ముట్టేవారు కాదు. ఆ డబ్బుతో కారా గారు వాళ్ళ గ్రామంలో మురపాకలో "రావిశాస్త్రి స్మారక గ్రంథాలయం" నిర్మాంచాలనీ, "ఒక బస్ షెల్టర్" కట్టించాలనీ అనుకున్నారు. అనేక తర్జనభర్జనలు అయిన తర్వాత తనకు కథానికా రంగంలో గుర్తింపుకి కారణమైనకథాప్రక్రియకు ఒక "కథా నిలయం" 1996లో ఏర్పాటు చేశారు. ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్త గురజాడ రాసిన "దిద్దుబాటు" కథ వెలువడిన ఫిబ్రవరి 22వ తేదీన "కథానిలయం" ప్రారంభించారు. తెలుగు కథలకో ఇల్లు కట్టిన ఆదర్శమూర్తి, మానవతామూర్తి, మహనీయులు కారాగారు. ఈ నిర్ణయం తెలుగు సాహిత్యంలో ఒక పెద్ద గొప్ప సంఘటన. ఈ "కథా నిలయం" ద్వారా తెలుగు సాహిత్యానికి ఎంతో సేవ చేశారు. వీరి సాహిత్య సేవ అనితర సాధ్యం. నిబ్దత గల రచయిత వీరు. ఆయన చేసిన సాహితీ సేవ కేంద్ర సాహితీ అకాడమీ పురస్కారాన్ని పొందేట్లు చేసింది. ఇంకా వీరికి ఎన్నో పురస్కారాలు, అవార్డులు అందుకున్నారు.

ప్రస్తుతం ఈ "కథా నిలయం" బాధ్యతలను కారాగారి పెద్ద కుమారులు, సహృదయులు కాళీపట్నం సుబ్బారావు గారు చూస్తున్నారు. కథలు ఎందుకు రాస్తున్నారో, ఎవరి కోసం రాస్తున్నారో, అనే విషయంలో కారాగారికి చాలా స్పష్టత వుంది. మనుషుల పట్ల, జీవితం పట్ల, వారికున్న నిశిత పరిశీలన చెప్పుకోదగ్గది. మెచ్చుకోదగ్గది కూడా. ముఖ్యంగా గ్రామీణ జీవితంలోని మానవ సంబంధాలను గూర్చి రాయడంలో ఆరితేరిన దిట్ట కారాగారు. జీవిత వాస్తవికతలను

ప్రతిబింబించడమే సాహిత్యం. ఆ పని కారాగారు సంపూర్ణంగా చేశారు. విజయం సాధించారు కూడా. వీరు జీవితంలోని వాస్తవ సమస్యలనే ఇతివృత్తంగా తీసుకున్నారు. యజ్ఞం, ఆర్తి, చావు, తీర్పు, భయం, కుట్ర, సంకల్పం, జీవధార, హింస, రాగమయి, శాంతి, స్నేహం మొదలైన కథలు రాసి ఉత్తమ కథకులుగా కీర్తి గడించారు. "యజ్ఞం" కథ కథాసాహిత్యంలో ఒక పెద్ద సంచలనం. గురజాడ రాసిన "మీ పేరేమిటి?" కథ ఒక గ్రామానికి సంబంధించిన మత మౌఢ్యాన్ని, మూఢాచారాలను గూర్చి రాస్తే, కారా ఒక గ్రామానికి సంబంధించిన అక్రమాలను, అన్యాయాలను, దుర్మార్గాలను గూర్చి తూర్పారపట్టారు. ఈ రెండు కథలు గ్రామీణ జీవితానికి ప్రతిబింబాలు. కారా గారు తన కథల్లో ఆదర్శ సమాజాన్ని చాలా చక్కగా చిత్రీకరించారు. కొన్ని కథల్లో వర్గ చైతన్యం, వర్గ సంఘర్షణను కళాత్మకంగా చిత్రీకరించారు.

కారా గూర్చి రావిశాస్త్రి గారు చెబుతూ "పోలీసులూ, ప్లీడర్లూ, కోర్టులూ, కేసులూ, బేంకులూ, వడ్డీలూ, ఫ్యాక్టరీలూ, లాభాలూ, వేలాలూ, అరెస్టులూ, రోగాలూ, దారిద్ర్యాలూ, మేడలూ, వాటి పక్క గుడిసెలూ, అమెరికన్ బాంబులూ, రష్యన్ రాకెట్టులూ, పెద్దవారి కోప్పలూ, పేదవారి చావులూ, దొరలూ, దొంగకవులూ తెగ పెరిగే ఈ పాడు లోకంలో ఎక్కడో అక్కడ, ఈ పాటైనా ఏ పాటైనా వర్షాలు కురుస్తున్నాయన్నా, కాల్వలు పారుతున్నాయన్నా, పంటలు పండుతున్నాయన్నా, కొంతమందైన పేదలు కొన ఊపిరితోనైనా, బతగ్గలుగుతున్నారన్నా, శ్రీకాళీపట్నం రామారావు గారిలాంటి సజ్జనులు లుండబట్టేనని నేను నమ్ముతున్నాను. భగవంతుడికి జనం నమస్కరిస్తారు. ఆ భగవంతుడు మనిషిగా మారితే అప్పుడు కూడా అందరూ అతనికి నమస్కరిస్తారని మనందరికీ తెలిసిన విషయమే. అయితే, దేముడు మానవుడైతే అప్పుడు అతనైనా సరే శ్రీకాళీపట్నం రామారావు గారికి నమస్కరించి తీరవలసిందే! "పురుషులలో పుణ్య పురుషులు వేరయా" అని వేమనగారు, రామారావు గార్లాంటి వారిని చూసే చెప్పి ఉంటారు. రామారావు గారి సజ్జనుడి సాంగత్యంలభించడం నా అదృష్టం. ఆయనలాంటి గొప్ప కథకులుండడం మన జనం అదృష్టం" అని అన్నారు.

వీరు 1956 వరకు కొన్ని కథలు రాశారు. 1956 నుంచి 1963 వరకు ఎనిమిది ఏళ్ళు పాటు ఏమీ రాయలేదు. వారి ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. దాని ఫలితమే 1964 మేలో "యజ్ఞం" కథ వచ్చింది. "నామూలంగానే మాష్టారు కథలు రాయటం మానేశారు. మళ్ళీ నా మూలంగానే రాయటం ప్రారంభించారు" అని రావిశాస్త్రి గారు అన్నారు. ఇది అక్షరాలా నిజం కూడా. అసలు ఇంతకీ కారాగారికి, రావిశాస్త్రి గారికి పరిచయం ఎలా అయింది. ఎక్కడ అయింది. అదో విచిత్రమైన కథ. 1952లో ఒక రోజున అంగర కృష్ణారావు గారు కారాలో కలిసి "అల్పజీవి" నవల చదివారా అని అడుగుతారు. లేదంటారు కారా గారు. "భారతి" మాసపత్రికలో ధారావాహికంగా వస్తుచదవండి. అది రాసింది రాచకొండ విశ్వనాథశాస్త్రి. ఆయన కూడా విశాఖపట్నం వారే అని అంటారు. కారాగారు విశాఖపట్నం రీడింగ్ రూములో "భారతి"లోని "అల్పజీవి" నవలను చదువుతారు. కారాగారి మనసు బాగుంది. మీద ఆ నవల చెప్పరాని ప్రభావం చూపుతుంది. అప్పటి నుండి రావిశాస్త్రి గారిని ఎలాగైనా కలవాలని తహతహపడతారు కారాగారు.

1953లో "విశాఖ నాటక సంఘం" వారి నాటక ప్రదర్శన జరుగుతుంది. ఆ నాటకం చూడడానికి ఇద్దరూ ఎవరికి వారే వెళతారు. ఒకరికి కారాకిళ్ళీ తినడం అలవాటు. ఒకరికి సిగరెట్లు తాగడం అలవాటు. కారా కిళ్ళీ కోసం కారాగారు, సిగరెట్లు కోసం రావిశాస్త్రిగారు ఇద్దరూ అనుకోకుండా ఒకే కిళ్ళీ బడ్డీ దగ్గర తారసపడతారు. ఇద్దరూ చక్కగా పలకరించుకొని పరిచయం చేసుకొంటారు. అప్పటి నుండి జీవితాంతం మంచిగా వుంటారు. ప్రతీ రోజు ఇద్దరూ తప్పనిసరిగా కలుసుకొనేవారు. సాహిత్యం, రాజకీయాలు మొదలైన అనేక విషయాల గూర్చి మాటలాడుకునేవారు. "తనకు తెలీని ఎన్నో ఇంగ్లీషు కథలూ, నవలలూ శాస్త్రిగారు చదివి చెప్పేవారు. ఆయన రాసిన కథల రాతప్రతులు చదివి

అభిప్రాయం చెప్పమని కారా ఇచ్చేవారు. ఈ అనుభవం కారాను ఎంతగానో జాగృతం చేసింది. ఇంతవరకూ తను చదివిందీ రాసిందీ ఓర్థీ వృధా పరిశ్రమగా ఆయనకు తోచింది. అందుకు భిన్నంగా రాయాలనే గాక, రచయితపైన ఒక గురుతర బాధ్యత వుందని కూడా ఆయనకు ఒక బలమైన అభిప్రాయం ఏర్పడింది'' అని కె.కె. మీనన్ గారు అన్నారు. కారాగారు, గురువు గారి రచనలపై తన అభిప్రాయాలను నిక్కచ్చిగా తెలియజేశారు. "రచన'' మాసపత్రికలో శాస్త్రిగారి రచనలను గూర్చి చక్కగా పరిశీలించారు. "సాహిత్యం పట్ల గౌరవ విశ్వాసాలూ, రచయితగా నాకో దృక్పథం ఏర్పరచిన వారిని చెప్పుకోవలసి వస్తే, శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారు ఆద్యులు. రచయితగా నన్ను నేను దిద్దుకోవడానికి సహాయబద్ద వారు చాలామంది వున్నారు. తక్కిన వారందరూ ఒక ఎత్తు. రావిశాస్త్రి ఒక్కరే ఒక ఎత్తు. దారి తప్పిన నా రచనా వ్యాసంగాన్ని వారి స్నేహ సావాసాలే సరైన దారిని పడేశాయి. కుటుంబరావు గారి నుంచీ, రావిశాస్త్రి గారి నుంచీ, చాలా నేర్చుకున్నాను. రావిశాస్త్రి నుంచి చూపూ, కొడవటిగంటి నుంచి అవగాహన, నేర్చుకునేందుకు ప్రయత్నం చేశాను'' అని వున్నది వున్నట్లు నిజాయితీగా పేర్కొన్నారు.

మనసు ఫౌండేషన్ సంస్థ "రాచకొండ రచనా సాగరం'' పేరుతో రావిశాస్త్రి రచనలను ప్రచురించింది. ఈ గ్రంథం పంపిణీ బాధ్యతను కారాగారే తీసుకున్నారు. "లాభాపేక్షతోనో, సాధారణ సాహిత్య సేవా దృష్టితోనో కాదు, కొత్తతరం పాఠకుల అవసరాలు, రచయితల అవసరాలు దృష్టిలో పెట్టుకొని రావిశాస్త్రి గారి ముద్రితాముద్రితాలన్నీ సేకరించి ముద్రించారని'' కారా గారు అన్నారు.

మధ్యతరగతి అల్పజీవులకు అచ్చమైన ప్రతిబింబం "అల్పజీవి'' నవలలోని సుబ్బయ పాత్ర. ఆ పాత్ర, ఆ నవల, దాని శైలీ శిల్పాలూ, కొత్తదనంతో ఆంధ్ర పాఠక లోకాన్ని ఓ కుదుపు కుదిపాయి. ఆశ్చర్యపరిచాయి. చదివిన ప్రతీవారూ ఎవరీ రాచకొండ విశ్వనాథశాస్త్రి? అని అనుకున్నారు. 'అల్పజీవి', భారతిలో రావడంతోనే ఓ తరానికి సరిపడా వారికి గుర్తింపు తెచ్చింది అని కారాగారు అన్నారు.

"సొమ్ములు పోనాయండి'' నవల మొదటి నుంచి చివరి వరకూ మాండలికంలో సాగింది. అయితే అలా రాయడానికి రావిశాస్త్రికి కారణాలున్నాయి. అంతకుముందు రాసే ప్రతి కథలోనూ ఇంటర్ ఫియరెన్స్ వుంటుందనే విమర్శ వుండేది. విమర్శ అధిగమించడానికి ఆయన ప్రయత్నం చేశారు అని కారా గారు అన్నారు. తర్వాత అది చూసి మనం కూడా అలా రాయవచ్చు అనీ, మంచిదనీ, చాలామంది అలాంటి ప్రయత్నం చేశారు. మాండలికానికీ, యాసకీ, వున్న తేడా తెలియక పోవడం వల్ల కొంతమంది విజయం సాధించలేక పోయారని కారాగారు అన్నారు. "మూడు కథల బంగారం'' నవల చెప్పుకోదగ్గదని చెప్పారు.

రావిశాస్త్రి గారి "ఇల్లు'' నవలను కారాగారు ముద్రించారు. అంతేకాదు, పంపిణీ బాధ్యత కూడా తానే తీసుకున్నారు. "ఈ నవలని రావిశాస్త్రి ఏ స్థితిలో రాస్తూ వచ్చారో, మరే స్థితిలో పూర్తి చేసేరో చూశాక, దీనిని నేనైనా ప్రచురించే అవకాశం ఉందని తెలిసి, జంకుతూ, జంకుతూ, వారిని సమీపించినపుడు, వారికళ్ళలో నవ్వుల్లో విరిసిన స్నేహ వాత్సల్యాలు గమనించేక, వారి నుండి నేను గ్రహించవలసేవీ, నేర్చుకోవలసేవీ తరగని గనులనిపించేయి. ఇదంతా ఎందుకంటే, "ఇల్లు'' ఆర్.కె. ప్రచురణగా రావడం నాకు గర్వకారణం ఆనాడొక ప్రచురణ కర్త. అదే అయితే ఆ ఘనత నాది కాదు'' అని కారాగారు అన్నారు. "ఇల్లు'' రచనా కాలం **28-02-1992** నుండి **10-04-1993.** ఈ నవల స్వాతి సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా వచ్చింది.

కారాగారు తెలుగు కథ గూర్చి చెప్తుతూ "ఒకనాడు పడక గదులకీ, వంటగదులకీ పరిమితమైన కథ, రావిశాస్త్రి గారి మాటల్లో చెప్పాలంటే ఒక దశలో వీధిన పడింది. నేడు దశ దిశలకి వ్యాపించింది'' అని అన్నారు. రావిశాస్త్రి సారా కథలు అన్ని తరగతుల పాఠకులనూ, అన్ని కాలాలకూ పరవశం చేసే కథలని పేర్కొన్నారు.

"పిపీలికం'' అద్వితీయమైన కథ. భారతంలా, చదివే వారి స్థాయిని బట్టి ఏ స్థాయి వారికి ఆ స్థాయిలో అర్థమయ్యే కథ. అ పరిణత పాఠకులకది చీమా, పామూ కథ. పరిణత

పాఠకులకు ఆ కథ తత్త్వశాస్త్రం మీద రావిశాస్త్రి గారి భాష్యం అని వివరించారు. "తప్పు" మరో గొప్ప కథ. ఓ రైతు బిడ్డ జీవితంలో దాదాపు ఇరవై ఏళ్ళకు పరుచుకున్న మూడు సంఘటనలు తీసుకొని శిల్పరీత్యా కథకు కావలసిన ఏక కాలికతను వస్త్వైక్యతను సాధించిన తీరు అద్భుతం అని కొనియాడారు. నేటికి ఎందరెందర్నో హృదయ శల్యంగా బాధించేది "వేతన శర్మ" కథ. మరవాలన్నా మరపురానిది ద్వైతాద్వైతం "బుద్బవం, 'అధికారి' కథలు అని, రావిశాస్త్రి కథలు గూర్చి కారా గారు బాగా ప్రశంసించారు.

కారాగారు రావిశాస్త్రి గారిశిల్ప సౌందర్యం గూర్చి చెప్పుతూ "దేశీయత, కథా నిర్మాణం, కథాకథనం, వ్యక్తీకరణ మొదలైన వాటిలో నేర్పు వల్ల శిల్ప సౌందర్యం ఏర్పడుతుంది. ఉదాహరణకి శ్రీపాదవారి వడ్ల గింజలు, రావిశాస్త్రి తప్పు, పిపీలికం, వేతన శర్మ, వంటి వాటిని ఎన్నిసార్లు చదివినా మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుంది. ప్రయోజనాన్ని సాధించడంతో పాటు అవి అంత అందంగా తయారవడానికి శిల్ప సౌందర్యం కారణం. వాళ్ళు తమకి తృప్తి కలిగేంత వరకు (%ూవతీటవఙ్ఱశీఅ%) మళ్ళీ మళ్ళీ రాసి వుంటారు. శ్రీపాదవారు, రావిశాస్త్రి గారు రాసిన కథనే మళ్ళీ మళ్ళీ రాసే వారు" అని అన్నారు. కథ ఎలా రాయాలి? అనే విషయమై కారా గారు అనేక వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలన్నీ కలిసి ఒకగ్రంథంగా కూడా వచ్చింది. "ఒకానొక వ్యాస అవసరానికి, ఒక కథా బీజం నుంచి కథలెలా పుట్టిచ్చో రాస్తూ రావిశాస్త్రి గారి "జరీ అంచు తెల్లచీర" యొక్క కథా బీజాన్ని ఎత్తి చూపి, సరికొత్త వారి నుండి, చేయి తిరిగిన వారి దాకా, వేర్వేరుగా ఎలాంటి వృత్తాంతాలతో కథ రాయొచ్చో చిన్న చిన్న మూడు పేరాల్లో రాశాను. తర్వాత కొన్నాళ్ళకు మరో అవసరానికి 1992లో "సంకల్పం" కథగా నేనే రాశాను. 'సంకల్పం' కథ ఒక ప్రయోగం. బలమైన కోరిక, అతి చిన్న కోరిక, అయినా ఇతర కారణంగా ఆ కోరిక తీరిక పోవడం వల్ల కలిగే వేదన, "జరీ అంచు తెల్లచీర" కథలో మనం చూస్తాం. ఈ "సంకల్పం" కథలో కూడా ఒక సంకల్పం, ఆ సంకల్పం నెరవేరకపోవడం, దానికి కారణాలు, అందులో వేదన చిత్రించాను" అని కారా గారు అన్నారు. "జరీ అంచు తెల్ల చీర" పేరుతో అప్పట్లో రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు రాసిన ఈ కథకి ఎన్నో అనుసరణలూ, అనుకరణలూ వచ్చాయని కారా గారు పేర్కొన్నారు. కథలో ప్రధానపాత్రను మార్చి, ఆమె పరిస్థితులను సీదా మార్చేసి, ముగింపులో తమాషాగా ఓ కొస మలుపు చేర్చి, పోలిక కందనంత దూరంలో పేరును కూడా మార్చేస్తే ఓ కొత్త కథ పుడుతుంది. ఇలాంటి గుడుస్తనం చాలనప్పుడే అనుకరణ అనుకరణగా దొరికిపోతుందని కారాగారు అన్నారు. రావిశాస్త్రి గారి విశాలాక్షి ఓ "జరీ అంచు తెల్ల చీర" కోసం విల విల లాడినట్లే, ఓ పేదవాడి కన్న కొడుకు ఓ గోల్డ్ కాప్ నల్ల పెన్ను కోసం తహతహలాడొచ్చు. ఇంట్లో వాళ్ళ చేత తిట్లూ, చీవాట్లు తినో, తన్నులు తినో, పైస పైస చొప్పున చిరు తిళ్ళ డబ్బులు మిగిల్చో, చివరికాపెన్ను కొంటాడు.

మర్నాడు బళ్ళో సావాసగాళ్ళకి దానిని చూపించబోతే అది కనబడదు. రద్దీ బస్సులో ప్రయాణం చేస్తుండగా ఎవరేనా కొట్టేసేరో, రాలిపోయిందో తెలీదు. ఇలా ఎన్నో రకాలుగా మార్చుకుంటూ కథలు రాయవచ్చు అని కారాగారు చాలా విపులంగా వివరించారు. గురజాడ "కన్యాశుల్కం" తర్వాత మనకున్నమంచి నాటకం "నిజం" అని కారాగారు అన్నారు. తమకి తెలిసింది తెలిసినట్టూ, తాము గమనించింది, గమనించినట్టూ, తాము గ్రహించింది గ్రహించినట్టూ, ఎప్పటికప్పుడూ తమ రచన ద్వారా రావిశాస్త్రి గారు వెల్లడిస్తూ వచ్చారని తెలియజేశారు. అంతటితో ఆగలేదు. తమకు కలిగిన కనువిప్పు, సాటి రచయితలకు కూడా కలిగించేందుకు ఆత్మ విమర్శాత్మక వ్యాసాలు రాసేరు, రాయించేరు అన్నారు. రచయితలకు గల సామాజిక బాధ్యతను ఎత్తి చూపుతూ రచయితలు ప్రతీవారూ తాము రాస్తున్నది. ఏమంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో ఆలోచించాలి అని శాస్త్రి గారు చెప్పేవారని తెలియజేశారు కారాగారు. ఈ హెచ్చరిక చాలామందిని ఆలోచింపజేసింది. నిర్ణయాలకు రాగలిగిన వారెందరో ఆయన సరసన ఆయన వెంట తమ సాహితీ కృషిని కొనసాగించారు అని కారాగారు పేర్కొన్నారు.

"యజ్ఞం" కథపై సుప్రసిద్ధ విమర్శకులు రంగనాయకమ్మగారు తీవ్రమైన విమర్శ చేశారు. ఆమె విమర్శపై మీ అభిప్రాయం ఏమిటని అడిగితే కారాగారు "యజ్ఞం విమర్శ చదివాను. రావిశాస్త్రి నాకు గురువు. ఒకసారి ఆయన కథపై విమర్శ వస్తే, పురాణంశర్మ సమాధానం పంపమని ఆయనకు ఉత్తరం రాసారు. దీనికి రావిశాస్త్రి కథ రాయడం వరకు నా పని. దాన్ని చివరంటా సమర్ధించుకోవడం నాకు అవసరం లేదు. మంచి కథ అయితే జనం ఆదరిస్తారు. కథ చెత్తదయితే వారే తిరస్కరిస్తారు అని సమాధానం ఇచ్చారు. నేనూ ఆ ఉద్దేశంతోనే ''యజ్ఞం'' విమర్శపై సమాధానం ఇవ్వదలచుకోలేదు'' అని కారా గారు అన్నారు.

తెలుగు కథా సాహిత్యానికి మీరు "ఒక లెజండ్'' అని అనుకోవచ్చా అని కారాగారికి అడిగితే "లెజండ్ అనుకోవడం ఒక భ్రమ. నాకు నలభై అయిదు సంవత్సరాలు వచ్చే వరకు నాకు ఎలాంటి గుర్తింపూ లేదు. నేను అప్పటికే "యజ్ఞం'', "కుట్ర'' వంటి కథలు రాశాను. అప్పటికీ నన్నో కథకుడిగా ఎవరూ అనుకోలేదు. విరసం సభ్యత్వం, కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి వంటి వారు నా గురించి మంచి మాటలు చెప్పడం వల్ల, ఈ గుర్తింపూ అవీ వచ్చాయి'' అని అన్నారు కారాగారు.

రావిశాస్త్రి లాంటి రచయితలు, రచయితల కోసం, నాలాంటివారు జనం కోసం, రచనలు చేస్తున్నారని యండమూరి అన్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటని కారాగారిని అడిగితే "జనం- ఈ మాట ప్రమాదకరమైంది. ఇంతకీ జనం ఎవరు? ఏ వర్గానికి చెందినవారు? యండమూరి పేర్కొన్న జనం ఎవరో నాకు తెలీదు. ఇక రావిశాస్త్రి రచయితల కోసం రాస్తారన్నది కూడా శుద్ధ అబద్దం. ఆయన రచనలు రచయితలు కాని వివిధ వర్గాల వారిని ఆకట్టుకున్న సంగతి నాకు తెలిసిన సత్యం'' అని అన్నారు.

**ప్రముఖుల అభిప్రాయాలు :**

"మంచి కథలు రాసేవాళ్ళు చాలామంది ఉన్నారు. గొప్పకథకు గొప్ప లక్ష్యం ఉండాలి. మంచి కథలు కాకతాళీయంగా రావచ్చు. గొప్ప కథలు గొప్ప కథకులు రాస్తే తప్పా రావు. గొప్ప కథలు రాసే ఘనత ఒక రాచకొండ విశ్వనాథశాస్త్రికీ, ఒక బీనాదేవికీ, ఒక కాళీపట్నం రామారావుకీ దక్కింది.'' కొడవటిగంటి కుటుంబరావు "కథారచనలో కారా కంటే రావిశాస్త్రి సీనియర్ వ్యక్తిగత సాన్నిహిత్యం ఉంది. ఇద్దరి రచనల్లో పోలికలున్నై. ఇరుగు పొరుగు మాండలికాలను రచనల్లో ప్రతిష్టిస్తున్నారు. ఇద్దరి రచనా లక్ష్యాలు ఒక్కటే. దోపిడి వ్యవస్థలో అణగారే జీవితాలను చిత్రిచటం, ఆ దోపిడీకి కారణాలు గుర్తించే చైతన్యాలు కలిగించడం, వీరిద్దరికీ సమాన ధ్యేయాలు. అయితే ఈ పోలికలింతవరకే. రావిశాస్త్రి నగర జీవితంలో సందు గొందుల చీకటి కోణాలను పరిశీలించి, పరిశోధించి, ప్రదర్శిస్తే, కారా పల్లెవాసుల కంబారి బతుకులలో బాధలు పల్లవిని పలికిస్తున్నారు. ఇద్దరి కృషీ పరస్పర పరిపూరకమైనది. వీరిద్దరి రచనా మార్గాల్లో భేదం ఉంది. రావిశాస్త్రి కథల దేశకాల పరిధి చిన్నది (పాత్రల్లో సన్నివేశాల్లో వైవిధ్యం ఎక్కువ), రావిశాస్త్రి వచనం చాలా సార్లు కవిత్వ స్థాయికి ఎగురుతుంది. కారా వచనం నింపాదిగా నిండు నదిలా ప్రవహిస్తుంది. రావిశాస్త్రి వచనంలో లాగా మెరుపులు, విరుపులు, గమ్మత్తులు, చమక్కులు కారా వచనంలో ఉండవు. కారా వచనంలో నిసర్గ సౌందర్యం ఉంది. విశ్వనాథ శాస్త్రి సాహిత్య లక్ష్యాన్ని, విస్తరింపజేయడానికి పాటుబడుతున్న కథకుడు కాళీపట్నం రామారావు.'' చేకూరి రామారావు (చేరా) "రాచకొండ విశ్వనాథ శాస్త్రి సాహిత్యమూ, స్నేహమూ, జీవితం నుంచి కథను స్వీకరించడమెలాగో తెలిపాయి. అంతేకాక సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి మాయలో మాయనూ, మంచిలో మంచినీ గ్రహించి, విడమరచే శక్తిని మాష్టారికి యిచ్చాయి.''

వివనమూర్తి "గురజాడ, తెలుగు కథానుగతంలో నుంచి వర్తమానంలోకి, గ్రాంథికం నుంచి వాడుక భాషలోకి నడిపిస్తే, రావిశాస్త్రిగారు వీధుల్లోకి, బజారులోకి నడిపించారు. ఆ కథను పల్లెల్లోకి, పంట భూముల్లోకి పంచాయితీల్లోకి నడిపించారు కాళీపట్నం రామారావు మాష్టారు.'' - అట్టాడ అప్పలనాయుడు "కారా రచనల్లో ప్రముఖమైన సజీవమైన రచనాకాలం రావిశాస్త్రి పరిచయంతో ప్రారంభమైంది.

శాస్త్రి గారి "అల్పజీవి" 'కారా జీవితంలో గొప్ప మలుపు. రావిశాస్త్రి, కారాకు మంచి సలహా యిస్తాడు. రచయితలకు ఒక ప్రాపంచిక దృక్పథం వుండాలని. అది కారాకు ఒక ప్రాపంచిక దృక్పథం వుండాలని, అది కారాకు తీవ్రంగా ఆలోచింపజేసింది. రావిశాస్త్రి మధ్య తరగతి గూర్చి మాత్రమే గాక, అథోజగత్తుకు చెందిన జీవితాలను గూర్చి విశ్లేషించాడు. "Macro" స్థాయిలో కాకుండా కారా "Micro" స్థాయిలో ఉన్న తెలుగు నేల భౌతిక పరిస్థితులపై ఆధారపడి రచనలు చేశాడు." - వకుళాభరణం రామకృష్ణ

ఆధారగ్రంథాలు :

1) అక్షర శిల్పి-రావిశాస్త్రి (అముద్రితం) - వెలమల సిమ్మన్న
2) కథాయజ్ఞం - చర్చా వ్యాసాలు - సం॥ చేకూరి రామారావు
3) కాళీపట్నం రామారావు రచనలు - సం॥ వివనమూర్తి, "రచనా"శాయి.
4) కాళీపట్నం సాహిత్యావలోకనం - సం॥ "రచన" శాయి, కాళీపట్నం సుబ్బారావు
5) తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
6) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - వెలమల సిమ్మన్న
7) మరో సారి కథల్లోకి - సం? రమాసుందరి
8) యుగకర్త గురజాడ - వెలమల సిమ్మన్న

పత్రికలు :

దిన, వార, మాస, ద్వై, త్రై, మాసపత్రికలు

❖ ❖ ❖

# కారా కథల్లో స్త్రీ పాత్రలు

**– డా॥. బి. నాగశేషు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్తగంగోత్రి, మైసూరు.

కథకు ఒక ప్రాంతంలేదు, కథకు కులంలేదు, కథకు మతంలేదు కథ ఫలానావాళ్లే రాయాలనే వాదం కూడా లేదు. సాహిత్యాకాశంలో కథల వర్షం ఎక్కడ కురిసినా కథానిలయం చేరాల్సిందే. నేడు మనం ఏదైనా ఒక విషయాన్ని కానీ, విషయాంశాన్ని కానీ, స్థలం కానీ, స్థలమాహాత్మ్యంకానీ, వ్యక్తులుకానీ, వ్యక్తులగురించికానీ, వస్తువుని, వస్తువాంశాన్ని కానీ, పద్యంకానీ, పాటకానీ, కవిత్వం, పాట, పని, సమస్తం అవసరాలకోసం మనం వెతికేది ముందు తీసే తలుపు ఇంటర్ నెట్. డిజిటల్ యుగంలో నివసిస్తున్న మనం డిజిటల్ తనాన్ని ఇరవై ఏడేళ్ల క్రితం ఆలోచించే అంతసామర్థ్యం కారా మాష్టారు గారికి అబ్బిందంటే అది చాలా అరుదైన వ్యక్తిత్వంగా చెప్పుకోవాలి. ఒక ప్రక్రియ మొత్తం ఒకచోటుకు చేర్చాలనే ఆలోచన, తపన రెండూ ఆయన్ని సాహిత్యాకాశంలో చిరస్థాయిగా నిలబెట్టాయి. అంతే కాకుండా, పాఠకున్ని, రచయితను ఇద్దరినీ ఒకచోటుకు చేర్చింది కథానిలయం అని చెప్పవచ్చు. సాహిత్యాభిలాష ఉండి కథ చదవాలనే ఆశ ఉంటే చాలు కూర్చున్నచోటే కంప్యూటర్ తలుపుతెరిచి కథాలోకంలోకి ప్రయాణిస్తే, ఎన్నికథలు కావాలి, ఏ కథకావాలి ఎవరి కథకావాలి అన్నీ మనచేతిలో దర్శన మిస్తాయి. ఇటీవలి కాలంలో అనేక ప్రక్రియల్లో కొంత మంది సంఖ్యవేసి మరీ దాడి చేస్తున్నారు, అవి నిలు స్తాయా, కాలంలో కొట్టుకుపోతాయా అనే నిజాన్ని మాత్రం కాలమే నిర్ణయించాలి. రచయిత ఏది రాసినా అది మనతో మాట్లాడుతున్నట్లుండాలి, మనల్ని మాట్లాడించేలా ఉం డాలి, గట్టిగా అరిచేలా చేయాలి, ఒక్కోసారి స్మశాన నిశ్శబ్దం అలుముకోవాలి, అందరితో ఆ రచన గురించి చెప్పుకొనేలా ఉండాలి, ఇంతేనా ఇలా మనం ఎందుకు రాయకూడదు అని అనిపించాలి, ఏవైనా రచనలోని తాలూకు సంఘటనలు మన జీవితంలో జరిగి ఉంటే ఒక్కసారి అవి గుండెను కలుక్కుమని ముల్లులా కెలకాలి, మంటలా రగల్చాలి, ప్రియురాలి ఆఖరి కౌగిలా మిగిలి పోవాలి. అన్నీ ఇలా ఉండాలని, ఉంటాయని అనుకోవ డానికి లేదు.

రావిశాస్త్రిగారు విశాఖభాషకు వన్నెతెచ్చినట్లే, శ్రీకాకుళం భాషకు గౌరవాన్ని సంపాదించిపెట్టిన ఘనత కారా మాష్టర్ గారు తీసుకొచ్చారు. కాళీపట్నం రామారావుగారు కథలు రాశిలో తక్కువగా రాసినా, వాసిలో చాలా నాణ్యత గలిగినవిగా సాహిత్యాన్ని సృజించగలిగారు. కథలురాసినా, కథలు సేకరించినా ఓ యజ్ఞంలా చేశారు. కథలకు అతనికీ విడదీయరాని స్నేహబంధం ఉంది. ప్రజల ఆర్తిని పసిగట్టిన మనిషి, ఇతని పట్టుదలను చూసి కథలే మహదాశీర్వాదం చేశాయేమో. కుట్రలు కుతంత్రాలు లేకుండాల కథలకు జీవధారగా నిలిచారు.

మరి వీరికథల్లో స్త్రీ పాత్రల మహత్వం, లోతు పాతులు, ఆదర్శాలు, అనుబంధాలు అన్నీ ఆత్మీయతలు తెలుసుకోవాలని, తెలియజేయాలనే చిన్న ఆలోచనే ఈ వ్యాసం.

లలిత, 'అదృశ్యం' అనే కథలో లలిత అనే పాత్ర స్త్రీ పురుషుల సంబంధాల పట్ల, వివాహ వ్యవస్థపట్ల ఉం డాల్సిన, చేయాల్సిన కర్తవ్యాన్ని గుర్తుచేసే పాత్ర అదృశ్యం అనే కథలో లలిత పాత్ర ద్వారా తెలియజేశారు.

లలిత ..... అనే యువకుడికి వివాహం ఖచ్చిత మౌతుంది, అబ్బాయి కూడా తెలిసినవాడే, ముందే గమ నించినవాడే అనే విషయాన్ని తెలుసుకుంటుంది.

ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పనిచేస్తూ తన పక్కింట్లో ఉండేవాడు. ఇతనికి ఎదురుగా ఉండే ఇంట్లో అనూరాధ అనే వివాహితను రోజూ తన చూపులతో పలకరిస్తూ ఉంటాడు. ఈ విషయంలో అనూరాధకూ,

లలితకూ వాదన జరగడం ఆఖరుకు భిన్నాభిప్రాయాలొచ్చి లలిత వివాహాన్ని తిరస్కరించడం ఇందులోని కథాంశం.

పేరులేని పాత్ర ఉత్తమ పురుషలో సాగిన కథ. ఈ కథలో తాను పెళ్లిచేసుకోబోయేవాడికి ఎలాంటి లక్షణాలుండాలో కలగంటూ వివరిస్తుంది. వివాహం విషయంలో స్త్రీలు ఎలా ఆలోచిస్తారో, ఆలోచించాలో ఈమె వివరిస్తుంది. ఆత్మాభిమానం, పరోపకారం, సామాజికదృష్టి కలిగిన అమ్మాయిగా తనకు కావాల్సిన వరుడుగురించి ఎన్నో కలలను వివరిస్తుంది.

రేవతి, లేఖాకథన పద్ధతిలో సాగిన ఈ కథ, దూరదృష్టి, నవచైతన్యం, తల్లులప్రేమ ఈ కథలో కనిపిస్తుంది. రేవతి అనే యువతి సీత అనే యువతికి రాసిన ఉత్తరాల సారాంశమే ఈ కథ. ఆ ఉత్తరాల్లో వారి కుటుంబ విషయాలు, ఆదర్శాలూ, పురాణాలూ, సైన్స్, యుద్ధాలు అన్నీ వివరించుకుంటుంటారు. సీత రాసిన ఉత్తరం కనిపించదు కానీ అందులోని విషయాలు మాత్రం అన్నీ చెప్పింటారు. అందుకు రేవతి ప్రతిస్పందిస్తూ రాసిన ప్రత్యుత్తరాలే ఈ కథాంశాలు. ఒకరకంగా సంఘ సంస్కరణాభావాలు ఈ కథల్లోని పాత్రధారులు అని చెప్పవచ్చు. కారా మాష్టర్ కథల్లోని వస్తువు కూడా అట్లే ఉంటాయి. గ్రామాలపై అభిమానం, పట్టణాలపై వ్యతిరేకత, ఆంగ్లభాషపై మోజు, వరకట్న దురాచారం, పెళ్లిచూపులపేరుతో యువతులు ఎదుర్కొనే కష్టాలు, ఆ తంతుతో జరిగే హింసలన్నీ రేవతి పాత్రద్వారా చెప్పించారు. ఒకరకంగా ఆదర్శవంతమైన జీవితానికి నిదర్శనం రేవతి పాత్ర.

సత్యవతమ్మ అనే పాత్ర మహదాశీర్వచనం అనే కథలోని పాత్ర సత్యవతమ్మ ఇంట్లో అనారోగ్యంతో ఉంటుంది, భర్తకు వచ్చిన జబ్బును నయంచేయలేక నరకం అనుభవిస్తుంటుంది. పల్లెలో స్థిరపడటం వల్ల పట్నం తాలూకు వ్యవహారాలు తెలుసుకోలేకపోతారు. క్రమంగా తమదగ్గరున్న కాస్తో కూస్తో సంపద తగ్గిపోవడం చివరికి చేతిలో చిల్లిగవ్వకూడా లేకపోవడం, మెడలోని పసుపు తాడు ముత్తయిదుతనాన్ని వెక్కిరించడం, తను వేసిన ఓటు తనకు ఏ మాత్రం మేలుచేయలేని తనాన్ని చూసి ఉస్సూరుమనడం కథలోని వస్తువు.

నారమ్మ చావు కథలోని నారమ్మ చనిపోతే ఇంట్లోని జనం కూలికి వెళ్ళింటారు. చిన్నపిల్లలు మాత్రమే ఇంటిదగ్గరుంటారు. ముసలమ్మ చనిపోయిందని తెలసు ఎవరికి చెప్పాలో తెలీని స్థితి, చనిపోయిన వార్త కంటే శవాన్ని రేపటిదాకా పెట్టుకుంటే వరికోతల కూలీ దొరకదని బాధ పడతారు, చివరికి ఇంటికొచ్చి శవాన్ని ఆరోజు సాయంకాలానికే తగలబెట్టడమో, పూడ్చడమో చేయాలని ఆరాటపడతారు, ముసలమ్మను తగలబెట్టడానికి కట్టెల కోసం ఇల్లిల్లూ తిరుగుతారు. చివరికి ఊర్లోని యువకులు కట్టెలుతీసుకొచ్చి వాళ్లడిగిన ప్రశ్నలకు కుటుంబ సభ్యులందరూ తలదించుకొని చితికి నిప్పంటిస్తారు. కూలీ ముందు ఇంట్లోపడే శవాలు కూడా లెక్కలేదు కారణం పేదరికం అంతగా పేదరికం తరుముతుంటే బంధాలు బంధుత్వాలు ఎక్కడ మిగులుతాయి.

సన్నెమ్మ, ఆర్తి అనే కథలోని పాత్రధారి ఎర్రెమ్మ, బంగారమ్మల బాధలు, సన్నెమ్మచావు, ఆర్థిక పరిస్థితులు మారకపోతే జీవితాలు మారవని ఈ సన్నెమ్మ కథ తెలియజేస్తుంది.

సత్యవతి, ఉన్నోడింట్లోని వృథా, లేనివాడంట్లోని వ్యథ ఇవి రెండూ కనిపిస్తాయి ఈ కథలో తిన్నది అరగని తనం కొందరిది. తినడానికి తిండిలేని తనం కొందరిది. షావుకారి పెరట్లో అయ్యే వృథా నీరు, పూరిపాకల్లో నీళ్ల లేక గొంతెండుపోయి అలమటించే ప్రాణాలు ఇవన్నీ తట్టుకొని నిలబడే జీవితాలకు ప్రతినిధి సత్యవతి పాత్ర. మిగిలిన అన్ని పాత్రలు ఇలానే ఉంటాయి.

ఆయన కథల మధ్య ఇతర విమర్శకులు చేసిన రెండు మూడు దశల విభజనను అంగీకరిస్తూనే, అన్ని కథల్లోనూ మానవసంబంధాల జీవధార అవిచ్ఛిన్నంగా ప్రవహించడం కనబడుతుంది. ఆయన కథలు రాయక

ముందున్న పరిస్థితులు, ఆయన కథలు రాసిన కాలానికి సంబంధించి పరిస్థితులు అన్నీ ఆయన కథల్లో దర్శన మిస్తుంది. కారా కథల్లో కుటుంబం, గ్రామం, కులం, వర్గం, స్త్రీపురుష సంబంధాలు, వయోభేదాలు, రాజ్యానికీ ప్రజలకూ మధ్య ఘర్షణ వంటి వేరు రూపాల్లో, వేరు వేరు స్థాయిల్లో వ్యక్తీకరణ పొందవచ్చు, వేరు వేరు పాత్రల ద్వారా పలికించిఉండొచ్చు, వేరు వేరు సన్నివేశాల్లో మనకు దర్శనమూ కావచ్చు, కాని మౌలికమైనది ప్రజాస్వామిక అన్వేషణ. ఇవాళ్టికీ కొనసాగుతున్న, నేటికీపరిష్కారం కాని ఆ అన్వేషణే ఆయన రచనలు నేటికీ నిత్యనూతనంగా పరిశోధనాత్మకంగా ఉంటున్నాయి.

ఈ మానవ సంబంధాల ప్రజాస్వామికీకరణ అన్వేషణ కారాను సహజంగా, అనివార్యంగా వర్గపోరాటం దగ్గరికి చేర్చింది. ఆయన కథలన్నీ వర్గపోరాటానికి వేరు వేరు వ్యక్తీకరణల చిత్రణలే. అయితే రచయితగా ఆయన విశిష్టత ఏమంటే ఆయన వర్గపోరాటాన్ని సమాజవ్యాప్తంగా వేరువేరు తలాల్లో జరిగే నిరంతర ప్రయత్నంగా విశాలంగా, లోతుగా, సృజనాత్మకంగా అర్థం చేసుకున్నారు. వర్గ పోరాటపు సుదూర, సూక్ష్మ ప్రకంపనలను కూడా ఆయన పట్టుకున్నారు. వర్గపోరాటాన్ని, దాని వ్యక్తీకరణలను నేరుగా, సూటిగా, మొరటుగా చిత్రించడం కాల్పనిక సాహిత్యం పని కాదనీ, అది విశ్వసనీయం కావాలంటే, పాఠకుల ఆలోచనల మీద ప్రభావం వేయాలంటే దాని చిత్రణ విభిన్నంగా, విశిష్టంగా, అపురూపంగా ఉండక తప్పదని ఆయన గుర్తించారు. అందువల్లనే ఆయన ఈ వర్గపోరాట నిత్యజీవిత ప్రతిఫలనాలను మానవ సంబంధాల ద్వారా, సామాజిక చరిత్ర ద్వారా, సాధారణ జీవన సంఘటనల ద్వారా, జీవన పరిణామాల ద్వారా చిత్రించాలని పూనుకున్నారు. అందుకే కారా కథలు చదువుతున్నప్పుడు పైపొరలో ఎవరికైనా కనబడేవి మానవ సంబంధాలు, సామాజిక చరిత్ర, సాధారణ జీవన సంఘటనలు, సాధారణ జీవన పరిణామాలు. అక్కడి నుంచి కింది పొరల్లోకి వెళ్తున్నకొద్దీ వర్గపోరాట అనివార్యత, పీడితవర్గ పక్షపాతం, వ్యవస్థ పరివర్తన ఆవశ్యకత కనబడతాయి. వర్గపోరాటాన్ని అంగీకరించని వాళ్లయినా, గుర్తించనివాళ్లయినా, దాని పట్ల అపోహలు ఉన్నవాళ్లయినా కారా కథలు చదివి ఆకర్షితులయ్యేది వారికి ఈ నాలుగు అంశాల్లో ఏ ఒక్కదాని మీదనైనా ఉండే ఆసక్తి, అభిరుచి వల్లనే. ఆ కథల్లోని నిర్మాణం వల్ల, పొరలు పొరలుగా సూచించిన అనేక అంశాలు మళ్లీ మళ్లీ గుర్తుకొస్తాయి. అంతిమంగా అవి పాఠకుల ఆలోచనా సరళిని ఉన్నతీకరిస్తాయి. పాఠకుల అవగాహనాల ఉన్నతీకరణే కారా రచనలను ప్రాసంగికంగా ఉంచుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు, 2008. వివినమూర్తి. మనసు ఫౌండేషన్, బెంగళూరు.
2. గుంటూరుసీమ సాహిత్యం చరిత్ర, 2020. పెనుగొండ లక్ష్మినారాయణ, అరసం, గుంటూరు.
3. కథాకిరణాలు-మనతెలుగు కథలు, పైడిమర్రి రామకృష్ణ. 2002. పైడిమర్రి కమ్యూనికేషన్స్, ఖమ్మం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# యజ్ఞం - సమకాలీన సంబంధాలు

**- డా॥. బూర్గుల స్వరూప**
తెలుగు అధ్యాపకురాలు,
యం.వి.ఎస్. ప్రభుత్వ కళాశాల, మహబూబ్‌నగర్.

**- డా॥. జంపుల తిరుపతయ్య**
తెలుగు అధ్యాపకుడు,
పాలమూరు విశ్వవిద్యాలయం.

మానవ జీవితంలో అనేక సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. అనేక సంవేదనలు అనుభూతమవుతూ ఉంటాయి. అనేక ఆలోచనలు ఏర్పడుతూ ఉంటాయి. ఆ ఆలోచనలు సమాజ హితం కోరేవి అయినప్పుడు, మనం సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, అధర్మాన్ని, అణిచివేతను, వివక్షతలను, వ్యత్యాసాలను గమనించిన మానవుడు మార్పుకోసం, సమాజ చైతన్యం కోసం తన వంతు కృషి చేస్తూనే ఉంటాడు. అలాంటి మార్పును ఆశించే కాళీపట్నం రామారావు గారు మార్పు కోసం కథల ద్వారా సమాజ హితం కోరినట్లు తెలుస్తోంది. సాహిత్యం సమాజనిష్టం. అది వైయక్తిక సృష్టి కావచ్చు. సామూహిక సృష్టి కావచ్చు. సమాజానికి వ్యక్తికి పరస్పర పోషణ పోషక భావం ఉంది. పైగా వ్యక్తికి తనదయిన అంతరంగం ఒకటి ఉంది. అభిరుచి ఉంది. ఆపేక్ష ఉంది. సమాజం కోసం వాటిని పూర్తిగా వదులుకోలేడు. సమాజము అతన్ని వదులుకో లేదు. సాహిత్యానికి సమాజానికి పరస్పర పోష్య పోషఖ సంబంధమున్నట్లే బింబ ప్రతిబింబ భావం కూడా ఇమిడి ఉంది. అందువల్ల తెలుగులో వచ్చిన యజ్ఞం కథ సమాజ (నాటి నేటి) స్థితిగతులకు ఏవిధంగా అద్దం పడుతున్నదీ పరిశీలించాల్సి ఉంది. 1) నాటి సామాజిక పరిస్థితులు 2) కుటుంబ సంబంధాలు 3) సమకాలిన సంబంధాలు నాడు నేడు.

యజ్ఞం కథంలో సామాజిక పరిస్థితులు. దాదాపు 6 దశాబ్దాల క్రితం వ్రాసిన ఈ కథలో వస్తువు గ్రామీణ వ్యవసాయ కుటుంబ నేపథ్యానికి సంబంధించినది. నిజానికి ఆ కాలంనాటి సామాజిక పరిస్థితులు కూడా వ్యవసాయమే ముఖ్య జీవనాధారంగా కొనసాగుతున్న స్థితి. అప్పుడప్పుడే ఆధునికత, అభివృద్ధి, విద్య, ఉద్యోగం అంటూ సామాజిక పరిస్థితులల్లో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆ గ్రామం గతంలో లేని హైస్కూల్, పోస్టాఫీసు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, హోటళ్లు, పాన్‌షాప్‌లు మొదలగునవి ఏర్పడ్డాయి. సుందరపాలెం అనే గ్రామంలో, జరిగిన సంఘటనలు జరుగుచున్న సంఘటనలు వస్తువుగా చేసుకొని ఒక గొప్ప కథను వ్రాసారు. కవిగారు ఈ కథలో అప్పల్రాముడు ముఖ్య పాత్రదానుడు. అతను చేసిన అప్పు తీర్చకపోతే అప్పిచ్చిన గోపన్న, గ్రామంలో పంచాయతి పెట్టిస్తాడు.

“మూడేళ్ల కిందట పుట్టి, మూడు నెల్లుగా ముడిపడి మూడు రోజుల నుంచి నలుగుతున్న లేగవు. ఆవేళ యిటో ఆటో తెలిపోతుంది.” అంటూ మొదలైన కథ. నాటి కాలంలో గ్రామాలలో పంచాయతిలు రచ్చబండ దగ్గర జరుగుతుంటాయి. కాని ఈ గ్రామంలో ప్రత్యేకంగా ఒక మంటపం నిర్మించారు. ఆ వూరి పంచాయతిలు అన్ని ఆ మంటపం దగ్గరే జరుగుతాయి. ఆ రోజు పంచాయతి లేక ఆ గ్రామంలోని ప్రజలు, పెద్ద మనుషులు, అన్ని కులాల పెద్ద మనుషులు, ఆవూరి ప్రసిడెంటు శ్రీరాములు నాయుడు ఆ ఊరిలో ఏ పంచాయతి జరిగిన కోర్టుకు వెళ్లకుండా అక్కడే తీర్మానించుకోవాలని ఆ వూరి వాళ్లు మండపం కట్టేటప్పుడు తీర్మానించారు. ఆ కట్టుబాటు ప్రకారమే అప్పల్రాముడి పంచాయతి అక్కడ పెట్టారు. అప్పుడు కాదు ఇప్పటికి గ్రామీణ ప్రాంతాలలో చాలా పంచాయతీలు ఆ గ్రామంలోనే తీర్మానించుకుంటారు. ఇలాంటిదే నేటి అప్పల్రాముడి పంచాయతి, గోపన్న దగ్గర

తీసుకున్న అప్పు మూడెళ్ల క్రితమే తీర్చాలి అప్పల్రాముడు. కాని తీర్చలేని పేదరికం వల్ల గడువు మూడు సంవత్సరాలు పెంచుతూ గ్రామ ప్రసిడెంట్ శ్రీరాములు నాయుడు గ్రామ పెద్దలు లక్ష్యుం నాయుడు, సూర్యంగారు, మొదలగు వారి ముందు నోటు వ్రాసి ఇచ్చాడు అప్పల్రాముడు. ఆ గడువు ముగియడంతో తగువు మొదలయింది. "బాబు - గోపన్నబాబు, నా మొహం సూపి కాకపోతే నా పెద్దల మొహం సూసన్న సెప్పేది సెవినుంచు, నన్ను, నా పిల్లల్ని కూలోళ్లను సేసేయకు. తరతరాల బట్టి మాది రైతు కుటుంబం ఇయాలా. రేపు నా మనవలు కూడా ఎదిగొస్తున్నారు. నానూ నా కొడుకులూ కాకపోయినా నా మనవలైనా నీ ఋణం తీర్చేసుకుంటారు. కాన వుంచేసుకోరు. నీ ఋణం సానాకాలం బట్టి ఉండిపోయింది. కాని యింకొక్క మూడేళ్లు గడువియ్" అంటాడు అప్పల్రాముడు. నాటి సామాజిక పరిస్థితులు, రైతుల దీన స్థితులు, అప్పల్రాముడు స్థితిని గమనిస్తే అర్థమవుతుంది. ఎంత దీనంగా, హీనంగా జీవిస్తున్నది.

అప్పు తీసుకున్న వారి పరిస్థితి అలా ఉంటే అప్పు ఇచ్చిన వారి పరిస్థితి గోపన్న మాటల్లో "బాబూ లక్షుం నాయుడు! నేనే శ్రీరాములు నాయుడ్ని నెప పెడుతున్నా ననుకోకు. ఆయన ధర్మరాజు, ధర్మరాజు లాగానే ఆయన అజాత శత్రువు. ఒక వంక న్యాయం కోసం ఎవ్వరూ ఊరు విడిచి పోకూడదని కట్టడి చేస్తాడు. ఇంకో వంక న్యాయం చెప్పవలసే వేళకు దాటిపోతాడు.లేకపోతే ఆయనకు గాని, ఆయన మేనమామలకు గాని, మంది లేరనా, మార్భలం లేరనా - ఒక్క పూటంటే ఒక్క పూట వచ్చి వెళ్ల డానికి ఆయనకు తీరిక చెక్కడం పూటంటే ఒక్క పూట వచ్చ వెళ్లడానికి ఆయనకు తీరిక చెక్కడం లేదు అంటూ అప్పల్రాముడి మనుషు లేమంటున్నారో చెప్పి ఆఖర్నా ఇలా అన్నాడు. 'నాకు అంగబలం మొదలే లేదు. అర్థబలం ఉండేదిగాని పోయింది. ఎటొచ్చి ధర్మబలం ఉంది కదా అనుకున్నాను. కాని అది సందేహంలో పడింది" ఇలాంటి సంబాషణలు మధ్య గ్రామ పంచాయతి కొనసాగుతుంది. ధర్మాధర్మాల గూర్చి ఆలోచిస్తే నాటి సమాజంలో ధర్మానికి కట్టుబడి సమాజం ఎక్కువగానే ఉండేది అని తెలుస్తుంది. అప్పులు తీర్చే విధానంలో కొంత దోపిడి జరుగుతున్నట్లు అర్థమవు తుంది. దాని వల్ల ధర్మం కూడా అటూ ఇటూ అవుతుందని అర్థం చేసుకోవచ్చు.

## కుటుంబ సంబంధాలు :

ఈ కథను బట్టి నాడు ఉమ్మడి కుటుంబాలు బలంగా ఉన్నట్లు తెలుస్తుంది. అప్పల్రాముడు తన కొడుకులు, కోడళ్ల, మనవల ప్రస్తావన తెస్తాడు. దాని బట్టి ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ కొనసాగుతున్నా, కుటుంబ సంబంధాలు అంత ఉన్నతంగా ఉన్నట్లు కనిపించలేదు. ఎందుకంటే గోపన్న ఆర్థికంగా చితికిపోయినప్పుడు తమ పిల్లలు తండ్రిని కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయారు. అదేకాకుండా కథలో ముగింపుపై అనేక విమర్శలు వచ్చినట్లు రంగ నాయకమ్మ వ్యాసాలు వ్రాసినట్లు మనకు కనిపిస్తుంది. నాటి సమాజంలో కాని నేటి సమాజంలో కాని తండ్రిని, కొడుకు చంపడము అనేది సరైన ముగింపు కాదని, మార్పు కోరుకున్న వారు, కుటుంబ సంబంధా లలో మార్పు కావాలనుకునేవారు. ముగింపు ఇలా ఉండకుండదనే కోరుకుంటారు. ధర్మంగా ఉన్న తండ్రిని చంపడం అనేది హృదయ విదారకరమైన విషయం అని చెప్పవచ్చు. ఇలాంటి సంఘటనలు కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తాయి. దాని వల్ల సమాజంలో విలువలు తగ్గిపోతాయి.

## సమకాలీన సంబంధాలు :

ఆధునికత పేరుతో గ్రామీణ వ్యవస్థలో ఉన్న సంబం ధాలు కొంత క్షీణించినట్లు తెలుస్తుంది. వ్యవసాయంలో నూతన మార్పులు, సంప్రదాయ పంటలు పోయి వాణిజ్య పంటలు వేయడం, మనుషులకు బదులుగా యంత్ర సామాగ్రి ఉపయోగించడం, వస్తువు మార్పిడి పోయి డబ్బు చాలమణి కథలో మనకు కనిపిస్తుంది. శ్రీరాములు

నాయడు తీర్పు అనంతరం, అప్పలరాముడు తన గతము నెమరెస్తూ కొన్ని విషయాలు ప్రస్తావిస్తాడు. శ్రీరాములు నాయుడు తెచ్చిన మార్పు వల్ల కొంత అభివృద్ధి జరిగింది. హైస్కూల్ రావడం, పోస్టాఫీసు రావడం, రోడ్లు కొత్తగా వేయడం, ప్రభుత్వ గ్రామీణ ఆఫీసులు వచ్చినవి, తద్వారా కొంత అభివృద్ధి చెందినప్పటికి మానవ సంబంధాలలో కొంత మార్పు వచ్చినట్లు కనిపిస్తుందని వ్యవసాయంలో సంప్రదాయ పంటలకు బదులుగా వాణిజ్య పంటలు పండించడం వల్ల వ్యాపారులలో లాభార్జన కొరకు హమాలీ, కూలీ, తరుగు తీసిన రైతులకు కొంత లాభసాటిగానే గిట్టుబడి వచ్చేదని, దాని వల్ల వాణిజ్య పంటలు పండించడానికి రైతులు మొగ్గు చూపే వారని, అప్పలరాముడు తన ఆవేదన వ్యక్తం చేవారు. అదేవిధంగా మనుషుల మధ్య సంబంధాలు కూడా తగ్గిపోయినట్లు, అభివృద్ధి కొంత మందికి లాభం చేస్తే చాలా మందికి నష్టం కలిగించినట్లు కథలో వారి ప్రస్తావన వలన తెలుస్తుంది. నాటి సమాజంలోనే కాదు, నేటి సమాజంలో కూడా అధునాతన అబివృద్ధి జరిగిన సామాజిక సంబంధాలు విభిన్నంగానే ఉన్నట్లు, ఆర్థిక, సాంఘిక, సామాజిక సంబందాలు చెడిపోతున్నాయి. కథలో అప్పలరాముడనట్లు మనుషులకు బదులుగా భవిష్యత్తులో, కోత యంత్రాలు వాస్తవమే అన్నట్లు నేడు ఆ యంత్రాలతోనే కోత, కలుపు, నాటు యంత్రాల ద్వారానే జరుగుతుంది. అభివృద్ధి వల్ల కొంత లాభంకొంత నష్టం జరగడం సహజం. కాని సమకాలిన సంబంధాలు కూడా నశిస్తున్నట్లు గమనించవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) కాలిపట్నం రామారావు సమగ్రకథా సంకలనం
2) కథ శిల్ప సమీక్ష - పోరంకి దక్షిణామూర్తి

❖❖❖

# చావు కథ - ఒక పరిశీలన

**- డా॥. చాగంటి నాగరాజేశ్వరి,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమండ్రి, తూ॥గో॥ జిల్లా.

కాళీపట్నం రామారావు మాస్టారి కలం నుండి జాలువారిన ఆణిముత్యాల వంటి కథల్లో ఒక మేలిమి ముత్యం "చావు" కథ.

జాతస్య హిధ్రువో మృత్యు: (జాతస్య మరణం ధ్రువం) - పుట్టిన ప్రతి జీవి మరణించక తప్పదు. అయితే ఆ చావు అనేది ఒక్కోచోట ఎంత సమస్యాత్మకమౌతుందో, దాని వెనుక వుండే అనేక కోణాలను ఈ కథలో రచయిత స్పృశించారు.

'చావు' అనేది వర్గాలను బట్టి, కులాలను బట్టి, ఋతువులను బట్టి ఒక్కోచోట పండుగ లాగా, ఒక్కోచోట ప్రాణసంకటంగా ఉంటుంది.

పేదవానియింట పెళ్లైనా తెలియదు
గొప్పవాని యింట చావు గొప్పే
పేద ధనిక తారమిట్లెరుగగవచ్చు
విశ్వదాభిరామ వినురవేమ ! అంటాడు వేమన

తరతరాలుగా ధనిక, పేద వర్గాల తారతమ్యం, కులాల మధ్య వ్యత్యాసం అన్ని విషయాలతో పాటు చావు విషయంలో కూడా ఎలా ఉంటుందో ఈ కథలో రచయిత చూపించాడు.

"పుట్టుక వ్యక్తిగతం -
చావు సామాజికం" అంటారు రచయిత..

పుట్టినప్పుడు పిలిస్తేనే బంధువులుగానీ, చుట్టుపక్కల వారు గానీ వస్తారు. కానీ మనిషి చనిపోతే ఎవ్వరూ పిలవక్కరలేదు. కుటుంబ సభ్యులతో బాధను పంచు కునేందుకు, సానుభూతి చూపేందుకు పిలవకుండానే వస్తారు.

నారమ్మ అనే ముసలావిడ చనిపోతే ఆమెను దహనం చేయడానికి అవసరమైన కర్రలకోసం పడిన శ్రమ, చేసిన ప్రయత్నాలే ఈ కథలో ఇతివృత్తం. ఈ నేపథ్యంలోనే రచయిత ధనికులు, పేదల మధ్య వ్యత్యాసం, కులాల వారీ బానిసత్యం, మోతుబరుల ఆధిపత్యం, తరతరాలుగా ప్రకృతి వనరులపై ఉన్నత వర్గాల వారి అధికారం, తరతరాల దోపిడీ వంటి అనేక అంశాలను చర్చించడంతో పాటు, విప్లవ భావాల నేపథ్యంలో అవసరమైనప్పుడు యువత తమ అవసరాలకోసం, హక్కులకోసం ఎదురు తిరగాలని ఉద్బోధిస్తారు.

అక్కివరం అనే గ్రామంలో మూలపేటలో ఎరకయ్య కుటుంబం ఒకటి. అతనికి భార్య సావాలు, పెద్దకొడుకు (ఇతడికి పేరు పెట్టలేదు), పెద్ద కూతురు పోలమ్మ, రెండో కూతురు నారెమ్మ, మూడో కూతురు సిమ్మాద్రి, నాలుగో కూతురు దాలి, ఆఖరి కొడుకు పెంటిగాడు. పేదల కుటుంబాల్లో ఎల్లప్పుడూ తారట్లాడే దారిద్ర్యమే ఎరకయ్య ఇంట్లోనూ నిత్యం తాండివిస్తుంది.

పంటలు బాగా పండి చేతినిండా కూలిపని దొరికితే వారికి పండగే. ఇంటివద్ద చిన్న పిల్లల్ని, కదలలేని ముసలివాళ్ళను వదిలేసి, ఇంటిల్లపాదీ కూలి దొరికినన్ని రోజులూ చుట్టు ప్రక్కల ఊళ్ళకు అన్ని రకాల వ్యవసాయ పనులకు వెళ్లిపోతారు. ఉదయం వెళితే మళ్ళీ పని పూర్తయ్యాక రాత్రికే తిరిగి వచ్చేది. మధ్యలో ఏకారణం చేతనైనా పని ఆపి ఇంటికి వెళ్ళిపోతే ఆరోజు మొత్తం కూలి డబ్బులు ఇవ్వరు.

ఈ కారణం చేతనే నారమ్మ చనిపోయిన విషయాన్ని సిమ్మాద్రి వాళ్ళ అమ్మా, నాన్నలకు చెప్పలేదు. అందుకు కారణం లేకపోలేదు. అంతకు ముందు రెండు, మూడు సార్లు నారమ్మను చనిపోయిందని భావించి వెళ్ళి చెబితే అమ్మా, నాన్న వచ్చేసారు. వారికి కూలీ ఇవ్వలేదు. అందుకే ఇంతకు ముందు సిమ్మాద్రి నాన్నమ్మ గురించి చెప్పడానికి

వెళ్తే పోలమ్మ ప్రక్కకు తీసుకువెళ్ళి ప్రొద్దున్నే అయితే ఏకబురైనా చెప్పు, మధ్యాహ్నమైతే కబురు తేవద్దని, లేకపోతే కూలీ డబ్బులు పోతాయని చెప్పింది. అందుకే ఇప్పుడు ఊరుకున్నారు.

నారమ్మ వయస్సు తెచ్చిన రోగాలతో పాటు చలికి తట్టుకోలేక చనిపోయింది. ఇంట్లో ఉన్న అన్నీ గుడ్డల్నీ, గోనె సంచుల్నీ కప్పినా చలిఆగదు. ఒక పావుగంట చలితో పారాడి ప్రాణాలు వదిలేస్తుంది.

అనంతరం సిమ్మాద్రికి ఆ రాత్రి చలిలో తమకు కప్పు కోవడానికి ఒక్క దుప్పటి ముక్క కూడా మిగలలేదని గుర్తొస్తుంది. ఈ సన్నివేశంలో శవంపై గుడ్డలు తీయడానికి ఆమె చేసిన ప్రయత్నం, పొరుగు పిల్లలకు తెలియకుండా జాగ్రత్త పడడం చూస్తే జీవితం వయసుకు మించిన పాఠాలను నేర్పుతుందనిపిస్తుంది.

పెద్దలంతా పని నుండి వచ్చాక శవాన్ని బయటవేసి ఆ పేటంతా చేరతారు. చూడడానికి వచ్చేవారు ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక శవదహనం గూర్చి చర్చ మొద లౌతుంది. కాల్చడానికి కట్టెలు కావాలని అంటుంది కోడలు సావాలు. కట్టెలు దొరక్కపోతే పాతిపెట్టేయడమే అంటుంది పొరుగింటి లచ్చమమ్మ. అలాగైతే ఆడ పడుచులు, ఇరుగు పొరుగు వారు తమని దెప్పుతారని సావాలు అంటుంది. ఊళ్ళో పెద్దల్ని రేప్పొద్దున్న అడిగేదేదో ఇప్పుడే అడుగుదామని, అందుకు బారికోడు కన్నయ్య ముందుంటే ఎవరూ కాదనరని ఉపాయం చెబుతాడు సొట్ట పాపిగాడు. ఇది అందరికీ నచ్చి వెళ్ళి అడుగుతారు. నాయుడుగారింటికెళ్తే ఆయన భార్య చాలా సేపు నిలబెట్టి, చనిపోయిన మనిషిని గూర్చి అన్నీ గుర్తు చేసుకొని, చివరికి ఈ చలిలో కుదరదని, రేప్పొద్దున్న రమ్మని తలుపేసేసు కుంటుంది. వెళ్ళిన వాళ్ళలో సీతయ్య అప్పారావు వచ్చేసారు. మిగిలిన వాళ్ళు సుబ్బారాయుడు ఇంటికి వెళ్ళారు. అక్కడకూడా పని జరగలేదు. ఇంతలో అప్పా రావు ఆవేశపూరితంగా ఒక ఆలోచన చెబుతాడు. నిజంగా పెద్దలందరికీ శవాన్ని కాల్చడమే ధర్మమని, లేకపోతే జీవుడు దెయ్యమై పోతాడనే మాటపై విశ్వాసముంటే తను ఒక ఆలోచన చెబుతానని, ప్రతి ఇంట పశువులను కట్టేకొయ్యను సేకరిస్తే శవదహనానికి సరిపోతుందని చెబుతాడు. దానికి పెద్దలు అంగీకరించరు. అది దొంగ తనమని, మనం ధర్మమార్గం వదలమని చెబుతారు. చివరికి పెద్దలంతా శవాన్ని పాతిపెట్టడానికి సిద్ధపడి శ్మశానానికి తీసుకెళతారు. అక్కడ గొయ్యితీసి మధ్యలో సారా తాగడానికి ఆగుతారు. ఇంతలో ఎరకయ్య పెద్ద కొడుకు, సీతయ్య మొదలగు కొంతమంది యువకులు తెగించి పందిరి అప్పయ్య కళ్ళంలో ఉన్న కట్టెల మోపుల్ని తీసుకువచ్చి పెద్దల ముందు పడేస్తారు. ఆ కట్టెలతో తన తల్లి శవాన్ని దహనం చేసిన ఎరకయ్య ముఖంలో ఎంతో ప్రశాంతత, ప్రకాశం కనిపిస్తాయి. రేప్పొద్దున్న ఈ యువకులను దొంగలుగా నిందిస్తే అది తన తప్పేనని, తనను శిక్షించమని అడుగుతానని నిర్ధారించుకుంటాడు.

ఈ కథలో సూరయ్య అనే ఆ పేట పెద్దమనిషి ద్వారా చనిపోయిన నారమ్మ జీవితం గురించి వివరిస్తాడు. ఆ సందర్భంలో రచయిత డబ్బుగలవాళ్ళు చనిపోతే దీపాలు, కర్పూర పరిమళాలు, పూల దండలు, భజనలు, దహనానికి గంధపు చెక్కలు, ఆవునెయ్యి వంటి ఆడం బరాలు ఉంటాయిని, ఆదే పేదల శవం వద్ద చనిపోయిన వాళ్ళ గురించి చెప్పుకునే కబుర్లు, కథలే ఉంటాయిన పేర్కొంటారు.

ఈ కథలో అప్పారావు పాత్రద్వారా విప్లవభావాలు పలికిస్తాడు. శవాన్ని దహనం చేయడమే మన ఆచారమని, కప్పెడితే దెయ్యాలవుతారని పెద్ద సూరయ్య చెబుతాడు. మీకు నిజంగా దహనం చెయ్యాలనుంటే కర్రలకోసం నిజంగా ప్రయత్నించాలని, అవసరమైతే పెద్దలను ఎదిరించాలని, ఆవేశంగా చెబుతాడు. పైగా మన పెద్దలు ధర్మమార్గమని తరతరాలుగా బానిసలుగా ఉండడమే నేర్పారని, పోనీ అలా ఉన్న మనకు అవసరం వచ్చి నపుడైనా ఆ పెద్దలు మనల్ని ఆదుకుంటున్నారా ? ఇంకా ఎన్నాళ్ళిలా వాళ్ళ కాళ్ళ కింద పడి ఉండాలి అని

ప్రశ్నిస్తాడు. న్యాయానికీ దారి లేదు. తిరుగుబాటుకి అవకాశం లేదంటాడు. అప్పారావు రేకెత్తించిన ఆలోచనలతో నూరయ్య ఆలోచనలలో కూడా మార్పొస్తుంది. తనకు ఊహ తెలిసేటప్పటికి అన్ని వర్గాల వారికి కొద్దో గొప్పో పొలం ఉండేదని, భరోసా ఉండేదని, క్రమంగా పశువుల మేతకని, బంజరుభూములు, పోరంబోకు భూములు దున్నేసారని, పారిశ్రామికీకరణతో భూమిపై ఆధిపత్యం అంతా మోతుబరులకు దక్కిందని, నోరు లేనివాళ్ళు బానిసలయ్యారని, క్రమ క్రమంగా ప్రకృతి వనరులైన గాలి, నీరు. భూమి, చెట్టు, పుట్టలన్నీ వాళ్ళ ఆక్రమించేసుకొని కొద్దికాలంలోనే ధనవంతులైపోయారని, మిగతావాళ్ళు మరింత పేదలైపోయారని విశ్లేషించి చెప్పాడు. కనీసం మనిషి చనిపోతే దహనానికి అవసరమైన కట్టెలుకోసం కూడా పెద్దలను కాళ్ళా వేళ్ళా పడాల్సిన స్థితి వచ్చింది. అయితే ధర్మంగా నడిస్తే ఎప్పుడో ఒకప్పుడు దైవం వస్తాడని, తమని రక్షిస్తాడనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తాడు.

కన్నయ్య మాటల్లో దైవం శంకు చక్రాలు. అవి లేకుండా కలికాలంలో కత్తి పట్టుకు వచ్చి, గుర్రంపై పాపాలు చేసేవోళ్ళని నరుక్కుంటూ వెళతాడట అని చెబుతాడు.

కన్నయ్యకు ఇంకో సందేహం వస్తుంది. ప్రపంచం చాలా అభివృద్ధి చెందింది. బాంబులు, విమానాలు అన్నీ వచ్చేసాయి. మరిప్పుడు దేవుడు ఎలా వస్తాడు. ఎలా పాపాత్ముల్ని చంపుతాడు ? అంటూ తన సందేహం వ్యక్తం చేస్తాడు. ఎలా పాపాత్ముల్ని చంపుతాడు ? అంటూ తన సందేహం వ్యక్తం చేస్తాడు. అది బహుశా ప్రళయ రూపంలో రావాలి. అదొచ్చినపుడు పేద గొప్ప తేడా లుండవు అంటాడు.

"కవయ: క్రాంత దర్శన:" అన్నట్టుగా రచయిత 1971 లోనే నిన్నో, మొన్నో వచ్చిన కరోనా గూర్చి ఊహించారేమో అనిపిస్తుంది. మొన్న వచ్చిన కరోనా దెబ్బకి పేద, ధనిక, కుల, మత, స్త్రీ, పురుష, చిన్నా, పెద్ద ఏ వ్యత్యాసం లేకుండా అందర్నీ గజగజలాడించింది. డబ్బుతోగానీ, అధికారంతోగానీ, పనిలేదు. పరిశుభ్రత ఒక్కటే రక్ష అన్నట్టుగా చేసేసింది. బహుశా కన్నయ్య ఊహించిన ప్రళయం అదేనేమో !

ముందుగా కర్రలు అలా తీసుకురావడం మంచిది కాదని అనుకున్నా, అవి ఎవరి సొత్తూ కాదని, ఊరి ఉమ్మడి ఆస్థిఅని, నోరుందని మోతుబరులు ఆక్ర మించేసుకుంటున్నారని, ఆ కర్రలను కొట్టినందుకు కూలీలకు కూలి కూడా ఇవ్వలేదని, కాబట్టి అది పందిరి అప్పయ్య సొంతం కాదని సీతయ్య చెప్పేసరికి ఎరకయ్యకు ఆ దేవుడే ఈ యువకుల మనసుల్లో దూరాడని భావిస్తాడు. తన తల్లి చివరి కోరిక అయిన జీవితకాలం చలి ఎగిరిపోయేలా కర్రలతో తనను దహనం చేయమనడం గుర్తొచ్చి ముఖం ఆనందంతో వెలిగి పోతుంది.

సూరయ్య తాత చెప్పిన కథలో ప్రస్తుతం చనిపోయిన నారమ్మ చాలా ఆత్మ విశ్వాసం గల మనిషి అని, కష్టజీవి అని తెలుస్తుంది.

ఈ విధంగా ఈ కథలో చావు వేసవికాలంలో వస్తే కర్రలకు తడుముకోనక్కరలేదు. శీతాకాలం కర్రలు దొరకవు. చలి కాబట్టి ఈ కాలం చావుకి అంత సరైనది కాదు.

ప్రతి విషయంలోను ఉండే తరతమ్యాలకు 'చావు' అతీతం కాదని రచయిత పేర్కొన్నారు. చావు ఎవరికైనా తప్పదు కానీ ఆ చావు ఇతరులకు సమస్య కాకూడదు అనిపిస్తుంది ఈ కథ చదివితే.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు - 2008 వరకు (లభ్య రచనలు) సంపాదకులు - వినయ మూర్తి, రచన - సాయి
2. భగవద్గీత 3. వేమన శతకం 4. సూర్యరాయాంధ్ర నిఘంటువు. ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కా.రా. మాష్టారి కథలు - ప్రాంతీయ అస్తిత్వం

- **డా॥. దార్లపూడి శివరామకృష్ణ ,** తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతపల్లి.

మాథ్యూ ఆర్నాల్డ్ తన 'డోవర్ బీచ్'లో ".....వాస్తవానికి ఈ లోకంలో సంతోషం లేదు / ప్రేమ లేదు / స్థిరత్వం లేదు, శాంతి లేదు, 'బాధకు ఉపశమనం లేదు / చీకటి కమ్ముకొస్తున్న మైదానం మీద ఉన్నాం..." అంటాడు. హె.జి.వెల్స్ అన్నట్లు ఇటువంటి అభద్రతా భావమే కథానిక పుట్టుకకు ముఖ్య కారణం. ఈ ఆందోళనను, విశ్వాస రాహిత్యాన్ని చిత్రించటానికి 'కథ'ను మించిన 'సాధనం' మరొకటి లేదని ఎందరెందరో కథా రచయితలనుకున్నారు. నాటి 'గురజాడ' నుంచి నేటి 'మల్లిపురం' వరకు ఈ ఒరవడి కొనసాగుతూనే ఉంది. వివిధ దేశాల రచ యితలు కథలను తన చుట్టూ ఉన్న అలజడిని చిత్రించటానికే ప్రయత్నం చేసారు. జీవిత వాస్తవికత, నిజజీవన తార్కికత దూరమవుతున్న కొద్దీ 'మనిషి' అస్తిత్వం సహజతకు చెల్లు చీటీ రాయటం ఓ విషాదమే' దీనిని పాశ్చాత్యులు IRREALITY అన్నారు. కానీ... మానవ మస్తిస్కాలలో ప్రాంతీయ అస్తిరత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. వ్యక్తి ఓ 'అసంగత్వ భ్రాంతి'కి లోనవటం జరిగింది. ఇటువంటి స్థితిని చిత్రించటానికి నిడివి తక్కువగానూ, పదును ఎక్కువగానూ ఉన్న సాహితీ ప్రక్రియగా 'కథ' ప్రక్రియ కనిపిస్తుంది. ఒక నిర్దిష్టమైన చారిత్రక దశలో పుట్టిన ప్రత్యామ్నాయ ప్రక్రియ (ALTERNATE GENER) కథ. ఈ కోణంలోంచి ఆలోచిస్తే మానవ ప్రాంతీయ అస్తిత్వాలు కథకు ఉప కరణాలు కావటం దృశ్యమానమవుతుంది. కథలో ఈ అస్తిత్వాన్ని చిత్రించటమనేది కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. పూలదండలో దారంల ఈ అంశంను బిగించుకోవాలసిన అవసరముంది. గురజాడ, రా.వి.శాస్త్రి, గంటేడి, అట్టాడ, భూషణం, శ్రీపాద, చా.సో వంటి వారి కథల్లో ఈ ప్రాంతీయ అస్తిత్వం అనేది భిన్న దృక్కోణాల్లో కనిపిస్తుంది. అయితే 'ప్రాంతీయ అస్తిత్వం' అనే మాటకు నికరమైన సరిహద్దులు లేవు. దేశంలోని వివిధ సామాజిక, ఆర్థిక పొరల్లో జీవిస్తున్న ప్రజా శ్రేణులున్న ఒక సమూహాలు ఆచరలోనూ, ఆదర్శలలోనూ వివిధ స్థాయిలలోనో అనుబంధాలుంటాయి. ఇటువంటి అస్తిత్వ భావనలో ఎన్నో పార్శ్వాలుంటాయి. కాలక్రమంలో వీటిలో కొన్ని తిరస్కరణకు గురి కావచ్చు. ఇటువంటి అస్తిత్వపు కోణాలు సాహిత్యంలో తీవ్రంగా ప్రస్ఫుటమయాయి. ఉత్తరాంధ్ర కథలలో ఇటువంటివి మిక్కుటంగానే ఉన్నాయి. జీవితం లోని లోతుల్ని, సంవేదనల్ని, వైరుధ్యాలను, సంక్లిష్టలను దర్శించి - వీటికి స్థానిక అస్తిత్వాన్ని ఓ నేపథ్యంగా ఎంపిక చేసుకొని 'భాష' (లేదా మాండలీకం)తో వర్ణనాలద్దటం 'కథ'కు ప్రసిద్ధి చేకూర్చింది. ఈ వరసలో కాళీపట్నం రామారావు గారి కథలను ప్రముఖంగా పేర్కొన్నాలి.

కథా రచయితగా కాళీపట్నం రామారావు గారి పరిణామాన్ని మూడు దశలుగా చెప్పుకోవాలి. మొదటి దశ 1948 నుంచి 1955 వరకు ఈ దశలో ఆయన రాసిన కథలు 'పెంపకపు మమకారం' నుంచి 'అశిక్ష - అవిద్య' వరకు 1955 తరువాత కథ పట్ల ఆయన అభిప్రాయం మారిందనే చెప్పాలి. ఈ మార్పుకు ఫలితం 1956 నుంచి 1963 వరకు మౌనం. ఈ కాలంలో ఆయన ధృక్పథం 'ప్రాంతీయ అస్తిత్వం' లో వర్గ పీడననను గ్రహించారు. కుటుంబ సంబంధాల నుంచి సామాజిక పీడనకూ, మద్య తరగతి పీడించే పై తరగతికి, పీడించ బడే తరగతికి మారింది. ఆ తరువాత 1964 నుంచి 1972 వరకు 'తీర్పు' నుంచి 'కుట్ర' వరకు పదహారు కథలు వ్రాసారు. ఈ కథలే ప్రాంతీయ అస్తిత్వ చిరునామాలుగా చెప్పుకోవచ్చు.

1993లో 'సంకల్పం' వరకు జరిగిన కథా 'యజ్ఞం'లో ఆయనెక్కడా తన ప్రాంతీయతను మరువలేదు.

'కీర్తికాముడు' కథలో వెంకయ్యనాయుడు కూలిపోవటానికి కారణం అతని దానగుణం మాత్రమే కాదు 'ఓ సామాజిక ఆర్థిక అస్థిరత' కూడా "ఆయన నడుం కట్టి జీవితంలో ప్రవేశించేసరికి ఆ ప్రాంతంలో రూపాయిల పలుకుబడి హెచ్చుటం, దినుసు పలుకుబడి తగ్గటం 'ఆరంభమయిం దంటారు. అంటే 'ద్రవ్య ఆర్థిక విధానం జీవితాల్ని ఆక్రమించుకోవటం చేత 'ఇంట్లో దినుసులు తప్పా రూపాయిలు విలువ చెయ్యటం కుదరదు' 'అప్రజ్ఞాతం' అనే కథలో సుదర్శనం' 'నా ఎరికలో యీ ఊళ్ళో ఎందరెందరలో రైతులు వ్యవసాయ కూలీలయ్యారు - ఈ భూములు ఆస్తులు ఎవరికి దఖలు పడ్డాయి? ఎలా దఖలు పడ్డాయి? శ్రమించి చెమటోడ్చడం వల్లా? శ్రమించి చెమటోడ్చినవాడు ఒక్కడైనా సెంటు భూమి కొనగలడా?' 'ఒక వ్యక్తి దోపిడి చేయటానికీ, అతని వల్ల దోపిడి జరగటానికి మధ్య 'నైతికంగా' ఉన్న తేడానే 'అప్రజ్ఞాతం'. మధ్య తరగతి జీవితాల కథల్లో కూడా ఆనాటి ఉత్తరాంధ్ర 'అస్తివజీవన విధానాల' చిత్రణ కనిపిస్తుంది. ఈ కథలో కా.రా. మాష్టారు చూసేది సామాజిక పరిణామం గురించిన లోతైన ఆలోచనా ధృక్పథమే. ఇక్కడ కా.రా గారు 1943 నుంచి 1947 వరకు రాసిన కథలను గూడా పరిగణలోనికి తీసుకొని పరిశీలిస్తే పెళ్ళిచూపుల తంతులోని స్త్రీ జీవన అస్తిత్వానికీ, ఆత్మగౌరవానికి భంగం కలిగించే పద్ధతిని రేవతి పాత్ర ద్వారా తీవ్రంగా వ్యతిరేకరిస్తారు. 'అవి వాహితగానే ఉండిపోతాను గానీ' అనే కథలో "తలలో నాలుకలా సంఘం కోసం తయారు చేసిన నా స్వభావాన్ని (అస్తిత్వం) వివిధ సామాజిక రుగ్మతలకు ఆధిపత్యం వహించే పురుష పులిజాతి స్వభావానికి ఎలా అప్పగించనూ/అని కథానాయిక చేత అనిపించడం ద్వారా నిరక్షరాస్యులైన సామాన్యులనో, రైతులనో వ్యక్తీ అస్తిత్వాభిమానాలకు విఘాతం కలిగించే దౌర్జన్యాన్ని 'బలానికి లక్ష్యం' కథలో తీవ్రంగా నిరసిస్తారు. ఈ ప్రాంతీయం అస్తిత్వం స్వాతంత్ర్యానికి పూర్వం ఉత్తరాంధ్రను చూపుతుంది. కా.రా.మాష్టారి 'యజ్ఞం' కథలో ప్రాంతీయ అస్తిత్వానికి చిహ్నాలుగా మిగిలిన అనేకానేక రుగ్మతలును ఈ కథనంలో గమనించవచ్చు. ప్రాంతీయంగా వచ్చిన ఉద్యమాలను విజయం, వైఫల్యాలు వలన వర్గచైతన్యానికి దోహదికారి కావచ్చు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర భౌగోళిక స్వరూపంలోని విశిష్ట, ప్రత్యేకతలు వలన ప్రజా జీవనంలోనూ వివిధ చైతన్య వంతమైన సంప్రదాయాలు, విశిష్టతలు ఉన్నాయి. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, పేదలు వంటి వారి జీవితాలు కేవలం 'కష్టానికే పరిమితం కావటం విషాదం. 'యజ్ఞం' కథ ముగింపులో అప్పల్రాముడు చేసిన పని 'ప్రాంతీయత అనిపించుకోదనే వాదన ఉంది. కానీ... మనిషికి 'ప్రాంతం' ఒక ఆలంబన మాత్రమే. తనదైన అస్తిత్వానికి ముప్పు వాటిల్లినప్పుడు, తన ఉనికికి భంగం కలిగినప్పుడు గానీ అతడెంత దూరమైన వెళ్ళగలుగు తాడు. 1960ల ప్రాంతంలో రైతాంగ గిరిజన ఉద్యమానికి ఎంతో ప్రసిద్ధి ఉంది. శ్రీకాకుళం రైతాంగం వర్గచైతన్యం లేదా ఉద్యమస్ఫూర్తి దేశదేశాలకు విస్తరించింది. ఈ నేపథ్యం నుంచే భూషణం మాష్టారు 'కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవిలో షావుకారు దూరాడ'ని అడవంటుకుందిలో రాస్తారు. ఏజన్సీ అనేది ఈ ప్రాంతపు ఓ విభిన్నమైన 'వ్యక్తిత్వపు అస్తిత్వానికి' ప్రతీకగా నిలిచే ప్రాంతం. అక్కడ మనిషిని మనిషే దోచుకొనే విధానం సహజమనిపిస్తుంది. బహుశా ఆటవిక న్యాయం అనుకోవాలి. 'యజ్ఞం' కథలో శ్రీరాములు నాయుడు ఓ వర్గానికి ప్రతినిధి. అప్పల్రాముడు బలహీన వర్గజాతీయుడు. అప్పులు తీసుకోవడం ఓ సర్వసాధారణ మైన స్థితి. కానీ... రక్తం పీల్చే విధంగా, బ్రతుకులను బానిసలుగా... తరతరాలవెట్టిగా మార్చే రీతిలో మార్పులు, తరాల అంతరాలు అనివార్యమవుతాయి. నాలుగు దశాబ్దాల క్రితం ఉన్నట్లు ఉత్తరాంధ్ర ప్రాంతం వర్తమానం లేదు.

ప్రాంతీయ అస్తిత్వం గురించి చర్చకు బయలు దేరేముందు 'ఒక ఉద్యమం ఒక నిర్దిష్ట విలువలతో

సమాజాన్ని సమూలంగా మార్చే ఆశయం సాగుతున్నప్పుడు, సాహిత్యం ఆ ఉద్యమంలో భాగం కావాలనీ, రచనలు ఆ ఉద్యమం ప్రయోజనాకి అనుగుణంగా సాహిత్య సృష్టి జరగాలని కోరుకోవటం తప్పు కాదు. కానీ, గమనించవలసిన విషయం ఏమిటంటే 'ప్రాంతీయతా అనేది నిత్యం మార్పులను తనలో కలుపుకుంటూపోతుంది. ఈ కథలో రచయిత శ్రీరాములునాయుడు, అప్పల్రాముడు పాత్రల నుంచి ఈ ప్రాంతపు 'అరాచకం' 'రాచరికపు' వర్గాల ముసుగులో సేవ, మంచితనం వంటివి చిత్రించడం జరిగింది. కథ ముగింపులో శ్రీరాములునాయుడు తీర్పు మరో సంఘటనకు దారితీసింది. ఎన్నెన్నో చర్చలకు అవకాశమిచ్చింది. చివరిలో అప్పల్రాముడు పలికే పలుకులు శాంతి, అహింసల పేరుతో పైకి వచ్చిన వాళ్ళెవరో ఏ మార్క్సిస్టు ఆర్థికవేత్తకి తెలియరానంత స్పష్టంగా చూపగలుగుతాడు అదే విధంగా 'భయం' 'ఆర్తి' 'చావు' వంటి కథల్లో రామారావు గారు ఈ 'ప్రాంత అస్తిత్వాన్ని' మనుషుల మనస్తత్వాలని చిత్రించారు. కా.రా. కథలు దాదాపుగా ఏవీ పైకి తెలిసిపోవు. పొరలు పొరలుగా విడదీసి చదువుతూ వెళితే అనేక 'జీవిత సత్యాలు' 'ప్రాంతీయ ఉనికి అస్తిత్వాల' వాస్తవాలు బయటపడుతుంటాయి. రచయిత ఎందుకిలా రాసారు అనే ప్రశ్న పాఠకుడిలో కలుగుతుంది. అలా తప్ప మరోలా రాయలేక పోయానని' అయనే వినయంగా అంగీకరిస్తారు. అంతర్లీన సత్యమేమిటంటే 'ఆ కథ అలానే రాయాలి' మరోలా రాయడం కుదరదు.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు - ప్రొగ్రెసివ్ పబ్లికేషన్ - 1999
2. 'కథాశిల్పం' - వల్లంపాటి - విశాలాంధ్ర ప్రచురుణలు - 1995
3. 'తెలుగు కథ - ప్రాంతీయ అస్తిత్వం' - సిల్వర్ జూబ్లీ కళాశాల - కర్నూలు - 2015

❖❖❖

# 'భయం' కథ - సామాజిక సందేశం

**– డా॥. కిలారి గౌరినాయుడు,** అధ్యాపకుడు, సెయింట్ జోసఫ్స్ మహిళా కళాశాల, విశాఖపట్నం.

ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఆధునిక కథానిక రచయితల్లో కాళీపట్నం రామారావు ముఖ్యులు. విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే కొంత కవితా వ్యాసంగం చేసినా ప్రస్తుతం అవి అలభ్యాలే. 'ప్లాటు ఫారమో' అనే శీర్షికతో ఆయన రచించిన దానిని 'చిత్రగుప్త' అనే పత్రిక ప్రచురించింది. అది ఆయన మొదటి రచనగా చెప్పుకోవచ్చు. రామారావు గారు తొలిరోజుల్లో కొంతకాలం కోర్టులో ఉద్యోగిగా ఉన్నారు. ఆ తరువాత ఆ ఉద్యోగాన్ని విడిచిపెట్టి ఉపాధ్యాయునిగా పని చేశారు. ఉపాధ్యాయుడుగా పని చేసిన కారణంగానే ఆయనతో పరిచయం ఉన్న వారందరూ ఆయనను 'కారా మాస్టారు' అని అభిమానంతో పిలుస్తారు.

రాగమయి, యజ్ఞం, జీవధార, రుతుపవనాలు, అభిమానాలు అనేవి కారా మాస్టారి రచనలు. 'కారా కథలు' అనే పేరుతో వారి కథలు ప్రచురింపబడ్డాయి. 2008లో కాళీపట్నం రామారావు రచనలు అనే పేరుతో ఆయన రచనలను మనసు ఫౌండేషన్ వారు ప్రచురించారు. ఆయన వ్రాసిన కథల్లో తీర్పు, హింస, భయం, యజ్ఞం, మహదాశీర్వచనం వంటి కథలు ప్రసిద్ధమయ్యాయి.

కథారచనలో, నవలా రచనలో రామారావు గారి ప్రతిభను గుర్తించి అనేకమైన ప్రముఖ సంస్థలు వారిని సత్కరించాయి. ఆయన రాసిన 'యజ్ఞం' కథను 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ ఉత్తమ కథగా గుర్తించి అవార్డు అందించింది. ఎన్.టి.ఆర్. జాతీయ పురస్కారం, లోక్ నాయక్ ఫౌండేషన్ సన్మానం, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డు, కొండేపూడి శేషగిరిరావు సాహితీ పురస్కారం వంటి ఎన్నో పురస్కారాలు ఆయనను వరించాయి.

రామారావు గారిలో ఒక ప్రత్యేకత ఉంది. అవార్డుల ద్వారా ఆయన పొందిన డబ్బును ఆయన ఖర్చు చేయలేదు. ఆ డబ్బుతో శ్రీకాకుళంలో 'కథా నిలయం' పేరుతో ఒక సాహితీ సంస్థను నెలకొల్పడం విశేషం. ఆ కథా నిలయంలో కథలకు, కథానిక రచయితలకు సంబంధించిన వివరాలన్నీ లభిస్తాయి. రామారావు గారు ఆధునిక కథా రచయితలను ఎంతగానో ప్రోత్సహించారు. ఆంధ్రభూమి దినపత్రికలో నేటి 'కథ' పేరుతో ఒక శీర్షిక నిర్వహించి ఎందరో యువకవులను పరిచయం చేశారు. వారి ప్రభావం ఆధునిక కథానిక రచయితలపై కనిపిస్తూ ఉంటుంది.

'భయం' కథను రామారావు గారు ఉత్తరాంధ్ర మాండలిక భాషలో రచించారు. ఈ కథ యువ దీపావళి పత్రికలో 01-11-1970న ప్రచురింపబడింది. లోకంలో అందరూ అన్నింటికీ భయపడరు. ఒకరు భయపడే విషయాన్ని మరొకరు ధైర్యంగా ఎదుర్కొంటారు. మరికొందరు ఆ భయాన్ని తొలగించుకోవడానికి ఎవరినైనా ఆశ్రయిస్తారు. కొంతమంది ఇతరుల భయాన్నీ ఆదాయంగా మార్చుకుంటారు. ఈ భయం అనేది మనుషుల మనస్సులను ఎలా ప్రభావితం చేస్తుందో ఆ భయం ఎలా పరిణమిస్తుందో తెలియజేస్తూ కాళీపట్నం రామారావు రాసిన ప్రముఖ కథానిక "భయం".

"పాము మనిషిని కుడుతుంది. మనిషికి చావంటే భయం. పామును చూస్తే చావుని చూసినంత భయం. చావుకి భయపడనివాడు పాముకు భయపడడు. పాము కాటేస్తుందో, వెయ్యదో కాని దాని భయం మనిషిని తినేస్తుంది. పురుగులాగ, ఎదురు తిరిగితే ఏమి ఉండదు. నీ చేయే పైన అప్పుడు చావు, పావు చీమల్లా చిన్నవయి పోతాయి" ఇవి కథలో సత్తెయ్య మాటలు. ఇవి నిజానికి అక్షర సత్యాలు.

భయం అనేది మానసిక దౌర్బల్యం ఈ దౌర్బల్యం ఉన్న వాళ్ళు తమకేదో జరుగుతుందని ఊహించుకోవడమే

భయం. మనిషి భయపడునట్లు ఒక్కోసారి జరుగవచ్చు, జరగకపోవచ్చు. భయం లేని వానికి కూడా తెలియని ప్రమాదం కలుగవచ్చు. కానీ ఏదో జరుగుతుందని ఊహిస్తూ భయపడడం చావుతో సమానంగా చెప్పుకోవచ్చు.

'భయం' కథ ప్రధానంగా పాముకి సంబంధించిన కథను ఆశ్రయించుకొని తిరుగుతూ ఉంటుంది. పాముని చూస్తే మనిషికి ఎలా భయమో, మనిషిని చూస్తే పామూ అలాగే భయపడుతుంది. ఆ భయంతోనే మనిషిని పాము కాటు వేస్తుంది. ఆ భయంతోనే మనిషి చనిపోతాడు. మనిషిలోని పాము భయాన్ని కొందరు ఆదాయంగా మార్చుకుంటారు. దానితో వ్యాపారం చేస్తారు. కథలో ఉన్న మనుషులను గమనిస్తే పాము భయంతో మనుషులు ఎలా ప్రవర్తిస్తారో స్పష్టమవుతుంది. తన కుటుంబంలో ఎవరికైనా పాము వలన ప్రమాదం కలుగుతుందేమో అనే భయం సత్తెయ్య తల్లి పారమ్మలో ఉంది. అందుకే తన ఇంటిలో పాము కనిపించినప్పుడు ఆమె సత్తెయ్యను కదలనీయలేదు. కుటుంబంలో పాము వలన ప్రమాదం జరుగుతుందనే భయం ఉంది. కానీ పారమ్మలాగా పిరికితనం లేదు సత్తెయ్యకు. పాము కనిపిస్తే చంపాలనుకుంటాడు. చంపకపోతే అదే తమను చంపుతుందని అనుకుంటాడు. ఆ ఇంట్లో గౌరేసు తల్లిదండ్రులకు కూడా పామంటే భయమే పాముని చంపితే గర్భవతిగా ఉన్న కోడలికి ఏమన్నా జరుగుతుందని వారికి నమ్మకం.

సత్తెయ్య భార్య రత్నాలుకి పాము కన్నా మంత్ర గాళ్ళంటే భయం ఎక్కువ. మంత్రగాళ్ళు తమకు గిట్టని వాళ్ళ వాకిట్లో ఏ అర్ధరాత్రి పామును వదలి వెళతారని, ఒంటేలుకి లేచి బయటకు వచ్చిన వాళ్ళను అది చంపుతుందని ఆమె భయం. అలాగే మంగలి చెంచయ్య భార్యకు పామంటే భయం. కాని వాళ్ళ కోళ్ళకు ఆ భయం లేదు. తమ పిల్లలను పాము పొట్టన పెట్టుకుంటే అవి పాముతో పోరాడుతాయి. మనుషులు ఆపడానికి ప్రయత్నించినా అవి ఆగలేదు.

బర్మా నుంచి వచ్చిన భార్యాభర్తలకు పాములు గురించి బాగా తెలుసు. అన్ని పాములు ప్రమాదకారులు కాదని, డజనో, అరడజనో కరిస్తేనే ప్రమాదమని వారికి తెలుసు. పాములను పట్టే మెలకువలు తెలుసు. వాళ్ళు పాము మాంసం కూడా తింటారని కొందరు నమ్ముతారు. వాళ్ళకు మంత్రాలన్నా నమ్మకం లేదు. పామంటే అసలు భయం లేదు ఇవన్నీ చిన్న పాత్రలు.

సుబ్బాయమ్మకే కాదు, అతని కుమారునికి కూడా పామంటే తగని భయం. కుమారునికి భయమయినా గురవయ్య రెచ్చగొడితే పాముని చంపడానికి కర్ర తీసుకున్నాడు. కర్ర తీసుకున్నా తీరా పాము ఇంట మధ్య చూసేసరికి దానిని కొట్టడానికి భయపడ్డాడు. అది పిరికితనం. కాని సుబ్బాయమ్మది పిరికితనం కాదు. ఆమెది మహాస్వార్థంతో కూడిన భయం. పాము వలన భయంతో తన కుటుంబాన్ని రక్షించుకోడానికి ఎవరినయినా బలి చేయడానికి కూడా ఆమె వెనుకాడదు. తన ఇంట్లో పామును చంపిన తరువాత పాము కాటుకు గురైన సత్తెయ్య ఇంటికి వెళుతుంటే కనీసం పరామర్శ చేయాలన్న జ్ఞానం కూడా ఆమెకు లేదు. తనకు సాయం చేసిన సత్తెయ్య తన వలన ప్రమాదానికి గురైతే పట్టించుకోని సుబ్బయ్యమ్మ పాము కంటే భయంకర మైనది. తన సుఖం తప్ప ఇతరుల సుఖం పట్టని తత్వం ఆమెది.

పావుల రావులయ్యకు పాముల గురించి తెలుసు. ఏ పాము కరిస్తే మరణిస్తారో, ఏ పాములు హాని కాదో బర్మా దంపతులలాగా రావులయ్యకు కూడా తెలుసు. పాముని చూసి జనం భయపడతారు కనుక ఆ భయాన్ని తనకు సంపాదనగా చేసుకున్నాడు. పాము కరచిందని అంటే మంత్రం వేస్తానంటారు. ఇంటిని అష్టదిగ్బంధనం చేయాలంటాడు. బూడిద చల్లాలంటారు. ఇల్లంతా తిరిగి హడావడి చేస్తాడు. ప్రతీ దానికి డబ్బులు వసూలు చేస్తాడు. పాము కరచిన వ్యక్తి, బ్రతికిన తరువాత కూడా వైద్యం పేరుతో అతని నుండి డబ్బు గుంజుకుంటారు.

సత్తెయ్య పాములని చంపడం వలన తన ఆదాయం తగ్గిందని అతనిపై పగ పూని, అతడు చావు బతుకుల్లో ఉన్నాడని తెలిసి కూడా అతని దగ్గరకు వెళ్ళడానికి నిరాకరించిన దుర్మార్గం అతనిది. అతడు పాము కన్నా భయంకరమైనవారు.

సొమ్ముల గురవడు మానవత్వం కలిగినవాడు. నిస్వార్థ పరుడు, మంచి మనసున్నవాడు. సుబ్బాయమ్మ పిలిస్తే వచ్చారు. సత్తెయ్యకు తోడుగా నిలబడ్డాడు. పాము నడుమును విరగగొట్టారు. సూటిగా మాట్లాడే తత్వం కలిగినవాడు. సత్తెయ్యను పాము కరచిన తరువాత అతనిని బ్రతికించమనే రావులయ్యని మరీ మరీ ప్రార్థించారు. తనతో ఉన్నవారు కూడా తనలాగే సుఖంగా ఉండాలనే తాపత్రయం అతనిది. కానీ రావులయ్య సత్తెయ్య దగ్గరకు రావడానికి నిరాకరించడంతో నిరాశపడ్డాడు. సుబ్బాయమ్మ ప్రవర్తన, రావులయ్య మాటలు అతనికి మనుషుల పట్ల నమ్మకాన్ని సడలించాయి. అందుకే అతడు పశువులశాలకు వెళ్ళినా ఆ పశువుల్లో అతనికి మానవ మనస్తత్వాలే కనిపించాయి. పాము కంటే భయంకరమైన మనస్తత్వం కలిగిన సుబ్బాయమ్మ, రావులయ్య వంటి మనుషులంటేనే అతడు భయపడ్డాడు. మానవత్వం గుండెల నిండా నింపుకొన్న గురవడు వంటివారు సమాజాన్ని బాగు చేస్తారు.

సత్తెయ్యకు పామంటే అసహ్యం తప్ప భయం, భక్తి లేవు. పామును గురించిన కథలు నమ్మడు. పాము దేవుడంటే నమ్మకు. అదొక విషపురుగని, అది కనిపిస్తే చంపాలని అతని నిశ్చితాభిప్రాయం. పాముని పట్టుకోవడం, ఊరికి దూరంగా విడిచిపెట్టడం వంటి జీవ కారుణ్య సిద్ధాంతాలను అతడు వ్యతిరేకిస్తాడు. పాముని చంపడంలో అతనికి నియమనిబంధనలు లేవు. ఎవరు పిలిచినా, ఏ వేళలో పిలిచినా వెళ్ళి పాముని చంపుతారు. అందుకు రావులయ్యలాగా సొమ్ము కూడా తీసుకోడు. అందుచేతనే అతడు ఆ కారణంగా రావులయ్యకు శత్రువయ్యాడు. సత్తెయ్య మనసు వెన్న. అతనిది విశాల దృష్టి. ఇతరులు అడిగితే కాదనలేని జాలిగుణం అతని సొంతం. తన ఊరును, తన కుటుంబంలాగా భావించే తత్వం అతనిది. ఊర్లో ఎవరికి అపకారం జరిగినా అది తనకు అపకారం లాగా భావిస్తాడు. ఊరందరూ సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య దేవుడుతో సమానం. కాని ఇతరుల స్వార్థం వలన ఆ దేవుడిలాంటి మనిషి ప్రమాదానికి గురయ్యాడు.

కొందరు భయపడతారు. కొందరు భయపడేవారితో వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తారు. కొంతమంది భయపడుతూ తాము సుఖంగా ఉండాలనుకుంటూ తమ సుఖం కోసం ఇతరులను బలి చేస్తారు. కొందరు భయాన్నీ దరి చేరనీయకుండా సమాజం సుఖంగా ఉండాలని ఆశిస్తాడు. తన చుట్టూ ఉన్నవారు సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య, గురవయ్య వంటి వారు సమాజానికి అవసరం. అలాంటి వాళ్ళ వలన సమాజం బాగుపడుతుంది. సమాజం చైతన్యవంతమవుతుంది. రావులయ్య, సుబ్బయమ్మ వంటి వాళ్ళ వలన సమాజం నష్టపోతుంది అనే కఠోర సత్యాన్ని ఈ కథ ద్వారా కాళీపట్నం రామారావు గారు తెలియజేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు - మనసు ఫౌండేషన్

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భావనా లోకంలో బ్రతుక్కి అర్థం చెప్పిన స్నేహం

**- డా॥. మెండా దేవానంద్ కుమార్,** తెలుగు శాఖాధిపతి, డా. లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం.

ఆధునిక తెలుగు కథ సాహిత్యంలో 'కారా' మాష్టరుగా కీర్తి గడించిన కాళీపట్నం రామారావు 9 నవంబరు 1924 లో 'పొందూరు' నందు జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తిరీత్యా కథకుడు. తన కథల ద్వార తాను జన్మించిన శ్రీకాకుళం జిల్లాకు ఎంతో పేరు ప్రాఖ్యాతులు తెచ్చి పెట్టారు. సామాన్య జ్ఞానం గల పాఠకులు సైతం కథలో లీనమయ్యే విధంగా రచనలు చేసారు. ''1966 లో వీరు రాసిన 'యజ్ఞం' కథ పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది. దోపిడి స్వరూప స్వభావాలను నగ్నంగా సహజంగా శాస్త్రీయంగా చిత్రించారు. దీనికి 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది''1 వీరు రచించిన మరో అద్భుత కథ స్నేహం. ఇందులో రచయిత విభిన్న వ్యక్తుల స్వార్థ మనస్తత్వాలను నిస్సంకోచంగా విమర్శించిన తీరును పరిశీలించడం ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

## కథ ప్రక్రియ :

పాట, కథ అతి ప్రాచీనమైన కళలు. ''మానవుడు ఎప్పుడైతే చెట్టు దిగి తన భావనాశక్తిని, ఇతరులతో మాటల ద్వార పంచుకోవడం మొదలు పెట్టాడో అప్పటి నుంచి కథ మొదలైంది'' కథ ఎన్ని పాత్రలు, సన్నివేశాలతోనైనా ఉండవచ్చు. తెలుగు కథ ఎప్పుడు పుట్టింది అని ఒక్క మాట అడిగారంటే అనగనగా ఒకరాజు... ఆ రాజుకు ఏడుగురు కొడుకులు...అను కథ పుట్టినప్పుడే అంటారు విమర్శకులు. ఇంట్లో తాత, అవ్వలు, సాయంకాలాలు తమ పనులు అయిన తర్వాత ఒక చోట చేరి కబుర్లు చెప్పుకునే సమయాల్లో ఈ కథలు ప్రారంభమయ్యాయి, మనకు ఇతిహాస, పురాణాల్లో కన్పించే అఖ్యానాలు, ఉపాఖ్యానాలే నేటి పరిభాషలో కథలు.

## స్నేహం కథ పాత్రలు :

అ) డాక్టరు గోపాలరావు (కథ నాయకుడు)

ఆ) పద్మవతి (డాక్టరు గారి భార్య)

ఇ) నరసింహులు (కాంపౌండర్)

ఈ) రాజారావు (డాక్టరు ఈనాటి స్నేహితుడు)

ఉ) మీనాక్షిదేవి (పేషెంట్)

ఊ) శివయ్య (డాక్టరు బాల్య స్నేహితుడు)

ఋ) పార్వతీశం (శివరామయ్య బావ)

ౠ) పనిపిల్ల ( డాక్టరు ఇంట్లో పనిపిల్ల)

ఎ) సత్యవతి ( డాక్టరు పొరిగింటావిడి)

ఏ) యస్వీరావు ( పి.ఎ.)

## కథ సంగ్రహం :

''ఫెళ ఫెళ ఫెళప్....ఫెళప్...ఫెళప్ మంటూ ఫడీల్ మందో ఉరుము'' ఎక్కడో మా ఘనమైన పిడుగు పడ్డది అన్నాడు కాంపౌండర్ నరసింహులు. దీన్ని బలపరుస్తూ అది పిడుగే నన్నాడు డాక్టరు కొత్త స్నేహితుడు రాజారావు. బయట కుండపోత వాన. లోన ఒక్కటే ఉక్కపోత. డాక్టరు గోపాలరావు పరధ్యానంలో ఉండి ఇవేవి పట్టనట్టు ఎటో శూన్యంలో చూస్తు ఉండిపోయాడు.డాక్టరు వార్డు ఎలక్షన్‌ల్లో నిలబడి వృత్తిని నిర్లక్ష్యం చేయడంతో పేషెంట్లను పోగొట్టుకున్నాడు. పాత పేషెంట్లు వచ్చి చూపించుకొని వర్షంలో తడుచుకుంటూ వెళ్ళారే కాని కొత్తవారు రాకపోవడంతో డాక్టర్లో చిరాకు మలేరియా రోగి టెంపరేచర్లా అదేపనిగా పెరిగిపోతుంది.

మూర్చొస్తే మూర్చరోగులు ఎలా మెలికలు తిరిగి పోతారో గోపాలరావులోని మందు మనిషి అలా కిరకిరా సులసులా చుట్టుకోలడం ఆరంభించిది. మూడు రోజు

లుగా మొండిగా కురుస్తున్న వర్షం మీద పట్టరాని కోపం వచ్చింది. ''రాజారావు సోది కబుర్లతో కాలక్షేపం చేస్తున్నడేగానీ ముష్టి ముప్పై రూపాయలు

సర్థలేదనే కోపం, ఇటువంటి పరిస్థితుల్లో మీనాక్షిదేవికి ఎప్పాయింట్‌మెంట్ ఇచ్చిన తన అవివేకం మీద, చివరకు తనకు ఎంతో ప్రీతిపాత్రమైన సిగరెట్టు ఒట్టి పోవడం చూసి తన బతుకు మీద పట్టరాని కోపం పుట్టి శరీరాన్ని కుతకుత ఉడికించేస్తోంది''

వాచీలో ఏడుకీ రెండు నిమిషాలు తక్కువగా ఉంది. కొన ప్రాణంలో ఉన్న రోగిని బతికించడానికి బాధ పడే వైద్యుడిలా టేబుల్ మీద ఓరగా కూర్చుని ఆలోచిస్తూన్నడు డాక్టరు. ఇంతలో ఇద్దరు కొత్తవాళ్ళు గుమ్మం ఎక్కుతున్నారు. నలభైయైదేళ్ళ కాయశరీరం మూడొంతులు తెల్లపడ్డ మీసాలతో ఉన్న వ్యక్తి,

అతనితో పాటు ఓ కుర్రాణ్ని గదిలోకి ప్రవేశపెట్టాడు. నా పేరు శివయ్య మాది బొబ్బిలి అంటూ డాక్టరుతో పరిచయం చేసుకున్నాడు. ఓరి ఓరి ఓరి..... అంటూ శివయ్యను డాక్టరు కౌగిలించుకున్నంత పని చేసాడు. తరువాత ఎక్కడున్నావు? యేం చేస్తున్నావు? ఎప్పు డొచ్చావు? ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరైపోతూ కుర్చీలో కూర్చోబెట్టుకున్నాడు. మనస్సున ఆవరించిన నిస్సావత్తు నిదానంగా వదిలిపోయింది. తరువాత వాళ్ళిద్దరూ బాల్య చరిత్రలు తవ్వుకోవడం ఆరంభించారు.

శివయ్య హైస్కూల్లో చదువుతుండగానే పెళ్ళ య్యిందట. తరువాత భీమునిపట్నం జిల్లాబోర్డులో మేస్టరుగా చేరడం డాక్టరు కి గుర్తుంది. ఆ తరువాత ఓ పాతిక సంవత్సరాలు చుట్టుపక్కల గ్రామాలు తిరిగి రావులపాడేరు హైస్కూల్లో నిలదొక్కుకున్నాడు శివయ్య. ఎనిమిది మంది సంతానం. సంసార భారం క్వాలిఫికేషన్ను ఇంప్రూమెంట్‌కు ప్రతిబంధకం కాగా మొన్ననే ఏడాది క్రితం తెలుగు బిఈడీ అనిపించుకున్నాడు. డాక్టరు మధ్యలో కలిపించుకుని ఇంకా చూస్తావెండుంకు కోయిం చెయ్ అన్నారు. "కోయించేయడానికి మానేడానికి మన మెవరం వాళ్ళే బలవంతన వాన్‌లో పడేసుకుపోయి కోసిపారేస్తున్నారు'' అని శివయ్య అనగానే అందరు ఫకాల్మన్నారు.

1980ల్లో ఎమర్జన్సీ పరిస్థితులు, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, బహుమతుల కోసం మధ్యతరగతి ప్రజల ఆరాటాన్ని ఎంతో చక్కగా రచయిత ఆవిష్కరించారు. గోపాలం అన్నట్టు నువ్వు మీ మేనమామ కూతుర్నే చేసుకున్నావు కదూ? అన్నాడుడ శివయ్య. అబ్బే లేదే ఆవిడే నన్ను పెళ్ళాడింది అని డాక్టరు చతురు లాడాడు. మీ మామ కులాసానా? అన్నాడు శివయ్య అల్లుడికి మామలోకువ అన్న చందంగా అంతా కూతురు పేరన పెట్టి నీకు చదువు చెప్పించాను పో పొమ్మన్నాడు ముష్టి రాస్కెల్ అంటూ కసంతా వెళ్ళగక్కేడు గోపాలరావు.

పరస్పర సంభాషణల తర్వాత శివయ్యకు కొంత ధైర్యం వచ్చింది. ముఫైయేళ్లు నిండక ముందే నటచక్రవర్తి బిరుదు గడించావు. తరువాత నాటక ఎకాడమీ సభ్యునిగా, ఒక టెర్మ్ యెమ్మెల్సీ చేశావు, ప్రస్తుతం పట్టణ కౌన్సిలర్‌వి అని శివయ్య ప్రశంసిస్తుంటే గోపాలరావుకి అంత వినసొంపుగా లేదు. ఇక లాభం లేదనుకుని అసలు విషయంలోకి శివయ్య వచ్చాడు. తన పెద్దకొడుకు చదువు, ఉద్యోగ ప్రయత్నం, ఇంటర్వ్యూ కోసం వచ్చిన సంగతి, రికమండేషన్ అవసరం, అందులోను డబ్బు లేనిదే అసలు పని జరగదని మూడువందలు తెచ్చానని చెప్పాడు శివయ్య.

తనను ఎక్కడ డబ్బు సర్ధమని అడుగుతాడోనని గోపాల రావు గుండె ఝల్లుమంది. అతని ఇబ్బందిని గమనించిన శివయ్య మడతలు విప్పిన మూడు వందలు డాక్టరు చేతిలో పెట్టి తన కొడిక్కి ఉద్యోగ బిక్ష పెట్టమని ప్రాధేయపడ్డాడు. డబ్బు తీసుకునే పార్టీ పి.ఆర్.ఓ. కానీ అతను మనతో మాట్లాడ్డట, అతని పి.ఎ. యస్పీ రావును పట్టురుంటే పని అవుతుందని శివయ్య చెప్పాడు. గోపాలరావు, రాజారావు వాళ్ళిద్దరూ దేనికోసం కుమ్ము లాడుకుంటున్నారో గాని తన కొడుకు భవిష్యత్తుతో

చెలగాటలాడే గండుపిల్లుల్లా కనపడ్డారు శివయ్యకు. శివయ్య ఆలోచనలు పరిపరి విధాలుగా పోవడాన్ని గుర్తించిన రాజారావు మంచికో చెడ్డకో ఓ దేవుణ్ణి నమ్ము కున్నట్టు మీ స్నేహితుణ్ణి నమ్ముకొని అతని మీద భారం వేశారు. అదృష్టం కలసివస్తే మీ వాడికి ఉద్యోగం వచ్చి తీరుతుంది. ఒకవేళ రాకపోతే ప్రయత్నలోపం అనుకోవద్దు అంటూ హితబోధ చేశాక శివయ్య కాస్తా తేలికపడ్డాడు. శివయ్య ఇచ్చిన డబ్బులో ఓ యాభై అప్పు ఇవ్వమని రాజారావు అడిగాడు. డాక్టరుకి ఎక్కడలేని కోపం వచ్చింది. కానీ రాజారావు మీ స్నేహితుని దగ్గర డబ్బు తీసుకోకపోతే ఏ వంటవానికో లేదా ఏ డ్రైవర్‌కో ఇచ్చేవాడు. మీ ప్రాణస్నేహితుని డబ్బు మీరు తింటే అర్థం ఉంది కానీ ముక్కు మొఖం తెలియనివాడు తింటే ఏలాగండీ చెప్పండి డాక్టరు గారు అన్నాడు రాజారావు. డాక్టరు గారికి తత్వం బోధపడి జేబులో నుండి ఏభై రాజారావుకి ఇచ్చాడు.

పనిపిల్ల కాఫీ కప్పు డాక్టరు గారికి అందిస్తూ తమరి కోసం ఎవరో వచ్చారని చెప్పింది. పేరు కనుక్కోమని పిల్లను కిందకు పంపాడు. ఐదు నిమిషాల్లో పేరు కనుక్కొని పైకి వచ్చింది. ఎవరో శివయ్య గోరట బాబు అంది. కిందికి దిగిన డాక్టరును చూసి శివయ్య పెద్ద గొంతుతో నీ కోసం ఇది రెండోసారి రావడం అనడంతో డాక్టరుకి లోన దడదడ లాడింది. కృతజ్ఞుణ్ణిరా గోపాలం నువ్వు చేసిన పనికి నేనూ నా కొడుకు జీవితాంతం మరచిపోలేం అన్నాడు శివయ్య. ఏం మీ వాడు సెలక్టు కాలేదా? అన్నాడు డాక్టరు ఎందుకు కాడూ? నువ్వు పట్టుకోవడం సెలక్టు కాకపోవడమూనా? శివయ్య ఆ మాట అనేసరికి డాక్టరు థేంక్ గాడ్ కూర్చో అంటూ తనూ ఓ కుర్చీలో కూలబడ్డాడు డాక్టరు.

బ్రతుకులో భయమంత పాపిష్టిది ఇంకొకటి లేదు. అన్నీ తెలిసిన వాణ్ణి కూడా అది పరమ మూఢుణ్ని చేస్తుంది. సీటు చిక్కనీయదు, ఉద్యోగం దక్కనీయదు. "నిన్న నా పాలిట దేవుల్లా నువ్వే అడగకపోతే నేను వెళ్ళి ఆ వంటవాడి పాదలమీద పడి వుందును. వాడు అందిన కాడికి చేత బట్టుకొని ఎన్ని తిప్పలు పెట్టేవాడో ఆ భగ వంతుడి కెరుక" అని శివయ్య చేతులు జోడించాడు. రాజారావు ఈ మనిషిని ఎంత చక్కగా అంచనా వేసేడో అనుకున్నాడు డాక్టరు. నా వల్ల రాత్రాంత నిద్ర చెడినట్టు ఉంది. ఒక పేద స్నేహితుడి కోసం శ్రమపడ్డాననుకో అన్నాడు శివయ్య. కాని డాక్టరు అదేమి మాట రా అని అనలేదుసరి కదా ఇంటికొచ్చిన బాల్య స్నేహితుణ్ణి భోజనం చేయమని అడుగుతాడని భావించిన శివయ్యకు నిరాశే ఎదురైయింది.

ఈ లోకంలో ఒకరి కొకరు ఏదో అవుతారన్నది ఒట్టి కల్ల. తండ్రి కొడుక్కొతడన్నది ఒట్టిది. చుట్టపక్కాలు, స్నేహితులు అంతా ఒట్టిది. మనిషి మనిషితో తిరుగు తున్నాడంటే అవసరం. అవసరం బట్టే అన్ని తిరుగుళ్ళు అంటాడు డాక్టరు. రాజారావు తన అవసరం కొద్ది తనతో ప్రేమగా ఉంటాడు, అలాగే తన బాల్య స్నేహితుడు శివయ్యకి జనం సింపతి లాగేయడం తెలును. పాతికేళ్ళు నా వైపు కన్నెత్తి చూడలేదు. వాడికి అవసరం రాగానే వచ్చిపడ్డాడు. వాడిలో రోగరి గ్రహించేకే శివయ్యంటే అసహ్యం కలిగింది.

మొదట్లో నిజంగానే సహాయం చేద్దామనుకున్నాడు కుదరకపోతే వాడుకున్న డబ్బిచ్చేదా మనుకున్నాడు. కానీ శివయ్య వెళ్ళిపోతూ పోతూ మూడు వందలు కాదు, ముప్ఫయి వందలైన లంచమిస్తానన్నాడు. ఓరే రోగ్ యీ నాటికి నువ్వు రోగ్‌వి, అయితే మనం ఎప్పటినుంచో రోగులకు రోగులమై ఉన్నాము. లోకంలో స్నేహమే లేదంటే బ్రతుక్కి అర్థమే లేకుండా పోతుంది. స్నేహం అవసరం ఉన్నప్పుడే కాదు, అవసరం లేకున్నా యోగ క్షేమాలు తెలుసుకునే పలకరింపులు మానవాళీకి అత్యవసరం.

**ముగింపు :**

మనుషుల్లో విభిన్న వ్యక్తులున్నట్లే తెలుగు కథకుల్లో కాళీపట్నాం రామారావు గారిది ప్రత్యేక వ్యక్తిత్వం. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరగడం వల్ల వీరి కథ

ఇతివృత్తాంతం నగలు మనిషి ఆలోచనల చూట్టు తిరుగుతాయి. మనిషి ఆనందాన్ని పొగొట్టుకుని డబ్బు కోసం చేసే చెడ్డ పనులను తప్పు పట్టారు. చెడు వ్యసనాలు విడిచిపెట్టి ఉన్నదానితో సంతృప్తి చెందటం మానవుడు అలవాటు చేసుకోవలనీ రచయిత వినయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తూన్నారు.

**ఆధార గ్రంథాలు :**

1) తెలుగులో ప్రక్రియా వైవిధ్యం - డా. సత్యవాది, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2012.

2) కాళీపట్నం రామారావు రచనలు, వివిన మూర్తి (సం), కళాజ్యోతి ప్రాసెస్ లిమిటెడ్, హైదరాబాద్, 1999.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆధునిక తెలుగు సాహిత్యంలో కాశీపట్నం రామారావు స్థానం

**– డా॥. పుట్ట శ్రీనివాసులు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, పాలమూరు విశ్వవిద్యాలయం, మహబూబ్ నగర్ జిల్లా, తెలంగాణ.

20వ శతాబ్ద కాలంలో కోస్తాంధ్ర నుండి తెలుగు సాహిత్యానికి ఆణిముత్యం జన్మించింది. అతడే మన కాశిపట్నం రామారావు. తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడానికి అనేక అంశాలు ఉన్నాయి. భాషాపరంగా నవలా పరంగా కథా పరంగా విమర్శకుడుగా ఇలాంటి అంశాలలో అగ్రగణ్యుడు సరళ భాషా రచయితగా సాహితీవేత్తగా సమాజాన్ని ఉత్తేజ పరచడానికి తనవంతు కృషి చేసిన మహనీయులు వీరి సాహిత్యాన్ని చాలా మంది కవులకి ఆదర్శంగా నిలిచింది. అనేక అంశాలలో ప్రజల మనోభావాలకు అనుగుణంగా సాహిత్యాన్ని కొనసాగించారు. తెలుగు కథలు రాస్తున్న కొందరు రచయితలను పీడిత వర్గ చైతన్యం కోసం అవగాహన కోసం కొన్ని రచనలు కొనసాగాయి.ఉత్తమ సాహిత్యవేత్తలు రాజకీయాలు మనస్తత్వ మనోభావాలకు స్వచ్ఛందమైన ప్రతి వ్యక్తి సామాజిక చైతన్యం కోసం పోరాడుతున్న ఈ విధంగా కథలు రాస్తారు. అదే మాదిరిగా నవలలో కాశీపట్నం రామారావు గారి సామర్థ్యాన్ని మనకు తెలుస్తుంది. ఎందుకంటే వారి నవలలో సామాజిక స్పృహ ప్రజా చైతన్యం జీవన చిత్రణ స్పష్టంగా కనబడతాయి.

కావునా నవలా సాహిత్యంలో కూడా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారు. అంతేకాకుండా ప్రాచీన ఆధునిక సాహిత్య రచనలో సద్వి విమర్శకుడిగా పేరు గాంచారు. కవి వ్యక్తిత్వము అతని కావ్యం కంటే గొప్పది కాదు కావ్య విమర్శ కవిని పట్టించుకోకుండా ఉంటే అంత మంచిది. చారిత్రక సామాజిక పరిస్థితులకు సాహిత్య విమర్శలో ఉంటుంది. కాశీపట్నం రామారావు గారు ఆధునిక సాహిత్యానికి అన్ని కోణాలలో మార్గదర్శ కులయ్యారు. ప్రస్తుత రచయితలకు విమర్శకులకు పాఠకులకు, భాషావేత్తలకు నవల రచయితలకు కొత్త మార్గాన్ని చూపించిన మహాయుగ పురుషుడు కాశీపట్నం రామారావు గారి సామార్థ్యానికి సంబంధించి నవలలు యజ్ఞం అభిమానాలు రాగమయ జీవధార కథలు రుతుపవనాలు కథా సంపుటి కారా కథలు కథా కథనం కథా యజ్ఞం ఇలాంటి రచనలతో విమర్శలో గానీ భాషలో గానీ నవలలో గానీ కథలో గానీ తన శైలిని ప్రత్యేకంగా చూపించారు.

తెలుగు రాష్ట్రాలలో కాక ఇతర రాష్ట్రాలలో కూడా కాశీపట్నం రామారావు రచనలకు ప్రత్యేక స్థానం ఉన్నది. ఆధునీకరణ భాషాపరంగా సంఘం అనుగుణమైన మార్పుకు ఏ విధంగా లోనవుతుందో భాష కూడా అదే విధంగా మార్పుకు లోనవుతుంది. మార్పు ఎప్పుడు కూడా జీవిత అవసరాలకు అనుగుణంగానే జరుగుతుంది. మానవుడు అభివృద్ధి సాధించుకునే దశలో కొన్ని శాస్త్రాలకు పూర్వం ఉన్నంత ప్రాముఖ్యత తర్వాత దశలో కొన్ని శాస్త్రాలకు పూర్వం ఉన్నంత ప్రాముఖ్యత తరువాత దశలో లేకుండా పోవచ్చని కాశీపట్నం రామారావు గారి అభిప్రాయము తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగం ఆరంభమైంది. ఆధునికత అన్న పదం సాహిత్యపరంగా కాలవాచి గాను గుణవాచిగా కల్పిస్తుందని ఆధునికతకు పునరుజ్జీవన ప్రక్రియ అని జాతి సంస్కృతికి నవ్యతకు మార్గమని తను విమర్శ రూపంలో తెలియపరిచారు. కాల్మనీగా వచన సాహిత్యంలో అత్యధిక విస్తృతి ప్రచారం కలిగిన ప్రక్రియ నవల ప్రక్రియ సాహిత్య ప్రభావం ఫలితంగా తెలుగులో ఉదయించింది. ఉదయించిన సూర్యుడే మన కాశీపట్నం రామారావు గారు వారి నవలలో సమకాలిన జీవితానికి దర్పణం సమగ్ర మానవ

జీవితాన్ని చిత్రించే వాస్తవిక రచనలు జీవితానికి ప్రతి బింబం లాంటిదిగా మధ్యతరగతి ఇతిహాసంలా వాస్తవికతకు కల్పనలు జోడించి నిత్య జీవితానికి ఉప యోగపడే విధంగా వీరి నవల నైజం ఉంటుందని చెప్పవచ్చును. కాశీపట్నం రామారావు గారి తెలుగు సాహిత్యంలో వారి ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నందుకే వారి కలం నుండి ప్రతి విషయం వస్తువుగా ఇతివృత్తంగా నేపథ్యం పరంగా పాత్రల సన్నివేశాల పరంగా శైలి దృక్పథం కాశీపట్నం రామారావు గారి సాహిత్యంలో ప్రత్యేక అంశాలు ఉన్నాయని తెలియపరచవచ్చును. ఆధునిక కవులలో ప్రత్యేక భావజాలాన్ని నింపిన మహనీయులు కాశీపట్నం రామారావు గారు రచయితగా, పరిశోధకుడిగా, పరిశీలకుడిగా, భాషావేత్తగా, కథకుడిగా, నవల పరుడిగా అనేక కోణాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ప్రతి అంశాన్ని మనసులో దాచుకుని తన మనోభావాలను సామాజిక భావాలకు అనుగుణంగా అక్షరరూపం దాల్చిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా, బహుభాషల కోవిదుడుగా పేరు పొందారు.

కాశీపట్నం రామారావు కంటే కారా పేరే సాహితీ వేత్తలకు బాగా సుపరిచితం పరిచయంగా వినబడు తుంది. ఏదైనప్పటికీ తెలుగు సాహిత్యంలో కాశీపట్నం రామారావు గారు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

❖❖❖

# నీటి సమస్యకాధారమేదని ప్రశ్నించిన కా.రా. జీవధార

**- డా॥. పులపర్తి శ్రీనివాసరావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (పి), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమండ్రి.

కారా మాష్టారుగా పేరుగాంచిన కాళీపట్నం రామారావు గారు 1924వ సంవత్సరం, నవంబరు 9న శ్రీకాకుళం జిల్లా మూరపాకలో జన్మించారు. ఈయన సెయింట ఆంతోని హైస్కూలు, విశాఖపట్నంలో చాలా కాలం ఉపాధ్యాయులుగా పనిచేశారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన ఈయన రచనా శైలి సరళంగా ఉంటుంది. సామాన్య జ్ఞానం కలిగిన పాఠకులు సైతం రచనలో లీనమయ్యేలా, భావ ప్రాధాన్య రచనలు చేశారు. ప్రఖ్యాత నవలా రచయిత అయిన యండమూరి వీరేంద్రనాథ్ కారా గారి రచనల నుండి ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించారు. ఇంతటి సాహితీ ఘనులు అయినందునే, ఈయన రాసిన 'యజ్ఞం' కథల సంపుటికి 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈయన రాసిన 'జీవధార' కథను విశ్లేషించి తెలియజేయడం కోసం ఈ వ్యాసాన్ని రాస్తున్నాను.

కారా మాస్టారు అట్టడుగు వర్గాల జీవన సమస్యలను ఎంత సూక్ష్మంగా చూడగలిగిన రచయితో చెప్పే కథ 'జీవధార'. తాగునీటి సమస్య అతిసాధారణ శ్రామిక జన జీవితాలను ఎంత సంక్షోభానికి లోను చేస్తుందో, దానిని పరిష్కరించుకోటానికి ఎప్పటికప్పుడు మనుషులు తమదైన మార్గంలో ఎలా పోరాటశీలురు అవుతున్నారో తెలిపిన కథ ఇది. వాసిరెడ్డి నవీన్ ప్రోద్బలంతో ఈ కథ వెనుక కథ గురించి రాస్తూ తను జనాభా లెక్కల రాస్తున్న సందర్భంలో చూసిన ఇక సన్నివేశాన్ని కథగా మలిచానని చెప్తారు రామారావు గారు.

భూమి పొరల నుండి, కొండ వాగుల నుండి ఉబికి వచ్చి ప్రవహించే ప్రకృతి సహజవనరు అయిన నీళ్ళపై కొందరి పెత్తనం ఎలా స్థిరపడిందా అని ఆలోచించే దిశగా ప్రేరేపించిన ఈ కథ పాఠకులను ఎంతగానో ఆలోచింప చేస్తుంది. జీవధార కథ విశాఖపట్నం జిల్లాలో పందిగుట్ట పాక ప్రజల ఎదురైన త్రాగునీటి సమస్యను వాస్తవికంగా చిత్రించింది. మంచినీటి కోసం బడుగు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తన సహచరుల ద్వారా విన్నవీ, వార్త పత్రికలలో వచ్చిన నీటి సమస్యల కథనాలు చదివీ పొందిన అవగాహన ఈ కథ వెనుక కనిపిస్తుంది.

1970 జూలై 4వ తేదీన ఏర్పడ్డ విప్లవ సంఘం వ్యవస్థాపక సభ్యుడుగా కాళీపట్నం రామారావు కథా వస్తువును శ్రామిక బహుజనుల జీవితాల నుండి స్వీకరించి కథలుగా మలిచే నిబద్ధతకు ఒక గుర్తుగా జీవధార కథను చెప్పుకోవచ్చు. ఒక కోణంలో చూస్తే జీవధార కథ విప్లవ కథ అని చెప్పక తప్పదు. విప్లవ కథ అంటే ప్రజల వాస్తవ జీవితాన్ని చిత్రిస్తుంది. అనవసరమైన కల్పనలకు విప్లవ కథలో ఆస్కారం ఉండదు. ఒక విధంగా చెప్పాలంటే సమాజంలోని ఉత్పత్తి సంబంధాలను చిత్రిస్తుంది అనవచ్చు.

### కథా వస్తువు పరిచయం :

విశాఖపట్నంలో సముద్రపు గాలి తగిలే దూరంలో ఒక కూలి వాడ ఉన్న ప్రాంతం పందిగుట్ట. ఆ వాడలోని 50, 60 పాకల వాళ్ళకు కేవలం ఒక కొళాయి ఉంది. దాని ద్వారా వచ్చే నీరే ఆ పాకల వాళ్ళు వాడుకోవాలి. ఆ నీళ్ళతోటే వాళ్ళ అవసరాలు తీర్చుకోవాలి. ఆ నీళ్ళు సరి పోనప్పుడు వాళ్ళలో వాళ్ళు ఘర్షణ పడతారు, కొట్టుకుంటారు కేసులు పెట్టుకుంటారు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతారు తప్ప తమ సమస్యకు కారణం వెతుక్కోరు. ఈ కథను పరిశీలిస్తే ఉన్న ఆ ఒక్క కొళాయి దగ్గరికి అమ్మాజీ నీళ్ల కోసం వస్తుంది. అప్పటికే ధార సన్నగా అవుతుంది. ఇక లాభం లేదనుకొని సత్యవతి సూచన మేరకు అమ్మాజీ తవిటమ్మతో కలిసి ఆమెతో రావు

బంగళాకు నీళ్ళ కోసం వెళ్తుంది. రావు భార్య, తల్లి ఇద్దరూ వాళ్ళు నీళ్లు పట్టుకెళ్ళటానికి ఒప్పుకోరు. నీళ్లకోసం వచ్చిన అమ్మాజిని, సత్యవతిని, తవిటమ్మను మా ఇంటి మీదకు వస్తే ఏం లాభం? మీరు మున్సిపాల్టీ వాళ్ళ మీదకి పోండి అని రావు తల్లి నిలువరించే ప్రయత్నం చేస్తుంది.

బిందెడు నీళ్లకోసం ప్రాధేయపడుతూ ఉన్నవాళ్ళకు కుక్కను మీదికి వదులుతామని వాళ్లంటే ఉక్రోషం పట్టలేక ఏదీ వదలండీ చూద్దాం అంటూ ఎదురు సవాల్ చేస్తారు. అప్పటికే మున్సిపాలిటీ కొళాయి నీళ్లు ఆగిపోయి ఖాళీ బిందెలతో వెనుదిరుగుతున్న తోటి స్త్రీలను కుక్కను వదులుతామని అంటున్నారు చూడండీ అని అరచి చెప్పంటే వాళ్లేమో అక్కడ నీళ్లు దొరుకుతాయి రమ్మంటున్నట్లుగా అర్థం చేసుకుని వాళ్ళు వచ్చి చేరుతారు. వాళ్లలో అప్పాయమ్మ చేసిన మధ్యవర్తిత్వంతో ఆ పూటకు తలా బిందెడు నీళ్లు తీసుకు వెళ్లటానికి అనుమతి దొరుకు తుంది. అందరూ కదిలినా అమ్మాజీ, సత్యవతీ కదలరు. ''బతకటానికి ముందు గంగ కావాల, ఆ తరవాత పంతాలూ, పట్టింపులూ'' అని వాళ్ళని కదలమని హెచ్చరిస్తుంది. మళ్ళీ నీళ్ళకు ఏ గుమ్మం ఎక్కాలి? ఎవరిని వేడుకోవాలి? అన్న సమస్య వాళ్లకు కలుగుతుంది. అందువల్ల కథ మళ్ళీ మొదటికి వస్తూనే ఉంటుంది. ఇలా ఎన్నాళ్లు అంటే 'కడవరకు..' అన్న మాటతో కథ ముగుస్తుంది.

జీవధార కథలో ఘటన ఒకటే అయినా నిశితంగా పరిశీలించి చూస్తే, దానిచుట్టూ నిర్మితమైన జీవితం సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక అసమానతల వ్యవస్థను దర్శింపచేస్తుంది. ఈ కథలో వర్గ వ్యత్యాసాలు, కూలివాడ జనజీవితం,నీటి సమస్య - మహిళా సమస్య వంటి అంశాలు ఈ కథా వస్తువునుండి అధ్యయనం చేయవచ్చు.

### వర్గ వ్యత్యాసాలు :

ఈ కథలో పంది గుట్ట అంచున కొంత కొంత దూరంలో పేదవాళ్ల వాడలు మూడు కలిసి కూలివాడగా పిలవబడతాయి. ఈ కూలివాడకు రోజుకు ఉదయం పదిగంటల తరువాత గంటన్నర పాటు నీళ్లు వచ్చే ఒకే ఒక కుళాయి ఉన్నా నీళ్లు దొరకనపుడు కూలివాడ ఆడవాళ్లు నీళ్లకోసం రెండంతస్తుల భవంతి ముందుకు వెళ్లి గేటు తెరవమని వేడుకొంటుంటారు. యాభై అరవై ఇళ్లకు రోజుకు గంటా గంటన్నర మాత్రమే విడువబడే నీళ్లు ఆ భవంతిలోని ఒక్క కుటుంబం వాళ్లకు లైను తెరిచి ఉన్నంతసేపూ వస్తూనే ఉంటాయి. నీళ్లను ఇంజన్‌తో ట్యాంకులకు ఎక్కించుకుని ఆ ఒక్క కుటుంబం సమృద్ధిగా వాడుకుంటుంది.

తరచి చూస్తే, నీళ్లు ఒకరు ఉత్పత్తి చేసే వస్తువు కాదు. దానికోసం ఫ్యాకటరీలు కట్టాల్సిన పనిలేదు. అది ప్రకృతి సహజ వనరు. కానీ దానిని పంపిణీ చేయటంలో ఉన్న వ్యత్యాసాలే కూలివాడ మహిళలను రెండస్తుల భవనం గేటు ముందుకు వెళ్ళేలా చేస్తాయి. వాళ్లకు కరువైన నీళ్లు అక్కడ సమృద్ధిగా ఉంటాయి. కరువును, సమృద్ధిని ఎదురెదురుగా నిలపటం ద్వారా కరువుకు సంపదకు మధ్య కార్యకారణ సంబంధాన్ని ఆలోచించమంటాడు ఈ కథలో రచయిత.

ఆలోచించటానికి ఆధారాలు అమ్మాజీ కారణంగా ప్రస్తావనకు వచ్చిన పదేళ్ల నాటి ఘటనలో ఉంటాయి. వాళ్లు నీళ్ల కోసం వెళ్లిన బంగళా యం.పి. రావుది. ఆయన ఏదో ఇంగ్లిష్ కెంపెనీలో పెద్ద మేనేజర్. ఇంగ్లీష్ కంపెనీ అనే మాట విదేశీ పెట్టుబడులు ఉన్న కంపెనీని సూచిస్తుంది. పదేళ్ల క్రితం ఆయన హెూదా ఇంత పెరగలేదు. ఇక్కడ జాగా కొనుక్కున్నాక పందిగుట్ట అంచులో ఉన్న కూలి వాడల్లోకి కాలినడకన వస్తాడు. నీళ్లూ నిప్పులూ అక్కరలేదా అంటూ పలకరిస్తాడు. అక్కడి ప్రజల వేలిముద్రలు తీసుకుంటాడు. దగ్గరుండి ఏ కొళాయి ఎక్కడ పెట్టించాలో, ఏ దీపం ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టించే ఏర్పాటు స్వయంగా ఉద్యోగుల వెంట ఉండి చేయిస్తాడు. ఆరు నెలల తరువాత తాను కొన్న స్థలంలో ఇల్లు మొదలుపెట్టి, మున్సిపాలిటీ కొళాయి నీళ్లతో, పెట్టించిన విద్యుద్దీపాల వెలుగులో, అక్కడ ఉ

న్న పాకలలోని ఆడవారు మగవారు కూలి చేయగా మూడు నెలలలో ఆ బంగళా పూర్తవుతుంది. ఇదే ఈ కథనం సారాంశం.

వాస్తవంగా చూస్తే, కొళాయి రావడం వల్లే బంగళా నిర్మాణానికి నీళ్లు దొరికాయి. ఆ దీపాల వెలుతురులోనే పనులు చకచకా జరిగాయి. నీటి కొళాయి, విద్యుత్ రావడం వలన పదేళ్లలో అక్కడి భూములు కొనిపెట్టుకున్న రావు ఆస్తి విలువ పెరిగిపోతుంది.ఒక విధంగా రావు బాగు పడ్డాడు. కానీ పాకల వాళ్ల జీవితాల్లో ఈ పదేళ్లలో ఎలాంటి మార్పు లేదు. నిజానికి పాకల వాళ్ల అవసరాలను తీర్చాలన్న ప్రజా ప్రయోజన దృష్టి అతనికేమీ లేదు. వాళ్ల అవసరాన్ని ముందు బెట్టి ప్రభుత్వ అనుమతులను తీసుకువచ్చి తన అవసరాలు తీర్చుకున్నాడు. ఇదంతా చేస్తున్నట్లు నటించి అతను సంపద పరుడు, సుఖ వంతుడు అయ్యాడు.

పాకల వాళ్లకోసం ఏర్పాటు చేసిన కొళాయి కూలి వాడలో లేదు. వాడ రోడ్డుమీద ఉంటుంది అని రచయితే చెప్తాడు. పాకలు దిగువగా గుట్ట వార గోతిలో ఉండగా కొళాయి ఎత్తుకు పోయే రోడ్డు మీద ఉందంటే నీటి పైపులైన్ వేయటంలో, కొళాయి పాయింట్లను గుర్తిం చటంలో ఎత్తుమీద ఉండేవాళ్ల ప్రయోజనాలే ప్రాధాన్యం వహించాయన్నది స్పష్టం అవుతుంది. ఉద్యోగులుగా ప్రభుత్వ వ్యవస్థలను ప్రభావితం చేయగల వర్గాల ప్రయోజనాలకు అనుకూలంగానే పనులు జరిగి పోతుంటాయన్నది జగమెరిగిన సత్యస్త్రం.. రావు వాళ్లకు ప్రతినిధి. కూలివాడ ఇళ్లన్నిటికీ ఒక కొళాయి పెట్టించి తన ఒక్క ఇంటి కోసం ఒక కొళాయి ఏర్పాటు చేసు కోవటంలోనే రావు ఎలాంటివాడో అర్థమవుతుంది. ఆధిపత్య శక్తులు తమ తమ ప్రయోజనాలను ప్రజల ప్రయోజనాలుగా ప్రచారం చేసి, తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటారనడానకి రావు పాత్రే నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

అసమానతల వ్యవస్థలో ఆస్తిపర వర్గాలు ఎలా ప్రవర్తిస్తాయో చూపిస్తారు. ఎక్కడయితే సంపద పోగుపడుతుందో అక్కడ అనేక దౌర్జన్యాలు జరుగుతాయి. అక్కడే శ్రమ దోపిడీ జరుగుతుంది. రావు ఇల్లు కట్టేటప్పుడు పని జరిగినంతకాలం అణా బేడా ఎక్కువో తక్కువో పాకల్లో కూలీలందరూ అక్కడే పనిచేసారు అని రచయిత చెప్పిన మాట గమనిస్తే అది వాస్తవమే అనిపించక మానదు. అలా శ్రమను చౌకగా కొంటూ ఆస్తులు పోగేసుకునే వర్గం తమ ఆస్తుల రక్షణ కోసం, వ్యక్తిగత రక్షణ కోసం తాము చెబితే వినని శ్రామికుల మీద దౌర్జన్యాలు చేయడం కోసం కుక్కలను, పోలీసు లను, చట్టాన్నీ, న్యాయస్థానాన్ని, రాజ్యాంగ యంత్రాలను, రాజ్యాన్ని వాడుకుంటుంది ఇది అక్షర సత్యం. ఇదే విషయం ఈ కథలో చెప్పకనే చెప్పారు రచయిత.

## కూలివాడ జనజీవనం :

విశాఖపట్నం చుట్టు పక్కల నుండి బతుకు తెరవు కోసం వలస వచ్చిన బడుగు మనుషులతో ఈ కథలో యాభై అరవై పాకల కూలివాడ ఏర్పడింది. పదేళ్ల క్రితం రావు బంగళా కట్టేనాటికే అక్కడ ఆ వాడ తయారయింది. అడపాదడపా వచ్చి చేరేవాళ్లు చేరుతూనే ఉంటారు. అమ్మాజీ కుటుంబం ముందు నుండీ ఉంటే సత్యవతి కుటుంబం బంగళా మొదలైన కాలంలో అక్కడికి చేరు తుంది. తవిటమ్మ వాళ్లు రెండు వారాల క్రితమే అక్కడకు వస్తారు. ఎవరు ఎప్పుడు వచ్చినా పట్టణాలలో బతకడానికి తాము చేయగలిగిన పనులను ఎంచుకుని జీవనం కొనసాగించడం కోసమేనని అర్థమవుతుంది. అలా అందరూ కూలి పనులు చేసుకుని బతికేవాళ్లే ఆ వాడలోని ప్రజలు.

ఈ కథలో బతుకుతెరువు మార్గాలు వివరంగా చెప్పబడ్డాయి. అమ్మాజీ తండ్రి ఇల్లు కట్టేచోట వడ్రంగి పని చేస్తాడు.ఇది కులవృత్తి కాదు. అతను ఎంచుకున్న వృత్తి. షరాబులు కానివాళ్లు వడ్రంగి పని చేయటం పల్లెలోకం నుండి అప్పుడే వచ్చిన తవిటమ్మ ఊహకందని

విషయం. తల్లి ఆడపిల్లల హాస్టల్లో పనిచేస్తూ ఉంటుంది. పట్నం కనుక ఆడపిల్లలు బయట ఊళ్లు నుండి చదువులకో, ఉద్యోగాలకో బయటకు రావటం, వాళ్లకు వసతి గృహాల ఏర్పాటు అక్కడ పనిచేయటానికి మనుషులు అవసరం. అది అమ్మాజీ తల్లికి పని కల్పించింది. అలాగే ఉద్యోగాలకు వెళ్లే వాళ్లకు మధ్యాహ్నం భోజనాలు వేడిగా వండి పంపగల శక్తి ఉన్నవాళ్లకు అవి తీసుకు వెళ్లి ఇవ్వవలసిన వాళ్లకు ఇచ్చి రాగల అవసరం ఉంది. దానిని ఉపాధిగా మలచుకున్న కుటుంబం అమ్మాజీది. అమ్మాజీతో పాటు, మేనత్త, మేనత్త కూతురు కలిసి రెండు తట్టల కారేజీలు మోస్తుంటారు. ఒక కుటుంబలో అయిదుగురూ పని చేస్తేనే ఆ కుటుంబానికి బతుకు భద్రత ఉంటుందనే విషయం అమ్మాజీ కుటుంబం ద్వారా తెలియజేశారు. ఈ కథలో ప్రత్యక్షంగా కనిపించే శ్రామికజనం అంతా మహిళలే. రావు ఇంటి తోటమాలి ఒక్కడే మగవాడు. ఈ కథకు వాళ్ల బతుకు తెరువుకు సంబధించిన సమస్యలు కాక నీటిసమస్య కేంద్ర స్థానంలో ఉంది కనుక ఇది ప్రధానంగా మహిళల జీవనానికి సంబంధించిన కథ అని చెప్పవచ్చు.

## నీటి సమస్య – మహిళా సమస్య :

ఈ కథలో ప్రధానంగా చిత్రించిన మరో అంశం నీటి సమస్య. ఈ కథలో నీటి సమస్య కేవలం విశాఖపట్నంలోని ఒక కూలివాడ మనుషుల సమస్యగా చిత్రించినా, చాలా చోట్ల పెద్ద ఎత్తున ఎదుర్కొంటున్న సంక్షోభం అది. నీళ్లు వంట, కడుక్కోవటం, ఉతుక్కోవటం, తాగటం వంటి ఇంటి అవసరాలకు సంబంధించిన సరుకు కనుక, ఇంటిపని స్త్రీలదిగా చేయబడిన సమాజంలో నీళ్లు తేవడం పూర్తిగా స్త్రీలకు సంబంధించిన వ్యక్తిగత సమస్యగానే చూడబడుతున్నది. అవసరమైన నీటి వనరులు వెతుక్కొంటూ వెళ్లటం, దూర ప్రాంతాలకు నడచి వెళ్లటం, క్యూలలో నిలబడి కలబడి నీళ్లు తెచ్చుకోవడం వంటివి ఆడవాళ్ల బాధ్యతే. మిలియన్ల సంఖ్యలో పేద ప్రజల జీవితం ఈ నీటి సంక్షోభం వల్ల దుర్భరం అవుతుందని అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. స్త్రీలు ఆత్మగౌరవంతో జీవించటానికి, సాధికారత సాధించటానికి రక్షిత త్రాగునీటి సౌకర్య లభ్యత ఉన్న సంబంధాన్ని గురించి కూడా ఈ నివేదికలు పేర్కొంటున్నాయి. స్త్రీల సాధికారత గురించిన ఈ అంశం గురించి కారా గారు ముందుగానే ఆలోచించి జీవధార కథ రాయడం ఎంతో ఉదాత్తమైన ప్రయత్నంగా చెప్పవచ్చు.

ఈ కథలో నీటి సమస్య పందిగుట్ట పాకల వాళ్లదే గాని,దగ్గరలో ఉన్న రావు బంగళా వాళ్లకు కాదు. కనీసావసరమైన నీటి లేమి పాకల లోని ప్రజల ఐక్యతకు, వైరుధ్యాలకూ కూడా కారణం కావటం గమనించవచ్చు. నీళ్లు తేవటం ఆడవాళ్ల పని కనుక ఈ కథలో పాత్రలుగా వచ్చే వాళ్లంతా మహిళలే. వాళ్ల ప్రవర్తనలను, సంబంధాలను నిర్ణయించేది నీళ్ల అవసరమే. దానిని భిన్న కోణాల నుండి స్వీకరించి ఈ కథలో భాగం చేసి గొప్ప ఆలోచనకు నాంది పలికారు రామరావుగారని చెప్పవచ్చు.

ఇక ఆడవాళ్ల మధ్య ఉండే స్నేహ సానుభూతులను నీటి అవసరం ఎలా చంపేస్తుందో ప్రారంభంలోనే సహజంగా చిత్రించి చూపారు రచయిత. 'నువ్వు ముందొచ్చావ్ నీళ్లు పట్టేసుకో' అని కొళాయి రావటం మొదలైన తొలి పావుగంటలో న్యాయానికి నిలబడే ఆడవాళ్లు మరి కాసేపటికే అది ముందు వచ్చిందా? నేను ముందు వచ్చానా అని తర్కానికి దిగటం, మూడో మనిషిని మధ్యలోకి లాగి తీర్పును కోరటం, ధార సన్నమయ్యేటప్పటికి ఒకరినొకరు తప్పులెన్నుతూ తాను పట్టుకోవటమే న్యాయమన్నట్లు వితండవాదం చేస్తూ తోపులాటలకు దిగటం కొళాయి దగ్గర దృశ్యం దానినే సూచిస్తుంది. నీళ్లు దొరకని వాళ్ల దైన్యం, దొరికిన వాళ్ల అతిశయం రెండింటినీ ఒకే సన్నివేశంలో చూపించారు రచయిత. ఆలస్యంగా కొళాయి దగ్గరకు వచ్చిన అమ్మాజీ యాభై అరవై కడవలు ఇంకా బోర్లించే ఉండటం చూసి తనవరకూ నీళ్లు వస్తాయన్న ఆశ అడుగంటి అప్పటికే

నీళ్లు పట్టుకుని వెళుతున్న ఆవిడను నీళ్లు పోయమని అడుగుతుంది. ఆవిడ తిరస్కరించటం గురించి చెప్తూ 'ఏక వరసని మూడు కుండల నీళ్లు పట్టుకుందేమో- ఆమెకు ఒళ్లూ పయి తెలియడం లేదు' అని రచయిత చేసిన వ్యాఖ్యానం గమనిస్తే ఈ విషయం అర్థం అవుతుంది. అమ్మాజీ కంటే ఆలస్యంగా వచ్చిన తవిటమ్మ ఉంది. ఆమెకు ఉన్న పసిబిడ్డను చూసుకునేవాళ్లెవరూ ఇంట్లో లేరు. బిడ్డకు పాలిచ్చి నిద్ర పుచ్చితే కానీ ఆమె ఇల్లు కదిలే పరిస్థితే ఉండదు. అట్లాంటి వాళ్లపట్ల జాలిపడి ముందు నీళ్లు పట్టుకునే అవకాశం ఇచ్చే గుండె మెత్తనను అవసరం అణచివేసిన విషయం కూడా ఈ కథలో సూచన ప్రాయంగా చెప్పబడింది.

బంగళా ముందు వాళ్లకు తిరస్కారం ఎదురైంది. నీళు లేవు.. వెళ్లిపోండి అన్న తిరస్కారం. ముందు ఆ మాట అన్నది నడీడు మనిషి. ఆ ఇంటి ఇల్లాలు. రావు భార్య. వాళ్లు బతిమిలాడారు. చంటిపిల్ల తల్లి తవిటమ్మను చూపి, తమ పెద్ద కుటుంబాల అవసరాలను చెప్పుకుని ప్రాధేయపడ్డారు. ఆమె కాస్త మెత్తబడి సరే అనే వేళకు లోపలి నుండి వచ్చిన ముసలమ్మమససేమిరా కుదర దంటూ అడ్డుపడింది. ఆవిడ రావు తల్లి. అత్తగారిని కాదని అంగీకారం చెప్పగల స్థితి కాదు కోడలిది. 'కుక్కలను ఉసి కొల్పనా' అని మాట తూలింది ముసలమ్మ. ఇక అక్కడినుండి మొదలైంది ఘర్షణ. నీళ్లడగటానికి వస్తే కుక్కలను చూపి బెదరగొట్టి పంపాలనుకొన్న పెద్దింటి మహిళలకు పేదింటి మహిళలు సవాల్ విసిరారు. కుక్కలను వదులుతారా వదలండి చూద్దాం అని సత్యవతి తెగించి మాట్లాడటం అందులో భాగమే. అవసరం తీరేమార్గం మూసుకు పోతుంటే నిస్సాహాయత నుండి జనించిన ఉక్రోషం వాళ్లది. ఆ ఉక్రోషమే కొళాయి నీళ్లు ఆగిపోవడంతో ఖాళీ బిందెలతో వెనుదిరుగుతున్న తోటివాళ్లను తమ బాధలో భాగం పంచుకోవటానికి సమీకరించేట్లు చేసింది. ముగ్గురం ముప్పయి మందిమి అయితే గానీ కొళాయి నీళ్లు పట్టుకోనీయం అని పంతం పట్టిన రావు భార్యను, తల్లిని వంచటం సాధ్యం కాదని తెలుసు గనుకనే వాళ్లు అలా చేసారు. కాసేపటి క్రితం మున్సిపాలిటీ కొళాయి దగ్గర నీళ్లకోసం ఎకసెక్కాలు ఆడుకొన్నవాళ్లు, పోటీ పడ్డవాళ్లు, తగాదా పడ్డవాళ్లు ఇప్పుడు అందరూ ఏకమై ముసలమ్మతో వాదనకు దిగటం ఇక్కడ గమనించాల్సిన విషయం

ఈ కథలో మరో విషయం ఉంది. పుచ్చుకునే వాళ్లెపుడూ ఇచ్చేవాళ్లకు లోకువే. నీటిని అడుక్కునే స్థితిలో అమ్మాజీలు, సత్యవతీలు ఉంటారు. దయాధర్మంగా ఇచ్చేవాళ్లలో రావుగారి తల్లి, భార్య, పిల్లలు ఉన్నారు. ఇచ్చేవాళ్లకు పుచ్చుకునే వాళ్లను ఎన్ని మాటలైనా అనటానికి, అవమాన పరచటానికి, బెదిరించటానికి అవకాశం ఉంది. అదెలా ఉంటుందో ఈ కథ చెప్పనే చెప్పింది. పడ్డ వాళ్లెప్పుడూ చెడ్డవాళ్లు కాదు అని ఓదార్పుగా చెప్పేమాట. కానీ పడ్డవాళ్లు మనుషులు కదా! వాళ్లకు ఆత్మాభిమానం, గౌరవంగా జీవించే హక్కు ఉంటాయి కదా! అమ్మాజీ, సత్యవతీ, తవిటమ్మ- ఇలాంటి స్త్రీల అభిమానం అంతగా అవమానింప బడుతున్నపుడు దానిపట్ల నిరసన వ్యక్తం చేసే అవకాశం వాళ్లకు ఉన్నదా అంటే లేదనే చెప్పాలి. అవహేళనలకు ఎదురు సమాధానం ఇవ్వాలని, అవమానాలకు ప్రతీకారం తీర్చుకోవాలని, ఆత్మగౌరవ ప్రకటన చేయాలనీ వాళ్లకు ఎంత ఉన్నా తక్షణ అవసరాల కోసం అన్నిటినీ వదులు కోవలసిన దయనీయ స్థితిలో కూలీనాలీ చేసుకునే మనుషులు ఉంటారు. ఆర్థిక వ్యత్యాసాలు, అవకాశాలలో అసమానతలు ఉన్న సమాజంలో చాలామంది ఇలా మానవత్వానికి పరాయీకరింపబడే భీభత్సాన్ని గురించి ఆలోచించమని ప్రేరేపించే కథగా ఈ కతను మలిచి నీటి తాలూకు అవసరాన్ని స్రీల జీవనానికి అనుగుణంగా చిత్రించారు రచయిత.

❖❖❖

# కా.రా. ఆర్థిక సంబంధమైన కథలు - పరిశీలన

**- డా॥. యస్.సి. సంజీవరెడ్డి,** తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు.

కా.రా కథలు ప్రపంచ సాహిత్యంలోనే గొప్పస్థానాన్ని పొందాయి. తెలుగు వాళ్ళు ఇరవయ్యో శతాబ్దంలో సాధించిన సాహిత్య పరమార్థం ఏమిటని మనం ప్రశ్నించుకుంటే చూపించే సాహిత్యంలో కా.రా. కథలను కూడా చేర్చవచ్చునని విమర్శకుల అభిప్రాయం. కా.రా. కథల్లో మన మనస్సులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే విషయాలు కనిపించవు. అలాగని దుఃఖాన్ని తెప్పించవు కొ.కు.కా.రా కథలను గూర్చి అన్నట్లు - లోకంలో కావలసినంత దుఃఖం ఉంది. దాన్ని సాహిత్యంలో ఏడుపుగా మార్చి, కన్నీల్లు తెప్పించి - అలా ఏడవగలిగిన పాఠకులు, హాయిగా తృప్తిపొందే కథలు మనకు తెలుసు. కానీ. కా.రా. కథలు ఈ పని చెయ్యవు. మనం భరించలేని అశాంతిని మనలో కలిగించి మనకు స్థిమితంగా నిద్ర పట్టకుండా చేస్తాయి.

కా.రా. కథల్లో ఇతివృత్తాన్ని బట్టి, ఆర్థిక సంబంధమైన, కుటుంబ సంబంధమైన కథలు, మద్య తరగతి జీవిత కథలు, శ్రామిక వర్గ జీవిత కథలు అని విభజించడం జరిగింది. అందులో ఆర్థిక సంబంధమైన కథలను పరిశీలిద్దాం.

## ఆర్థిక సంబంధమైన కథలు :

కా.రా. చాలా కథలు ఆర్థికాంశాల చుట్టూనే తిరుగుతాయి. 1949 కాలానికే సమాజంలో వస్తున్న అన్ని మార్పులను కా.రా. తన కథల్లో చిత్రించడానికి ప్రయత్నించారు. అలాంటి కథలలో కీర్తికాముడు, అప్రజ్ఞాతం, అన్నెమ్మనాయురాలు, పలాయితుడు ముఖ్యమైనవి.

### కీర్తికాముడు :

కీర్తిని మాత్రమే నమ్ముకున్న ఓ కీర్తికాముడి కథ ఇది. తాతముత్తాల నుంచీ దాతలుగా పేరు తెచ్చుకున్న వెంకట్యనాయుడి కుటుంబం క్రమంగా ఆస్తిని పోగొట్టుకుంది. వెంకయ్యనాయుడు ఛాందసుడే కానీ సోమరి కాదు. అందుకే తన నలభై ఎకరాలు పాలేర్ల సాయంతో సొంతంగా సాగుచేశాడు. మారుతున్న ఆర్థికపరిస్థితుల వల్ల రూపాయల పలుకబడి పెరిగి, దినుసుల పలుకబడి తగ్గడం మొదలైంది. జనం దినుసులకు బదులు రూపాయల నిలువ చెయ్యడం ఆరంభించారు. క్రమంగా నాయుడు ఇంట్లో డబ్బు అవసరం పెరిగింది. ఆడపిల్ల పెళ్ళిళ్ళు, దానధర్మాల కోసం ఆస్తి కరగడం మొదలైంది. రామినాయుడుతో తగవు వల్ల కోర్టుఖర్చులకై అప్పు చెయ్యాల్సివచ్చింది. అలా మొదలైన అప్పు క్రమంగా పెరుగుతూ పోయింది. ఖర్చు ఎంత తగ్గించుకున్నా ఆశ్రయించిన వాళ్ళు మొండికేసి మరీ లాక్కుపోయారు. క్రమంగా అసలు, వడ్డీ మరింత ఎక్కువై భూములమ్మే పరిస్థితి ఏర్పడింది. సగం ఆస్తిపోయింది. ఏ నోళ్ళు అతన్ని పొగిడాయో, అవే నోళ్ళు తెగడడం ఆరంభించాయి. తన ఆర్థికదుస్థిని వెంకయ్యనాయుడు గుర్తించినా, అంగీకరించడు. తర్వాత కాలంలో కూడ 'దుబారా' ఏమీ తగ్గలేదు. ఈ 'దుబారా' అతని గతకాలపు కీర్తిని నిలబెట్ట డానికి తప్పనిసరి అయ్యింది.

వెంకయ్యనాయుడు కూలి పోవడానికి కారణం అయిన రూపాయల కాదు. ''ఆయన నడం కట్టి జీవితంలో ప్రవేశించే సరికి ఆ ప్రాంతంలో రూపాయల పలుకబడి హెచ్చుడం, దినుసు పలుకుబడి తగ్గడం ఆరంభమయింది'' ఇలా ద్రవ్య ఆర్థిక విధానం జీవితాన్ని ఆక్రమించుకోవడం చేత 'ఇంటో దినుసులు తప్ప రూపాయల నిలువ చెయ్యని' వెంకయ్యనాయుడు అప్పుల్లో కూరుకు పోతాడు.

### అప్రజ్ఞాతం :

'దోపిడీ జరగడం వేరు, దోపిడీ చెయ్యడం వేరు' అనే

విషయాన్ని ఈ కథ చర్చిస్తుంది. పట్నంలో బి.ఏ. చదువుతున్న సుదర్శనం కొంతమేరకు కమ్యూనిస్టుభావాలకు ప్రభావితుడై ఉంటాడు. సెలవులకు గ్రామం చేరిన సుదర్శనం ఆ ఊరులోని జగన్నాథస్వామి ఆలయం వద్ద కబుర్ల సందర్భంలో పెట్టుబడీదారీ విధానంపై తన వాదన వినిపిస్తాడు. రైతులను షావుకార్లు, షావుకార్లను ఆ పైని సంపన్నులు దోచుకుంటున్నారని చెప్పడానికి ప్రయత్నిస్తాడు. పదివేలతో వడ్డీ వ్యాపారం మొదలుపెట్టిన సూర్పడు ఎలా లక్షాధికారి కాగలిగిందీ సవివరంగా చెప్పిన సుదర్శనం తెలివితేటలకు అంతా నివ్వెరపోతారు. 'పంట కోసం రైతు అప్పు చెయ్యడం, ఆ అప్పిచ్చిన వ్యాపారికే రైతు తన పంటను అమ్మాలనే ఒప్పందం, ఆ పంటధరను కూడ ఆ వ్యాపారే నిర్ణయించడం. అలా మొత్తం ప్రణాళికలో చివరకు అసలు వడ్డీ ఆకాశానికెగరడం, ఆ రైతు పొలాన్ని వ్యాపారి లాక్కోవడంతో అనుకున్న 'పని' పూర్తి అవ్వడం అనే విషయాలు చూపిస్తూ సూరప్పడిని దోషినిచేసి నిలబెడతాడు.

సుదర్శనం "నా ఎరికలో యీ ఊళ్ళో ఎందరెందరో రైతులు వ్యవసాయ కూలీలయ్యారు. ఈ భూములూ, ఆస్తులు ఎవరికి దఖలు పడ్డాయి? ఎలా దఖలు పడ్డాయి? శ్రమించి చెమటోడ్చడం వల్లా? శ్రమించి చెమటోడ్చిన వాడు ఒక్కడైనా సెంటుభూమి కొనగలిగాడా? అంటాడు.

ఈ మాటలు విని కోపం తట్టుకోలేకపోయిన సూరప్పడు, తాను దోషినైతే ఆ పాపఫలం అనుభవిస్తానంటూ తనను తానే శపించుకుంటాడు. ఇది జరిగిన పదిహేనురోజులకు సూరప్పడి ఒక్కగానొక్కకొడుకు కాళ్ళు చేతులు పడిపోవడం, అందరూ సూరప్పడినీ, సుదర్శనాన్ని తూలనాడడం, ఈ ఘటనకు బెదిరిపోయిన సుదర్శనం కొడుకును బ్రతికించమని దైవాన్ని ప్రార్థించడం వరుసగా జరిగిపోయాయి. సూరప్పడు పెట్టిన గడువులోగా, చనిపోతాడనుకున్న సూరప్పడికొడుకు లేచి కూర్చోవడం, పరీక్ష ప్యాసవుతాడనుకున్న సుదర్శనం ఫెయిలవ్వడం జరిగాయి.

రచయిత దృష్టిలో "సుదర్శనం తన సాక్షిక దృష్టిని విడనాడి, మరింత అవగాహనను పెంచుకొని ఉంటే ప్రజలను చైతన్యవంతం చేయగలిగి ఉండేవాడని" తెలుస్తుంది.

వల్లంపాటి సుబ్బయ్య గారి మాటల్లో - 'ఒక వ్యక్తి దోపిడీ చేయడానికీ, అతని వల్ల దోపిడీ జరగడానికీ మధ్య "నైతికంగా" ఉన్న తేడా ఈ కథలో అప్రజ్ఞాతంగా చూపబడింది.

### అన్నెమ్మనాయురాలు :

ఉత్తమపురుషలో సాగిన ఈ కథలో 'అన్నెమ్మ' ప్రధానపాత్ర. కథ మొత్తం ఆమె చుట్టూ సాగుతుంది. ఆమె తరానికి, ఆమె మనవడితరానికి మధ్య ఉన్న భావవైరుధ్యాన్ని మారుతున్న ఆర్థిక పరిస్థితులను పట్టి చూపించిన కథ ఇది. పెద్దింటికోడలైన "అన్నెమ్మ" కుటుంబంలో భూముల విషయమై పొరుగూరి రైతులతో జరిగిన గొడవ, కోర్టులకు తిరగడం లాంటి సంఘటనల కారణంగా కుటుంబంలోని మగవాళ్ళతో పాటు ఆస్తిని పోగొట్టుకున్న అన్నెమ్మ, మిగిలిన ఒక్క కొడుకుతో, కోడలితో కుటుంబాన్ని రక్షించుకోగలగింది. కొంతకాలానికి శిక్ష అనుభవించి వచ్చిన ఒక్క కొడుకు క్షయవ్యాధితో చనిపోవడం, మనవడి మీదే ఆశతో అన్నెమ్మ అన్నీ తానై నడిపించింది.

అన్నెమ్మతరం వారు కలవారైనా, రోజంతా ఒళ్ళోంచి పనిచేసే స్వభావం ఉన్నవారు, శ్రమ విలువ తెలిసినవారు. మారిన ఆర్థిక పరిస్థితుల్లో జనం సులభసంపాదనకు అలవాటుపడి, డబ్బుమీది వ్యామోహంతో అన్యాయాలనే న్యాయాలుగా భావిస్తూ కొత్త సంస్కృతికి అలవాటుపడ్డారు. అలాంటి తరంలోంచి వచ్చిన మనవడు తనకు ఆస్తిని రాసివ్వమని పంచాయితీ పెట్టడం అన్నెమ్మకు బాధ కలిగించింది. చిన్నవయస్సులో ఆ డబ్బును ఎలా ఉపయోగించాలో తెలియక వాడేమైపోతాడోనని బాధపడింది.

మనం ఈ రోజు చేసే పనిరేవు ఏవిధంగా పరిణ

మిస్తుందనే దృష్టి ఇప్పటి తరానికి లేదని, తప్పంతా మారుతున్న ఆర్థికవ్యవస్థదేనని రచయితభావనగా అర్థమవుతుంది.

**పలాయితుడు :**

మధ్యతరగతి జీవితాలకు మూలమైన ఆర్థిక విధానాన్ని చర్చించిన కథ ఇది. సహాయనిరాకరణోద్యమంలో జైలు పాలై, అన్యాయంగా చనిపోయిన ఒక స్వాతంత్ర్య సమర యోధుని కొడుకు రాజశేఖరం. అక్కడా, ఇక్కడా పెరిగి ఒక చిన్న ఉద్యోగం సంపాదించాడు. నిమిషంలో ఇంటిని నరకంగా మార్చే భార్య, పాతకాలపు మనషుల సహజ చాదస్తం ఉన్న నాయనమ్మ, నికృష్టుడైన ఆ తండ్రి కొడుకేనని ఈసడించే అత్తమామలు, బ్లాక్ మార్కెట్ మింగేస్తున్న జీతమూ, అప్పులూ - ఈ సమస్యలతో ఎవరికీ చెప్పుకోలేని నరకయాతన అనుభవిస్తాడు. నిజానికి రాజశేకరం పిరికిపందాకాడు, అప్రయోజకుడూకాడు, ఆలోచనాశీలిగానే ప్రవర్తిస్తాడు. కానీ క్రమంగా తన జీవితం, నుంచి తానే పలాయితుడౌతాడు. తన ఆర్థిక దుస్థితిని చక్కబరచుకోమని సూచననిచ్చిన మిత్రునికి ఉత్తరం ద్వారా 'మనుషులకు గల స్వేచ్ఛ ఈ సమాజంలో ఏ పాటిదో' వివరిస్తాడు. తన జీవిత దుస్థితికి కారణాలు చెబుతాడు. మన జీవితపు పగ్గాలగు మన చేతుల్లో లేవని, అందుకు కారణం నేటి మనిషి అనుసరిస్తున్న ఆర్థికవిధానమని, ఇందులో ఇరుక్కుని ఉన్నంతకాలం మన జీవితాలను మనం ఆనందమయం చేసుకోలేమని బాధపడతాడు.

నేటి సమాజంలో సంపదలను ఎక్కువగా అనుభవించే వారు వాటిని ఉచితంగా పొందుదామని ఆలోచిస్తారే గానీ, అందుకు తగిన కష్టం చెయ్యరు. పేదలకన్నా వారు ఏవిధంగా అర్హులో గమనించరు. అంటూ రాజశేఖరం వాపోడం ద్వారా తాను ఆశించే సామాజిక ధర్మాన్ని కా.రా. ఈ కథలో సూచిస్తారు. ఈ సూచనద్వారా నేటి ఆర్థికవిధానాల పట్ల వ్యతిరేకత, ఆలోచనాశీలులైన రాజశేఖరం లాంటి బాధితులపట్ల పక్షపాతం స్పష్టంగా కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**

1. కుటుంబరావు, కొడవటిగంటి - ఉపోద్ఘాతంలో ఉటకింపు, కాళీపట్నం రామరామ కథలు
2. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - కథాశిల్పం

❖❖❖

# కథా మాస్టారు

**- జంధ్యాల శరత్‌బాబు,** సీనియర్ జర్నలిస్ట్ అరసవల్లి (ఆంధ్రప్రదేశ్).

రెండక్షరాల పేరు 'కారా'. ప్రత్యేకించి కథారచన, నిర్వహణల్లో ఆయనే మాస్టారు. కాళీపట్నం రామారావు అనగానే 'కథానిలయం' మన ముందు నిలుస్తుంది. శ్రీకాకుళాన్ని సారస్వత చిత్రపటంలో అగ్రభాగాన నిలిపినవారు. సంస్థను స్థాపించి పాతికేళ్ళు. నాలుగేళ్ళు తక్కువగా నిండు నూరేళ్ళూ జీవించారాయన. మాట, రాత, అసలు మనిషంతా సరళమే. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలు చెప్పినట్లే, ఆ ఉద్యోగ విరమణ తర్వాత కూడా రచయితలూ, కవులకు సూచనలిస్తూ వచ్చారు. భాష, భావం, శైలి అన్నింటికీ ప్రాధాన్యమిచ్చిన సహజసిద్ధ కలం యోధుడు. యోధుడు అని ఎందుకు అన్నానంటే - సమాజ సమస్యలతో పోరాడుతూనే ఉన్నారు కనుక.

యోధ అనే పదానికి సాయుధ జీవి అనీ అర్థముంది. కారా మాస్టారి ఆయుధం కలమే! కలం బలంతోనే అక్షరయజ్ఞం సాగించి, ఫలితంగా నిలయాన్ని సాధించి మన తెలుగు వారందరికీ నిత్య నూతన కానుకనిచ్చారు. సుస్థిరత తన స్వభావం. ఒకే బడిలో మూడు దశాబ్దాలకు పైగా బోధన చేశారన్నా, సంవత్సరాల తరబడి ఊరూ వాడా తిరుగుతూ కథా రచనల్ని సమీకరించారన్నా ఆ వెనకా ముందూ ఉన్నది స్థిర సంకల్పమే. 'అన్నిటినీ చదువుతూనే వచ్చా, అందరితోనూ నా భావనల్ని పంచుకుంటూనే ఉన్నా' అన్నారు ఒక సందర్భంలో. అదిగో ఆ అధ్యయనమే, ఆ వ్యక్తీకరణమే ఆయనను కథా మాస్టారును చేశాయి.

రాయడం కన్నా రాయించడం మిన్న అన్నదే ఆయన జీవన సూత్రం. యోధత్వమే ఆధారంగా ఎందరెందరో రాతవీరుల్ని సృజించారు. కష్టనష్టాలతో పోరు కొనసాగించ డానికి, సంఘ స్థితిగతులను చక్కదిద్దడానికి రచనే సాధనమవుతుందన్నారు. అందులో కనిపించాల్సింది పాత్రలు కాదు - మనుషులే అని ఎప్పుడూ చెప్తుండేవారు. ఎక్కడ ఏం చెప్పదలచినా సడలిపోవటం, వడలిపోవడం కూడదనేవారు. నిజానికి 'యజ్ఞం' రాసి రమారమి అరవై వసంతాలు కావస్తోంది. ఈనాటికీ ఆ కథనే మనమంతా గుర్తు చేసుకొంటూ ఉంటున్నామంటే, అదీ రచనా పటుత్వం. చదివినవారు అందులో ఏముందో ఇప్పటికీ చెప్తూనే ఉన్నారు. ఇంకా అనేకులు ఇవాళ్టికీ చర్చోపచర్చలు సాగిస్తున్నారు. చదువరులూ విమర్శకులూ ఇంతటి మథనంలో ఉన్నారంటే, అదే కథన శక్తి. సంపద చేతులు మారిన విధానాన్ని అక్షరీకరించిన నాటకీయతా యుక్తి. ఇన్నిన్ని శక్తియుక్తులు కలగలిసినందునే కారా కథ అగ్రగామి అయింది. ఉత్తరాంధ్ర జనజీవన చిత్రణను విశ్వవ్యాప్తంగా రూపుదిద్ది ఒక చరిత్రనే సృష్టించింది. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి తోడు పాఠకజన నమస్కారం స్వభావసిద్ధంగానే లభించింది.

దినపత్రికలో 'నేటికథ' నిర్వహణ అటు తర్వాత ఎంతటి సాహితీ సృజనకి కారణమైందో మనందరికీ తెలుసు. సృజనే కాదు, సమీకరణా ఆయనకి ప్రీతి పాత్రాలు. సమీకృతం శాశ్వత చిరునామా కథానిలయమే! వార, మాస, విశేష పత్రికల నుంచి సేకరణ, భద్రపరచడమంటే మాటలా? స్వాతంత్ర్యానికి పూర్వం నాటి వాటినీ అందుబాటులోకి తేవడం ఆయనకి తప్ప ఇతరులకి అయ్యే పనేనా? వేలాది సంపుటాలు, సంకల నాలు, అపూర్వ రచనలు; అనేకానేక సాహితీవేత్తల చిత్ర పటాలు... సరస్వతీ సామ్రాజ్యం కాదా అది? అక్కడున్నవి కేవలం అద్దాల బీరువాలు కావు; అక్షర లక్ష్మి వైభవాన్ని ప్రతిఫలించే నిలువుటద్దాలు. సహస్రాధిక పుటల్లో పొందు పరచి ఉన్న మాస్టారి రచనలపైన అశేష అభిమానుల విశేష అభిమానాలెన్నో. అన్ని పుస్తకాల్లోనూ 'జీవధార'

కనిపిస్తుంది. 'రాగమయి' అలవోకగా ప్రవహిస్తుంది. 'రుతుపవనాలు' మాదిరిగానే ఆ అక్షరాలన్నీ మలయ సమీరాలు. అవన్నీ కథా కథన చాతురిని వెలయించి మనలోని ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేసేవే. వీటికితోడు అదే చరిత్రాత్మక పుస్తకాలయంలో ఉన్న ఆత్మకథలు, జీవిత చరిత్రలు, ఉద్యమ గాథలు, సామాజిక చిత్రీ కరణలు నిన్నూ నన్నూ అందరినీ సాదరంగా పలకరిస్తాయి.

కథానిలయంలోని ఆ వివరాలకు స్వరాల వరాలూ జత చేరితే తెలుగుతల్లి ఇంకెంతో పులకరిస్తుంది. శ్రీకాకుళంలో ఉన్న విశాఖ 'ఎ' కాలనీ వీధికి రాకపోకలు సుప్రసిద్ధులు, పరిశోధకులకు తోడు అధ్యాపక - విద్యార్థి బృందాలకూ విస్తరిస్తేనే ధన్యత. అవును మరి. తెలుగు రచనలన్నీ చేరుకునేది కంచి కథా నిలయానికే కదా. ముఖ్యంగా కథ లక్ష్యం, లక్షణం సామాజిక మార్పు. అందుకే ఆయా కథలన్నింటినీ ఒక దగ్గరే చేరిస్తే ఇప్పటివారికి గతం తెలుస్తుంది. ప్రస్తుతం బోధపడు తుంది. భవిష్యత్తు దర్శనమవుతుంది. వందలాది పుస్తకాలతో వెలసిన మందిరం కాలపరిణామ క్రమంలో లక్ష కథల నిధి అవుతోంది. వర్తమాన కథకుల రచనా సర్వస్వ సేకరణ, డిజిటల్ డేటాలోకి రూపాంతరీకరణ, పుస్తకాల స్కానింగ్, సంస్థ వెబ్‌సైట్ నిర్వహణ... వేటికి అవే విలక్షణం. అన్నింటికంటే మించి అలనాటి సంపుటాలూ, సంకలనాలూ ఒకేచోట లభించే అపూర్వ అపురూప కథాస్థలి అది. మాటలూ రాతలకే పరిమితం కాకుండా చేతల్లోకి తెచ్చి, కలకాలం నిలబెట్టుకోవడం మన అందరి ప్రథమ ప్రధాన బాధ్యత.

సాహిత్యమైనా, వ్యక్తిత్వంలోనైనా ఆయనకు ఆయనే సాటి. దూరదృష్టి, నవచైతన్యం, జయప్రద జీవనం శీర్షికలు తన మూర్తిమత్వాన్ని పట్టి చూపుతాయి. 'దిక్కుతోచక తల్లడిల్లుతున్న స్థితిలో ఉన్న నన్ను ఆదరించి ఆదుకున్న సజ్జనుడికి కృతజ్ఞతగా శాశ్వత చిహ్నం' అంటూ పెద్ద కథను అంకితమిచ్చారు కారా. మాస్టారుది ధర్మావేశం. సత్యాన్వేషణపైనే ఎప్పుడూ చూపు. 'నా రచనలు ఇతరుల మీద ప్రభావం చూపినా చూపకున్నా, నేను చేసిన ఆలోచనల వల్ల మారాను. దీనికి నిదర్శనాలున్నాయి' అన్నారు 'నేనెందుకు రాశాను' వ్యాసంలో. అదీ తన మనో విశ్లేషణ.

- జీవితం మనిషిలో మార్పు తెస్తుంది. అందుకు అనుభవం కారణమవుతుంది.
- మంచి కార్యశూరుడు దేనికీ ఇతరుల మీద ఆధారపడడు. మంచి యజమాని అన్నిటికీ ప్రభుత్వాల కేసి చూడడు.
- ఉన్న నిజాలను చెప్పడం పట్ల ఉండే భయాన్ని మొట్టమొదట రచయితలు వదులుకోవాలి.
- లోకం మాట అటుంచి కనీసం తమకు జరిగే మంచి చెడ్డలనైనా గుర్తించే శక్తి రచయితలకు ఉండాలి. న్యాయా న్యాయాలకు స్పందించే స్వభావమైనా కావాలి. ఇవేవీ లేనివారు రచయిత లైతే కారు.
- ఏ రచనకైనా జీవితమే ప్రేరణ. జీవిత అస్తవ్యస్తత మనిషిని బాధిస్తుంది. సరిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే రచయితలు కథలు రాస్తారు.
- రాసిందానికి డబ్బులు రావడం వేరు. డబ్బుకోసమే రాయడం వేరు.
- ఒకరు రాసిందే రాసినా, ఒకరు రాసినట్లే రాసినా పాఠకులు చదవరు.
- కథలు ప్రధానంగా రెండు విధాలు. హృదయాన్ని స్పృశించేవి, బుద్ధిని తాకేవి.
- రచనల్లో కొన్నింటికి కొసమెరుపులైతే, మరికొన్నింటికి కొస మలుపులు.
- జీవితం వల్ల ప్రభావితమవుతూ, ఆ జీవితాన్నే ప్రభావ పరచడం ఉత్తమ సాహిత్య లక్షణం.
- నాకు అందనివాటికోసం దుఃఖం లేదు. అందు కోలేని వాటి గురించి విసవిసలూ లేవు. అందిన వాటిపట్ల ఆనందమూ, కృతజ్ఞతా ఉన్నా గర్వం అసలే లేదు.

ఇవన్నీ మాస్టారి భావాలు, అనుభవాలు. ఎన్ని బహూకృతులు అందుకున్నా, ఘనసత్కారాలు పొందినా; ఏ దశలోనూ వినమ్రత వీడని, మొహమాటం వదలని తన పేరు కాళీపట్నపు వెంకట సూర్య రామ సుబ్రహ్మణ్యేశ్వర రావు. తన కథల్లో మానవ సంబంధాలున్నాయి. అవి ఒక ప్రాంతానికో, పరిస్థితికో పరిమితమైనవి కానే కావు. అందరికీ అన్ని స్థితిగతులకీ వర్తించేవి అవి. రావిశాస్త్రి అన్నట్లు, ఆయన వంటి గొప్ప కథకులుండటం మన పాఠకుల అదృష్టం. వేల్చేరు నారాయణరావు చెప్పినట్లు - కారాలా కథ చెప్పేవారు సాహితీరంగంలో ఎంతోమంది లేరు. కథను ఆయన అందరిలా రాయరు. పొందికగా చెక్కుతారు. తనకు అన్నివిధాలా నచ్చాకనే పత్రికలకు పంపేవారు. ఉత్సుకతా ఉత్సాహం ఉన్న కొత్తవారిని ఎంతగా అక్కున చేర్చుకుంటారంటే, జీవితాంతమూ అయనను మరవలేనంతగా. అందుకే ఎందరెందరు అభిమానులు, ఆరాధకులను పొందారో లెక్కంటూ లేదు. ఒక్కసారి తనను చూసినవారు, మాట్లాడినవారు తిరిగి కలవాలని అనుకోకుండా ఉండలేరు. అంతటి విలక్షణ తత్వం మాస్టారుది. ఎంతో చిత్తశుద్ధీ కార్యదీక్షా ఉంటే తప్ప నమస్తాన్నీ, సర్వస్వాన్నీ కథా నిలయానికే ధారపోయరు కదా! ఎక్కడ ఏ సమావేశం జరిగినా, ఎంత దూరమైనా ప్రయాణించి వచ్చి, ప్రతి రచయితనీ పలకరించి మరీ రచనల వివరాలు తెలుసుకునేవారు. వాటన్నిటినీ క్రోడీకరించి, కథలన్నింటినీ నిలయానికి చేర్చేవారు. ఎంత సాహిత్య ప్రేమ ఉంటే ఇంత స్వచ్ఛంద సేవ?

జూన్ 4న కారా మాస్టారి సంస్మరణ. ఇప్పటికే ఏడాది కావస్తోంది. ప్రేమాదరాల చిరునామాగా మారిన ఆ నిండుమనిషి గుర్తుకు రాని క్షణమంటూ ఉండదు కథా ప్రేమికులకి! ఎవ్వరూ మరవలేని, చేతులు రెండూ జోడించి నమస్కరించకుండా ఉండలేని పెద్దమనిషి!! చదివే, చదివించేవారందరూ గుండెల్లో పెట్టుకునే ధన్యచరితుడు. ఓ ముఖాముఖిలో తానే తేటతెల్లం చేసినట్లు -

'కొందరి రచనలంటే ఇష్టం ఉంటుంది. మరికొందరు రాసేవాటిపైన గౌరవం పెరుగుతుంది. ఇంకొంతమంది నుంచి నేర్చుకోవాలనిపిస్తుంది. జీవితం నుంచి పుట్టి, ఆ జీవితాన్నే ప్రభావితం చేసే రచనలంటే నాకు ఇష్టం'. అవును. అక్షరమంటేనే అయనకు ఇష్టం, గౌరవం. అందుకనే కథనీ, కథా ప్రపంచాన్నీ అన్నింటికన్నా మిన్నగా ప్రేమించారు. కలవరించారు. పలవరించారు. అంతా పుస్తకమయం చేసుకున్నారు. కథకులకే కథకుడయ్యారు. తాను చదివారు, ఇతరులతో చదివించారు. తను కొన్నే రాసినా, తోటివారితో ఎన్నెన్నో రాయించారు. ఎవరి రచనను వారు ప్రేమించడం సహజం. మరొకరిది చదవాలన్నా, బాగోగులు చెప్పాలన్నా వారికది పెద్దపనే. సరిగ్గా ఆ పనినే తన నిత్యకృత్యం చేసుకున్నారు మన మాస్టారు గారు. ఆయన అందరివారూ కావడానికి అదే కారణం. ఎప్పుడో 1998 లోనే రాసుకున్న వీలునామా ఆయన మనసుకు అక్షర సంతకం. అందులోనూ మొత్తం కథా నిలయ మయమే. వయసునూ జయించారనడానికి మరో ఉదాహరణ - అదే సంస్థ ప్రారంభమప్పుడు ఆయనకు 75 ఏళ్ళు. జీవనోత్సాహమంటే ఇదే కదా!

తానూ తన కథల గురించి చెప్పుకోవడానికి ఇష్టపడని మాస్టారు ప్రధానంగా వర్ధమాన రచయితల రచనల మీద ఎంతైనా చెప్తారు, ఎంతసేపైనా మాట్లాడతారు. విస్తృతి, విశాలత, సమాదరణ నిండితే తప్ప మరెవ్వరూ చేయలేరు అలా. అరవైకి పైగానే ఉంటాయి ఆయన రాసినవి. మంచివీ, ఫరవాలేదని తనకి అనిపించేవీ ఓ ముప్పై అయిదు ఉంటాయని అన్నారు కానీ; మాస్టారి ఏ కథను ఎవరు చదివినా స్పందించకుండా ఉండలేరు. స్పందించాలన్నా, దాన్ని అందించాలన్నా ఆయనే. కథల మీదనే అన్ని ఆలోచనలూ.

ఇది ఇప్పటిది కాదు. ఎప్పుడో 46 ఏళ్ళనాటి ముచ్చట. ముచ్చటిస్తూ మాస్టారే తన 'కారా' కథ చెప్పుకొచ్చారు. 'మాస్టారూ ఇంత లలితంగా మాట్లాడే మీకు ఆ కారాకిళ్ళీ ఘాటు ఎలా అలవాటైందీ' అంటే 'అప్పట్లో అలా అలవాటుగా మొదలైంది' అన్నారు నవ్వుతూ. తన

ఆలోచన ఎంత లలితమో రచనలలో అంత ఘాటుదనం. ఇలా అన్నింటినీ సొంతం చేసుకున్నారు కాబట్టే 'కథల మాస్టారు' అయ్యారాయన. మనలో ప్రతి ఒక్కరికీ ఇప్పుడు ఏమనిపిస్తుంది? కారా మాస్టారైనా, కథా మాస్టారైనా ఆయన మాత్రమే. అసలంటూ ఆయనను మరిచిపోతే గదా... తిరిగి ఇప్పుడు గుర్తుకు తెచ్చుకోవడానికి? మాస్టారూ! కథ ఉన్నంత కాలమూ మీరుంటారు. మీరున్నంత కాలమూ కథా ఉంది. ఇదిలాగే కొనసాగేలా చూడటం కాదు - చేయడం మనందరి విధి. కారాగారూ! బాధ్యత మా అందరిదీ.

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు శాఖ నిర్వహణలోని ఈ 'సాహిత్యం - సమాలోచన' కారా దర్శనభాగ్యం కలిగిస్తోంది. ఇంతకంటే ఎవరైనా కోరుకునేది ఇంకేముంటుంది?

❖❖❖

# యజ్ఞం - సమిధలౌతున్న శ్రమజీవులు

**- కోష్టు గోవిందరావు,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

అంతర్జాతీయంగా ప్రపంచీకరణ నేపథ్యంలో భూగోళమే చిన్న గ్లోబల్ మార్కెట్‌లా మారిన సందర్భంలో శాస్త్ర సాంకేతికత అభివృద్ధి చెంది నలుదిశలా వ్యాపించిన తరుణంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో సాంకేతికతను ప్రవేశపెట్టిన తరువాత వచ్చిన విప్లవాత్మక మైన మార్పుల వలన సమాజంలో కూడా అలాంటి మార్పులనే గమనించవచ్చు. మానవ పురోభివృద్ధి శరవేగంతో దూసుకుపోతున్న రోజుల్లో సమాజంలో ఏర్పడిన వివిధ అంతరాలను గమనించవచ్చు. ముఖ్యంగా ఆర్థిక అసమానతలు పెరిగి కొంతమంది కోట్లకు పడగలెత్తితే, మరికొంతమంది ఆర్థికంగా చితికిజ పోయి, ఉపాధి కోల్పోయి, జీవనం దుర్భరమై, అథ:పాతాళానికి కుంగిపోయారనే చెప్పవచ్చు. పారిశ్రామిక రంగంలో మార్పులు వలన, నూతన సాంకేతిక పద్ధతులు వలన, నూతన యంత్రాల వలన ఘననీయమైన ఉత్పత్తి పెరిగి, ఎగుమతులు పెరిగి జాతీయోత్పత్తి పెరిగినప్పటికీ, దేశీయంగా ఉన్న చిన్న చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు దివాలా చేసి పెద్ద పరిశ్రమలతో పోటీపడలేక మూతపడ్డాయి. అలాంటి పరిస్థితుల్లో వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న శ్రామికులు, వృత్తిపనివారు ఉపాధి కోల్పోయి, మరో వృత్తిలోకి వెళ్ళలేక తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చినది. ఈ విధమైన పరిస్థితులు పేదరికపు శాతాన్ని పెంచడానికి దోహదపడ్డాయనే చెప్పవచ్చు. ముఖ్యంగా వలస వాదాన్ని ప్రేరేపించాయి. ఎందుకంటే "పువ్వులమ్మే చోట కట్టెలమ్మలేని" చందంగా బాగా బ్రతికి, ఆర్థికంగా దివాలా తీసిన కుటుంబాలు స్వగ్రామంలో ఉపాధి లేక వేరే కూలి పనులకు వెళ్ళలేక నగరాలకు వలసపోవడం గమనించవచ్చు. సాంకేతిక అభివృద్ధి జరిగిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధినే కాక ఆర్థికంగా దెబ్బతీస్తున్న చిన్న, సన్నకారు రైతుల పరిస్థితులను ఉపాధి కోల్పోయిన భూమి లేని వ్యవసాయ కూలీల దుర్భరమైన జీవితాన్ని తెలియజేస్తూ వారి యొక్క ఆవేదనను అక్షరీకరించిన అక్షర కృషీవలుడు కారా మాష్టారు.

కారా మాష్టారు అని ముద్దుగా పిలుచుకునే కాళీపట్నం రామారావు గారు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. 1924 నవంబరు 9న శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో మురపాక గ్రామంలో జన్మించారు. ఈయన చేసిన రచనలు తక్కువైనా సుప్రసిద్ధాలు యజ్ఞం అభిమానాలు, రాగమయి, జీవధార, రుతు పవనాలు, కారా కథలు, కథాకథనం, కథాయజ్ఞం మొదలైనవి ఈయన రచనలు. ఈయన రచనల్లో దోపిడీ స్వరూప స్వభావాలను నగ్నంగా, సరళంగా, సహజంగా, శాస్త్రీయంగా చిత్రీకరించారు. ఈయన రచనలు సరళమైన భాషలో ఉంటూ, ప్రాంతీయ మాండలీకానికి పట్టం కట్టాయి. కారా మాష్టారు ఉత్తరాంధ్ర ప్రజల జీవన స్థితిగతులను, అభివృద్ధి పేరుతో జరుగుతున్న మోసాన్ని, దోపిడీలను తెలియజేస్తూ, ఉత్తరాంధ్ర మాడలికంలోనే కథలు రాయడం జరిగింది. 1966లో ఈయన రాసిన యజ్ఞం కథను గమనించి నట్లయితే అభివృద్ధి పేరుతో జరుగుతున్న మోసాన్ని తెలియజేసారు. ముఖ్యంగా అభివృద్ధి వలన కొంతమంది ఆర్థికంగా లాభాలు పొందితే మరి కొంతమంది ఉపాధిని కోల్పోయారు. దాన్నే ఇతివృత్తంగా గ్రహించి, పల్లెల్లో జరుగుతున్న అభివృద్ధి పేద ప్రజలకు, భూమి లేని వ్యవసాయ కూలీల పాలిట శాపంగా మారుతున్న దృశ్యాన్ని కథారూపంలో తీసుకువస్తూ యజ్ఞం కథ ద్వారా సమిధలైపోతున్న శ్రమజీవుల వెతల్ని వివరించారు.

ప్రపంచం సమూలంగా అభివృద్ధి చెందుతూ, అంతరిక్ష యాత్రలు చేస్తున్న తరుణంలో నగరీకరణ, పట్టణీకరణ

ప్రభావాలకు లోను కాకుండా గ్రామీణ వాతావరణాన్ని అణువణువూ అద్దుకొని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న సిక్కోలు జిల్లాలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి ఛాయలు కనిపిస్తున్న నేపథ్యంలో, ఆ అభివృద్ధి పేదల పాలిట శాపంగా మారుతున్న వైనాన్ని తెలియజేసారు కారా మాష్టారు. ఈ కథలో ఇతివృత్తాన్ని గమనించినట్లయితే ఒక మార్పు వలన వచ్చే సానుకూల, ప్రతికూల ప్రభావాలు వలన ప్రజల జీవితంలో ఏవిధమైన మార్పులు వస్తున్నాయో తెలియజేసారు. కథలో సుందరపాలెం గ్రామాన్ని పరిశీలించినట్లయితే దెయ్యాలు కూడా దరిచేరని గ్రామానికి రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, కోపరేటివ్ సొసైటీలు, విద్యుత్తు, రైస్‌మిల్, వ్యాపార సముదాయాలు వ్యవసాయ యంత్రాలు మొదలైనవి రావడం జరిగింది. దానివల్ల ఆ గ్రామం రూపురేఖలు పూర్తిగా మారి, చుట్టు పక్కల గ్రామాలకు వ్యాపార కేంద్రంగా, విద్యాకేంద్రంగా మారి ఆదర్శ గ్రామమైంది. కానీ చిన్నాచితక వ్యాపారస్తులు, చేతివృత్తులు, చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు పరిస్థితి మాత్రం తారుమారైందని అప్పలరాముడిచే ఆవేదన వ్యక్తం చేసారు కారా మాష్టారు. గ్రామాల్లో జరిగిన ఈ పురోభివృద్ధి యొక్క ప్రతికూల ప్రభావాలు శ్రామికుల మీద ఏ విధమైన ప్రభావాన్ని చూపాయో గమనించినట్లయితే రోడ్డు పనులు జరగడం వలన తాత్కాలిక ఉపాధి లభించినప్పటికీ ఆ తరువాత కార్లు, జీపులు, లారీలు, బస్సులు రాక మూలంగా నాటుబళ్ళు, ఎడ్లబండ్లు గుర్రపు బండ్ల ద్వారా సాగే వస్తు రవాణా, మానవుల ప్రయాణాలు లేకపోవడం వలన నాటుబండ్లు శ్రామికులు ఉపాధి కోల్పోయారు. పాఠశాలల రాక కూడా ధనవంతులకే ఉపయోగపడింది కానీ కూటికి గతిలేని పేదలకు చదువు చెప్పించలేక పోయింది. పెద్ద పెద్ద వ్యాపార సముదాయాల వల్ల పారిశ్రామిక వస్తువుల సులభ లభ్యతతో గ్రామీణ ప్రాంతంలో ఉండే చేనేత, చేతివృత్తులు నిరాశ్రయ మయ్యాయి. విద్యుత్ రాకతో మోటార్లు వలన ఏతాం తోడే శ్రామికులకు ఉపాధి కరువయ్యింది. రైసు మిల్లు రావడం మూలంగా కలిగినోళ్ళ ఇళ్ళల్లో కూళికి దంచే జనం కూలి పోవడమే కాదు, కూలి తెచ్చుకున్న పుట్టెడు గింజలకూ తిరిగి కూలి ఇయ్యాల్సి వస్తోంది. ఇక వ్యవసాయం మాటకు వస్తే వాణిజ్య పంటల పుణ్యమా అని కూలీ గింజలు పోయాయి. వ్యాపారస్తులు కోట్లు సంపాదిస్తే, రైతులు ఉన్న పొలాల్ని అమ్ముకోవలసి వచ్చింది. ఈ విధంగా పల్లెల్లో తారుమారైన పరిస్థితులను గమనించినట్లయితే ఒకప్పుడు బాగా బ్రతికిన వారందరూ ఇప్పుడు ఈ మార్పుల ఫలితంగా కూటికి గతిలేని నిరుపేదలైపోతున్నారు. ఈ విధమైన పరిస్థితులు గ్రామాల్లోని పేదల, దళితుల దుర్భరమైన ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తున్నాయి. యాంత్రిక జీవనం మానవజీవనంలోకి ప్రవేశిస్తున్న తరుణంలో చేతి వృత్తులను, కాయకష్టాలన్ని నమ్ముకున్న ప్రజలు ఉపాధి లేక, చాలీచాలని కూలీలతో జీవనం సాగించలేక, అప్పుల వలయంలో కూరుకుపోయిన గ్రామీణులు అయితే ఆత్మహత్యలు, లేదంటే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోవడం జరుగుతుంది. దీని వలన గ్రామీణ జనాభా తగ్గిపోవడం మరియు అక్షరాస్యత రేటుపై కూడా ప్రభావం చూపుతుంది.

ఈ కథ ద్వారా రచయిత ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధిని, వాటి వెనుక జరుగుతున్న చీకటి పరిణామ క్రమాన్నీ వివరించారు. అభివృద్ధిపై దృష్టి పెట్టిన ప్రభుత్వం చిన్న చిన్న రంగాల్లో ఉపాధి కోల్పోయిన శ్రామికులను పూర్తిగా గాలికి వదిలేయడం జరుగుతుందని, వారికి ఏ విధమైన ఉపాధి మార్గాలు చూపడం లేదని తెలియ జేసారు. ముఖ్యంగా ఈ కథలో ఒక పెద్ద మనిషి మాటల్లో

వండిన వంటంతా కావందుల గోదాల కెళ్లాల,
ఎల్లకుండా కూలోడు అడ్డు తగుల్తున్నాడు,
ఎనకట్రోజుల్లో తన్ని సేయించుకునేవారు,
ఇప్పటి రోజుల్లో ఆ పప్పులుడకవు,
కూలోడి అడ్డు వొదిలించుకోవాలంటే మిషీన్లు కావాలి,

మిసీన్లు తేవాలంటే యెలట్రిసిటీ, రోడ్లూ కావాలి,
అంతేకాదు, సదువుకున్న కూలోల్లు కావాలి,
అందుకనే యీ యిస్కూళ్ళు, యీ రోడ్డూ, యీ యలట్రిసిటీ,
ఇయన్నీ మనకోసవే అనుకోవడం మన బుద్ధి తక్కువ,
నీల్లు తోడ్డానికి మెసీన్లొచ్చేసి నాయనే గుంజుకు పోతన్నారు,
రేప్పొద్దున్న దున్నడానికి, ఊడుపులకు, గొప్పులకు,
కోతలకు కూడా మెసీన్లు రాబోతున్నాయి,
అప్పుడు సూసుకోండి తడాఖా....!

ఈ మాటలో ఒక వైపు ప్రశ్నించే తత్వం. మరోవైపు శ్రామికుల్ని చైతన్యపరిచే తత్వం రెండూ ఇమిడి ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఈ వాక్యాల ద్వారా సమాజంలో జరుగుతున్న వాస్తవాన్ని నిర్భయంగా, నగ్నంగా తెలియజేసారు. సమాజం ఏ విధంగానైతే నిత్య నూతనత్వం పొందుతుందో, ఆ నూతనత్వంతో జరుగుతున్న మార్పులు ఏ విధంగా ఉంటున్నాయో, అవి ప్రజలమై ఏ విధమైన ప్రభావాన్ని చూపుతున్నాయో, బళ్ళు ఓడలు- ఓడలు బళ్ళుగా ఎలా మారుతున్నాయో ఈ కథలో స్పష్టంగా తెలియజేసారు. ఎందుకంటే వాణిజ్య పంటల పరిచయంతో రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు పండించి, వచ్చిన ఆదాయంతో కొంత వర్తకులకు పెట్టుబడి పెడితే, మరికొంత నాయురాళ్ళ మెడల్లో బంగారంగా కనిపించేది. కానీ వర్తకంలో మోసాలు వల్ల రైతులు భూములమ్ముకొని వీళ్ళ బంగారం సావుకారమ్మల మెడల్లో ప్రత్యక్షమవుతున్నాయని అప్పలరాముడు చెప్పడంతో పాటు, చిన్న చిన్న వ్యాపారస్థులు ఏవిధమైన కుదేలై దివాలా తీసారో గోపన్న వృత్తాంతంలో అర్థమవుతుంది.

ఇక పాలకవర్గం చేస్తున్న పనులు కూడా అలానే ఉన్నాయి. కేవలం చదువుకున్న కూలోల్ల కోసమే పాఠశాలలు అనే విధంగా మన విద్యావిధానం ఉందని రచయిత అభిప్రాయపడుతున్నాడు. ఎందుకంటే సాంప్రదాయ, వృత్తిపరమైన విద్యలు విద్యార్థులను ఉద్యోగస్తులుగా తయారు చేస్తున్నాయే కానీ, ఉద్యోగ కల్పనకు అవకాశం కల్పించడం లేదు. ఇక వ్యవసాయ రంగంలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని గమనిస్తే రచయిత చెప్పిన యంత్రాలు నేడు పల్లెటూర్లలో తిష్ట వేశాయి. వ్యవసాయంలో లేని యంత్రమంటూ లేనేలేదు, దున్నడానికి, దమ్ము చేయడానికి, నాట్లు వేయడానికి, కలుపు తీయడానికి, చదును చేయడానికి, విత్తు విత్తడానికి, గొప్పు తవ్వడానికి, కోత కోయడానికి, నూర్పిడికి, పంటను రవాణా చేయడానికి ఇవే కాకుండా కలుపునివారణకు ఎరువులు, సాగు నీటికై డిప్ యంత్రాలు ఇలా అన్నింటికీ యంత్రాలు ఉపయోగించడం జరుగుతుంది. వీటివలన తక్కువ ఖర్చుతో వేగంగా పని జరుగుతుంది. అదే విధంగా కూలీల కొరత, కూలీల ఆజమాయిషీ వంటి ఒత్తిడి రైతులపై ఉండట్లేదు. ఆ కారణం చేతనే నేటి రైతులందరూ ఈ యంత్రాల సహాయంతోనే వ్యవసాయం చేస్తున్నారు. అలాంటప్పుడు రైతు కూలీల పరిస్థితి ఏమైనట్లు, పొలం దుక్కి, విత్తువిత్తడం, దమ్ము చేయడం, ఉడుపులు, కలుపుతీత అని సుమారుగా 60 రోజుల పని, కోతలు, నూర్పులు అంటూ మరో 40 రోజులు పని, ఆ తరువాత అపరాల పంటలకనో, కూరగాయల పంటలకనో, వాణిజ్య పంటలకనో, మిగతా కాలాలు కలుపుతీత, గొప్పులు, పంట కోతలు ఇలా నిత్యం ఉపాధి లభించే గ్రామాలు నేడు యంత్రాలతో కిటకిట లాడిపోగా రైతు కూలీలు వలస దారులుగా భవననిర్మాణ కార్మికులైపోతున్నారు.

కథలో రచయిత యొక్క కొసమెరుపు గమనించదగినది. ఎందుకంటే పై వాక్యాలలో రచయిత రోడ్లు, స్కూళ్ళు, విద్యుత్తు, రైస్‌మిల్లు వంటి వాటి వలన ఉపాధి కోల్పోయిన వారిని గూర్చి చెపుతూ, వ్యవసాయ రంగంలో రాబోయే మార్పులు అంటూ వేసిన ప్రశ్న నేటికి కనిపిస్తోంది. ఎందుకంటే రైతులకు తక్కువ ఖర్చుతో,

రోజుల తరబడి అవ్వాల్సిన పని గంటల వ్యవధిలోనే అయిపోతుండడం వలన రైతు కూలీలను పనులకు పిలవకుండా యంత్రాలతోనే వ్యవసాయం చేయడం జరుగుతుంది. ఈ విధమైన పరిణామాలను గమనించి నట్లయితే ఉపాధి కోల్పోయిన గ్రామీణులు అప్పుల బాధలు తాళలేక వలసలకు దారి తీస్తున్నారు. ఈ సాంకేతిక విధానం పెద్ద రైతులకు వరంగా మారినప్పటికీ చిన్న సన్నకారు రైతులకు, రైతుకూలీలకే కాదు వ్యవసాయ ఆధారిత వండ్రంగి, కమ్మరి మొదలైన ఎన్నో వృత్తులకు కూడా జీవనోపాధి కరువైంది. మన సమాజంలో ప్రతీ వృత్తివారు మరొక వృత్తివారితో అవినాభావ, అనుబంధ సంబంధాలు కలిగి ఉండటం జరుగుతుంది. అలాం టప్పుడు ఒక వర్గంపై ప్రభావం పడినప్పుడు మిగిలిన అన్ని ఆధారిత వర్గాలు కూడా ఆ ప్రతికూల ప్రభావాన్ని అనుభవించాల్సిందే. ఈ విధమైన అనుబంధం వలనే ఒక వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పు రైతులూ, రైతు కూలీలు, వడ్రంగులు, కమ్మరులు, వారి ఆధారిత వర్గాల వారు కూడా ఉపాధిని కోల్పోవడం జరుగుతుంది.

అభివృద్ధి, సాంకేతికత అనేది దేశానికి చాలా అవసరం. మారుతున్న ప్రపంచంతో మార్పును ఆహ్వానించడం అత్యావశ్యకం, కానీ ఆ మార్పు వలన అన్ని వర్గాల వారికీ మేలు జరిగేలా ఉండాలి. అప్పుడే దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తుంది. అలా కానప్పుడు ఎంత అభివృద్ధి జరిగితే ఏం లాభం పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయి, ఆర్థిక, సామాజిక అంతరాలు సమాజంలో ప్రతిబింబించి నప్పుడు ఆ సమాజం యిప్పటికీ సంపూర్ణమైన అభివృద్ధిని సాధించినట్లే భావించవచ్చు. ఈ కథ ద్వారా రచయిత అభివృద్ధి పేరుతో అన్ని వర్గాల వారు దోచుకు తినే దోపిడీ విధానాన్ని బహిర్గతం చేస్తూ గ్రామీణుల ఉపాధిని గాలి కొదిలేసిన ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని సున్నితంగా విమర్శిం చారు. యజ్ఞం కథ ద్వారా అభివృద్ధి అనే మహాయజ్ఞంలో ఉపాధి కోల్పోయి సమిధలై కాలుతున్న శ్రమ జీవుల్ని వారికి తెలియకుండానే వారు ఏవిధంగా దోపిడీకి మోసానికి గురవుతున్నారో ఈ కథ ద్వారా తెలియజేసారు కారా మాష్టారు. మరీ ముఖ్యంగా ఈ కథలో మాష్టారు గారు వాడిన భాష ఉత్తరాంధ్ర మాండలికానికే వన్నె తెచ్చింది. కథాకథనంలో పాత్రోచితమైన భాషను ప్రవేశపెట్టి, సామాన్య కూలీల సరళమైన భాషలోనే వారి ఆవేదనను, ఆ కాలంనాటి పరిస్థితులను, రైతు కూలీల సమస్యలను తెలియజేసారు.

**ఆధారగ్రంథాలు :**

1) యజ్ఞం - కాళీపట్నం రామారావు
2) కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3) అంతర్జాల సమాచారం.

❖❖❖

# దాహం తీరని 'ఆర్తి'

**- ఎస్. లలిత,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూర్, మంచిర్యాల

కారా మాస్టారుగా పిలుచుకునే కాళీపట్నం రామారావు గారు తెలుగు కథకులలో సుప్రసిద్ధులు. కథలకు చిరునామ అంటే కాళీపట్నం రామారావుగారి కథా నిలయమే మనకు గుర్తొస్తుంది. కాళీపట్నం రామారావు గారు కథానిలయాన్ని 1997లో శ్రీకాకుళంలో స్థాపించారు. రచయితల కథలన్నీ వారి కథానిలయంలో భద్రపరచ బడ్డాయి. తన స్వంత ఖర్చులతో కథానిలయం ఏర్పాటు చేశారు. ఆ కథలన్నీ భావితరాల పరిశోధకులకు ఉప యోగపడాలనే లక్ష్యంతో కథలన్నీ సేకరించి, వాటికి సాంకేతికతను జోడించి, పాఠకులకు అందుబాటులోకి తీసుకురావటంలో, కథానిలయాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కారాగారి కృషి ఎంతో ఉంది.

కథానిలయం నిర్వాహకుడిగానే కాకుండా ఒక మంచి కథకుడిగా విమర్శకుడిగా తనదైన శైలితో పాఠకుల హృదయాలను చూరగొన్నారు. కారాగారు 1924 నవంబర్ 9న శ్రీకాకుళం జిల్లా మురపాకలో జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డారు. ప్రవృత్తి రీత్యా రచనలు చేస్తూ సాహిత్యరంగంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. సమకాలీన సమస్యలపై స్పందిస్తూ సాహితీ సృజనను గావిస్తున్న వారిలో కాళీపట్నం రామారావుగారిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

కాళీపట్నం రామారావు గారి కథల్లో వారిచ్చే ముగింపు కావచ్చు, పరిష్కారం కావచ్చు, అవి ప్రత్యక్షంగా వ్యక్తపర్చరు. అవి పాఠకుల వివేచనకే వదిలివేస్తారు. ఆయన కథలు పాఠకుల్ని సూటిగా ప్రశ్నిస్తాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కుని, మన అంతరాత్మకు సమాధానం ఇచ్చేలా తర్కానికి గురిచేసేలా కాళీపట్నం రామారావు గారి కథలు ఉంటాయి. సమాజంలోని లోపాలను వ్యంగంగా దెప్పి పొడుస్తూ బలమైన అస్త్రాల్ని సంధించేలా వారి కథా రచన కొనసాగుతుంది. కాళీపట్నం రామారావు గారి కథలు మానవ జీవితాల్లోని విభిన్న కోణాల్ని ఆవిష్కరిస్తాయి.

సమాజంలోని స్వరూప స్వభావాలను ఆకలింపు చేసుకున్న వ్యక్తి. తక్కువగా రచనలు చేసినా, సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించే రచనలే చేస్తారు. కథలు సరళంగా ఉంటాయి. కథల్లో అంతర్లీనంగా రచయిత దృక్కోణాన్ని, వ్యాఖ్యానాన్ని, తాత్వికమైన కోణంతో జోడించి చెప్పే ప్రయత్నం చేస్తారు.

కాళీపట్నం రామారావుగారు రాసిన కథల్లో వీరికి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువచ్చింది "యజ్ఞం కథ". ఈ కథలో దోపిడి పూరిత సమాజ స్వభావాల్ని రచయిత నిష్పక్షపాతంగా ఎండగట్టాడు. ఈ కథకు కాళీపట్నం రామారావు గారికి 1996లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. కాళిపట్నం రామారావుగారి 'ఆర్తి' కథను సమీక్షించి, విశ్లేషించి కథా గమనంలోని సామాజిక ప్రయోజనాన్ని చర్చిస్తే, 'ఆర్తి' కథ శీర్షికను బట్టే ఆర్తి అంటే దుఃఖం, బాధ అనే అర్థాలున్నాయి. ఈ కథలో 'ఆర్తి' అనే మానసిక సంవేదనని నిశితంతా పరిశీలిస్తే ఏ పాత్ర పక్షం వహించి చూసినా ఆ పాత్ర దృక్కోణంలో ఆయా పాత్రలు పడుతున్న యాతనే సరైనదని, అదే 'ఆర్తి' అని పాఠకులకు అనిపిస్తుంది. కానీ శీర్షిక కంటే బలమైన, లోతైన విశ్లేషణలతో కూడిన మానవీయతను మేల్కొలిపే నైతిక అంశాలెన్నో ఈ కథలో ప్రస్ఫుటమవుతాయి. ఆయా అంశాలే కథా చర్చకు వచ్చి సామాజిక ప్రయోజనాన్ని సాధించేవి. పాఠకుల వ్యక్తిత్వ వికాసంపై గాఢమైన ముద్రను వేసేవి.

రచయిత 'ఆర్తి' కథలో దళితుల జీవన నేపథ్యాన్ని తీసుకొని సహజమైన వాస్తవిక దృక్కోణంలో ఆవిష్క

రించారు. మాలపేటను సంఘటన స్థలంగా ఎన్నుకొని దళితుల జీవన వ్యథలను, వాళ్ళ ఆహార్యాన్ని, వారి ఆలోచనా సరళిని రచయిత ఒడిసిపట్టుకున్నాడు. ముఖ్యంగా రచయిత మనల్ని మాలపేటకు తీసుకెళ్ళాడా అనే విధంగా అక్కడి పరిస్థితులు, ఆయా పాత్రలతో మనల్ని తాధాత్మ్యం చెందిస్తాడు. కథలోని పాత్రల మనోభావాల్ని వాటి మానసిక ప్రవృత్తులను ఎంతో లోతుగా ఆయా పాత్రల సంభాషణల్లోనే మనకు విశద పరుస్తాడు.

రచయిత కథను ఎన్నుకున్న సంఘటన స్థలం మాలపేట అంటే రచయితది కళింగాంధ్రం అయిన శ్రీకాకుళం ప్రాంతం కావడం, ఆ ప్రాంతం ఒరిస్సా రాష్ట్ర సరిహద్దుల్లో ఉండటం వల్ల కొన్ని ఒరియా పదాలు కూడా శ్రీకాకుళం వారి కళింగాంధ్ర మాండలిక యాసలో చేరాయి. ఒరియా పదాలతో కూడిన ప్రత్యేకమైన యాసను ఉపయోగించడం ద్వారా కథ అంతా చాలా సహజంగా అనిపిస్తుంది. ఈ యాసే పాఠకుల్ని కాళీపట్నం రామారావు గారి రచనల్ని చదివించేలా చేస్తుంది.

కథావస్తువు: పైడయ్య, సన్ని భార్యాభర్తలు. ఇరు వర్గాల కుటుంబ కలహాలవల్ల, భార్యాభర్తల బంధం ఎడబాసే స్థితికి వస్తుంది. ఇరువర్గాలు సన్ని తల్లి (ఎర్రమ్మ), పైడయ్య తల్లి (బంగారి) ఈ ఇద్దరి వియ్యపు రాళ్ల మధ్య ఏర్పడిన తగాద భార్యాభర్తల బంధాన్ని విడదీసే పరిస్థితుల్ని తీసుకువస్తుంది. పైడయ్య పట్టణంలో రోజువారి కూలీగా జీవనం సాగిస్తూ నెలకోసారి ఇంటికి వస్తూ ఉంటాడు. పుట్టింట్లో బతుకు వెళ్లదీస్తున్న భార్య సన్నిని, తన ఇంటికి తీసుకువెళ్లలేని నిస్సహాయ స్థితిలో ఉంటాడు. పెద్దావిడ అయిన నరసమ్మ ద్వారా రాయబారం నెరిపిన, సన్ని తన ఆత్మాభిమానాన్ని వదులుకుని భర్త పైడయ్యతో వెళ్లడానికి నిరాకరిస్తుంది. ఊరి పెద్ద అసిర్నాయుడు గారి తీర్పు ద్వారా వియ్యపురాళ్ళ తగాదా పరిష్కరించబడి, భార్య భర్తల బంధం నిలిపేలా తీర్పునిస్తాడు. ఆ బంధం తాత్కాలికమా? శాశ్వతమా? అనే సంశయాలతో కథ ముగుస్తుంది.

"ఆర్తి" కథానేపథ్యం భార్యా భర్తల బంధంగానే కనిపిస్తున్న కూలంకషంగా పరిశీలిస్తే, ఎన్నో సామాజిక, ఆర్థిక, రాజకీయ, మానవీయ కోణాలు ఆవిష్కరించ బడ్డాయి. ఎర్రమ్మ తన కూతురు సన్నిని పండగకు ముందు, అత్త బంగారి ఇంటికి పంపడానికి నిరాకరి స్తుంది. కారణం పండగకు ముందు రోజుల్లో చేతుల నిండా పని, కూలి దొరుకుతుంది అనే ఆశతో, తన కుటుంబానికి, కొన్ని రోజులైనా ఆకలి, దప్పుల బాధ లేకుండా చూసుకునేందుకు, తన కూతురు సన్నిని, కుటుంబానికి ఆసరా చేసుకోవాలనుకుంటుంది. బంగారి తన కోడలు సన్నీని పండగ తర్వాత పుట్టింటికి పంపిస్తానని అని అనడంలో కూడా అంతస్సూత్రంగా ఆకలి సమస్యను కొంతవరకైనా అధిగమించవచ్చునన్న ముందు చూపుతోనే. ఈ ఇద్దరి వియ్యపురాళ్ల ప్రధాన సమస్య ఆర్థికాంశమే. తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవాలనే ఆరాటమే ఈ ఇద్దరిలోనూ కన్పిస్తుంది. మానవుని జీవితంలో ప్రధాన సమస్య ఆకలి. తమ ఆకలి తీర్చు కోవటం కోసం ఒక్కోసారి ధర్మం, అధర్మం, నీతి, న్యాయం అనే విచక్షణ జ్ఞానాన్ని మర్చి, తమ ఆకలి తీర్చుకోవటం కోసం అనేక మార్గాలను ఎంచుకుంటారు. ఆ ఆకలి అనే సమస్యే వియ్యపురాళ్లు కొట్లాడుకునే పరిస్థితుల్ని కలిగించింది.

ప్రపంచీకరణ ప్రభావంవల్ల ఉన్న ఊరు, కన్న తల్లిదండ్రులను విడిచి ఎన్నో ఆశలతో, పైపై మెరుగులు చూసి, తాను జీవిస్తున్న జీవితం కంటే మెరుగైన జీవితాన్ని అనుభవించాలని, అత్యాశతో పట్నాలకు వలస వెళ్లిన వారి జీవితాలు ఎంతటి దుర్భర స్థితిగతులను అనుభ వించవలసి వస్తుందో? తెలియ చేస్తూ, రచయిత పైడయ్య పాత్ర ద్వారా ఆవిష్కరించారు.

"నన్నడిగితే తిండినేక ఏ గడ్డో కరిసి చావడం మెరుగు. పేనాలు ఒక్క పాలికి పోతాయి" (పుట, 11). రామయ్య పట్నం వెళ్ళినప్పుడు అక్కడ పైడయ్య ఎంతటి దుర్భర పరిస్థితుల్లో బతుకు వెళ్లదీస్తున్నాడో? రామయ్య అన్న

మాటల్లో మనకు అవగతమవుతుంది. పైడయ్య భార్య పొందుకోసం న్యాయమైన మార్గాన్ని అనుసరించక, తప్పుడు మార్గంలో భార్యను లొంగదీసుకోవాలను కుంటాడు. అందుకు పెద్దమ్మ నరసమ్మను మధ్య వర్తిత్వానికి పంపినప్పుడు సన్నీ మాటల్లో, ఆమె వ్యక్తిత్వం, ఆత్మాభిమానం వ్యక్తీకరించబడతాయి. సాధారణ స్త్రీలాగా ఆలోచించకుండా, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన స్త్రీ మూర్తిలా ఆమె ఆలోచనా సరళి కన్పిస్తుంది.

"అదే ఉద్దేశమైతే నానసనెల్లను. నాకు నా యమ్మ ,బాబు, నా తోడబుట్టువు ఎంతో, ఆ వంక మనుషులు ఆడికి అంత. వొళ్లెరబెట్టి అన్ని తెచ్చుకోవడమైతే నా సేత గాదు" అంటుంది. (పుట, 6) పై సంఘటన ద్వారా సన్నీ మాటల్లో ఆంతర్యం మనకు తెలుస్తుంది. పుట్టిల్లు అంటే తనకు ఎంత గౌరవం ఉంటుందో, భర్త పైడయ్యకు కూడా తన కుటుంబం అంటే అంతే గౌరవం, ప్రేమ ఉండాలంటుంది. పుట్టింటిని, అత్తింటిని గౌరవించే స్త్రీగా సన్ని కన్పిస్తుంది.

"కడుపుకుండి మనిషి దొంగతనం సెయ్యరాదు. కట్టుకున్న పెనిమిటో, వొళ్ళెరబెట్టి వుండి కాని పని సెయ్యడం తప్పు" (పుట, 13). పైడయ్య భార్య పొందుకోసం చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టడంతో రామయ్య కోడలిపై ఆశపడి ఆమెను బలవంతంగా చేయబోయిన సందర్భంలో, రామయ్య కోడలు... ఆకలి తీర్చుకోవడం కోసం దొంగతనం చేయటం తప్పు కాదు. అన్నీ ఉండి తప్పుడు మార్గంలో వెళ్ళాలి అనుకోవడం తప్పు అంటూ పైడయ్యలో పాతుకుపోయిన అనాగరికపు చర్యలకు తన మాటల ద్వారా అడ్డుకట్టవేసి, మనిషికి కొన్ని విలువలు, సంస్కారం ఉండాలని తెలియజేసింది. జీవిత సత్యాలను బోధించింది. ఊరి పెద్దయిన అసిర్నాయుడు వియ్యపురాళ్ళ కొట్లాటకు తీర్పు చెప్పి, పైడయ్య, సన్నీని కలిసి ఉండమని చెబుతాడు. పేదరికంలో మగ్గుతున్న ఎర్రమ్మకి నచ్చచెప్పి, వియ్యపు రాలు బంగారితో కలుపుగోలుగా ఉంటే కలిగే ప్రయోజనాలు చెబుతూ సయోధ్య కుదుర్చుతాడు.

అసిర్నాయుడు తీర్పు చెప్పడం ఆ తీర్పులో కూడా ఒక ఆర్థిక సూత్రం అంతర్లీనంగా కనిపిస్తుంది. పేదరికాన్ని అనుభవిస్తున్న ఎర్రమ్మ, బంగారితో స్నేహపూర్వకంగా ఉన్నట్లయితే, కొంతవరకైనా తమ ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్న ఆశను ఎర్రమ్మలో కలిగించడం. ఆర్తి కథలో కథ నడిచిన తీరు, కథను రచయిత నడిపించిన తీరు విలక్షణం. ఈ కథలో కథ చదువుతున్న పాఠకుడికి, కథా ప్రారంభంలో, వియ్యపురాళ్ళ అహానికి సంబంధించిన కథా వస్తువు అయ్యుంటుందనే ఆలోచనని, రచయిత పాఠకులలో కలిగిస్తాడు.

"ఎంగిలాకుల కోసం వీధి కుక్కలు ఎందుకు కొట్టుకు చస్తాయో? విస్తాళ్ళల్లో భోజనం చేసిన వారికి అర్థం కాకపోవచ్చు. ఏడాదిపాటు పేగులు మాడితే ఎవరికైనా అందులో నీతి కన్పిస్తుంది". (పుట, 8) అంటూ రచయిత కథలో తన వ్యాఖ్యానాన్ని జోడిస్తూ, లోతైన విశ్లేషణతో కూడిన సత్యాన్ని ఆవిష్కరించే క్రమంలో, ఎన్నుకున్న వాక్య నిర్మాణ శైలి కథా వస్తువుకి కీలకం. ఆయువుపట్టు అని చెప్పవచ్చు. రచయిత కాళీపట్నం రామారావుగారు ఆ ఒక్క వాక్యం ద్వారా కేవలం ఆకలి అనే సమస్యనే ప్రస్తావించ లేదు. జీవితంలో అన్నీ సంపూర్ణంగా లభించిన మానవునికి వాటి విలువ తెలియదు. ఏవైనా కొరవడినప్పుడే వాటి విలువ తెలుస్తుందని, ఆయా సమస్యల్లోని సారాన్ని పూర్తిగా అవగతం చేసుకోగలరనే వాస్తవాన్ని రచయిత తెలియజేశారు. రచయిత ఏదో కొత్తగా చెప్పబోతున్నారు అనే ఉత్కంఠతను పాఠకుల్లో కలిగిస్తూ, కథను ఆసాంతం చదివేలా రచయిత కథను మలచిన తీరు ఆకట్టుకుంది.

'ఆర్తి' కథలో పైడయ్య, సన్నిలు కలిసి పోవటాన్నే రచయిత కథా ముగింపుగా ఇచ్చారు. అసిర్నాయుడు ఇచ్చిన తీర్పుతో భార్య భర్తలు కలిసి ఉండవలసిన పరిస్థితి వచ్చింది. కానీ నిజంగా మనస్ఫూర్తిగా పైడయ్య సన్నీతో కలిసి కాపురం చేస్తాడా? పైడయ్యలో మోచేతికూడు అనే భావన కలిగింది. అంటే భార్యభర్తల బంధం బలపడ డానికి ఒకరి దగ్గర తలొగ్గాల్సిన పరిస్థితులు వచ్చాయి.

తన చొరవతోనో, నేర్పుతోనో భార్యను కాపురానికి తీసుకురాలేకపోయాను అనే భావన పైడయ్యలో చోటు చేసుకుంది. అంటే పైడయ్యలో కలిగిన తర్కం సరైనదేనా? పైడయ్యలో మానసిక పరిపక్వత కలిగిందా? అంటూ ప్రశ్నలు సంధిస్తూ దళితుల జీవితాల్లో మార్పు రావాలని తమకు తామై ఆలోచించి సరియైన నిర్ణయాలు తీసుకోగలగాలని రచయిత ఆకాంక్షించారు. దళితుల్లో సామాజిక స్పృహను కలిగించేలా రచయిత అనేక కోణాల్ని చర్చిస్తూ వాటి ద్వారా నైతిక విలువలను పెంపొందించేలా నీతి మార్గాన్ని అనుసరించేలా కథను నడిపించారు.

**ఆధార గ్రంథాలు :**

1. రామారావు కాళీపట్నం, కథానిలయం వెబ్‌సైట్: ఆర్తి కథ.
2. వెంకట సుబ్బయ్య వల్లంపాటి, కథా శిల్పం, ప్రథమ ముద్రణ: జనవరి 1994, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్.
3. వెంకట సుబ్బయ్య వల్లంపాటి, నవలా శిల్పం, 1996, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్.
4. దక్షిణామూర్తి పోరంకి, కథానిక స్వరూప స్వభావాలు, ప్రథమ ముద్రణ:1988, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్.

❖❖❖

# "యజ్ఞం కథ - అప్పలరాముడు పాత్ర వైశిష్ట్యం"

**- షేక్ షానాజ్ బేగం,** తెలుగు అధ్యాపకురాలు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు, ప్రకాశం జిల్లా.

కారా మాస్టారుగా సుప్రసిద్ధులైన ''కాళీపట్నం రామారావు'' 1924, నవంబర్ 9 న శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలానికి చెందిన మురపాక లో భ్రమ రాంబ, పేర్రాజు దంపతులకు జన్మించారు. శ్రీకాకుళంలో ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదివాడు. భీమిలిలో సెకెండరి గ్రేడ్ ట్రైనింగ్ స్కూలులో ఉపాధ్యాయ శిక్షణ పొందాడు.1948 నుండి 31 ఏళ్ళు ఒకే ఆంథోనీ ఎయిడెడ్ హైస్కూల్‌లో ఒకేస్థాయిలో ఉద్యోగము చేసారు. అతను 1979లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పదవీవిరమణ చేసిన రచయిత, కథకులు, పురుషులందు పుణ్య పురుషులు వేరయా ! కథకుల్లో గొప్పకథకులు వేరయా అంటారు కొడవటిగంటి కుటుంబరావు. సాహిత్యంలో మంచి కథకులు గా పేరు తెచ్చుకున్న వారిలో రావిశాస్త్రి, బీనాదేవి ల తర్వాతి స్థానం కాళీపట్నం రామారావుకే దక్కుతుంది.

ఈయన సాహిత్యంలో తెలుగు కథకు శాశ్వతత్వాన్ని చేకూర్చే దిశగా విశేషకృషి చేశారు. ఆంధ్రభూమి దినపత్రికలో 'నేటి కథ' శీర్షికను నిర్వహించి క్రొత్త రచయితలకు అవకాశమిచ్చారు. ఆరు దశాబ్దాలుగా కారా మాష్టారి కథలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. తన నిజజీవితంలో అనుభవించిన, పరిశీలించిన కష్టాలను, సంఘర్షణను ఆయన తన కథలలో ఇమిడ్చాడు. సమాజంలో అట్టడుగు వర్గాల జీవన సమరాన్ని సునిశితంగా పరిశీలించి తన పాత్రలలో చూపారు.

ఈయన శ్రీకాకుళంలో ప్రారంభించిన కథా నిలయం, తెలుగు కథల సేకరణకు అంకితమైన ఒక గ్రంథాలయం. ప్రఖ్యాత కథకుడు కాళీపట్నం రామారావు తనకి వచ్చిన పురస్కారాన్నంతటినీ వెచ్చించి శ్రీకాకుళంలో ఫిబ్రవరి 22, 1997 సంవత్సరంలో ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. తెలుగులో రాయబడ్డ ప్రతి కథనీ ఈ గ్రంథాలయంలో భద్రపరచాలని స్థాపకుల ఆకాంక్ష.ఈ కథానిలయంలో దొరకని కథ అంటూ ఉండదని, రెండస్తుల భవనంలో ఎక్కడెక్కడి కథలన్నీ పొందుపరచబడి ఉంటాయి. 1997లో ఆరంభమైన ఈ ''కథా నిలయం''లో (2000 నాటికి) 4,000పైగా వారపత్రికలు, మాస పత్రికలు, విశేష పత్రికలు ఉన్నాయంటే ఈయన చేసిన విశేష కృషికి నిదర్శనం.

### సంక్షిప్తంగా కథ :

దశాబ్దాల క్రింద తాను మధ్యవయస్కుడుగా ఉన్నప్పుడు, గోపన్న వర్తకునిగా ఎదిగి స్థిరపడక పూర్వం, అప్పల్రాముడు తన వ్యవసాయ పంటలను అప్పుడే దళారి వ్యాపారిగా జీవితం ప్రారంభించిన గోపన్నకు ఆయన చెప్పిన ధరలకు మారుమాట్లాడకుండా అమ్ముతుండే వాడు. అయిదారు సంవత్సరాలలోనే గోపన్న అంచె లంచెలుగా ఎదిగాడు. అప్పల్రాముడి ఆర్థిక పరిస్థితి మాత్రం క్రమక్రమంగా దిగజారింది. గోపన్న దగ్గర తీసుకున్న కొద్ది అప్పు తడిసి మోపెడయింది. తనకున్న పొలం క్రమక్రమంగా తరిగిపోయి ఇప్పుడు కాసింత మాత్రమే మిగిలింది. గోపన్న అప్పు తీర్చాలంటే ఆ కాసింత అమ్మాలి. అది అమ్మితే తనకు, తన కొడుకులకు, మనవలకు బువ్వ లేనట్లే. బానిస బతుకులు బతకాలి. గోపన్న పరిస్థితి కూడా పెద్ద వర్తకుల పోటీ తట్టుకోలేక పోవటం వలన చితికిపోయింది.

ఇప్పుడు పంచాయితీలో తేల్చవలసిన విషయాలు ఒకటి - అది అప్పా, కాదా? రెండు - దానిలో ధర్మమెంత, అధర్మమెంత? మూడు - తీర్చవలసి వస్తే ఎంత ఇస్తే సరిపోతుంది?

శ్రీరాములునాయుడు ఊరిలో పెద్ద మనిషి. ఊర్లో వారి తగాదాలు అతనే పరిష్కరించేది. శ్రీరాములు నాయుడు ఎంతో గుంజాటనకు లోనై ఇది అప్పే అని తీర్పు చెప్పాడు. అప్పల్రాముడికి కోపం వచ్చింది. అయినా కోపం దిగమింగుకుని ఆయన తీర్పులోని అసంగతాన్ని వివరించాడు. ఆ 'కాసింత నేల' అమ్మి అప్పు తీరుస్తా నన్నాడు. కానీ, అప్పల్రాముడి రెండవ కొడుకు సీతా రాముడికి ఇది ససేమిరా ఇష్టం లేదు. బ్రతికినంతకాలం చాకిరీ చేసి గోపన్న అప్పు తీరుస్తాను కానీ, నోటికాడి ఆ కాసింత పొలం అమ్మటానికి వీలు లేదన్నాడు. అమ్మితే తండ్రిని చంపి తానూ చస్తానన్నాడు. అయినా అప్ప ల్రాముడు తన మాటకు కట్టుబడి, శ్రీరాములు నుద్దేశించి ఇలా అంటాడు. అయ్యా నేను చెప్పిన మాటలను విన్న తర్వాత నాది అప్పే అని తమరు ఒప్పుకుంటే వేలి ముద్రలు వేయిస్తానన్నాడు. అమ్మకం పత్రం మీద నిశానీ పెట్టి, కొడుకుల చేత, మనవళ్ళ చేత నిశానీ వేయించాడు. సీతారాముడి కళ్ళు చంద్రనిప్పు లయ్యాయి. ఇంటివైపు పరిగెత్తాడు. జనంలో కలకలం పెరిగింది. సీతారాముడికి తనకున్న ఒక్కగానొక్క కొడుకు కంబారీగా ఉండటం ఇష్టం లేక, ఆ చిన్నవాడ్ని నరికి గోతంలో వేసుకుని ధర్మ మండపం ముందు దభాలున పడవేశాడు. ఈ అకృత్యంతో కథ ముగుస్తుంది.

## యజ్ఞం కథలో అప్పల్రాముడి పాత్రచిత్రణ :

యజ్ఞం కథలు అప్పల రాముడి పాత్ర కీలకమైంది ఇతని వయస్సు 70 సంవత్సరాలు, నమ్మకస్తుడు అనే అభిప్రాయం ఊర్లో అందరికీ ఉంది. ఈ కథ 1964 ప్రాంతానిది కాబట్టి ఆనాటి స్థితిగతులు ఇందులో అద్భుతంగా చిత్రీకరించారు కాళీపట్నంగారు. అప్పల్రాముడు హరిజన పెద్ద. ఊరిలోని ప్రతి ఒక్కరూ అతడిని మంచివాడని, నీతి తప్పని వాడని గౌరవాభి మానాలు కల్గిన వ్యక్తి అని పేరున్నవాడు. ఆ గ్రామానికి పెద్ద శ్రీరాములునాయుడు. ఇతని ప్రోత్సాహం వల్లనే సుందరపాలెం చాలా అభివృద్ధి చెందిందని, పేదల పక్షం వహించిన గొప్పవ్యక్తి అనే భావన అందరి నోళ్ళల్లోనూ ఉంటుంది, అప్పల్రాముడు నోరు తెరిచి మాటలాడేదాక అందరి అభిప్రాయం ఇదే. కథ ఉద్దేశం తమకు జరిగిన దోపిడిని తెలియజేసే పాత్ర అప్పల్రాముడిదే. తాము దోపిడీకి గురి అయిన విధానాన్ని వివరించి అందరిలో ఆలోచనలు రేకెత్తించే పాత్ర అప్పలరాముడిదే. ఒకనాటి భూస్వామ్య వ్యవస్థలో రైతుల జీవితాలు చితికిపోయిన విధానాన్ని బూర్జువా వ్యవస్థలో భూస్వాములు అభివృద్ధిని గురించి ధైర్యంగా ప్రశ్నించింది నిలదీసిందీ అప్పల రాముడే. అప్పలరాముడు నోరు తెరవకుండా ఉంటే కథకు అర్థం ఉండేది కాదు. యజ్ఞం కథలో అప్పల్రాముడు కీలక పాత్రధారి. మూడేళ్ల క్రితం తాను గోపన్న అనే షావుకారు వద్ద అప్పు పడ్డాడు. అప్పు తీర్చడానికి ఊరి పెద్ద అయిన శ్రీరాములు జోక్యంతో మూడేళ్ల గడువు ఇప్పించినా తీర్చలేకపోయాడు. ఆ ఊరిలో శ్రీరాములు న్యాయ మండపాన్ని ఏర్పాటు చేశాడు. అందుకే ఆ ఊరి సమస్యలు దేవాలయం దగ్గర పరిష్కరించే విధంగా పటిష్టమైన న్యాయవ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఈ మండపంలో న్యాయం జరకకుంటే అప్పుడు ఈ మండపాన్ని కూల్చివేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు శ్రీరాములు. విచారణలో అప్పలనాయుడు నోరు విప్పలేదు. ఇంక చర్చ అనవసరం అనుకున్న శ్రీరాములు అది అప్పే అని తీర్పు ఇస్తాడు. ఈ మాటల విన్న తర్వాత అప్పల్రాముడు హృదయం ఆవేశంతో రగిలిపోయాడు. శ్రీరాములు న్యాయం చేస్తాడని అది అప్పు కాదని తీర్పు ఇస్తాడని ఆశించాడు. కానీ శ్రీరాములు అలా చేయకుండా అది అప్పేనని, అతను తీర్చకుంటే తాను తీరుస్తానని అంటాడు ప్రజల మెప్పుకోసం. నాయుడిని వెళ్ళమని చెప్తే వెంటనే అప్పలరాముడు ఆవేశంతో ఊగి పోయాడు. శ్రీరాములు రాక ముందు సుందరపాలెం గ్రామంలో తమ జీవితాలు ఎలా ఉన్నాయో కళ్ళకు కట్టినట్లు చెప్తాడు అప్పల రాముడు.

ఒకనాటి సుందరపాలెం చుట్టుపక్కల 15గ్రామాలకు పెద్దగా ఉండేదని, చుట్టుపక్కల ఊరి వారికి ఏమి

కావాల్సివచ్చినా సుందరపాలెం వచ్చేవారని, తామంతా తిండికి బట్టకు ఇబ్బందులు లేకుండా జీవించామని ఆ గ్రామాల్లో స్త్రీలు లక్ష్మీదేవుల్లా నగలు ధరించి కళకళ లాడుతూ ఉండేవారని, మాలపల్లెలో స్త్రీలు బంగారం కాకున్నా వెండి ఆభరణాలతో మెరిసేపోయేవారని, ఇప్పుడన్ని కరిగి బూర్జువా వ్యవస్థలో మాడి మసి అయ్యాయని చెప్తాడు.

తమకు ఇలాంటి పరిస్థితి రావడానికి కారణం శ్రీరాములు అని గట్టిగా నొక్కి చెప్తాడు అప్పలరాముడు. మాలమాదిగలు కష్టించి పనిచేసుకునేవారని, ఒకరి సొమ్ము తీసుకోవడం తెలియదని అందరూ కాస్తో కూస్తో భూములను కలిగి కూటికి, గూటికి ఇబ్బంది లేకుండా ఉండేవారని, అందరూ కష్టపడి బ్రతికేవారని చెప్తూ, గంగయ్య అనే దేశదిమ్మరి పొగాకు పంటను ఈ గ్రామానికి పరిచయం చేశాడని ఊర్లో షావుకారులు ఆ పంటవైపు మొగ్గు చూపించి దిగుమతి చేసేవారని, ఆ క్రమంలోనే వేరుశనగ పంటను తీసుకొచ్చారని, పొగాకుస వేరుశనగంటే ప్రజలు భయపడుతుంటే షావుకార్లు పేదవాళ్లను నచ్చజెప్పి ఆ పంటలు పండింపజేశారని, తమకాలంలో డబ్బు చెలామణిలో లేదని వస్తుమార్పిడి పద్ధతి అమలులో ఉండేదని, పన్నులు సైతం పంట గింజలతో చెల్లించేవారమని, ఆరోజుల్లో షావుకార్లే పంట రేటు ఇంత అంటే తీసుకోవడమే తప్ప ఎదురుతిరిగి ప్రశ్నించిందే లేదని, ఇలా షావుకార్లు ఎంత తిన్నా రైతులకు కొంత గిట్టుబాటు ఉండేదని చెప్తాడు. తర్వాత వారిలో స్వార్థం పెరగడం కారణంగా ఏది పండిస్తే దాని ధర తగ్గడం, ఏది పండించకుంటే దాని ధర పెరగడంతో షావుకారులు రైతులను దోపిడి చేసి దిగజార్చారని, పదేండ్లు తిరిగేసరికి ఆగ్రామంలోని స్త్రీల నగలన్నీ భూస్వాముల భార్యల మెడల్లోకి చేరాయని, అప్ప లాముడు తన పతనం గురించి చెప్తూ వస్త్ర వ్యాపారి అయిన గోపన్న అప్పుడే దళారిగా మారి వ్యాపారం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతున్న సమయంలో తనపొలం బాగా పండటం చూసి ఈ పంటంతా తనకు అమ్మమన్నాడు. అప్పటినుండి అతను ఎదగడం, తాను దిగజారడం మొదలైందని తాను పండించిన పంట గోపన్నకు తప్ప ఎవరికీ అమ్మలేదని, అతనితో వ్యాపారం చేస్తూన్నప్పుడు అప్పుడు అరెకరం అప్పుడు ఒక ఎకరం అమ్ముకుంటూ చివరికి రెండెకరాల మడి చెక్క మిగిలింది. ఇంతవరకు నా పొలంలో వచ్చిన ఆదాయాన్ని తీసుకున్నది ఎవరు? తన తండ్రి తనకిచ్చిన ఆరెకరాల పొలాన్ని తొమ్మిది ఎకరాలు చేశానని, తొమ్మిది ఎకరాల పొలం రెండెకరాలకు వచ్చిందంటే దానికి కారణం ఎవరు అప్పు చేయడానికి కారణం ఎవరు? నిజంగా నేను అప్పు పడ్డానా లేక నాకష్టం గోపన్న దోచుకున్నాడో అది మీరే నిర్ణయించాలి. ఇలా నేనే కాదు ఊరు ఊరంతా అప్పుల ఊబిలో చిక్కుకుపోయాం. ముందు 15 మంది షావుకార్లు వర్తకం చేసేవారు వాళ్ళంతా ఏమయ్యారు? ఇటువంటి పంటలు పండించి అప్పుల ఊబిలో ముందు మేము తర్వాత షావుకార్లు చితికిపోయారు. పన్నులు చెల్లించడం వచ్చాక ముందు వర్తకం చేసినవారు వాళ్ళేరి? ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈ ఊరంతా మిల్లులతో నిండిపోయింది. ఒకరిని ముంచుతూ ఒకరు బాగుపడు తున్నారు. అనాదిగా బలవంతుడు పేదవారిని దోపిడీ చేయడమేనా? ఉన్నవాడు ఉన్నవాడి పక్షాన నిలబడితే ఎలాగా? నువ్వు చేస్తుంది కూడా ఇదే కదా ! ఇది నరుడు తెస్తున్న ముప్పా? నారాయణుడు పెడుతున్న చిక్కా? నువ్వేచెప్పు. 15 ఏండ్ల క్రితం నువ్వు ఈ ఊరిని ఉద్ధరించడానికి వచ్చేటప్పటికి మాబ్రతుకులు ఇవీ.

శ్రీరాములనాయుడు అభివృద్ధి పనులు చేపట్టినపుడు మమ్మల్ని ఉద్ధరించే దేవుడు వచ్చాడనుకున్నారు జనాలు. నీమాట వింటే తమ అప్పులు తీరి ముప్పులు తప్పు తాయని భావించారందరూ. హైస్కూల్ కట్టిస్తే బ్రతుకులు బాగుపడతాయనుకున్నారు జనాలు. కొంతకాలం రాళ్లు మోసి పొట్టనింపుకున్నారు. రోడ్లన్నావు, రెండేండ్లు కూలి చేసుకొని చాలామంది బ్రతికారు. కో-ఆపరేటివ్

గోడౌన్లు అన్నావు. కొంతకాలం రాయి రప్పా మోసుకొని బ్రతికాం. ఇంకా ఈ ఊరికి ఏమి తేలేకపోయావు. మా పొట్టలు గడవడంలేదు, మా భూములు కరిగిపోతున్నాయి. ఒకనాడు పది, పదిహేను మంది ఉండే షావుకార్లు ఇప్పుడెంతమంది ఉన్నారు? వాళ్లంతా అభివృద్ధి అనే ఉచ్చులో ఉరితాడులుగా మారారు. మాలల్లో స్త్రీ పురుషులిద్దరూ కష్టపడినా ఫలితం లేదని తమ కడుపులు నిండడంలేదని భూములు కరిగి పోతున్నాయని ఆవేదనను వ్యక్తం చేస్తాడు. రాత్రి తన కొడుకు సీతా రాముడితో తగాద అయ్యిందని, 30, 35 సంవత్సరాల నుండి మనసొమ్ము షావుకారు తిన్నాడో, షావుకారు సొమ్ము మనమే తిన్నామో, చివరికి ఈ అప్పు తేలింది. నిజం ఏమిటో ఆ దేవుడికే తెలుసు. ఈ భూమిని అమ్మితే తాను చస్తానని, లేక తనను చంపుతానని చెప్పాడు. నువ్వు చెప్పే తీర్పును ముందే ఊహించి నా బిడ్డలను పొలం అమ్ముదామన్నాను. కానీ వాళ్ళు ఒప్పుకోవడం లేదు.

నువ్వు రోడ్లు వేయించడం వలన వాహనాల రాక పోకలు పెరిగి మా బండ్లు తిరగడం ఆగిపోయి 30 కుటుంబాలు వీధిన పడ్డాయి. కరెంటు తెప్పించావు. మోటర్ల ద్వారా నీరు రావడంతో ఏతాలు తోడే కూలి జనం పని పోయింది. రైసుమిల్లు పెట్టించడం వల్ల కూలికి దంచేవారి జీవనాధారం పోయింది. చదువులకోసమని పట్నాలకెళ్ళి ఆ సంస్కృతిని పల్లెలో పెడితే పల్లెలు అభివృద్ధి చెందవు. బహుశా ఈ విషయం తెలిస్తే నువ్వు ఈ పని చేసి ఉండేవాడివి కాదేమో. హైస్కూల్ కట్టించడం వల్ల చుట్టూ ఉన్న భూములకు రెక్కలు వచ్చాయి. ధరలు విపరీతంగా పెరిగిపోయి భూములున్న చుట్టుప్రక్కల వాళ్ళు బాగుపడ్డారు. జీవితమంతా కష్టపడినందుకు మాకు లభించిన బహుమతి ఈ అప్పు. ఇది తప్పు అని ఒక్కరూ అనరు, అనలేరు, అంటే ఊరిలో బ్రతకలేరు. పండిన పంటంతా కామందుల గోడౌన్లలోకి వెళ్ళాలి. వెనుకటి రోజుల్లో కూలివాళ్ళ అవసరం ఉండేది. కూలి అవసరం లేకుండా ఉండాలంటే కరెంటు మిషన్లు కావాలి. అవి నడవాలంటే కరెంట్ కావాలి. రేపు ఊడ్పులకు కోతలకు మిషన్లు వస్తే రైతు ఎలా జీవించాలి? నువ్వు ఎవరికి ఉపకారం చేయాలని ఈ యజ్ఞాన్ని ప్రారంభించావు? అది ఎవరికి మేలు చేస్తుంది? నాబిడ్డలు చాకిరీ చేసి అప్పు తీరుద్దాం అంటున్నారు. కానీ నువ్వుకూడా వాళ్ళ పక్షమే వహించావు. నరుడు తెచ్చిన చిక్కుకు విరుగుడు ఉంటుంది కానీ నారాయణుడు తెచ్చిన చిక్కుకు విరుగుడు ఉండదు. కష్టం తీర్చాల్సిన నాయుడే కష్టానికి కారకుడైతే ఎవరికి చెప్పుకోవాలి? అప్పల్రాముడు వెంటనే పొలం అమ్మి సంతకాలు చేస్తుండగా సీతా రాముడు తనకొడుకు బానిసగా బ్రతకడం ఇష్టం లేక మూడేండ్ల కొడుకును చంపి ఆ ధర్మ మండపం దగ్గర పడవేసి, తండ్రితో నీకు గొప్ప కావాలి. బిడ్డలు ఏమైనా పర్లేదు. అప్పలరాముడు నిజాయితీ పరుడు అని అందరిచేత అనిపించుకోవాలి. నువ్వు బానిస బ్రతుకు బ్రతికావు, నేను అలాగే బ్రతికాను, నా కొడుకు కూడా ఇటువంటి జీవితానికి జీవించవలసిన అవసరం లేదు. ఇటువంటి బానిస బ్రతుకు బ్రతకడం కంటే చావే మంచిది. నువ్వు నన్ను చూసినట్లుగా నా బిడ్డని బానిసగా నేను చూడలేనని, తిరుగుబాటును ప్రదర్శిస్తాడు సీతారాముడు.

**ముగింపు :**

యజ్ఞం కథలో కారా మాస్టారు గారు తరతరాలుగా జరుగుతున్న దోపిడిని స్వార్థం కోసం పెద్దరికాన్ని ప్రదర్శిస్తూ, ఊరిని ఉద్ధరించామనే పెద్దమనుషులు నిజంగానే ఉద్ధరిస్తున్నారా? లేదా? అనాదిగా భూస్వామ్య వ్యవస్థలో జనాలు తమకున్న ఆస్తిపాస్తులను పోగొట్టుకుంటూనే ఉన్నారు. ఉన్నవాడు పైపైకి పోతుంటే లేనివారు లేమితో బాధపడడం ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాం. ఈ కథలో అప్పల్రాముడు అంతా వివరించాక ఊరి ప్రజల్లో చైతన్యం కలిగి నిజమే కదా అనుకుంటారు కానీ శ్రీరాములనాయుడు ఏమి మాట్లాడడు. తాను చేస్తుంది తప్పు అని తెలిసినా న్యాయం చేయలేని

నిస్సహాయుడు శ్రీరాములు. గొప్పలకుపోయి న్యాయా న్యాయ విచక్షణా జ్ఞానం లేనివాడు. అతని సంకల్పం మంచిదైనా న్యాయమైన తీర్పు ఇవ్వలేకపోతాడు. అప్పలరాముడి కొడుకు సీతారాముడు తన తండ్రిని పొలం అమ్మేదామని బ్రతిమాలతాడు, బెదిరిస్తాడు. అప్పలరాముడు పంచాయితిలో మాట్లాడు తుంటే నోరు మెదపకుండా వింటాడు. ఇంత విన్న తర్వాత కూడా మార్పులేని వ్యవస్థను చూసి మధనపడతాడు. కంబారీలుగా ఉంటూ బానిస బ్రతుకులు ఊహించ డానికి కూడా కష్టంగా, భరించలేనివిగా ఉంటాయి. వెట్టి చాకిరీ చేయించుకొని కూటికి గూటికి బట్టకు కరువై కష్టపడుతూ బ్రతికాడు. సీతారాముడు తన బిడ్డ కష్టపడుతూ జీవించడాన్ని ఊహించలేకపోయాడు. అప్పల్రాముడు కూడా ఏమి జరిగినా "నేను మాట తప్పను, ఇచ్చిన మాటకు కట్టుబడి అప్పు తీరుస్తానని" కుటుంబ సభ్యులు ఎలా జీవిస్తారనే ఆలోచన లేకుండా తన మాటను తాను నెగ్గించుకున్నాడు. యజ్ఞం చేసి ఊరు బాగుజేసి గొప్ప వ్యక్తిగా మారిన యజ్ఞంలో అప్పల్రాముడితో సహా చితికిపోయిన జీవితాలు ఎన్నో. శ్రీరాములు చేసిన యజ్ఞంలో సమిధగా మారింది సీతారాముడి కొడుకు. ఇటువంటి దురాగతాలు నిత్య జీవితంలో కూడా అక్కడక్కడా తారసపడుతూనే ఉన్నాయి. అటువంటి కుటిల రాజకీయ నాయకులు చేసే యజ్ఞాలు ఎవరి కోసం? ధనవంతులకా ? పేద వారికా? ఇది ఆలోచించాల్సిన విషయం. ఈకథలో నరుడు తెచ్చిన ముప్పుకు విరుగుడు ఉంటుంది కానీ నారాయణుడు తెచ్చిన చిక్కుకు పరిష్కారం ఉంటుందా? అనేది ఆలోచించాల్సిన విషయం. దళారి వ్యవస్థ ఉన్నన్నాళ్ళు న్యాయం అందని ద్రాక్షపండే. కథలో అప్పలరాముడు నెమ్మదిగా ఉండి సమస్య గురించి చెప్పాడే తప్ప ఎదురు తిరగలేదు. ఏ నాయకుడైనా ప్రజా ప్రయోజనం నెరవేరుతుందా లేదా అని గమనించి, మార్పుకు శ్రీకారం చుడితే ఆ వ్యవస్థ బాగుపడుతుంది. అదే అప్పలరాముడి ఆశ, శ్వాస.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు
2. అంతర్జాల సమాచారము

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు కథా సాహిత్యానికి దిక్సూచి 'యజ్ఞం'

**- తంగి ఓగేశ్వరరావు,** తెలుగు అధ్యాపకులు, వి.వి.గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప.

కాళీపట్నం రామారావు తెలుగు సాహితీలోకానికి సుప్రసిద్ధమైన పేరు. తన కథలతో బడుగు బలహీన వర్గాల వారి జీవితాలను చిత్రించిన కథకుడు. కథా నిలయం స్థాపించి ఔత్సాహికులైన రచయితలకు, పరిశోధకులకు విలువైన సాహిత్యాన్ని అందించిన సాహితీ కృషీవలుడు. కారా మాస్టర్ అని పిలవబడే కాళీపట్నం రామారావు గారు నవంబర్ 9, 1924న శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం మురపాక గ్రామంలో జన్మించారు. యస్.యస్.యల్.సి. వరకు శ్రీకాకుళంలో చదువు కున్నారు. భీమిలిలోని సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ స్కూల్ నుండి ఉపాధ్యాయ శిక్షణ పొందారు. 1943 - 46 మధ్య నాలుగైదు ఉద్యోగాలు చేసినప్పటికీ ఆయన స్థిరంగా ఇమడగలిగింది ఉపాధ్యాయ వృత్తిలోనే. 1948 నుండి పదవీ విరమణ వరకు విశాఖపట్నంలోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేశారు.

కాళీపట్నం రామారావుగారు 'చిత్రగుప్త' మొదలుకొని పదుల సంఖ్యలో కథలు రచించారు. ఆయన కథలు సమాజంలోని మధ్యతరగతి మరియు అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలను ప్రతిబింబిస్తాయి. తనపై రావిశాస్త్రిగారి ప్రభావం ప్రబలంగా ఉండేదని రామారావుగారు తరచుగా చెప్పుకునేవారు. అదేవిధంగా ప్రఖ్యాత రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌గారు తాను రచయితగా మారడంలో రామారావు గారి స్ఫూర్తి ఎంతగానో ఉందని చెప్పుకుంటారు.

సమాజాన్ని జాగృతం చేసే విధంగా రామారావుగారు రచించిన కథలలో ప్రసిద్ధమైంది 'యజ్ఞం' కథ. 1966లో వచ్చిన ఈ కథ తెలుగు పాఠకుల విశేష మన్ననలు పొందింది. దోపిడి స్వరూప స్వభావాలను నగ్నంగా, సరళంగా, సహజంగా, శాస్త్రీయంగా చిత్రించిన కథ ఇది.

'యజ్ఞం' కథ చదివాక నాకు ఒక్కటే అనిపించింది. కథలు ఎలా రాయాలో అని మథనపడుతున్నవారికి ఈ కథ ఒక ప్రేరణగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. శ్రీకాకుళానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరపాలెం చుట్టూ ఈ 'యజ్ఞం' కథ తిరుగుతంది. ఆ పల్లెటూరితో పాటు అక్కడి వ్యక్తుల మనస్తత్వాలు, జీవనశైలులను ఆ ప్రాంత మాండలీకం లోనే రచయిత వర్ణించడానికి ప్రయత్నించడం వల్ల కథలో ఏదో తెలియని ఒక సహజత్వం కనిపిస్తుంది.

దోపిడి స్వరూప స్వభావాలను ఈ కథ కచ్చితంగా బహిర్గతం చేసింది. ఒక గ్రామ పెద్ద, ఓ దళారి, ఓ దళిత రైతు చుట్టూ ఈ కథ తిరుగుతుంది. గోపన్న అనే దళారి వద్ద అప్పల్రాముడు అనే దళిత రైతు ఎప్పుడో నాలుగు తరాల ముందు కొంత సొమ్ము అప్పుతీసుకుంటాడు. వడ్డీతో ఆ అప్పు పెరిగి కొండంతవుతుంది.

తరతరాల నుండి కొందరు దళారులు చేసే మోసాల వల్ల, వారు వేసే దొంగ వడ్డీల వల్ల రైతుల నడ్డి విరిగిం దనడం నిర్వివాదం. కానీ ఆ తర్వాత కాలంలో ఆర్థిక మాంధ్యం వల్ల దళారి గోపన్న కుటుంబం కూడా బాగా చితికిపోతుంది. ఇలాంటి సమయంలో అప్పల్రాముడి నుండి అప్పుకట్టించడానికి ప్రయత్నిస్తాడు గోపన్న.

ఈ సమస్య ఆ ఊరి పెద్ద శ్రీరాములు నాయుడు వద్దకు వస్తుంది. కానీ వివిధ కారణాల వల్ల నాలుగైదు సార్లు వాయిదా పడుతుంది. ఆ అప్పును తామే చెల్లించేసి, అప్పల్రాముడి కుటుంబంతో వెట్టిచాకిరి చేయించుకోవ డానికి కొందరు పెత్తందార్లు పథకం వేస్తారు. కానీ అప్పల్రాముడు మౌనంగా ఉండడంతో ఎవ్వరూ ఏమీ చేయలేకపోతారు. ఎట్టకేలకు మళ్ళీ నాయుడే తీర్పు చెప్ప వలసిన పరిస్థితి ఏర్పడతుంది. అప్పల్రాముడు గోపన్నకు

అప్పు తీర్చాలా వద్దా? అన్నది మొదటి ప్రశ్న. అయితే దొంగ వడ్డీలతో పెరిగిన అధర్మపు సొమ్ము అప్పు క్రిందకు వస్తుందా? అన్నది అప్పల్రాముడి ప్రశ్న. అయినప్పటికీ వేరే మార్గం లేకపోతే ఆ అప్పు తనకున్న రెండెకరాల ముప్పై సెంట్ల మడి చెక్క అమ్మి తీర్చేయాలనుకుంటాడు. అప్పటికీ తాను కోర్టుకెలితే గెలిచే అవకాశముందని కొందరంటారు కూడా. అయితే చితికిపోయిన గోపన్నకు అప్పుతీర్చకపోతే పాపమంటారు మరికొందరు.

కథలో ముఖ్యంగా ఒకవైపు అప్పల్రాముడి వ్యథను బహిర్గతం చేస్తూనే, జనాల ఆలోచనలు ఎలా ఉం టాయన్న పాయింట్ మీద కూడా కసరత్తు చేశారు రచయిత. తొలుత మౌనంగా ఉండి అప్పు విషయంలో ఏమీ మాట్లాడకుండా ఉన్న అప్పల్రాముడు ఎప్పుడైతే శ్రీరాములు నాయుడు విసిగిపోయి, ఆ అప్పు తానే తీరుస్తానంటాడో అప్పుడు నోరు విప్పుతాడు. తరతరాల నుండి జరుగుతున్న మోసాలను బట్టబయలు చేసి, అందరూ నోళ్ళు వెళ్ళబెట్టేలా చేస్తాడు.

కానీ అదే అప్పల్రాముడు ఆత్మాభిమానంతో తన అప్పుకాని అప్పుని ఎవ్వరూ తీర్చవలసిన అవసరం లేదని, తానే పొలం అమ్మి తీర్చుకుంటానంటాడు. కరణాన్ని పత్రం రాయమంటాడు. కానీ అప్పల్రాముడి చిన్నకొడుకు సీతారాముడు తండ్రికి అడ్డుపడతాడు. తమ కుటుంబాన్ని బానిసత్వంలోనికి నెట్టవద్దని చెబుతాడు. కాని తండ్రి మాట వినకుండా పత్రంపై సంతకం పెట్టడంతో ఆ బానిస బ్రతుకు తనతోనే అంతం కావాలని, తన కొడుకు బానిసగా బ్రతక కూడదని భావిస్తాడు సీతారాముడు. "ఒరేయ్! ఓరె, కొడకా, నువు బానిస బతుకు బతుకుతావా - లేకపోతే సస్తావా?" అని ముక్కుపచ్చలారని కొడుకు నడిగి, వాడు చచ్చిపోతానంటే మారుమాట్లాడకుండా కన్నకొడుకును నరికేస్తాడు సీతారాముడు.

కథలో క్లైమాక్స్ చాలా ఆలోచింపజేస్తుంది. సీతారాముడు ఎందుకు అలా చేశాడు? అనేది జీర్ణించుకోలేని సత్యం. తనలాంటి వారు విప్లవ బాట పట్టాలని అలా చేశాడా? మరి నిజంగానే అది అతని అభిమతమైతే ముక్కుపచ్చలారని కొడుకుని అంత దారుణంగా హత్య చేయడమెందుకు? లేదా ఇందులో ఎదైనా గూడార్థం ఉందా? అనే ప్రశ్నల పరంపరలో పాఠకుడు ఉక్కిరి బిక్కిరవుతాడు. కథ ఆద్యంతం ఎన్నో సామాజిక, రాజకీయ కోణాలను చూపించాక, చివరిలో ఊహకందని విధంగా ఒక చావును దేనికో సింబాలిక్‌గా రచయిత ఎందుకు చూపించారనేది ఒక్కో పాఠకునికి ఒక్కో విధంగా అనిపించవచ్చు. కొందరికి క్లైమాక్స్ నచ్చకపోవచ్చు. విమర్శలను, విశ్లేషణలను కాసేపు పక్కనపెడితే కథలు రాయాలనుకునేవారు తప్పక చదవాలసిన కథ ఇది. తెలుగు కథా సాహిత్యంపై తనదైన ముద్రవేసిన కథ 'యజ్ఞ'.

ఈ కథలో రచయిత 'అభివృద్ధి అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానాన్ని రెండు భిన్న పార్శ్వాల నుండి పాఠకలకు చూపించారు. ఒకటి శ్రీరాములు నాయుడు దృష్టి కోణం నుండి కాగా, మరొకటి అప్పల్రాముడి దృష్టి కోణం నుండి. శ్రీరాములు నాయుడి దృష్టిలో అభివృద్ధి అంటే నేడు మనం మాట్లాడుకునే అభివృద్ధి. అనగా రోడ్లు, విద్యుత్‌లైన్లు, బోరుబావులు వేయడం, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడం మొదలైనవి కాగా, వాటి వెనుక ఉన్న చీకటి కోణాన్ని రచయిత అప్పల్రాముని మాటల ద్వారా పాఠకలోకం ముందుంచారు.

"నువ్వు రోడ్డేయించినావు, నువ్వేయించిన రోడ్డుకు మా బళ్ళమీదే మా సేతులతోనే రాళ్ళు సేరిసినాం. ఆ సేతులతోనే ఆట్ని పేర్సి మట్టిమోసి నునువు జేసినాం. దానిమీద జీపులొస్తున్నాయ్, కార్లొస్తున్నాయ్, లారీలు, బస్సులు తిరుగుతున్నాయి. గాని మా బళ్ళ బేరాలన్నీ పడిపోనాయి... నువ్వెలట్రిసిటీ యేయించినావు, పంపింగు మిసెన్లొచ్చేసినాయి. ఏతాలు తోడే మా కూలోళ్ళ నోళ్ళల్ల బుగ్గడింది. సూరెంబాబు రైసు మిల్లెట్టినాడు. కలిగినోళ్ళ యిల్లల్లో కూలికి దంచే జనం కూల్లు పోవడం మాట టుంచు. కూల్లు సేసుకు బతికే మా యాడ జనం కూడా కూలి తెచ్చుకున్న గింజలు పుట్టెడూ పందుం - కూలిచ్చి

మిల్లుకేస్తున్నారు" అని అప్పలాముడు అన్న మాటలు అభివృద్ధి రథచక్రాల క్రిందపడి నలిగిపోతున్న పేద ప్రజల జీవితాలకు అద్దంపడుతున్నాయి. శ్రీరాములు నాయుడు ఆ గ్రామంలో చేసిన అభివృద్ధి పర్యావస్థానాల గురించి చెబుతూ 'తన్నేసిన దానివొల్ల కొందరి బతుకులు బుగ్గయి, ఆ బుగ్గిలెల్లి మరి కొందరికి బువ్వలు వుట్టాయి' అని రచయిత యర్రయ్య మాటల ద్వారా అభివృద్ధి అనే పదం వెనుక ఉన్న రెండు పార్శ్వాలను ఏకకాలంలో ధ్వనింపజేశారు.

1960 వ దశాంకంలోనే కాళీపట్నం రామారావుగారు ప్రపంచీకరణ దుష్పరిణామాలను ఊహించి, ఈ నాటకంలో కొన్ని సంఘటనలను చిత్రించారు. "ముందు రైతోళ్ళు మునిగిపోనారు. తరువాత సావుకోళ్ళ.... పన్ను లొచ్చినాక పొగాకు వొర్తకాలు దెబ్బ తినీసీనాయి. పడవ టమ్మోర్లు యీలను శానావరకు నంచీసుకున్నారు. యేరుశనగ, మిరపల వొర్తకాల్లో కొందర్ని జంక్సనుకాడ మిల్లులు, మరి కొందర్ని టేశనుకాడ మిల్లులు - పెద్ద వొర్తకులు - యీలకన్న లోకం సూసినోళ్ళు - యీల్లను ముంచీసినారు. అయితే ఆ మిల్లులైన యిప్పుడున్నాయా? ఆట్నన్నింటినీ అంతకన్న పెద్ద మిల్లులు ఆవదాలవొలసవి మింగీసినాయి. మరి అవైన వుంటాయా? నాకు తెల్దుగాని, ఆట్నికూడ మింగుతున్న వీఁ మింగబోయేవీ యెక్కడో యేవో వుట్టి పెరుగుతూనే వుంటాయి" అన్న అప్పలాముని మాటలు ప్రపంచీకరణ స్వరూప స్వభావాలను తేటతెల్లం చేస్తాయి. ప్రపంచీకరణ పెట్టుబడిదారులను, ధనవంతులను మరింత సంపన్నులుగా చేస్తూ సంపద కేంద్రీకరణకు దారితీస్తుందనీ, పేదలను మరింత దారిద్ర్యంలోనికి నెట్టివేస్తుందనీ అప్పలాముని మాటలు స్పష్టంజేస్తున్నాయి.

ప్రాచీన కాలం నుండి మధ్యవర్తుల వ్యవస్థ ఇటు ఆరుగాలం కష్టించి పండించిన రైతులను, అటు వినియోగదారులను దోపిడీకి గురిచేస్తున్నారన్నది నిర్వివాదం. ఈ కథలో కాళీపట్నం రామారావుగారు ఈ దళారి వ్యవస్థ స్వరూప స్వభావాలను కొంతవరకు చర్చించారు. "బాబయ్యా! యే దినుసైనా మావమ్మబోతే రూపాయికైదు కుంచాలు. మాం కొనబోతే మూడే కుంచాలు. అదే మాదిరి మాం కొనేటప్పుడు కుంచాలు సిన్నవిగుండేవి. మావమ్మే ఏలకి పెద్దవైపోయేవి" అని అప్పలాముడన్న మాటలు ఈ దళారి వ్యవస్థ రైతులను మోసం చేస్తున్న తీరును వివరిస్తాయి. రైతు తాను పండిన పంట చేతికొచ్చే సమయంలో ఈ వ్యాపారులందరూ ఏకమై పంట ధరలను తగ్గించి వేయడం, రైతుల వద్ద నుండి పంట మొత్తం తక్కువ ధరకు కొనుగోలు చేసి, తర్వాత అదే పంటను ధరలు పెంచి వినియోగదారులకు ఎక్కువ ధరకు అమ్ముకోవడం, అదే విధంగా రైతులు ప్రత్తి పండిస్తే దాని ధరను కృత్రిమంగా తగ్గించి వేరుశనగ ధరను పెంచడం, వేరుశనగకు ధర ఉందికదా అని తరువాత సంవత్సరం ఆ పంట వేస్తే, దాని ధరను తగ్గించి మరో పంట ధరను పెంచడం ఇలా వ్యాపారులు రైతులను మోసం చేస్తున్న తీరును రచయిత అప్పలాముని మాటలలో పాఠకులకు తెలియజేసిన తీరు వాస్తవికంగా ఉంది. చివరిగా "బాబయ్యా! ఆనాటికీ యీనాటికీ నాకు బోదపడని సంగతొక్కటుంది. నా కాలం ముచ్చట సెప్పెను. మీ కాలంనాడు మీరే ఎరుగుదురు. బస్తా బియ్యం యేడు రూపాయీలు, బేడా పరక్కి గజం గుడ్డ. ఏడు రూపాయీలెక్కడ. ఏడు పదులెక్కడ; ఏ ధరవ తండ్రులెందు గురించి పెంచేస్తున్నారో - ధరలు! లేక ఆటి మానాన అవే సెట్లేదిగిపోయినట్టెదిగి పోతున్నాయో - తెలీదు" అని అప్పలాముడన్న మాటలు యథార్థం. నిజానికి ఆ ధరలు ఎందుకు పెరుగుతున్నాయో అప్పటి అప్పలాయునికే కాదు ఈనాటి విద్యాధికులకు కూడా తెలుసు అనడం సందేహమే.

కాళీపట్నం రామారావుగారు ఈ కథలో గ్రామాల్లోని పెత్తందార్ల దుర్మార్గపూరితమైన మనస్తత్వాలనను వాస్తవికంగా చిత్రించారు. అప్పలాముడు బాకీని తామే తీర్చి, వారి కుటుంబం చేత వెట్టిచాకిరి చేయించు

కోవాలనుకుంటారు ఈ గ్రామంలో పెద్దమనుషులుగా చెలామనయ్యే కొందరు పెత్తందార్లు. దానికి అప్పల్రాముడు అంగీకరించడు. మరొక సందర్భంలో పొలం అమ్మి గోపన్న బాకీ తీర్చేస్తే అదే గ్రామంలో మరో దళితుని బంజారు భూమిని అప్పల్రాముని కుటుంబానికి ఇప్పిస్తామని చెబుతారు. వారి సానుభూతి వెనుక ఉన్న అసలు కుతంత్రాన్ని రచయిత అప్పల్రాముని రెండవ కుమారుడైన బోడిగాని మాటల్లోనూ, చిన్నకుమారుడైన సీతారాముని మాటల్లోనూ బహిర్గతం చేశారు.

"మా వోళ్ళ నోళ్ళే నాలుక్కొట్టి మా పిల్లలు నోళ్ళు మూస్తాఁ వంటారు. దానిమీద ఆళ్ళు వుసురు మాకైనా తగుల్తాది; మాది ఆళ్ళకైనా తగుల్తాది. కాకపోతే మాఁవూ మాఁవూ పిలకలట్టుకుని మీ పాదాల మీద పడాల" అన్న బోడిగాని మాటలు, "బాబయ్యా, ఆ బంజారు బంగారఁవే పండుతాదో యెండో పండుతాదో ఆ సంగతటుంచండి. దాని మదుపులకి డబ్బులేదు. ఆ మదుపులకి మళ్ళా అప్పుసెయ్యాల. అది బంగారం పండే నాటికి ఆ అప్పు వడ్డీలతో పెరిగి దానికి సరిపడా నిండుకుంటాది. కష్టపడ్డం మావొంతు. అనుబగించడం అప్పిచ్చినోడొంతు" అని సీతారాముడు అన్న మాటలు పెత్తందార్ల దుర్మార్గ పూరితమైన మనస్తత్వాలకు అద్దంపడతాయి.

రామారావుగారు ఈ కథను శ్రీకాకుళం మాండలికంలో రాశారు. ఇది కథకు మరింత అందాన్నిచ్చింది. గ్రామీణ మానవసంబంధాలను వారి మండలికంలో వ్యక్తం చేయడం ప్రశంసనీయం. సుందరపాలెం గ్రామ పెద్దలు అప్పల్రాముడు, అతని కుటుంబసభ్యులను 'మీరు గోపన్న వద్ద అప్పు తీసుకున్నారా?లేదా?' అని ప్రశ్నించినప్పుడు వారు చెప్పే సమాధనం భాషలో మాండలికాల ప్రాధాన్యతకు అద్దంపడతాయి. "అప్పు వున్నదా లేదా అంటే తఁవరంతా వున్నదన్నాక లేకెటు బోద్దంటారు. తీరుస్తారా, తీర్చరా అంటే తీర్చకపోతే ఊరుకుంటారా అంటారు. అయితే తీర్చమంటే మా దగ్గరేటుందంటారు. ఉన్నదానిని గురించి ఎత్తితే మా బతుకేం గావాలంటారు. ఆ తెలివి అప్పు పుచ్చుకున్నప్పుడు లేదా అంటే అప్పుడు తాము చిన్నవాళ్ళట, గ్యానం లేకపోయిందంటారు. అయితే వున్నవాళ్ళే తీరుస్తారు అంటే తీర్పించు కొండంటారు". ఇలా అప్పల్రాముని కొడుకులు ఇచ్చే సమాధానం పరిశీలిస్తే మాండలికాలు రచయిత రచనా సామార్థ్యాన్ని మరింత పెంచుతాయనే విషయం స్పష్టమవుతుంది.

కాళీపట్నం రామారావుగారు ఈ కథలో గ్రామాల్లో ఉన్న కులవివక్షను, దానిని వ్యతిరేకంగా దళితులలో వస్తున్న చైతన్యాన్ని అద్భుతంగా చిత్రించారు. అప్పల్రాముడు ఎప్పటికీ అప్పు తీరుస్తాననిగానీ, తీర్చననిగానీ చెప్పకపోవడంతో ఆక్కడే ఉన్న శ్రీరాములు నాయుడు బంధువు అన్నమయ్య "గతిలేని మనుషులు తగవుకెడితే, మతిలేని పెద్దలు తీర్చే వారా - అని సాఁవెత చెబుతాడు మా తాత. యీ యవ్వారం చూడబోతే ఆ చందం తయారయ్యింది. మ్మూడ్రోజులై తగవు నలుగుతోంది. కాని మాల నాకొడుకు ఒక్కడూ మాటాడడు. ఆల్లని పట్టుకొని యీ పెద్దలంతా అమ్మా బాబూ అని పిసకరిస్తారే గాని "ఎం ఎధవనకొడుకుల్లారా మీకొచ్చిన పోయేకాలం! మీ బాబుగారి సొమ్మా? మీ తాతగారి సొమ్మా? ఇవ్వకెక్కడికి పోతారు. తంతాం!" అని ఒక్కరూ అడగరు. మాకు చేతగాదు పోవయ్యా అని ఆ ముసిలోడితో చెప్పనయినా చెప్పరు. పైగా యీ పెద్దలు కోర్టుల కెవ్వరెల్లకండి; మాదే పెద్ద కోర్టంటారు..." అని కులదురహంకారంతో మాట్లాడతాడు. వెంటనే అప్పల్రాముని చుట్టమొకడు "బాబూ, అన్నమయ్య బాబు! అంత కోపం తెచ్చుకోకు. ఎంత తవరునాయులైనా అంత దురితం తగదు. సదురులోని బాబులెవరూ తఁవకన్నా తక్కువ సదువుకోలేదు. ఆ పత్రం కోర్టుకెళ్తే ఏఁవౌద్దో తవకు తెలియక పోవచ్చుగాని ఆరికి బాగా తెలుసు. అందుకే ఆరి రాకట యీ పద్ధతి నెల్తాంది. తఁవరు తొందరపడకండి" అని అన్నయయ్య మాటలకు ఇచ్చిన సమాధానానన్ని పరిశీలిస్తే అగ్రవర్ణాల కులదురహంకారానికి వ్యతిరేకంగా దళితులలో వస్తున్న చైతన్యాన్ని తెలియజేస్తున్నాయి.

ఈ కథలో కాళీపట్నం రామారావుగారు శ్రీరాములు నాయుడు పాత్రను తీర్చిదిద్దిన తీరు చదువరులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ పాత్ర ప్రారంభలో గ్రామాన్ని ఉద్ధరించే ఆదర్శ పురుషునిగా కనిపించినా కథ ముందుకు వెళ్ళేకొలది అభివృద్ధిపై సరైన అవగాహన లేని వ్యక్తిగా కనిపిస్తాడు. చివరికి సీతారాముడు "బాబూ శీరాఁవులు బాబు! నువ్వంటే నాకు మా సెడ్డ కసి; ఎప్పుడు? ఇంతకు పూరవం. ఇప్పుడో - నేదు. ఎందుసేతో తెలుసునా? నువ్వెత్త యెర్రిపీరువి. లోకవంత నువ్ సెప్పినట్టినాలని, ఇంటారని నీ మనసులో ఓ ఉద్దేశం. ఈ రాజ్జ్యన్నీ నిన్నూ ఏలే దొరలెవరో యెరుగుదువా - అదిగో ఆ బాబులిద్దరు. అదిగో ఆ కరణమయ్య, అదిగో ఆ మునసబయ్య. ఆళ్ళకి ఆళ్ళు సేసుకోలేని మంచిని నువ్వు సేసినంత కాలఁవే నీ రాజ్జం. ఆ తరువాత - ఆళెవరో, నువ్వెవరో, ఆ సంగతి నీకిప్పుడు తెలీదు" అన్న మాటలు శ్రీరాములు నాయుడు పాత్ర కథలో క్రమంగా దిగజారిన తీరును తెలియజేస్తాయి.

ఈ కథలో పాఠకులకు రెండు యజ్ఞాలు కనిపిస్తాయి. ఒకటి సుందరపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి శ్రీరాములు నాయుడు చేసింది కాగా మరొకటి అభివృద్ధి చట్రాల క్రింద నలిగిపోతున్న పేదవర్గాల ప్రజలను మేల్కొలపడానికి సీతారాముడు తన కొడుకును చంపుకోవడం. తెలుగు కథాసాహిత్యాన్ని 'యజ్ఞం' కథకు అటూ ఇటూ అని చెప్పచ్చు. ప్రపంచ కథాసాహిత్యం సరసన చేర్చదగిన గొప్ప కథ ఈ 'యజ్ఞం'.

"యజ్ఞం మొదటిసారి చదవగానే నాకు చప్పున గురజాడ రాసిన 'మీ పేరేమిటి?' జ్ఞాపకం వచ్చింది. ఈ రెండి మధ్యా ఎన్నో పుష్కరాల ఎడం ఉన్నది. కాని, ఇలాంటి కథ మరొకటి అడ్డం నాకు తెలియదు. గురజాడ ఒక గ్రామానికి సంబంధించిన మౌఢ్యాన్ని గురించి రాస్తే, కాళీపట్నం ఒక గ్రామానికి సంబంధించిన రాక్షసాన్ని గురించి రాశారు" అని కొడవటిగంటి కుటుంబరావుగారు ఈ కథను ప్రశంసించారు.

ఈ యజ్ఞం కథకు 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అవార్డుగావచ్చిన సొమ్మును మూలధనంగా పెట్టి కథానిలయానికి పునాది వేశారు. ప్రస్తుతం ఈ కథానిలయం ఎందరో కథకుల, పరిశోధకుల అవసరాలను తీరుస్తూ, వారిని ప్రోత్సహిస్తూ తెలుగు సాహిత్యానికి సేవలందిస్తుంది.

ఈ విధంగా తెలుగు కథాసాహిత్యానికి చిరస్మరణీయమైన సేవలందించిన కారా మాస్టర్ 2021 జూన్ 4న స్వర్గస్తులయ్యారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. వివిన మూర్తి, రచన 'శాయి' (సం), కాళీపట్నం రామారావు రచనలు (2008 వరకూ లభ్య రచల సంగ్రహం), మనసు ఫౌండేషన్, బెంగుళూరు, 2009.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భయం కథ - సామాజిక విశ్లేషణ

**- తేలు వెంకట కుమారి,** పరిశోధకురాలు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

కారా మాష్టారుగా ప్రసిద్ధి చెందిన కాళీపట్నం రామారావు గారు సరళ భాషా రచయిత, కథకుడు, విమర్శకుడు, వృత్తిరీత్యా ఉపాధ్యాయులైన ఈయన నవంబరు 9,1924 సం॥లో శ్రీకాకుళం జిల్లా పొందూరు గ్రామంలో జన్మించారు. ఈయన రచనా శైలి సరళంగా ఉంటుంది. సామాన్య జ్ఞానం కల పాఠకులు సైతం రచనలో లీనమయ్యేలా, భావ ప్రాధాన్య రచనలు చేశారు. ప్రసిద్ధ నవలా రచయిత అయిన యండమూరి వీరేంద్రనాథ్ రామారావు రచనల నుండి ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించారు. ఈయన చేసిన రచనలు తక్కువైనా సుప్రసిద్ధులు. పదవ తరగతి చదివేటప్పుడు 'ముద్దు' అనే కథను రాశారు. చిత్రగుప్త పత్రికలో ప్రచురితమైన 'ప్లాటుఫారమో' అనేది వారి మొదటి రచన. ఆత్మీయులందరూ వీరిని కారా మాష్టారు అంటారు. రామారావు గారు రాగమయి, యజ్ఞం, జీవధార, రుతుపవనాలు, అభిమానాలు అనే రచనలు చేశారు. వారి కథలు కారా కథలుగా ప్రచురించబడ్డాయి. 2008 సం॥లో రామారావు గారి రచనలన్నీ కలిపి 'కాళీపట్నం రామారావు రచనలు' అనే పేరుతో సంపుటంగా వెలువడ్డాయి. మహదాశీర్వచనము, తీర్పు, హింస, యజ్ఞం, అప్రజ్ఞాతం, సంకల్పం, భయం మొదలైన కారా కథలు బహుళ పాఠకాదరణ పొందాయి. రామారావు గారి యజ్ఞం కథకు 1995లో కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి లభించింది. యన్టీయార్ జాతీయ పురష్కారం, లోక్ నాయక్ ఫౌండేషన్ సన్మానం, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డు, కొండేపూడి శేషగిరిరావు సాహితీ సత్కారం మొదలైన ఎన్నో పురస్కారాలు అందుకున్న రామారావు గారు తనకు అవార్డుల ద్వారా వచ్చిన సొమ్ముతో శ్రీకాకుళంలో 'కథా నిలయం' అనే సంస్థను నెలకొల్పారు. ఇందులో కథలకు, కథా రచయితలకు సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుంది. రామారావు గారు 'ఆంధ్రభూమి' దినపత్రికలో 'నేటి కథ' అనే శీర్షికను నిర్వహిస్తూ కొత్త రచయితలకు ప్రోత్సాహం అందించారు.

'కాళీపట్నం రామారావు కథలు' అనే కథా సంపుటి నుండి భయం కథ స్వీకరించబడింది. కారా మాష్టారుని గుర్తు చేసుకుంటూ ఆయన రాసిన కథ భయం. లోకంలో అందరూ అన్నింటికి భయపడరు. ఒకరు భయపడే విషయాన్ని మరొకరు ధైర్యంగా ఎదుర్కొంటారు. మరి కొందరు ఆ భయాన్ని తొలగించడానికి ఎవరినైనా ఆశ్రయిస్తారు. ఈ భయం అనేది మనుషుల మనస్సులను ఎలా ప్రభావితం చేస్తుందో, ఆ భయం ఎలా పరిణమిస్తుందో తెలియజేస్తూ కాళీపట్నం రామారావు గారు రాసిన అద్భుతమైన కథానిక "భయం".

### భయం కథ ఇతివృత్తం :

భయం కథలో కాళీపట్నం రామారావు గారు సత్తెయ్య పాత్రను గొప్పగా తీర్చిదిద్దారు. సత్తెయ్య తల్లిదండ్రులు పారమ్మ, గౌరేసు. ఓ రోజు పారమ్మ పాము కనిపించిందంటూ కేక వేసింది. ఆ కేకకు ఆమె అత్తా మామలు వచ్చారు. వారు ముసలివారు. భయంతో కదలకుండా నిలబడి పోయారు. అంతలో పారమ్మ భర్త గౌరేసు, కొడుకు సత్తిబాబు(సత్తెయ్య) పరుగెత్తుకొని వచ్చారు. గౌరేసు తల్లిదండ్రులు పాముని కొట్టవద్దన్నారు. కర్ర చేతిలోకి వచ్చినా పామును కొట్టే అవకాశం మాత్రం రాలేదు. పాము తప్పించుకుంది. పాము పిడకల కుచ్చిలి కిందికి దూకింది. పిడకల కుచ్చిలి విరగదీయించారు. పాము లేదు కాని పాము పొర, పాము గ్రుడ్లు కనిపించాయి. అయితే ఆరోజు రాత్రి గౌరేసును పాము కరిచి, తప్పించుకొని పోయింది. పాము కరచిన వారికి మంత్రం వేసి వైద్యం చేసే రావులయ్యకు కబురు చేస్తారు.

రావులయ్య తన మంత్రాలతో గౌరేసుని బ్రతికించారు. కాని అప్పుడే నెలలు నిండని కాన్పు వల్లనో, నాటు మంత్రసాని చేతకాని తనం వల్లనో పారమ్మ చనిపోతుంది. సత్తెయ్య నివాసం ఉండే ప్రాంతంలో పాములు ఎక్కువ. గౌరేసును కరిచింది నాగుపాము కాదని, ఉల్లిపామని రావులయ్య మందు తెచ్చి పాము కరిచిన చోట కట్టు కట్టాడు. మూడు రోజుల తర్వాత కట్టిన చోట మాంసం ముద్ద ఊడిపడింది. కాని గాయం నయం కాలేదు. వైద్యం చేయించడానికి సత్తెయ్య ఆస్తి అంతా హారతి కర్పూరంలా హరించుకుపోయింది. గౌరేసు మరణిస్తాడు. దీంతో సత్తెయ్యకు పాములంటే అసహ్యం కలిగింది.

సత్తెయ్య పదిహేను సంవత్సరాల వయస్సులో అతనికి మొదటిసారి పాము తటస్థపడింది. ఒక కర్రను తీసుకొని ఆ పామును చంపేసాడు. ఆ తర్వాత సత్తెయ్య ఆ ఊళ్లో ఎన్ని పాములను చంపాడో లెక్కలేదు. అతనికి పాతికేళ్ళు వచ్చేసరికి 'పావుల సత్తెయ్య' అనే పౌరుష నామం అతనికి స్థిరపడింది. పాము విషపు పురుగు కనుక దానిని చంపడం తప్పుకాదని అతని అభిప్రాయం. పాము మంత్రం వేసే రావులయ్య డబ్బు మనిషి కావడంతో అతనిని కాదని సత్తెయ్యనే అందరూ పిలిచేవారు. ఆ ప్రాంతానికి బర్మా నుంచి భార్యభర్తలు వచ్చారు. వారు పాములను పట్టి చర్మం తీసి అమ్ముకొనేవారు. వారి దగ్గర నుంచి సత్తెయ్య కొన్ని మెళకువలు నేర్చుకున్నాడు.

సత్తెయ్య భార్య రత్నాలు తన భర్తను మార్చాలనుకుంది. సత్తెయ్య ఉండే ఊళ్లో సుబ్బాయమ్మ నివాసం ఉంటుంది. ఈమె స్వార్థపరురాలు. మహా పిసినారి. సుబ్బాయమ్మ సత్తెయ్యకు ఎదురొచ్చి తన ఇంటికి రమ్మని కన్నంలో దూరుతున్న పాముని చూపిస్తుంది. సత్తెయ్య పాము దగ్గరకు వెళ్ళాడు. పాము తోక పట్టుకొని బయటకు లాగాడు. కర్ర ఇవ్వమని సత్తెయ్య అడిగాడు. గురవడు (పశువుల కాపరి) కర్ర విసిరాడు. అది సత్తెయ్యకు పాముకు మధ్యలో పడింది. కర్ర తీసుకునే ప్రయత్నంలో పాము సత్తెయ్యను కాటువేసింది.

సత్తెయ్య బయటకు వెళ్ళే సమయంలో అతనిని సుబ్బాయమ్మ పరామర్శ చేయలేదు. గురవడు సత్తెయ్యకు వైద్యం నిమిత్తం పావులయ్య దగ్గరకు వెళ్ళాడు. సత్తెయ్యకు మంత్రాలపై నమ్మకం లేదని తాను రావడానికి నిరాకరించాడు. గురవడు సత్తెయ్య ఇంటికి వెళ్ళలేక అక్కడి నుండి గోవులున్న చోటుకి వెళ్ళాడు. ఆనాటి అనుభవాల కారణంగా అతడు పశువులను చూస్తుంటే అవి నిన్న కనిపించిన దానికి భిన్నంగా కనిపిస్తున్నాయి. సత్తెయ్య గారింట్లో పెరిగిన బక్క గోవు తల్లిపోయిన పిల్లలాగా, సుబ్బాయమ్మ గారి ఇంటి గోవు దొంగకోళ్ళు గోవులాగా ఇలా ఒక్కో గోవు ఒక్కో విధంగా కనిపిస్తుంది. అతనిలో మార్పుకు అతని అనుభవమే కారణం.

సత్తెయ్యను పాము కరిచిందనే వార్త విన్న జనం గుంపులు గుంపులుగా వచ్చి చూసిపోతున్నారు. కొందరు సుబ్బాయమ్మ కారణం అని చెప్పుకోసాగారు. పాములంటే భయం లేని సత్తెయ్య ఎన్నో పాములను చంపి 'పావుల సత్తెయ్య' అయ్యాడు. పాముని దేవుడుగా నమ్మని సత్తెయ్య చివరికి పాముల వలననే మరణించడం విచిత్రం.

## భయం కథలో పాత్రల యొక్క వ్యక్తిత్వం :

భయం కథలో కారా మాష్టారు గారు సత్తెయ్య పాత్రను గొప్పగా తీర్చిదిద్దారు. ఉత్తమ గుణాలు, సంస్కారం, వ్యక్తిత్వం, ధైర్యం, మంచితనం కలవాడుగా సత్తెయ్య కనిపిస్తాడు. సత్తెయ్య మరణ సమయంలో కూడా మంత్రం కోసం రావులయ్యను పిలవని సంకల్పం అతనిది. అందరికీ సహాయం చేసే గుణం అతని సొత్తు. పాము ముట్టిందని తెలిసి ఊరు ఊరంతా వచ్చి అతనిని చూసి వెళ్ళింది కాని అతనిని బ్రతికించుకోవడానికి వాళ్ళు ప్రయత్నం చేయకపోవడం వారి స్వార్థపూరిత మనస్తత్వాన్ని తెలియజేస్తుంది.

సత్తెయ్య భార్య రత్నాలు భర్త అడుగుజాడల్లో అతని అభిప్రాయమే తన అభిప్రాయంగా నడుచుకునేది. పరుల

సుఖాలకు తన భర్త మరణిస్తే తాను కష్టాలపాలయింది. కథలో రత్నాలు గొప్ప ఇల్లాలుగా భర్త క్షేమాన్ని ఆశించే పతివ్రతగా రచయిత చిత్రించారు.

గురవడు పాత్ర చిన్నదైనా అతని మనసు పెద్దది. ఇతరులు కష్టాల్లో ఉంటే తన బాధగా భావించే సహృదయత గురవడి పాత్రలో కనిపిస్తాయి. మానవత్వాన్ని గుండెలనిండా నింపుకున్న గురవడు వంటి వారే సమాజాన్ని బాగుచేస్తారు.

ప్రజలు భయాన్ని అడ్డం పెట్టుకొని, మంత్ర తంత్రాలంటూ ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపు కునే మోసగాళ్ళకు ప్రతీకగా రావులయ్య పాత్రను రచయిత చిత్రించారు.

ఊరందరికీ సహాయం చేసే సత్తెయ్య మరణానికి కారణమైన సుబ్బాయమ్మ సత్తెయ్య మరణానికి కనీసం బాధ కూడా వ్యక్తం చేయలేదంటే ఆమె పాము కన్నా భయంకరమైనదని తెలుసుకోవాలి.

కొందరు భయపడతారు కొందరు భయాన్ని దరిచేర నీయకుండా సమాజం సుఖంగా ఉండాలని ఆశిస్తారు. తన చుట్టూ ఉన్నవారు సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య, గురవయ్య లాంటివారు సమాజానికి అవసరం. అలాంటి వాళ్ళవలనే సమాజం బాగుపడుతుంది.

**పాముల పట్ల ప్రజల్లో విశ్వాసాలు :**

పాములను గురించి ప్రజలలో ప్రచారంలో ఉన్న నమ్మకాలు అన్నింటినీ సందర్భానుగుణంగా రచయిత తెలియజేశాడు. పాము కలలో కనిపిస్తే మంచిది. కలలో పాము కరిస్తే ఇంకా మంచిది. నిద్రపోయే మనిషికి పాము పడగపడితే ఆ మనిషి చక్రవర్తి అవుతాడు, కోటికి పడగ లెత్తుతాడు. పామును చంపకూడదు. పాము కనిపిస్తే దానిని చంపకుండా పట్టుకొని ఏ కుండలోనో పెట్టుకొని ఊరి వెలుపల విడిచిపెట్టాలి. పాము మంత్రం పని చేయాలంటే పాము కాటు తగిలినవాడికి ఆ మంత్రం మీద తప్పకుండా నమ్మకం ఉండాలి. శివుడు పాముని పుట్టించి భూమి మీదకు వదలినప్పుడే పాము మంత్రాన్ని కూడా చెప్పాడని మంత్రగాళ్ళ విశ్వాసం. కొన్ని పాములు కొందరి వంశాలను తరతరాలుగా వదలకుండా అంటి పెట్టుకొని కాపాడుతుంటాయి. ఆ పాములను పిలస్తే వచ్చి పాలు తాగి వెళ్ళి ఇంట్లో ఏ మూలనో పడుకొని నిద్రపోతాయి. ఇంట్లో పిల్లలుంటే వారిని ఆడిస్తాయి. అలాంటి పాములకు కోపం వస్తే అవి మనుషులను కరవవు. పడగవిప్పి నేలకేసి కొట్టుకొని చనిపోతాయి. తెలుసో తెలియక వాటిని చంపితే ఆ వంశం అంతటితో అంతరించిపోతుంది. నాగుపాముని చంపకూడదు. ఒకవేళ చంపితే వాడు ఆవు నెయ్యి, మంచి గంధం చెక్కలతో దాన్ని దహనం చేయాలి. లేకపోతే నాగ ప్రతిష్ట చేయించాలి. భార్య గర్భవతిగా ఉంటే ఆ భర్త పామును చంప కూడదు. ఒకవేళ చంపితే ఆ ఇంట్లో ఏదో కీడు కలుగు తుంది. ఒకప్పుడు గొప్ప మంత్రవేత్తలు ఉండేవారు. వాళ్లు రాయబార మంత్రం చదివితే కాటు వేసిన పాము ఎక్కడున్నా, నేరం చేసినట్లు తలవంచుకొని వచ్చి ఎక్కడ కాటు వేసిందో అక్కడున్న విషాన్ని పీల్చి వచ్చినదారినే వెళ్ళిపోతుంది. ఎరను మింగిన పామును అసలు చంప కూడదు. అది మహా పాపం కలుగజేస్తుంది. ఈ కథలో నమ్మకాలు ఉన్న జనం కొందరు వీటిని నమ్ముతారు కొందరు నమ్మరు.

**పాముల పట్ల ప్రచారంలో ఉన్న కథలు :**

పాములను గురించి ప్రజలలో ప్రచారంలో ఉన్న కథలు అన్నింటినీ సందర్భానుసారంగా రచయిత తెలియజేశారు. "నా కంట నరుడు పడకూడదు నరుని కంట నేను పడకూడదు" అనుకుంటూ పాము ప్రతి రోజు పుట్టనుండి బయటకు వస్తుంది. నాగుపాము కళ్లల్లో కెమేరా అర వంటి ఏర్పాటు ఉంటుంది. దాని వల్ల ఒకసారి దానికి ఏదైనా హాని చేసిన మనిషి సముద్రాలకు అవతల ఎక్కడ ఉన్నా అతనిని పగబట్టి కాటువేసే దాకా

ఊరుకోదు. మల్లె నాగు, సంపెంగి నాగు అని పాములుంటాయి. మల్లెపూవులున్న చోటికి మల్లె నాగు, సంపెంగి పూలు ఉన్న చోటికి సంపంగి నాగు వస్తాయి. అందుకే సంపంగిని దేవాలయాల్లోనే పెంచుతారు. ఆరుబయట పడుకొనే స్త్రీలు తలలో మల్లెపూలు పెట్టుకోవడం మంచిది కాదని, పెట్టుకుంటే మల్లెనాగులు వస్తాయని అంటారు. రక్తపాడ అనే పాము కరిస్తే అద్దెడు రక్తం కక్కుకొని చనిపోతారు. నాగుపాము విషయానికైనా విరుగుడు ఉంటుంది కాని నల్లత్రాచు కరిచిందంటే విరుగుడు ఉండదు. మంత్రగాడికి కబురుచేసినా అతడు వచ్చేవరకూ కూడా బతకడు. పొడపాము అనే ఒక రకం పాము జానెడు పొడవే ఉంటుంది. తాడిచెట్టు మవ్వల్లో దాని కాపురం. అది దవడ మీదనే కరుస్తుంది.

**ముగింపు :**

మనిషి సమాజంలో ఎదుర్కొనే సమస్యలు పాముల లాంటివి. నీకు నీవుగా ఎదిరించలేవో అవి భయపడతాయి. వాటి వల్ల కష్టనష్టాలు నువ్వే పడాలి. సమస్య వచ్చినపుడు హాని, కష్టం, నష్టం కలగకుండా ఇంకొకరు తీర్చేయాలి అనుకున్నప్పుడే మనుషులలో స్వార్థం బయటకు వస్తుంది. సమస్యలు ఎదురైనపుడు మనుషుల నిజస్వరూపాలు బయడపడతాయని ఈ భయం కథ వల్ల తెలుస్తుంది. కారా మాష్టారు సృష్టించిన గురవయ్య 13 సంవత్సరాల వయస్సులో జీవిత సత్యాలు, మనుషుల్లో స్వభావాలు అర్థం చేసుకోగలిగాడు. 97 ఏళ్ళు జీవించిన కారా మాష్టారు చివరి వరకు నిస్వార్థంగా, నిర్భయంగా నమ్మిన విలువల కోసం జీవించారు.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు, డిగ్రీ ప్రథమ సంవత్సరం - సెమిస్టర్ -2 - మారుతీ పబ్లికేషన్ - గుంటూరు.
2. అంతర్జాల కథనాలు - ప్రసార మాధ్యమాలు - వార్తా పత్రిక

**నిఘంటువులు :**

1. ఆంధ్ర శబ్ద రత్నాకరము - బహుజనపల్లి సీతారామాచార్యులు, శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు, తెలుగు పర్యాపద నిఘంటువు - ఆచార్య జి.ఎస్.రెడ్డి - ప్రగతి పబ్లిషర్స్ - 2016
2. విజ్ఞాన సర్వస్వం - తెలుగు సంస్కృతి, సంపుటి-3, తెలుగు భాషా సమితి, మద్రాసు-1959.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

భావవీణ

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కారా కథలలో సామాజిక దృష్టి- ఒక పరిశీలన

**- డా॥ జి.వి.యస్.జయపాలరావు,** ప్రభుత్వ పురుషుల కళాశాల, శ్రీకాకుళం.
**- డా॥ బి. వేణుగోపాలరావు,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం.

స్వశక్తితో జీవనం సాగించాలని నిశ్చయించుకుని, 1942 సంవత్సరంలో S.S.L.C. పాసై విశాఖపట్నం చేరారు రామారావు గారు. చిరు ఉద్యోగాలు చేస్తూ, హిందూ రీడింగ్ రూమ్ కి తరచూ సాహిత్య సమావేశాలకు హాజరయ్యేవారు. ఆ క్రమంలో ముగ్గురు మిత్రులు తనను అత్యంత ప్రభావతం చేసి నన్ను కార్యోన్ముఖుడను చేశారని అంటారాయన. నడక, నమ్రత, భావుకత ను గమనించిన ఒక మిత్రుడు'' కుటుంబ చికాకులు ఎక్కడా,ఎప్పుడూ ,ఉంటాయని వాటి మీద ఎక్కువ ఆలోచించి కాలాన్ని వృధా చేయకూడదని చెబుతూనే నన్ను పుస్తక ప్రపంచంలోనికి,భావ ప్రపంచంలోనికి, క్రమంగా లౌకిక ప్రపంచంలోనికి తీసుకువచ్చాడు. ఇంకొక మిత్రుడు మార్క్సిస్ట్ భావజాలాన్ని నూరు పోస్తూ, చర్చిస్తూ, ఎవరెవరి రచనలు జీవిత గమనంలో వెలుగునిస్తాయో వివరించాడని, మూడవ మిత్రుడికి నాకు అభిప్రాయాల్లో, ఆదర్శాలలో, జీవన విధానంలో

భిన్న పార్శ్వాలున్నా, అతడు నా ప్రాణమిత్రుడని " నేను నా జీవన దృక్పథంలో '' కారా మాస్టర్ వివరించారు. సజ్జన సాంగత్యం, ఉత్తమ గ్రంథ పఠనం (హిందూ రీడింగ్ రూమ్ లో) వలన నాలో ప్రభావవంతమైన సాహిత్య మూర్తి ఆవిష్కరించబడిందని చెప్పినారు.

స్నేహితులు నువ్వు రాయగలవని ప్రోత్సహించడంతో కథలు రాయడం మొదలుపెట్టారు. డిగ్రీలు లేకపోయినా, ప్రబంధ, ఇతిహాసాల కథా వస్తువులను సృష్టించకపోయినా, తను మెలిగిన సమాజంలో తను పరికించిన సమస్యలు, జనజీవన వ్యత్యాసాలతో పాటు, సమాజపు ఎత్తు పల్లా లను గ్రహించి, సరళమైన భాషలో, అవసరమైన యాస ప్రయోగాలతో, సాంస్కృతికంగా, ఆర్థికంగా, సామాజికంగా, సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతలకు తనదైన శైలిలో పరిష్కారాలు చూపిన మహోన్నత వ్యక్తి కారా మాస్టారు. సంమిత్రుల మార్గదర్శకత్వంలో తొలి కథ "ఆంధ్రపత్రిక'' లోనూ, మలి కథ "భారతి'' లోను అచ్చుయినాయి.

తల్లితండ్రులు పిల్లలను ఏ విధంగా తీర్చిదిద్దాలన్న విషయాన్ని సూచన చేస్తూ 1947లో "స్వార్జితం'' కథ లో విత్తం మనిషి పాలట శాపమని ఆస్తి సంపాదించే మెలకువను పిల్లలకు నేర్పాలి గాని కూడబెట్టి వారి కివ్వడం సరికాదన్నది ఆ కథ సారాంశం.

ఏ కాలమైనా, ఏ ప్రాంతమైనా జాతిని చైతన్యం చేయడం కోసం నాలుగు సూచనలు చేశారు కారా మాస్టారు. కుటుంబ సమస్యలు, అత్యాచారాలు, ఆర్థిక చిక్కులు, పౌష్టికాహారం లోపం స్త్రీలను ఎక్కువగా బాధిస్తుంటాయి. వీటి పరిష్కారం కోసం కా.రా. మాస్టారు ధైర్యవంతులుగా, ఆరోగ్యవంతులుగా, ఉండాలంటే వారిని దాస్య స్వభావం నుండి, పిరికితనం నుండి, ఈర్ష్య ద్వేశాలనే దుర్గుణాలనుండి, స్వార్థపత్వం నుండి, రోగిష్టితనం నుండి బయటపడే విధంగా స్త్రీలను సంస్కరించాలి అంటారాయన.

ప్రజల నిష్క్రి పరాయణత్వం, రాజకీయ రుగ్మతలు, ఉపాధ్యాయ స్వార్థపూరిత ఏకపక్ష ధోరణలు, జాతి పునః నిర్మాణానికి అవరోధాలు. నేటి సమాజాన్ని పరికిస్తే ఆత్మగౌరవం, సమభావం అనేవి ఎండమావులే. ఈ సమస్యల నుండి బయట పడాలంటే, ప్రజలు, ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు ముందుగా స్వతంత్రులు, ధైర్యవంతులు, సంపన్నులు, జ్ఞానతుష్ట పరులుగా మెలగాలి. ధైర్యం, సమ భావం, త్యాగనిరతి పెరుగుతాయి.

పదవి కోసం ఎటువంటి రాజ్యాంగేతర పనులు

చేయడానికి అయినా సిద్ధపడేవారు, కుటుంబ సభ్యుల సైతం లెక్కచేయని వాళ్ళు, ప్రజాస్వామ్యం ముసుగు కప్పుకున్న గోముఖ వ్యాఘ్రాలు, అంతా మనమే అంటూనే స్వలాభం చూసుకునే నయవంచకుల నుండి దేశాన్ని స్వేచ్ఛ సౌభ్రాత్రాల వైపు, ప్రజాస్వామ్యం దిశగా, సమ సమాజం కోసం యువకులు, విద్యావంతులు కార్యోన్ముఖులు కావాలని సూచిస్తూనే, దేశంలో ప్రజలు మూర్ఖులు, అజ్ఞానులు, అయి ఉంటారని, యువకులు విద్యావంతులైతేనే, బురఖా రాయళ్ల పాలన నుండి, పదవి వ్యామోహానా పరులు, స్వార్థ భూయిష్టుల నుండి విముక్తి పొంది దేశాన్ని పాలించగలుగుతారని నా అభిప్రాయం అంటారు కారా మాస్టారు.

ప్రైవేట్ విద్య, అర్హతలు చాలని ఉపాధ్యాయులు, ప్రమాణాలు గాలికి వదిలిన విద్యా వ్యవస్థ ప్రమాణాలు భ్రష్టు పట్టడం చూస్తున్నాము. అందుకే 60 ఏళ్ల క్రితం కారా మాస్టర్ ఏమన్నారంటే, ఉపాధ్యాయ వృత్తి ఎందుకు స్వీకరించాలంటే, వారు తదితరు వృత్తుల్లో ప్రవేశిస్తే వారు ఉపాధ్యాయ స్థానము అనర్హులకు విడిచిపెట్టడం అవుతుందని, తద్వారా భవిష్యత్తు తరాల వారికి తీరని అపచారం చేసినట్లు అవుతుందని అంటారాయన.

ప్రజాస్వామ్యం మనగడ సాగించాలంటే, ప్రజాస్వామ్యం ముసుగులో నడమంత్రపు సిరులు తెచ్చే మార్పులను ప్రజాస్వామ్యం గుర్తించలేక పోతుంది, కానీ సత్యం ఆగదు. అర్ధబలిమి కల అసాధ్య సాధకుల భగీరథ ప్రయత్నాలు సఫలమైన నాడు బయటపడుతుందని క్రమగతి కోల్పోయిన గడియార చక్రంలా, నర్మగర్భంగా దేశద్రోహులు గురించి లంచగొండిల గురించి అధికార ధనగాంధర్వుల గురించి స్పష్టంగా "జననిష్ఠురలలో" చెప్పినారు.

దేశంలో రాజకీయ పార్టీల మీద స్పష్టమైన అభిప్రాయాన్ని వెలిబుచున్నారు. ప్రజల విశ్వాసం చూరకొంటూ వచ్చిన సోషలిస్ట్, కమ్యూనిస్ట్, కాంగ్రెస్ వంటి బలమైన రాజకీయ పార్టీలు ఏమీ మినహాయింపు లేకుండా కొమ్మలు, వాటి రెమ్మలుగా అసంఖ్యాకమైన పార్టీలు పుట్టుకొచ్చినాయి. అవన్నీ ఒక కులాన్నో మతాన్నో ఉద్ధరించే భారాన్ని భుజాన ఎత్తుకున్నాయి. ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచే బదులు వ్యక్తి ఆరాధన, స్పర్ధ, వైశ్యామ్యాలను పెంచుతూ పోతున్నాయి. ప్రజల్లో వచ్చిన వర్గ స్పృహ మీద కుల మత లింగ ప్రాంతీయ స్పృహలను వాటి అంతర్గత శాఖోప శాకలతో సహా పెంచే ప్రయత్నంలో ద్వేష వైశమ్యాలకు బీజాలు పడుతుండటం చూస్తే, ప్రజాస్వామ్యం మునగడ ప్రశ్నర్ధకమవుతున్నది అన్నది అతని అభిప్రాయం.

దేశం గురించి, నాయకత్వాల గురించి, వేదికల మీద పెద్దపెద్ద మాటలు, ఉపన్యాసాలలో చెబుతుంటారు, జన హృదయాలను దోచుకోవాలనే స్వార్థకాంక్షలతో చెప్పే వారి మాటలు చాలా తియ్యగా ఉంటాయి. కానీ చేతలు భిన్నంగా ఉంటాయి ఈ ప్రక్రియ అన్ని తరాల్లోనూ జరుగుతున్నదే?

శ్రీకాకుళం రైతాంగ పోరాటం నేపథ్యంలో, ఎందరో కవులు, కళాకారులు, గలమెత్తి సామాజిక స్పృహ కలిగించడంలో ఎవరు వంతు పాత్రను వారు పోషించారు . వాటి సంకలనం " నేలతల్లి విముక్తి కోసం " పుస్తకమునకు ముందుమాట వ్రాస్తూ తరతరాల బానిసత్వం గురించి, పరాయి పీడన గురించి ఆయన మాటల్లోనే" నేలపై పీడితులు పీడించే వారికి ఎదురు తిరిగింది లగాయితు అక్కడ జరిగిన ప్రతి సంఘర్షణకు అణిచివేత యత్నానికి, పేదల ప్రతిఘటనకు, ప్రభుత్వాల దమనకాండ కు, పిచ్చెత్తిన రాజ్యహింసకు, పెల్లుబుకిన ప్రతి హింసకు, ఆది నుండి నేటిదాకా సాగుతూ వచ్చిన మారణహోమాలకు, మా తాత తండ్రుల నుండి, మన వరకు, మన మనమళ్ల వరకు, సాక్షులుగానే ఉంటాము. అణచివేత, రాజ్య హింస, మారణ హెూమాలు, రాజ్యంలో సాధారణమని, ఏలిన వారు తాబేదార్లు, వివిధ పక్షాలకు చెందిన నాయకులు, " నిజం" తప్ప అంతా మాట్లాడతారని సూటిగా చెప్పారు.

ఊహాత్మకమైన, ఆచరణకు దూరంగా నున్న సిద్ధాంతాల

మీద రచన వ్యాసంగాలు చేయటం కన్నా, వాస్తవంలో చుట్టూ ఉన్న సమాజాన్ని పరికించి జన సామాన్యునికి అర్థమయ్యే భాషలో విస్ఫోటనం లాంటి భావజాలంతో రచనలు చేయాలంటారు ఆయన. ప్రతి రచయిత " నేనెందుకు రాస్తున్నాను అని ప్రశ్న వేసుకొని " సమాధానంగా బ్రతుకు గురించి, బ్రతుకు పరమార్థం గురించి, భ్రమలను పోగొట్టుకోవాలని, చదివింది ఒక్కటి, విన్నది ఒకటి, చూసింది వేరొకటి, అర్థమయ్యింది మరొకటి, సమన్వయం లేక, రచనలు చేయరాదంటారు. రచయితలను సూటిగా ప్రశ్నిస్తూ మీరు నమ్మే సిద్ధాంతాల మీద, రాస్తున్నది ఆచరిస్తున్నది, ఆదర్శాల పేరుతో సమాజాన్ని మెప్పిస్తున్నది ఒక్కటేనా? అని ఆత్మ విమర్శ ప్రతి రచయిత చేసుకోవాలంటారు.

అందరు రచయితులకు ఆయన చెప్పేది ఒకటే, "ఎంతటి పరిశీలనా శక్తి కలవారు అయినా, ఒక స్థిరమైన ప్రపంచక దృక్పథం లేని వారు ఎవరూ కూడా గొప్ప రచనలు చేయలేరు'' ఎరిగిన వ్యక్తుల మీద, జరిగిన సంఘటనల మీద కథలు రాయరు. వాస్తవ జీవితము నుండి వారి వారి ప్రాపంచక దృక్పథం మేరకు జీవిత వాస్తవాలను గ్రహిస్తారు. వాటిని సంఘటన లని, పాత్రల్ని, సన్నివేశాలను కల్పిస్తారు. అంతా కల్పన అయినా వారి చిత్రంలో ఆ కల్పనలో జీవితమంతా సహజంగా కనబడుతుంది. కథ కాని దానికి, కథకు మధ్యలో ఉన్న చిన్న అంతరాన్ని స్పష్టంగా తెలియజేశారు కారా మాస్టారు.

పౌరులకు, రాజ్యాంగబద్ధమైన పాలన ఇస్తామని ఒట్టు పెట్టి, రాజ్యాధికారానికి వచ్చిన తరువాత నేతలు మాట తప్పి నీతిమాలి, "రాజ్యాన్ని'' సొంత మోఖాసాగా అనుభవిస్తున్న పద్ధతి మీద, ప్రభువుల దారే మా దారిగా భావించిన తాబేదారుల మీద, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, పరుల సొత్తును దఖ లు పరుచుకోవడం, మొదలైనవి రచయిత చేతిలో కథావస్తులు కావచ్చు కానీ కథ రాసేవారికి కథ ఎందుకు రాస్తున్నాను నా లక్ష్యం చేరువైందా లేదా అని చూసుకోవలసిన బాధ్యత కూడా ఉంటుందని కారా మాస్టర్ అంటారు.

జీవితంలో వెలుగు చీకట్లు అర్థ భాగాలు, చీకట్లోనున్న కొందరు వెలుగు గురించి రాస్తారు, వెలుగులో ఉంటూ జీవితంలోనున్న చీకటి గురించి రాస్తారు, వెలుగు తప్ప, చీకటిని ఎరగని వారు అందులో నీలి నీడల్ని చీకటిగాను, మరికొందరు చీకటి కాదని వెలిగే చీకటి, చీకటే వెలుగని రాస్తారు. కానీ గమనించవలసిన విషయం ఏమిటంటే లోకంలోని మంచికో చెడ్డకో స్పందించి, ఇతరులను స్పందింప చేయవలసిన అవసరము చేయాలని కోరిక లేని వారు కథలే కాదు ఏమీ రాయలేరు అంటారు కారా మాస్టారు.

కథలు రాస్తూనే, కదా ఎలా రాయాలి? అన్న ప్రశ్నకు సమాధానంగా "పది కాలాలపాటు కథ నిలబడాలంటే అది విశ్వజనీనమైన సమస్యగా ఉండాలి", అదేవిధంగా పరిష్కారం అన్ని కాలాల్లోనూ సార్వజనీన మవాలని సూచించినారు. కథలు రాసేవారికి "కారా వారి కథలు'' పెద్ద బాలశిక్ష అనటంలో సందేహం లేదన్నది నా నిశ్చితాభిప్రాయము.

❖ ❖ ❖

# అభిమానాలు నవలిక : ఒక పరిశీలన

**- డా. సిహెచ్. సావిత్రి,** తమిళ విశ్వ విద్యాలయం, తంజావూరు, తమిళనాడు

మనిషి మనసు ఎల్లప్పుడు ఒకే స్థితిలో ఉండదు. నిలకడలేని మనసు కెరటాల్లాగా సంచలిస్తూనే ఉంటుంది. మనిషి యొక్క మనస్సు జ్ఞాన స్థితిలో పనిచేస్తే, చర్యలకు మంచి ఫలితాలు కలుగుతాయి. అలా కాకుండా భయం, అనుమానం వంటి ప్రతికూల ఆలోచనల వల్ల ప్రతికూలంగా ప్రభావితమైనా, ఆ ఆలోచనలతో చేసే పనులన్నీ చెడు ఫలితాన్ని ఇస్తాయి. అభిమానాలు అన్న నవలికలోని కథానాయకుడు పద్మనాభం తన కొడుకు ఎక్కడ దారి తప్పిపోతాడో అనే మితిమీరిన భయం మరియు ప్రతికూల ఆలోచనలతో చుట్టుముట్టబడిన తన కొడుకుపై అమితమైన వాత్సల్యంతో, దయగల తండ్రిగా కథ మొత్తం చిత్రీకరించ బడింది. ఈ నవలికలోని విషయాల్ని కొన్ని ఉప శీర్షికలుగా విభాగించుకొని పరిశీలించబడింది. అవి -

1. పిల్లల పెంపకం
2. బంధుత్వం
3. మాతృ ప్రేమ
4. బాల్యదశ
5. రోగ ఫలితం
6. భాషా ప్రయోగం

**పిల్లల పెంపకం :**

పిల్లల పెంపకం ఒక సూక్ష్మ కళ. చిన్న పిల్లల మనస్సు మరియు మెదడు కొత్త తెల్ల కాగితం లాంటిది. అందులో మొట్టమొదట ఎలాంటి విషయాలు నమోదు చేయబడతాయో అవే మనస్సు మరియు మెదడులో నాటుకుపోతుంది. దీని ప్రకారం, ఆలోచన మరియు జ్ఞానం దాని మూలాన అది పనిచేయడం ప్రారంభిస్తాయి. పైగా, పిల్లలకు దేనినైనా సరే తెలుసుకోవాలన్న తపన, కోరిక ప్రకృతి సిద్ధంగానే, సహజంగానే కలగడం వలన వేటిని చేయవద్దని అంటామో, వాటినే చేయడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. అలాంటి సందర్భాలలో పిల్లల్ని పెంచడంలో తల్లిదండ్రుల బాధ్యత అనేది చాలా ముఖ్యమైందిగా ఉంటుంది. తల్లిదండ్రులు తమ స్థితి నుండి దిగి వచ్చి, పిల్లల స్థానానికి పరిణతి చెంది, పిల్లల స్థానంలో నిలబడి, వారి మానసిక స్థితి మరియు ఆలోచనా ప్రవాహానికి అనుగుణంగా వారికి అవసరమైన ఆలోచనలు మరియు మంచి అలవాట్లను వారికి బోధించాలి. అలా కాకుండా వారి స్థానంలోనే నిలబడి, పిల్లలకు దారి చూపినప్పుడు, పిల్లల మనస్తత్వం మారిపోయి అనేక చెడు అలవాట్లకు బానిసలవడం జరుగుతుంది.

ఈ నవలికలోని కథానాయకుడైన పద్మనాభం పిల్లల పెంపకంలో చాలా సూక్ష్మమైన విషయాల్ని చేపట్టడంలో విఫలుడయ్యాడు. ఆ కారణం వలనే కొడుకు చలపతి యొక్క మనసులో రకరకాల మార్పులు కలిగాయి. వాడి ఆరోగ్యం కుంటు పడడానికి కూడా ఇదే కారణమైంది. కొద్ది రోజుల సెలవులకు, చలపతి వాడి తల్లి, తండ్రి, చెల్లెళ్ళని చూడాలనే తపనలో, ఇంటికి వచ్చినప్పుడు పద్మనాభం వాడి వద్ద ప్రవర్తించిన తీరు, వాడిని ఖండించినది, కొట్టినది, తిట్టినది, వాడి లాగు జేబులో నుండి సిగరెట్టు పెట్టెను చూసి చాలా కోపగించింది పైగా, వాడివద్ద ఎలాంటి వివరణ అడగకుండా, వాడిని మాట్లాడనివ్వకుండా వెంటనే వాడిని శ్రీకాకుళం పంపింది వంటి అన్ని చర్యలలోను ఒక తండ్రి తన బిడ్డను ఎలా పెంచాలి అన్న విషయం నుండి ఆయన తప్పటడుగు వేశారన్నది స్పష్టంగా తెలుస్తున్నది. అతివృష్టి అనావృష్టి అన్న సామెతకు తగినట్లు మితిమీరిన ఖండన, మితిమీరిన కోపం, కన్నా కొడుకును అనునయించక పోవడం, బెదిరించి భయపెట్టి ఎడంగా ఉంచడం పిల్లల పెంపకంలో తండ్రి సరియైన దారిలో వెళ్లలేదనడానికి కారణాలుగా చెప్పుకోవచ్చు.

అలాగే, తన చిన్నాన్న దగ్గర డబ్బు తీసుకోవడం తప్పని ఖండించి, ఎవరు డబ్బు ఇచ్చినా తీసుకోవడమేనా? అని తిట్టి బెదిరించినది, పిల్లల పెంపకానికి వ్యతిరేకమైన చర్యగా చెప్పవచ్చు. దేనినైనా సరే, చాలా ఓర్పుతో నెమ్మదిగా విడమర్చి చెప్పినప్పుడు ఎలాంటి పిల్లలైన చక్కగా వింటారు. పద్మనాభం వద్ద ఇలాంటి మనసు అస్సలు లేదు. చలపతికి తన చిన్నాన్నకిచ్చే గౌరవం, మరియాదలు, ప్రేమ కన్న తండ్రిపై లేవు. కారణం పైన చెప్పినవే. పిల్లల పెంపకంలో పద్మనాభం తమ్ముడు భాస్కరం మరియు అతని భార్య రాఘవి ఇద్దరు కూడా పిల్లల పెంపకంలో బాగా అనుభవమున్న వాళ్లలాగా ఈ కథలో చిత్రించబడింది.

**బంధుత్వం :**

బంధుత్వం అనేది చాలా చాలా సున్నితమైన మనస్తత్వం కలిగి ఉంటుంది. బంధుత్వాన్ని రక్షించుకోవడం అనేది ఒక కళ. దానిని నైపుణ్యంతో చేపట్టితే, మన చుట్టూ ఉన్న బంధువులు అందరు మనకు ఆత్మ బంధులవుతారు. ఈ కథలోని కథానాయకుడు పద్మనాభం బంధుత్వాన్ని ఎలా దక్కించుకోవాలాన్న నేర్పరితనం లేనివాడు. అతనికి అతని కొడుకుకు మధ్య ఉన్న బంధంలో పగుళ్లు ఏర్పడ్డాయి. తన కొడుకు చాలా బాగా ఉండాలని, బాగా ఉన్నత స్థితికి రావాలని అధిక ఎదురుచూపులతో ఉన్నందువలన, ఎక్కడ కొడుకు తప్పుడు దారి పడతాడో అనే భయంతోనూ, అధికంగా ఖండించడం వలననే పిల్లలు సన్మార్గంలో పయనిస్తారనే ఆలోచనలతో ఉన్న పద్మనాభానికి కొడుకు యొక్క ప్రేమ, అనురాగాల్ని అర్థం చేసుకోలేకపోయాడు. అలాగే అతని తమ్ముడు భాస్కరం తన వివాహానికి ముందు అన్నగారిపై అధిక ప్రేమతోను, గౌరవంతోనూ ఉన్నాడు. అన్నగారి మాటకు ఎదురు మాట చెప్పకుండా ఆయనకు లోబడే ఉన్నాడు. అలాంటి తమ్ముడి బంధాన్ని ఆయనకు వివాహం అయిన తర్వాత తన ఇష్టంతో పని లేకుండ, తన ఇష్టానికి వివాహం చేసుకొన్నాడని, తమ్ముడు అనే బంధాన్నే తూలనాడాడు పద్మనాభం.

కొద్ది రోజుల తర్వాత తన కొడుకు జబ్బు పడ్డా సమయంలో భాస్కరం మరియు రాఘవి యొక్క మంచి మనస్సును, వారు పద్మనాభంపై చూపిన ఆప్యాయతను, అక్కరను, ప్రేమను చాలా రోజుల తర్వాత అర్థం చేసుకొని వాళ్ళల్లో కలసిపోతాడు పద్మనాభం. ఈ కథలో బంధుత్వాన్ని ఎలా నిలబెట్టుకోవాలో తమ్ముడికి, తమ్ముడి భార్యకు తెలిసినంతగా పద్మనాభం తెలుసుకోలేకపోయాడు అన్నది తెలియవచ్చింది.

పద్మనాభం తన భార్య రామలక్ష్మమ్మతో తగిన విధంగా నడచుకోలేదని, రామలక్ష్మమ్మ తన మనసు విప్పి అన్నీ విషయాల్ని తన భర్తతో పాలుపంచుకోవడానికి గాని, అనువుగా మాట్లాడడానికిగాని వీలులేని పరిస్థితిని ఈ కథలో సృష్టించబడింది. పద్మనాభం కథ ముందు  భాగం వరకు తాను పెద్ద మనిషి, తనకే అన్నీ తెలుసు అన్న భావన, తను చేసిందే సరి అనే మొరటు స్వభావం కలిగిన వాడుగానే తన జీవితాన్ని గడిపాడు. ఇటువంటి మనస్తత్వం బంధుత్వాన్ని బలపరచేందుకు ఎంతమాత్రం సాయపడదు. కథ వెనుక భాగంలో తన తప్పుల్ని సరిదిద్దుకొని, తమ్ముడు, తమ్ముడు భార్య, కొడుకు, తన భార్య అందరిని అర్థం చేసుకొని అందరితోనూ సవ్యంగా జీవించడం వలన బంధుత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఒక ఆనవాలుగానే దీనిని చెప్పుకోవచ్చు.

**మాతృ ప్రేమ :**

మాతృ ప్రేమ అనేది ప్రపంచంలోనే తక్కిన అన్ని ప్రేమల కంటే పవిత్రమైనది, ప్రత్యేకమైనది. అందులోనూ తండ్రి ప్రేమ కంటే తల్లి ప్రేమ చాలా రెట్లు విలువైనది. ఈ కథలో రామలక్ష్మమ్మ తన కొడుకు మీద అధిక ప్రేమ, వాసల్యం కలిగి ఉన్నాను, భర్త అంటే భయం. ఆ కారణం చేత కొడుకు చలపతిపైన తన మాతృ హృదయాన్ని కనబచలేకపోయింది. పద్మనాభం తన కొడుకును కఠినంగా నిందించినప్పుడల్లా రామలక్ష్మమ్మా చాలా బాధ పడుతుండేది. అయినా కూడా

తన భర్తను ఎదిరించి ఒక్క మాట కూడా మాట్లాడేది కాదు. భర్తపై ఉన్న భయం వలన తన కొడుకు పక్షాన మాట్లాడలేని స్థితిలో ఉండేది. ఈ కథలో, భార్యా భర్తల మధ్య సరియైన అవగాహన లేనందువలన, తన మాతృ హృదయాన్ని తన కొడుకు వద్ద వెలిబుచ్చని దౌర్భాగ్యురాలుగ జీవితం గడిపేది. అటు పిమ్మటే కొడుకు విషయంలో భార్యా భర్తలు ఇద్దరికీ అవగాహన వస్తుంది అనేది ఈ కథ వలన తెలుసుకో గలుగుతాం.

**బాల్య దశ :**

బాల్య దశ అనేది మనిషి యొక్క జీవితంలో చాలా ముఖ్యమైన స్థానాన్ని నిలబెట్టుకుంటుంది. అందులోను ముఖ్యంగా ప్రాథమిక చదువులు వాని భవిష్యత్తుకు, జీవితమంతటా పునాదిగా ఉండగలిగేది. బాల్య దశలో నేర్చుకొనే అలవాట్లు వాడి జీవితాంతం వరకు కొనసాగుతుతూనే ఉంటుంది. చలపతి యొక్క బాల్యదశ సహజమైనదిగాను , అందరి పిల్లలలాగా తనకు కలుగలేదు. విద్యా నేర్వడానికి వెళ్ళిన చోట పలు కష్టాల్ని అనుభవిస్తాడు. తన గురువు వద్ద మాత్రమే కాకుండా, తన తండ్రి వద్ద కూడా చాలా కష్టాల్ని అనుభవించాడు. ఇన్ని కష్టాలతో కూడిన బాల్యదశ ఒకని తెలివితేటల్ని పెంచేదిగాను, పక్వపడ్డ మనసు కలిగిందిగాను ఉండడానికి వీలుపడదు. ఈ కథలోని చలపతి బాల్యదశ ఇలాంటిదే.

**రోగ ఫలితం :**

రోగమనే శరీర సుస్తి మనిషి జీవితంలో ఎవరిని కూడా వదలి పెట్టలేదు. ఎడముగాను ఉండదు. అయితే ఈ రోగం, మరణం విడిపోయిన అనేక బంధువుల్ని ఒకటి చేరుస్తుంది. అనేక సంవత్సరాలుగా పలు కారణాల వలన విడిపోయిన బంధుత్వం, ఏదైనా మరణం సంభవించినప్పుడు లేదా రోగ పీడితులైనప్పుడు పగవారు కూడా దయతలచి పాతవి మరచి, బంధుత్వానికి ముఖ్యత్వమిచ్చి అందరు ఒకటౌతారు అనేది సాధారణంగా సమాజంలో జరిగే విషయమే. ఈ కథలో కూడా చలపతి ఒంట్లో బాగోలేక వాడు ఆసుపత్రిలో ఉన్నప్పుడు, తల్లి తండ్రులకు బదులుగా చిన్నాన్న, పిన్నమ్మ వాడికి తోడుగా ఉండి చలపతిని చాలా బాగా చూచుకొన్న వైనం పద్మనాభం మనసులో అనేక మార్పులు కలుగ చేస్తాయి. తన తమ్ముడి పైనన, తన తమ్ముడి మనసు మారడానికి రాఘవియే కారణమనుకొని ఇన్నాళ్ళు తప్పుగా అనుకొన్న పద్మనాభానికి వారిపట్ల ఎక్కడలేని ప్రేమ వాత్సల్యాలు కలుగుతాయి. అందుకు కారణం చలపతికి సుస్తి చేయడమే. భాస్కరం మరియు రాఘవి వీరిపై పద్మనాభుడీ కోపం, మనస్తాపాలు సరి అయి, దూరమై ఎడంగా ఉన్న బంధుత్వం మళ్ళీ ఒకటిగా కలిసింది అంటే దానికి కారణం చలపతి శారీర సుస్తియే కారణమనేది కథలో ముందుగానే తేటతెల్లమైంది.

పై విధంగా ఈ కథ పలు పరిమాణాల్ని దాటి వెళ్ళినా, పద్మనాభం తన ఆలోచనల్లోనూ, నిర్ణయంలోనూ పలు సందర్భాల్లో నిలకడైన స్థితిని కొనసాగించినా కూడా ఒక సందర్భంలో భార్య యొక్క ప్రశ్నలకు జవాబు చెప్పే స్థితి, తన తరపు వాడానల్ని వివరంగా తెలిపిన రామలక్ష్మమ్మ దానిని అర్థం చేసుకొనే విధంగా వివరించి చెప్పిన తీరు చాలా బాగుంది. అలాగే తన అన్న తనపై పెంచుకొన్న ద్వేషాన్నో, చుట్టరికం నుండి దూరమయినదానినో పెద్ద సమస్యగా తీసుకోకుండా, వాని కొడుకుకు కావలసిన అన్నిటిని కథ ప్రారంభం నుండే దానుగా ముందుకువెళ్లి చేసిన తీరును, తర్వాత రోగ పీడితుడైనప్పుడు తాను, తన భార్యా, తల్లి తండ్రులుగా ఉండి చూసుకొన్న విధం బంధువుల పటుత్వాన్ని దృఢ పరిచేదిగా ఉంది. ఈ కథ ద్వారా బంధువుల్లో జరిగే గొడవలు, గందరగోళాలు ఎప్పటిని స్థిరంగా ఉండవు అనేది తెలుసుకో గలుగుతున్నాం. ఈ కథలోని చలపతి, తాను ఒంట్లో బాగోకుండా ఉన్నప్పుడూ తన విషయాన్ని తన తండ్రి దగ్గర చెప్పకుండా ఉండడాన్ని చాలా లోతుగా పరిశీలిస్తే, తన తండ్రిపై ఎంత కసితో ఉన్నాడనేది,

ఆ చిన్న తనంలోనే తన తండ్రి తనమీద చూపిన కఠినత్వం, బెదిరింపులు వాడి చిన్నారి మనసును గాయపరిచాయి అనేది చాలా చక్కగా రచయిత చిత్రించాడు. కథ మధ్య భాగంలో పద్మనాభం తన తమ్ముడిపైన, తమ్ముడి భార్య పైన చూపిన నిరసన భావన, వారి ప్రేమానురాగాల్ని అర్థం చేసుకొనక, వారిని, వారి అనుబంధాన్ని ఉదాసీనపరచిన వాటిని మనసులో పెట్టుకోక బాస్కరం కథ చివరి భాగంలో పద్మనాభం కుటుంబంతోటి కలసి బంధాన్ని దృఢపరచిన విధం చాలా శ్రేష్ఠమైంది కథకు మంచి ముగింపు కూడాను.

**భాషా ప్రయోగాలు :**

కాళీపట్నం రామారావుగారి 'అభిమానాలు' అన్న నవలికలోని భాషను గనుక పరిశీలించినట్లయితే, రచయిత ఇందులో వాడిన పదజాలం, నానుడులు, ఉపమానాలు వీటిని చదివినప్పుడు పాఠకుల్ని శ్రీకాకుళం ప్రాంతానికి తీసుకువెళ్లినట్లు భావనా కలుగుతుంది. అంతేకాదు, ఆ నాటి భాషా ప్రయోగాలు ఎలా ఉండేదోకూడా తెలుస్తుంది. ఇందులోని పదజాలం, నానుడులు, ఉపమలు అన్నీ కూడా చాలా విచిత్రంగా రచయిత ప్రయోగించినట్లుగా అనిపిస్తుంది. ఇందులోని భాషను శ్రీకాకుళం పాఠకులు తప్ప ఇతరులకు అర్థమవడం కొంచెం కష్టమనే చెప్పాలి. అందులోనూ మాలాంటి రాష్ట్రేతర పాఠకులకు మరింత కష్టమైన పనే. ఇక ఇందులోని భాషను ఉప శీర్షికల ద్వారా పరిశీలిద్దాం.

పదజాలం

ఈ నవలలోని పదజాలాన్ని గనుక పరిశీలిస్తే రచయిత చాలావరకు వ్యావహారిక భాషను ప్రయోగించినా, చాలాచోట్ల గ్రాంథిక భాషను కూడా ప్రయోగించారు. ఈ నవలికలో చాలా చోట్ల ఆంగ్ల పదాలు, ఇతర భాషా పదాలు కూడా వాడారు. మచ్చునకు కొన్ని-

**గ్రాంథిక భాషా పదాలు :**

కానవచ్చింది (పుట : 137), నిలుచుండి పోయారు (135), చెప్పుమీ (139), ఐనా (139)

**ఆంగ్ల పదాలు :**

ప్రొమోషన్లు (133), లిస్టులు, (133), ఇనస్పెక్టర్ (133), ఆర్డరు (135), క్రిమెన్సు, యడ్రసు, ఆఫీసు (120)

**ఇతర భాషా పదాలు :**

తువాలు (120), బేషరతు (120), దస్తూరీ (120)

**మాండలిక భాషా పదాలు :**

నిద్రభంగి (137), గాదరించు (138), అపసంతి (140), దస్తు పెట్టి (140), గబ్బిలాయి (137), ఉత్తాల పెట్టింది (140), తెరిపి (131), ఎడమిచ్చి (132), కోపరేఖలు (136), లుమ్మ చుట్టుకొని (136), పొదికట్టు గుమ్మం, సాగోరి పోవడం ( 127), ఆకాడికీ (129), అగపడు (129), దుయ్యబట్టు (124), కాలహరణం (123), తాపీపడి (124), కరణీ (125), చెళుకు (125), పేపరువ్వ (126), కళవిళ (126), విహ్వల చిత్త (130), చకిత నేత్రాలు (130), స్మారకం (142).

**వాక్య ప్రయోగాలు :**

ఈ నవలికలోని ప్రయోగాలు కొన్ని చాలా విచిత్రంగా అనిపించాయి. వాటిలో కొన్ని -

- మతి లేకుండా మంగళవారం పడ్డది (135), గుప్తవాంచలూ (134), సూచావాచాగానైనా (133), డాబులు కోస్తూ (140), భారత వాక్యం (132), వడ్లగింజలో బియ్యపు గింజ (121), ఏతావాతా (122), కొయ్యకట్టి కూర్చొను (127), అనములనుగాని, మినుములనుగాని (132), తూచి తులమెత్తు (129), పులుకూ పులుకూ మని (135), కోపానికి యోచనకు చుక్కెదురు (136), అక్కుర్లు బుక్కుర్లు (127), క్రిందపడి మీదపడి (129), పిండారబోసినట్లు (124). ముఖం తిరగడం (141), ఎంగిలి పది రమ్మని (141)

**ఉపమానాలు :**

1. అతని గొంతు ఆ వాతావరణంలో దట్టమైన వర్షానంతరం కాసే చక్కటి ఎండ కలిగించే అనుభూతిని కలిగిస్తుంది (130)
2. హరికేన్ లాంతరు దీపశిఖ స్పష్టాస్పష్టపు హృదయ స్పందన

వలె ...... వెలుతురులు విరజిమ్ముతోంది ( )

3. పద్మనాభం గారు మాటాడి విడిచిన వెనుక ఆ వాతావరణం లక్ష్మమ్మ పాలిట కారుమొయిళ్ళు కుంభవృష్టిగా కురిసి వెలిసిన సాయం సంధ్యలా ఉంది (132)
4. బయట వాకిట పున్నమరేయి వృద్ధచంద్రుని వెన్నెల కూడా అట్లాగే పేలవంగ వుంది (142)

**సామెతలు** :

1. పచ్చి వెలక్కాయ పడ్డట్టు (139)
2. ఆలిమీద కోపం రోలుమిద చూపాదన్నట్టు (147)

పై విధంగా అభిమానాలు అన్న నవలికలోని భాషా ప్రయోగాలు ఆశ్చర్యం కొల్పే విధంగా విచిత్రంగా ఉన్నాయి. కాళీపట్నం రామారావుగారి ప్రచురణల్లో ఇలాంటి భాషా ప్రయోగాలు అన్నిటిని ఒక దగ్గర చేరిస్తే మాండలిక పద కోశాన్ని తయారు చేయవచ్చు.

**ఆధార గ్రంథాలు** :

1. లిలిన మూర్తి సంపాదకులు : కాళీపట్నం రామారావు రచనలు, మనసు ఫౌండేషన్, బెంగుళూరు
2. Magazine.sarangabooks.com

❖ ❖ ❖

**BHAVAVEENA *Spl. Issue***
**Vol.19, Issue. 5, May 2022**
**ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253**

భావవీణ

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కారా మాస్టారు కథలు - వర్గ సమాజ నిర్మాణం తీరుతెన్నులు

**- డా॥ ఢిల్లీశ్వరరావు సనపల,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం, చరవాణి : 9441944208

జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్దిమంది తెలుగు కథా రచయితల్లో కాళీపట్నం రామారావు గారు ఒకరు. శ్రీకాకుళం జిల్లా పొందురులో 1924 నవంబరు 9న జన్మించిన కారా మాష్టారు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన కథకుడుగా ఎదిగారు. భాషా ప్రయోగంలో ప్రాంతీయత, వస్తువులో అభ్యుదయం, శిల్ప నైపుణ్యంలో స్వతంత్రత పొందుపరచి గొప్పదైన కథల యజ్ఞం చేశారు. కారా మాష్టారు కథల్లో దేశీయతతో కూడిన ఆత్మీయత దర్శనమిస్తుంది. ప్రతి మాటా ఆచీతూచి ప్రయోగించినతీరు స్పష్టంగా తెలుస్తోంది. కారా మాష్టారు కథల్లో వస్తు వైవిద్యంతో పాటు శైలీ నైపుణ్యం స్ఫురిస్తుంది. సంకల్పం, రాగమయి, అభిమానాలు, అభిశప్తులు, అశిక్ష-అవిద్య, పలాయితుడు వంటి కథల్లో కుటుంబ సంబంధాలు, మానవ జీవితంలోని అతి సున్నితమైన అంశాలును అనేక కోణాలలో చిత్రించగా అప్రజ్ఞాతం, ఇల్లు, చావు, భయం, జీవధార, కుట్ర వంటి కథల్లో మార్క్సిస్ట్ భావజాలంతో కూడిన సామ్యవాద సిద్ధాంత పోకడలు దర్శనమిస్తాయి. వర్గ సమాజపు అంతరాలు, కులవ్యవస్థ మొదలైనవి ఈ కథల్లో ప్రస్తావించబడ్డాయి, శ్రమదోపిడి, సంపద దోపిడీలు జరుగుతున్న తీరును చిత్రకారుడు కుంచె పట్టుకొని చిత్రించిన తైలవర్ణ చిత్రంవలే దర్శనమిస్తుంది.

అప్రజ్ఞాతం కథలో శ్రమదోపిడీ జరుగుతున్న తీరును వివరిస్తూ శ్రమదోపిడితో పాటు ఆర్థిక దోపిడీ ఆర్థిక ప్రవాహం కేంద్రీకరణ విధానం సుదర్శనం పాత్ర ద్వారా తెలియజేశారు. గ్రామాల్లో జరిగే అతి సాధారణ చర్చను వేదిక చేసుకొని శ్రమజీవుల సంపద దోపిడీ వంటి వాటిని గూర్చి పేర్కొంటూనే భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారి విధానాల మూల సూత్రాలను వివరించడం ఈ కథలో ప్రధాన వస్తువు. దేవాలయంలో యువకులమధ్య జరిగిన ఒక సాధారణ చర్చలో భాగంగా సుదర్శనం, బైరాగి, బుచ్చిలింగం, సూరప్పడు, షావుకారు కుమారులు, నారాయణయ్య పాత్రల మధ్య సంభాషణలు శ్రమదోపిడి, సంపద దోపిడీల మూల సిద్ధాంతాన్ని చర్చా రూపంలో వివరించబడింది. అంతేకాకుండా మార్క్సిస్ట్ భావజాల మూల సిద్ధాంతాలను పేర్కొన్నారు రచయిత.

పట్టణంలో బి.ఏ. పరీక్ష రాసి వచ్చిన సుదర్శనం తన గ్రామంలో అందరికంటే తనే ఎక్కువగా చదువుకున్న వ్యక్తి. గ్రామస్తులైన బైరాగి, బుచ్చిలింగం, నారాయణయ్య, షావుకారు కొడుకులతో కూర్చున్న సందర్భంలో సుదర్శనాన్ని వాదంలో ఓడించాలని ఒక్కొక్కరు ఒక్కో విధమైన ప్రశ్నలు వేయడం, వాటికి సమాధానాలు సుదర్శనం చెప్పడం అందులో భాగంగా ప్రశ్నకు బదులిస్తూ సుదర్శనం దోపిడీని గూర్చి ఇలా పేర్కొంటాడు.

సంభాషణలో భాగంగా "పెట్టుబడిదారి విధానంలో దోపిడీ ఉంది. ఆ దోపిడీ వల్ల రెక్కలు ముక్కలు చేసుకొనే వాళ్ళకు దక్కేది తక్కువ. దాదాపు సంపదంతా దాచుకొనే వాళ్ళకే దక్కుతుంది" అని అంటాడు సుదర్శనం. కూలీల శ్రమదోపిడీ జరుగుతుందంటే ఒప్పుకోని నారాయణయ్య ఆ దోపిడీ ఎలా జరిగిందో చెప్పమని సవాలుగా విసురుతూ "పాలేర్ల చేతా, కూలీల చేత పని చేయించుకుంటే వాళ్ళకు జీతమో కూలీయో ఇస్తున్నాం కదా అందులో దోపిడీ ఎక్కడుంది" అని ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా దోపిడీ ఎలా ఏ రూపంలో జరుగుతుందో సుదర్శనం ఇలా పేర్కొంటాడు "తగిన జీతం తగిన కూలీ ఇయ్యటం లేదు. వాళ్ళకు రెండు రూపాయిలు ముట్టవలసిన చోట రూపాయ ముడుతుంది" అంటాడు. రెండు రూపాయిలు కూలీకి బదులు రూపాయి కూలీకి కూలీలు ఎందుకు వస్తున్నారు? వారి ఆస్తులు దోచుకుంటున్నామా అని అడిగిన ప్రశ్నకు "అంతకన్నా ఎక్కువే దోచుకుంటున్నారు. దుడ్డు కర్రలు చూపి కాదు. ఆకలి రక్షసి కోరలను చూపి. నువ్వు పేదవారని

వెక్కిరించే పాలేర్ల వద్దా కూలీల వద్దా అమూల్యమైన శక్తి ఒకటి ఉంది. ఆ శక్తే మట్టిలోంచీ, ఖనిజంలోంచీ మనందరం వాడుకొనే సమస్త వస్తువులనీ తయారు చేస్తుంది. మీకు, ఆ ఫ్యాక్టరీ యజమానులకూ కావలసింది అతి విలువైన శ్రమశక్తి'' అని అంటాడు.

శ్రమశక్తిని అత్యంత తక్కువకు అమ్ముకోవల్సిన పరిస్థితులను భూస్వాములు, పెట్టుబడిదారులు ఎలాకల్పిస్తున్నారో పేర్కొంటూ ఇలా అంటాడు - "ఏ పూట ఆ శక్తిని అమ్ముకోకపోతే ఆ పూట వాళ్ళకు తిండి ఉండదు. ఆకలి రక్షసి పేగులు నమిలేస్తుంది. వరసగా కొన్నాళ్ళు తిండి లేకపోతే మాడి చస్తారు. వాళ్ళు అలాంటి నిరుపాయ స్థితిలో ఉండగా ఆ స్థితిని ఆసరాగా చేసుకొని ఇక్కడ మీరైనా, అక్కడ ఫ్యాక్టరీ వారైనా వాళ్ళ శ్రమని బేరమాడుతారు. ఏదో ఒక రేటుకి వాళ్ళ శ్రమ అమ్మడు కాకపోతే ఒక్కరోజైనా వాళ్ళు బ్రతకలేరు.

అందుకూ హీనక్రయానికైనా వాళ్ళు శ్రమశక్తిని అమ్ముకుంటారు'' అంటూ రెక్కాడితే గాని డొక్కాడని వేతన జీవుల వ్యధను పేర్కొంటాడు కవి. మరో విషయాన్ని కూడా కవి ప్రస్తావిస్తాడు. సామాన్య రైతులు సైతం కూలీల శ్రమను దోచుకోవడం కొసమెరుపు. సామాన్య రైతులు మొదలు భూస్వాములు, ఫ్యాక్టరీ యజమానులువరకూ వారివారి స్థాయిలో శ్రామికుల శ్రమను దోచుకుంటున్నారనే సత్యాన్ని తెలియజేస్తాడు. సామాన్య రైతులు పాలేర్ల, కూలీల శ్రమను దోచుకుంటే షావుకార్ల చేతిలో వ్యాపారులు, సామాన్య రైతులు మోసపోతున్నారనే వాస్తవాన్ని రచయిత పేర్కొంటాడు. సామాన్య రైతులు నుండి జరిగిన దోపిడీ వలన పోగైన సంపద ఆర్థిక వికేంద్రీకరణకు బదులు ఆర్థిక కేంద్రీకరణకు దారితీస్తుందనే విషయాన్ని పేర్కొన్నాడు కవి. సామాన్య రైతులు వడ్డీ వ్యాపారుల చేతుల్లో ఎలా దోపిడీకి గురౌతున్నారో సుదర్శనం మాటల్లో పేర్కొంటారు - కూలీలు రైతుల చేతుల్లో అన్యాయమైపోతున్నట్లే రైతులు, వ్యాపారులు, షావుకార్ల చేతుల్లో అన్యాయమైపోతున్నారు.

షావుకార్లు రైతులకి అప్పులిచ్చి అధిక వడ్డీల రూపంలోనూ, సరుకు కొనుగోలు రూపంలోనూ రైతుల్ని ఎలా దోచుకుంటున్నారో వివరిస్తూ "సంవత్సరం మొదటి రోజున అప్పుచ్చిన డబ్బుకి ఎంత వడ్డీ లెక్కవేస్తారో ఆఖరు రోజున ఇచ్చిన దానికి కూడా అంతే వడ్డీ లెక్క వేస్తారు. రూపాయికి మూడణాల వంతున నూటికి పందొమ్మిది రూపాయిల వడ్డీ'' అని పేర్కొంటూ షావుకారులు రైతులను ఎలా నిర్బంధంలోకి నెడుతూ సంపద పోగు చేసుకుంటున్నారో చెబుతూ- "నీ వద్ద అప్పు తీసుకున్న రైతు తన పంటను నీకే అమ్మాలి. ధర నిర్ణయించేది నువ్వు లేదా నీ సాటి వాడు ఇంకొకడు. కొలిచేది నీ కుంచంతో. పైగా కొలతలో చెక్కుపట్టు'' ధర నిర్ణయంతో, కొలతలో ఇలా అనేక విధాలుగా షావుకార్లు రైతుల్ని దోచుకుంటున్న విధానాన్ని పేర్కొంటాడు. కూలీలు, పాలేర్లు శ్రమ దోపిడీకి గురైతే రైతులు సంపద దోపిడీకి బలైపోతున్నారు. శ్రమదోపిడి కారణంగా కొందరు, సంపద దోపిడీ కారణంగా మరికొందరు బలైపోతున్న కారణంగా వర్గ సమాజం ఏర్పడి అంతరాలకు అవకాశం ఎలా జరుగుతుందో ఈ కథలో తెలియజేశారు. సమాజంలో ఆర్థిక అంతరాలు ఎలా పెరుగుతున్నాయో "అప్రజ్ఞాతం'' కథలో పేర్కొన్న విధానం సమాజంలోని సజీవ సన్నివేశాలకు సాక్షీభూతంగా నిలుస్తుంది. 20 సంవత్సరాల వయస్సులో నాలుగు వేలు సంపద కలిగిన సూరప్పడు 60వ ఏటకు వచ్చేసరికి రెండు లక్షల సంపదకు అధిపతి అయ్యాడు. రైతులుగా జీవితాన్ని ప్రారంభించిన బైరాగి, బుచ్చిలింగం వంటి వారు రైతు కూలీలుగా మారారు. ఆర్థిక కేంద్రీకరణకు ఇంతకంటే మంచి ఉదాహరణ ఇంకేముంటుంది. మనిషి జీవనానికి మించిన ఆస్తి ఉంటే అది అక్రమార్జనే అంటాడు రచయిత. కథలో సూరప్పడును గూర్చి ప్రస్తావిస్తూ అతడికి సంపద ఎలా పోగైందో వివరిస్తూనే సుదర్శనం చేత ఇలా పలికిస్తాడు - "మీకే కాదుఆస్తంటూ ఎవరి దగ్గరకు ఏ మేరకు చేరినా అది అన్యాయార్జితమే. న్యాయంగా సంపాదించిన డబ్బు భుక్తికి మాత్రమే సరిపోతుంది. కడుపుకి లేని పేదవాడు యీ లోకంలో ఉన్నంత కాలం అంతకు మించి చేసిన ఆర్జనంతా అన్యాయార్జితమే''. "ఎవడి పొట్టో కొట్టందే మన

పొట్టకు మించిన తిండి మన ఇంట్లో మిగలదు. పదిమంది ఆస్తి చెదిరితే గానీ ఒకడి ఆస్తి పెరగదు.'' పై మాటలు సంపద వికేంద్రీకరణను ఆకాంక్షిస్తుంది.

వర్గ సమాజ అంతరాలను చిత్రించే మరో కథ "ఇల్లు''. ఈ కథలో సామాన్యుడి అతి సాధారణ ప్రాథమిక అవసరాలు తీరడానికి కూడా ఒక జీవితకాలం శ్రమించాల్సిన పరిస్థితులను అంతర్లీనంగా ప్రస్తావిస్తాడు. కవి. సామాన్యుడు జీవితాంతం కష్టపడినా కేవలం నివాసానికి సరిపడినంత ఇల్లు కూడా లేని స్తితికి ఎవరు కారణం? ఏమిటి కారణం? రేయింబవళ్ళు కష్టపడినా నిలువ నీడ లేని స్థితి. తరాలుగా తిన్నా తరగని ఆస్తులు కొందరికి, నిలువ నీడలేని స్థితి మరికొందరికి. మధ్యతరగతి జీవనం గానుగెద్దు జీవితమని వివరించే మంచి కథ ఇల్లు. ఉన్నవాడు మరింత ఉన్నవాడౌతుండగా లేనివాడు మరింత లేని వాడౌతున్నాడు. నిచ్చెన మెట్ల సమాజంలో శ్రమ ఒకరిది, సంపద మరొకరిది. గృహప్రవేశం రోజున కూడా తూట్లు పడి రంగు వెలిసిన బట్టలే కట్టుకోవలసిన స్థితి పావన రామయ్యది.

వేతన జీవుల వెతలు ఎలా ఉంటాయో, మధ్యతరగతి జీవితం మానసిక స్థితి యేమిటో ఈ కథలో చక్కగా చెప్పారు. అత్యంత జాగ్రత్తతో కూడిన జీవన పోరాటం సాగించగా జీవితాన్ని జల్సాగా సాగించడం మరికొందరిది. ఇల్లు కథలో పావన రామయ్య ఇల్లు కొనడంలో ఆలోచించిన ఆలోచన, పిల్లల పెంపకంలో తన ఆర్థిక అసమర్థత తన బావమరిదితో వెల్లబుచ్చుతాడు. "ఈ యిల్లు కొనడమొక్కటే నేను నా జీవితంలో ఆడగల కొంటే నేను నా ముసలితనాన్ని ధైర్యంగా ఎదుర్కోగలుగుతాను. అదృష్టం బాగుండి ఇల్లు దక్కించుకోగలిగితే నాకన్నా నా పిల్లలు గొప్ప అదృష్టవంతులు కాగలరు.''

ముప్ఫై ఐదేళ్ళు టైపిస్ట్ కాపీయిస్ట్ గా పని చేసి రిటైర్ అయ్యే పావన రామయ్య ఆరువేలు పెట్టి ఇల్లు కొనడానికి మూడు నెలలు సతమతమయ్యాడు. తన బిడ్డలకి సరైన చదువు, జీవితం అందించలేని సగటు మధ్యతరగతి మనిషి వేదనకు ఉదాహరణ పావన రామయ్య. "వాడు నా కడుపున పుట్టి ఏమి సుఖం అనుభవించలేదు. తిట్లు, చివాట్లు, కసుర్లు, దెబ్బలు తప్ప ఒక్క అచ్చటా ముచ్చటా ఎన్నడూ ఎరగడు. దానికి నా పేదతనం కొంత కారణం.''

కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ లేకపోవడం ఎటువంటి సమాజానికి నిదర్శనమో ఆలోచించేదిగా ఉండే మాటలివి - బ్రతుకు బ్రతుకంతా శ్రమపడి కూడ బెట్టిందంతా ధారపోస్తే కాని ఒక గూడు రాకపోవడం చాలా అన్యాయం. "పశువులకూ, పక్షులకూ కూడా తమ స్వంత గూడంటూ ఉంటుంది. మనిషి చచ్చిందాకా బ్రతికి కూడా తమ స్వంత గూడంటూ కట్టుకోలేక పోతున్నాడు. దీనికి ఎవరిని ఏమనాలో తెలియడం లేదు.'' ఎవరిని ఏమనాలో తెలియడం లేదు అనే మాటలో ఆలోచనంతా దాగి ఉంది. అసలు మర్మం ఆలోచించమని కవి హెచ్చరిస్తున్నాడు. పంచభూతాలు సైతం సామాన్యుడు నుండి దూరం చేస్తున్న అదృష్య శక్తులను గమనించాలని హెచ్చరిస్తున్నాడు కవి.

"ఉద్ధతుల మధ్య పేదలకుండ తరమే?'' అంటాడు నృసింహకవి. ఆ మాటలే ఇక్కడ గుర్తుకు తెచ్చిన సందర్భమిది. పట్టణాల్లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే అటు ప్రభుత్వం ఇటు మేడలు కలిగిన పెద్దలు వారిని అక్కడ నుండి ఖాళీ చేయించేసే స్థితి. "మీ పాకలు అంటుకుంటే మా మేడ కాలిపోతుంది.'' ఇది ఏ సమాజానికి ప్రతీకో చెప్పకనే తెలుస్తోంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలే పాలనలో ఉన్నప్పటికీ అందిన వాడికి అన్నీ అంది, అందని వాడికి ఏమీ లేని స్థితి. "ఈ లోకంలో సాహసించి ఎవడు ఎంత తన బోరకిందకి లాక్కుంటే అంతే వాడికి దక్కుతుంది. నా వంతు నాకు న్యాయంగా వస్తుందన్నది భ్రమ'' అంటాడు కవి. నోరున్నవాడిదే ఊరు నొల్లుకు తిన్నవాడిదే కూడు అనే సామెతకు సరిపోతాయి పై మాటలు. పావనరామయ్య ఇల్లైతే కొనుక్కున్నాడు కానీ వీధి దీపాలు లేక ఇల్లు చీకటిలోనే ఉంది అని ప్రతీకాత్మకంగా పేర్కొంటూ "ఆ కాలనీలో కొత్తగా లేచిన భవనాల్లో చాలా వాటికి నిర్మాణం పూర్తి కాకముందే దీపాలు పడ్డవి. కానీ వెచ్చదనం కోసం వాటి

తలుపులన్నీ మూసి ఉన్నవి'' అంటాడు. ఇక్కడ చీకటి, వెలుగులు ఆర్థిక అసమానతలకు ప్రతీక. అవసరం లేకపోయినా కొందరికి అన్నీ లభిస్తున్నాయి.

అవసరమైన వారికి మాత్రం అంతా శూన్యం. వెలుగు అవసరమైన వారికి అంధకారం అవసరం లేని వారికి అనంతమైన వెలుగులు. ఈ వెలుగు ఆర్థికాసమానతలకు ప్రతీకలు. అందుకే కవి ఇల్లు కథ చివరిలో "ఇళ్ళలో బంధించిన వెలుతురులతో వీధుల్లో విహరించే చీకటితో ఊరికి ఉత్తరాన వెలుస్తున్న ఆ కొత్తవాడ కలకల్లాడుతూ కనిపించే కన్నె పిల్లలా కాకుండా అకాల వైధవ్యం దాపురించిన కాంతలా ఉంది'' అంటాడు. ఇక్కడ ఉత్తరం అనేది కుబేర స్థానం అనగా సంపన్నుల నివాస ప్రాంతం. చీకటి వెలుగులనేవి ఆకలి అనంత సంపదలకు ప్రతీకలు. అందుకే సమాజమనెడి స్త్రీ అకాల వైధవ్యం పొందిందంటూ ప్రతీకాత్మకంగా పేర్కొంటాడు.

ఆర్థిక అసమానతలను ప్రస్తావించే కారా మాస్టారి మరో కథ "చావు''. ఈ కథలో అన్నపురాశులు, ఆకలి మంటలు రెండూ ఒకే సమాజంలో ఉండే వర్గ అసమానతలను తెలియజేస్తుంది. రెక్కాడితే కాని డొక్కాడని కష్టజీవులు ఏ పూటకాపూటే పూట బత్యం వెతుక్కోవలసిన స్థితి ఒకవైపు. మట్టివాసన తెలియని భూకామందులు ఒక వైపు అలాంటి సమాజంలో పేదలకొచ్చిఅయన ఏ చిన్న కష్టమైనా తీరడానికి పడుతున్న ప్రయాసను ఈ కథలో వివరించాడు కవి. దళిత వాడలో ముసలమ్మ మరణం. ఆమెను కాల్చడానికి వాడలో నాలుగు మోపులు కర్రలు లేని స్థితి. కామాందుల వద్ద మోపుల కొద్దీ కర్రలున్నప్పటికీ దళితులకు ఇవ్వడని స్థితి. చివరకు బలప్రయోగంతోనే హక్కులు సాధన జరుగుతుందని ఈ కథ తెలియజేస్తుంది.

అంతర్గత సంఘర్షణ, అవధులు, పరిమితులు ఒక వైపు ఆ అవధులు దాటితే అనుకున్నది సాధించవచ్చునని చెప్పే చైతన్యం ఒక వైపు ఈ రెండింటి మధ్య అంతర్గత సంఘర్షణల నేపథ్యంతో కథ నడుస్తుంది. మార్క్స్ పేర్కొన్న అంతర్గత వర్గ సమాజ స్థితిని ఈ కథ తెలియజేస్తుంది.

పంచభూతాలనబడే గాలి, నీరు, నిప్పు, నేల, నింగి బడుగు బలహీనులకు దూరమై బలవంతుల బందిఖానాలో బలవంతంగా బందీయై పోతున్న స్థితి నేడు సమాజంలో అడుగడుగునా దర్శనమిస్తుంది. విషయాన్ని కవి ఈ కథలో పేర్కొంటాడు. ఆయువు తీరి అంతిమ యాత్రకు నాలుగు మోపులు కర్రలుకు నోచుకోలేని శవాలు, జీవచ్ఛవంలా మిగిలిన దీనస్థితి ఈ కథ చక్కగా వివరిస్తుంది. మొత్తం కుటుంబం పనికి పోతున్నా పిల్లల మొలకి సరైన గుడ్డ కప్పుకునే స్థితి లేదు. ఎముకలు కొరికే చలిలో పూరి గుడిసెలో కప్పుకోవడానికి ఒక దుప్పటి ముక్కైనా, గోనె సంచైనా లేని దీనస్థితి. "రాత్రి తొంగొందికి ఒక్క గోనె గుడ్డైనా లేదు. అన్నీ శవం మీదే ఉండి పోయేయి'' అని సిమ్మాద్రి పలికిన మాటలు వారి నిజస్థితి తెలియజేస్తుంది. శవంపైన కప్పిన గుడ్డలే తీసి పరుసుకోవలసిన పరిస్థితి.

పేదరికం, ఆకలి చాలవన్నట్లు కులం రక్కసి కోరలు ఎల్లప్పుడూ నిమ్నకులాలను వెన్నంటే ఉంటుంది. చావు కథలోని కులవివక్ష, పేదరికం శ్రమదోపిడీ సమాజస్థితిని తెలియజేస్తుంది. పొయ్యిమీదకి దొరికితే పొయ్యిలోనికి దొరకని స్థితి పేదలది. "పొయ్యిమీదకి దొరికే రోజుల్లో పొయ్యి కిందకి దొరకడం పెద్ద గగనం.'' ఉన్నవాడు మరింత ఉన్నవాడిగా లేనివాడు ఇంకా లేనివాడిగానే ఉండే సమాజ అంతరాన్ని దాని కారణాలను చావు కథ వివరిస్తుంది. తరాల తరబడి పగలనక, రాత్రనక శ్రమిస్తున్న పేదలు పేదలుగానే ఉండిపోతున్న వైనం, తలరాతలు మారని స్థితి సమాజంలో దర్శనమిస్తుంది. ఒకడు ఉన్నవాడిగా అనేక మంది లేనివారిగా ఉన్న సమాజంలో అవసరాలు కోసం, అవకాశం కోసం ప్రతిఘటన, తిరుగుబాటు అవసరం అంటాడురచయిత.

దోపిడీకి ప్రత్యక్ష కారణాలు భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ కాగా పరోక్ష కారణాలు అవిద్య, అసఖ్యత, అంతర్గత అసమానతలు, అధిక సంతానం, పరతంత్రత మొదలైనవి పరోక్ష కారణాలుగా కవి పేర్కొంటాడు. "మనం యేదన్నా ఎవుడి మట్టుక ఆడు తిన్నగ సూడం మంచికైనా సెడ్డకైనా అన్నిటికీ ఎవుడో ఒకడు

ఇదిలాగని సెప్పాల. ఈ పేట పెద్దరిక వెలలాగుందంటే ఆళకి తోసదు. ఇంకోడు సెపితే యినుకోరు. పోనీ లోకాన్ని సూసి నేర్సేనా నేర్చుకుంటారా? అదీ నేదు.'' ఈ మాటలు ద్వారా సమస్య అసలు ములాసేముటో చెప్పకనే తెలుస్తోంది.

మంచితనం పేరుతోనో, కర్మ సిద్ధాంతం పేరుతోనో అనగారిపోతున్న జీవితాలు గురించి పేర్కొంటూ "మనవంత ఏటనుకుంటావంటే పేద బతుకే పెద్ద బతుకనుకుంటాం. అడుక్కుతిన్నా తప్పుకాదు. అన్నేయం కూడు వద్దంటారే పెద్దలు. పాపం సేస్తే భగవంతుడు కట్టి కుడుపుతాడు. కుక్కలవవుతాం, నక్కలవవుతాం అన్నేయం అసిబోదంటారు.'' ''ఎవుడైతే నాయమని, దరమవని పూర్వీకులు సెలవిచ్చిన కట్టుబాట్ల కొసలకండ మందంతా నడిసిన దారినే నడుస్తాడో ఆడల్లా పేదోడు.'' మంది మొచ్చిన మంచోడు అడుక్కు తిన్నానికి, ఆణ్ణిమింగిన పెద్దోడు అందలాలెక్కడానికీ నడిపింది నీదారి'' అంటాడు. "చావు'' కథలో అప్పారావు పాత్ర ద్వారా కాలంతో పాటు మారలేని బ్రతుకులు కర్మ సిద్ధాంతపు కోరల్లో చిక్కుకొని నేటికీ విడలేని పరిస్థితి. దానిని పెంచి పోషిస్తున్నది వర సమాజ వ్యవస్థ అని ''చావు'' కథలో పేర్కొన్నాడు. సామాజిక బాధ్యత లేని సమాజంలో తిరుగుబాటు అనివార్యమంటాడు కవి. "బతికిన బతుకు సరే! సచ్చిన సావు కాడా మనుసులకి ఇదం పదం అక్కరలేదా! ఇప్పుడీ శవం ఎవుర్దీ? బతికున్న మనిషైతే నీది నాదీ సచ్చిన శవం ఊరందరిదీనూ'' అంటూ సామాజిక బాధ్యతను పేర్కొంటూనే "నీకవుసరం కాన్దానికే నువ్వడలైన గడ్డి కరిసినపుడు, అవుసరం కొద్దీ నాను సేస్తే తప్పా'' అంటాడు.

వ్యవస్థ మారాలంటే వ్యవస్థ ద్వారా బాధితుడైన వాడు మార్పును కోరుకోవడం అవసరం. బాధితుడే వ్యవస్థ మారాలని కోరుకోనినాడు, దానికై ప్రయత్నం చేయనినాడు వ్యవస్థ ఎన్నటికీ మారదంటాడు రచయిత. "రోగికే బతకాలని లేదు. అలాంటప్పుడు ఎంత వైద్యుడైతే మాత్రం ఏం చేయగలడు? అంటూ కర్తవ్య బోధ చేస్తాడు కవి.

ముగింపు:

కారా మాస్టారి కథల్లో వైవిధ్యం దర్శనమిస్తుంది. కొన్ని కథలు కళ్ళముందే జరిగే అతి సాధారణ సంఘటనల్లా అగుపించినా వాటి లోతు, పర్యవసానం చాలా దూరం విస్తరించి ఉంటుంది. సాధారణ సంఘటనలు, సందర్భాలను ఉదహరిస్తూ అత్యంత లోతైన విశ్లేషణ కారా మాస్టారి ప్రత్యేకత. "అప్రజ్ఞాతం'', ''ఇల్లు'', ''చావు'' కథల్లో ఇటువంటి లోతైన విశ్లేషణే దర్శనమిస్తుంది. వర్గ సమాజం ఏర్పాటు దానికి కారణాలైన సామాజిక, ఆర్థిక కోణాలు విశ్లేషణతో పాటు వాటి నివారణా చర్యలును విశ్లేషించి పేర్కొన్నారు. వివనమూర్తి గారన్నట్లు "కాశీపట్నం రామారావుగారు బహుశా తెలుగు సాహిత్యపు ఉమ్మడి గుర్తుగా చూడవలసిన వారు.''

**ఉపయుక్త గ్రంథాలు :**

1) యజ్ఞంలో పదేను - కావ్య పబ్లిషింగ్ హౌస్
2) ఆధునిక సాహిత్య ప్రక్రియలు - తెలుగు అకాడమీ ప్రచురణ
3) తెలుగు సాహిత్య విమర్శ - ఆచార్య వెలమల సిమ్మన్న
4) కాళీపట్నం రామారావు రచనలు - "రచనా'' శాయి - వివనమూర్తి

❖ ❖ ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

భావవీణ

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కా.రా. గారి కథలు - మానవ సంబంధాలు

– **డా॥ బి.శ్రీనివాసరావు**, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆముదాలవలస

"మానవ సంబంధాలను కథలలో ప్రక్షిప్తం చేయటం కష్టతరమే. కొంత నాటకీయత, ముసుగులు సహజం. సహజమైన మానవ ప్రవర్తనను కథలుగా తీర్చిదిద్దటమే కథకునికి కష్టమైన పని' అంటారు. ప్రముఖ కథారచయిత బుచ్చిబాబు. 1940-70 మధ్యల వచ్చిన కథలలోని క్రమపరిణామ వికాస దశలను గమనిస్తే కథలలో మానవ సంబంధాలు ఎక్కువగా చిత్రించబడ్డాయి. స్వాతంత్ర్యం అనంతరం మానవసముహాలలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాంతాల విభజన, కరువులు, అధిక వానలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు నడము గడచిన కాలంలో తెల్లబోయిన మానవత్వపు పతనంతో మానవ సంబంధాలు పల్చనవటం గమనించవచ్చు. ఆకలి కేకలు వంటివి ప్రాంతాలవారీగా కథలకు వస్తువులుగా మారాయి. ఎందరెందరలో రచయి(త్రి)లు తమ కథలకు 'మధ్య తరగతి' 'దిగువ తరగతుల' వారినే పాత్రలుగా చేసుకొన్నారు. వీరికి 'అనుబంధాలు' అంటే ఓ విధమైన వ్యామోహం. 'నవల' ముమ్మరంగా ప్రచారంలో ఉన్న కాలంలో కూడా రచయిత్రులందరూ ఈ అంశాన్ని కథ వస్తువులుగా చేసుకొన్నారు. కీర్తి, కనకాలను పొందారు. ముళ్ళపూడి, యర్రంశెట్టి, మల్లాది వంటి వారు హస్యానికి కూడా మధ్య తరగతి మానవ సంబంధాలను ఆలంబనగా మలుచుకున్నారు. కృతిమత్వంలేని సంబంధాలు, అనుబంధాలు, ఆప్యాయతలు వంటివి ఈ 'వర్గం'లో పతాకస్థాయిలో ఉంటాయి. కానీ... 'మానవ సంబంధాల నడుమ కనిపించని భ్రమలు శాతం కూడా ఎక్కువే కదా' అంటారు సంజీవ్‌దేవ్. నిజమే కావచ్చు. ఈ మధ్య వచ్చిన ఒక చలన చిత్రంలో 'మా మధ్య తరగతి కుటుంబాల్లోని అనుబంధాలు, ఆప్యాయతలు మీకర్థం కావు' అనే డైలాగ్ ఒకటి ఉంది కానీ... ఈ సంభాషణను దర్శకుడు ఆయా సందర్భాల్లో వినియోగించిన తీరు వల్ల దానిలోని 'సారాంశధ్వని'లో 'మార్పు' 'విసురు'లను గమనించాలి. ఇదే రకమైన 'ధ్వని' కథారచయితలు సహితం ఈ మావన సంబంధాలను కథలో నిర్వహించే సందర్భంలో ప్రతిఫలింపజేస్తారు. ఇక్కడ మరో విషయమేమిటంటే ప్రాంతీయత, భాష వంటివి కూడా మనుషుల మధ్య దగ్గరితనానికి, వారిలోని అంతర్గత అభిమాన ఆప్యాయతలు విస్తరించుకోవటానికి వినియోగం అవుతాయి. ఈ నేపథ్యం కూడా 'మానవ సంబంధం' పరిపుష్టం చేసుకోవడానికి, బలహీనపరుచుకోవటానికి కూడా వినియోగపడతాయి. మరో ప్రత్యేకమైన బంధం 'డబ్బు' డబ్బు 'మనిషి' జీవితాన్ని శాసిస్తుంది. మనిషి 'శ్వాసిస్తాడు' "మానవ బంధాలన్నీ ఆర్థిక బంధాలేనని కారల్ మార్క్స్ ఎన్నడో నిర్ణయించిన విషయం అందరికి తెలిసిందే. ఇటువంటి మానవ సంబంధాలను కా.రా. మాష్టారు వర్గచైతన్యానికి, సామాజిక అవకతకల ప్రదర్శనకు వేదికగా చేసుకొన్నారు.

ఈ రకమైన కథలను 1948-1955 వరకు రాసారు. 'పెంపకపు మమకారం' నుంచి 'అశిక్ష - అవిద్య' వరకు. కా.రా. మాష్టారి కథల్లో మూడు రకాల వర్గీకరణ ఉంది. ఆయా కాలాల్లో ఆయన రాసిన రచనల్లో నాటి సమాజం, భాష, ప్రాంతీయ అస్తిత్వాల వెనుక 'ఉద్యమం' కారణంగా 'మానవ సంబంధాలు' వెనుకనున్న శూన్యతను తెలియజేస్తాయి. ఇది ఆయన 'రచనలను ఆపి మౌనం' వహించిన సమయమంటారు సాహితీ మిత్రులు. మనిషి ధృక్పథంలో మార్పులకు ప్రేరణ కూడా ఈ సంబంధాలే అనేది ఆయన రచనల్లో కనిపిస్తుంది. మనిషి 'దాన కర్ణుడు' గా పిలిపించుకోవాలనుకోవటం తప్పు కాదు. కానీ... పైసలను దాచుకోలేక - సామాజిక స్థాయి, హోదాల కోసం 'పంపకాలు' చేయటం వలన 'ధనవంతుడు' పేదగా మారితే మానసికంగా, శారీరకంగా, సామాజికంగా కూడా కూలిపోక తప్పదు. ఈ అంశాన్ని సహితం కా.రా. మాష్టారు "కీర్తికాముడు" కథలో

వెంకయ్యనాయుడు పాత్రతో వివరిస్తారు. మనుషుల మధ్య 'సంబంధాలను' గాయపరిచేది, శిధిలం చేసేది 'డబ్బు' ద్రవ్య ఆర్థిక విధానం మనిషి జీవితాలలోని మరో కోణంను ఆవిష్కరిస్తుంది. దీనని 'స్వార్థమని' 'స్వయంకృతాపరాదమని' 'ఖర్మ' అని సరిపెట్టుకోమని 'బంధువులు' చెప్పటం మధ్య తరగతి, దిగువ తరగతి కుటుంబాలలోని 'బంధాలలోని డొల్లతనం' ను తెలియజేస్తుంది. ఒక వ్యక్తి 'దోపడిడికి', అతనికి జరిగే 'దోపడికీ' మధ్య 'నైతికంగా' ఉన్న తేడా - ఈ సందర్భంలో ఆయా పాత్రల నడుమ జరిగే సంభాషణల కూడా ఈ డొల్లతనాన్ని తెలియజేస్తాయి. 'పలాయితుడు' అన్న కథలో 'పల పక్షపు సంపద పంపకానికి' కారణం ఈనాడు మానవుడనుసరిస్తున్న ఆర్థిక విధానమని (ఇందుకు హేతువేమిటి?) కథలోని ప్రధాన పాత్ర రాజశేఖరం తెలుసుకుంటాడు 'ఈ జూదగొండి ఆర్థిక విధానం హస్తాలలో ఇరుక్కొని ఉన్నంతకాలం మానవజీవితాలను మన ప్రయత్నంతో ఆనందమయం చేసుకోలేము' అంటారు. కానీ... వీటి వెనుక కనిపించే కబంధహస్తాల అన్వేషణ ఎవరికి వారు చేయవలసిందే. విశ్లేషించుకోవలసిందే. మధ్య తరగతి కథల్లో వినిపించే మానవ సంబంధాలలో కూడా కా.రా. మాష్టారు సామాజిక పరిణామాన్ని గూర్చి లోతుగానే ఆలోచిస్తారు. సమాజంలో వస్తున్న మార్పులపట్ల, ఆ మార్పుల వెనుక ఉన్న వాస్తవ అంశాలను 'కథ' వివరిస్తుంది. కానీ.. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే మాష్టారి కథలు ఏవి 'అసలు విషయాన్ని సూటిగా' చెప్పవు. పాఠకుడు అర్థం చేసుకోవలసిందే. "కా.రా. రచయితగా భయస్తుడు. పరిష్కారాలన్నీ తెలిసి స్పష్టంగా దేన్నీ చూపరు" అంటారు. కె.వి.ఆర్ కానీ... ఆయన (కా.రా) 'యజ్ఞం' 'చావు' 'శాంతి' వంటి కథలను కూడా రచించారనే విషయం విస్మరించరానిది. మానవ మస్తిష్కాలకు పదునుపెట్టి అలసేటట్టు చేసే ఈ సమాజం. ఆర్థిక అసమానతల, వర్గ చైతన్యం, దోపిడి వంటి వాటిని మాష్టారు తన కథలకెందుకు 'వస్తువు'లుగా తీసుకున్నారనే ప్రశ్న వెనుక 'రచయితగా కా.రా గారికున్న రెండు అసాధారణ శక్తులను గురించి కూడా తెలుసుకోవాలి.

అవి జీవిత పరిశీలన, మాటను విని రికార్డు చేసుకోగల నైపుణ్యం' అంటారు వల్లంపాటి వారు. 'శాంతి'లో ధనిక జీవితం వెనుక సంబంధాలను వివరించినా, 'చావు'లో నిరుపేద జీవితాన్ని వర్ణించినా ఎక్కడా తన సహజత్వాన్ని కోల్పోని తత్వం ఆయనది. అదే విధంగా 'చావు'లో ముసలిదాని శవాన్ని వర్ణిస్తే పాఠకునికి శవం కుళ్ళిపోతున్న వాసన కూడా వస్తుంది. ఇదీ ఆయన రచనలోని 'కథన శిల్పం' యొక్క నైపుణ్యం కా.రా.మాష్టారి కథల్లో శ్రీకాకుళం యాస, భాష ఎక్కువగా కనిపిస్తుంది. దీని వెనుక మానవ సంబంధాలలోని లోతు, క్లిష్టత, శూన్యత వంటి వాటిని' తనకు పరిచయమున్న 'సహజమైన సమాజ నేపథ్యంను ఆయన వారధిగా ఎంచుకున్నారు. కారణం - ఆయన జన్మస్థలం, ఉద్యమమైనవి. కనుకనే ఇక్కడి 'మనుషులనే' 'తన కథల్లో పాత్రలుగా చేసుకొన్నారు. వాటికి తనకనువయిన, ఎటువంటి కృతకత లేని భాషనే వాడుకున్నారు. విజయవంతమైనారు. భాష, జీవిత వాస్తవికతలో ఒక ప్రధానమైన అంశం. ఏ ప్రాంతపు జీవితాన్ని ఆ ప్రాంతపు భాషలో రాయకపోతే ఆ జీవిత చిత్రణ మీద విశ్వసనీయత కలగవు. ఆ ప్రాంతపు ప్రజలు ఉపయోగించి 'పదబంధాలు' వెనుక పెనవేసుకుపోయిన 'బంధాలు' కూడా సహజంగా ఆవిష్కృతమవటానికి 'భాష' ముఖ్యవసరమని కా.రా. మాష్టారు గుర్తించారు. తరువాత వచ్చిన అట్టాడ, గొరునాయుడు, మల్లిపురం వంటి వారు దీనిని కొనసాగించారు - కొనసాగిస్తున్నారు. (అప్పలనాయుడు గారు తన 'బహుళ' ద్వారా మరోసారి ఈ భాషకు విశిష్టస్థాయి కల్పించారు).

కా.రా. మాష్టారు రాసిన కథల్లో 'అభిమానాలు' ఈ మానవ సంబంధాల్లోని ఎన్నెన్నో కోణాలను ఆవిష్కరిస్తుంది. ఇదో బ్రాహ్మణ కుటుంబం కథ. కుటుంబంలో పెనవేసుకొన్న అభిమానాలు ప్రాధాన్యత, వాటిలోని క్లిష్టతలు ప్రధానాంశం. ఈ కథలో పద్మనాభం, భాస్కరం, లక్ష్మిమ్మ, రాఘవి, చలపతి ముఖ్యపాత్రలు. ఈ కథ వలన సమాజానికి ప్రయోజనం లేదు అనే విమర్శకులు కూడా ఉన్నాయి. కానీ రామారావు

గారి కథలు ఒక్కసారే ఆవిష్కరించుకొని, విడివిడిగా ముక్కలు చేసి చర్చించుకోదగినవి కాదు. ఒకటికి నాలుగుసార్లు చదవ వలసిందే. సారాన్ని కాల పరీక్ష నాళికలో పరీక్షించి విశ్లేషించుకోవలసిందే. ఈ కథలో అవసరాలతో కూడి అనుబంధాలు, అనుమానాలు, ఆవేదలనలతో కూడిన మానవ సంబంధాల వెనుక సామాజిక, శాస్త్ర (మానసిక) సంబంధ అంశాలు మిళితమై ఉన్నాయనేది సత్యం. ఈ కథలో పాత్రల మధ్య సంఘర్షణలు, అభిమానాల ముసుగులో అణచిపెట్టబడిన క్రౌర్యం వ్యక్తం చేసారు రచయిత. ఎవరికెవరూ తమ ఇబ్బందులను హాయిగా చెప్పుకో(లే)రు. వీటికి ఎన్నెన్నో 'కనిపించని సంకెళ్ళున్నాయి'. ఈ సంకెళ్ల వెనుక 'నిస్సహాయత' 'కక్ష' 'జంతుతత్వం' వంటివి కనిపిస్తాయి. భర్త (పద్మనాభం) భార్యతో (లక్ష్మమ్మ) మానవ సహజమైన లైంగిక ప్రేమ వ్యక్తమయ్యేలా ఉండడు. ఏదో 'అధికారం' ఇచ్చే గొంతు నుంచి ఆయన మాట్లాడతాడు. ఈ నిస్సహాయతను ఆమె తన కొడుకు కోసం 'ఏడుపు'గా మార్చుకుంటుంది.

అంటే సమాజం అంగీకరించే విధంగా ప్రదర్శించి తన కోరికల్ని తీర్చుకుంటుంది. మొత్తం కథలో గమనించవలసిన విషయం ఏమిటంటే (మధ్య తరగతి) మానవ సంబంధాలలోని ఓ నాటకీయమైన పరివర్తన' (ప్రవర్తన) ఉన్నాయని. పాత్రలన్నీ అణగారిన కోర్కెలతో తమలో తామే అణగిపోతుంటాయి. తమలోని ఈ 'ఘర్షణ' తమ వారి మీదనే కసిగా మారుతుంది. దీనికి అభిమానాలు - అనుబంధాల ముసుగులో తమనుతాము హింసించు కుంటూ, తమ వారిని హింసించటం. బయటకు కనిపించని మధ్య తరగతి (ఏ కుటుంబమైనా) వారిలో ఇంత భయంకరమైన 'హింస' అంతర్లీనంగా ఉంటుంది. కానీ... సమాజం ఇది గుర్తించదు. మనుషులు 'సహజమే' కదా అనుకుంటారు, 'భుజాలు తడుము'కుంటారు. తరతరాలుగా వస్తున్న ఆస్తుల్ని, హక్కుల్ని 'క్రమ పద్ధతి'లో రక్షించుకోవడం కోసం ఏర్పడిన ఉమ్మడి కుటుంబం వ్యవస్థలో వ్యక్తి చైతన్యం ఆరోగ్యకరమైన పద్ధతిలో ఎదగదని, బోనులో పెట్టిన జంతువుల్లా వ్యక్తులు ప్రవర్తన ఉంటుందని ఈ కథ తెలియజేస్తుంది. ఇటువంటి కథలే రామారావు గారి కథలన్నీ. ఈ కథలో ఓ 'సామాజిక స్వరూపం' ఉంది. అంతరంగాలను 'అనుబంధాల'లో త్రొక్కివేస్తున్న భావజాల వ్యవస్థ స్వరూపం ఉంది. మానవ సంబంధాలలోని అనేకానేక కోణాలను ఎంతో విభిన్నంగా చిత్రిస్తాయి. శ్రీ కాళీపట్నం రామారావు గారి కథలు.

**ఆధార గ్రంథాలు:**

- 'కథాశిల్పం' - వల్లంపాటి - విశాలాంధ్ర - 1995
- కాళీపట్నం రామారావు రచనలు - ప్రొగ్రెసివ్ ప్రచురణలు - 1999
- సాహితీసుధ - విజేత కాంపిటషన్స్ - 2015

❖ ❖ ❖

# కాళీపట్నం రామారావు జీవితం - కథల్లో సమాజ చిత్రణ

**- బి.క్యాథరీన,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ సిటీ కాలేజ్, హైదరాబాద్.

కాళీపట్నం రామారావు 1924 నవంబరు 3వ తారీఖున ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని 'పొందురూ' గ్రామంలో జన్మించారు. అయిదుగురి సంతానంలో అందరికన్న పెద్దవారు. రామారావు 1929-33ల మధ్య మురపాకలోనే 4వ తరగతి వరకూ చదువుకున్నారు. ఆరవ తరగతిలో రామారావుకి అల్లరి చిల్లర తిరుగుళ్ళూ చుట్టలూ, పేకాటలూ అలవాటయాయి. బడి ఎగ్గొట్టి ఆటలాడటం నేర్చి పరీక్ష తప్పారు. శ్రీకాకుళం పట్టణంలో చక్రపాణి వెంకట్రావు అనే హయ్యర్ గ్రేడ్ ఉపాధ్యాయునికి అప్పగించారు. ఆ అనుభవాలు ఛాయలు. అభిమానాలు కథలో కనిపిస్తాయి. పెద్ద పెద్ద కవులు బాల్యంలో అల్లరి చిల్లరగా తిరిగిన వాళ్ళే తరువాత మహాకవులయ్యారు. తిలక్పాత్రతో పాటు రామారావు పాత్రల్ని కూడా పేర్కొనవచ్చు.

1940మార్చిలో పుల్లెల సత్యనారాయణ గారింట్లో ఉండి పదవ తరగతి పరీక్షకి కూర్చుని పాసయ్యారు. మురపాకలో రామకృష్ణ గ్రంథాలయంలోని పుస్తకాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. 1941-42 విద్యా సంవత్సరం శ్రీకాకుళం గుడివీధిలో పుల్లెల వారింటో ఉండి యస్.యస్.యల్.సీ చదువుకొని పరీక్షరాసి పాసయ్యారు. వేదుల, జాషువా, కరుణశ్రీల ఖండకావ్యాలలో పరిచయ మయింది. సౌందర్యలహరి, రామాయణం వంటివి. ఫిబ్రవరి 43లో పెద్దచెల్లిలి వివాహం జరిగింది. 1943వ సంవత్సరంలో సెప్టెంబరు 1వ తారీఖు 'చిత్రగుప్త'లో కార్డు కథలు శీర్షికలో రామారావు 'ప్లాటుఫారమో'' అనే రచనను ప్రచురించారు. ప్రచురణలో ఆయన మొదటి రచన అదే ! 1963లో 'భారతి' వారు తిప్పి పంపిన 'వధ' కథను ఆయన తిరిగి ఏ పత్రికకీ పంపలేదు.

1943 నుంచి విశాఖపట్నంలో ఎక్కువగా నివసించిన రామారావు అనేక ఉద్యోగాలు చేశారు. డిస్ట్రిక్ కోర్టులో కాపీ సెక్షన్లో రీడర్ చేరారు. అదే తొలి ఉద్యోగం. రెండవసారి ఇల్లు వదిలివెళ్ళి తిరిగి వచ్చాక కోటవురట్ల రిసీవర్స్ ఆఫీస్లో టైపిస్టుగా చేరారు. ఆ ఉద్యోగంలో కొన్ని నెలలు పనిచేసి స్వశక్తి మీద వచ్చింది కాదని భావించి మానేశారు. 1945లో మూడవసారి రామారావు యింట్లో తెలియబరచకుండా ఏదైనా పత్రికలో ఉద్యోగం సంపాదించుదామని మద్రాసు వెళ్ళారు. అప్పుడే శ్రీశ్రీని కలిశారు. ఏ ఉద్యోగమూ రాలేదు. ఆకలితో మద్రాసు రోడమ్మట తిరుగుతున్న రామారావుని ఒక "గుంటూరు సజ్జనుడు ఆదరించి సహాయం చేసి విశాఖపట్నం తిరిగి పంపాడు. రామారావు 'రాగమయి' అనే పెద్ద కథను లేదా చిన్న నవలను ఆ పెద్దమనిషికి అంకితం యిస్తూ యిలా రాశారు. జీవితం వ్యర్థమని విపరీతమైన అశాంతిలో రామారావు ఆత్మహత్యా నిర్ణయం తీసుకున్నారు. యాదృచ్ఛికంగా ఆ ప్రయత్నం విఫలమయింది. తన కథలలో పాత్రలు ఆత్మహత్య పరిష్కారాలు యివ్వరాదని నిర్ణయించుకున్నారు.

విశాఖ పట్నం స్టాఫ్ ఆఫ్ రాయల్ ఇంజనీర్స్ ఆఫీసులో గుమస్తాగా కొన్నాళ్లు పనిచేసిన రామారావు అదే ఊరిలో ఇంజనీరింగ్ స్టోర్స్ డిపోకి బదిలీ అయ్యారు. 1946 మార్చి 19వ తారీఖున రామారావుకి సీతామహాలక్ష్మితో వివాహం జరిగింది. అప్పటికి ఆయనకి 21 సంవత్సరాలు. వివాహం జరిగిన కొద్ది నెలలలోనే 80 రూ. జీతం వచ్చే స్టోర్స్ డిపోలోని ఉద్యోగానికి రాజీనామా చేశారు. తన సాహిత్యాసక్తికి ఉపాధ్యాయ వృత్తి సానుకూలంగా ఉంటుందన్న ఆశతో 30 రూ. జీతం... దొరకటానికి అవకాశం గల ఉద్యోగం కోసం భీమునిపట్నంలో సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్లో చేరారు.. ఆ ట్రైనింగ్ సమయంలోనే రామారావుకి భళ్ళమూడి

నారాయణరావు స్నేహమూ, అతని ద్వారా మార్క్సిజంతో పరిచయమూ కలిగింది. 'అప్రజాతం' అనే కథలో ఆయనకి మార్క్సిస్టుల పట్ల అప్పటికి గల దృష్టి కొద్దిగా తెలుస్తుంది.

కాళీపట్నం రామారావు జీవిత సంఘటనల్ని, పాత్రల ప్రవర్తనల్ని, వాళ్ళ మాటల్ని వున్నవి వున్నట్టుగా ఎంతో వాస్తవికంగా రాశారు. రామారావు గారికి మనుష్యుల నైజాల్ని నిశితంగా పరిశీలించే నేర్పు వుంది. కాని అదొక్కటే ఆయనలో చెప్పుకోదగ్గ విశేషమైతే రామారావు మంచి రచయిత అవుతారుగాని గొప్ప రచయిత అవరు. గొప్ప రచయిత కావటానికి అంతకన్నా విశేషం ఏదో వుండి వుండాలి. ఆయన రాసిన తొలి కథల్లోది "అభిమానాలు" అనే కథ. రెండోది. ఆయన తర్వాత రాసిన కథల్లో అందరికీ ప్రచురంగా తెలిసిన "యజ్ఞం" "అభిమానాలు" బ్రాహ్మణ కులం వాళ్ళ కథ. కుటుంబంలోని వాళ్ళు ఒకరి మీద ఒకరు చూపించుకునే అభిమానాలు, వాటి క్లిష్టతలు ప్రధానాంశం. ఈ కథలో పాత్రల్ని మాత్రం ఒకసారి జ్ఞాపకం చేస్తాను. పద్మనాభం గారు. ఆయన తమ్ముడు భాస్కరం, భార్య రాఘవి, పద్మనాభం గారి కొడుకు చలపతి వీళ్ళు ముఖ్య పాత్రలు.

ఈ కథలో కొంతసేపు చదివాక గాని తెలియదు. పద్మనాభంగారూ, లక్ష్మమ్మ గారు భాస్కరాన్ని చిన్నప్పటి నుంచి కొడుకులా పెంచి పెద్దచేశారని భాస్కరం తన తండ్రిలాంటి అన్నగార్ని కాదని రాఘవిని పెళ్ళి చేసుకున్నాడని ఆ తరువాత అన్నగారు కక్షపట్టి భాస్కరాన్ని వెలివేశారని చివరికి భాస్కరం కూతురు బారసాలకి కూడా వెళ్ళలేదని. సరే ఇది అర్థమైంది. కాని ఇక అసలు విషయం పద్మనాభం. పద్మనాభంగారు తన కొడుకు చలపతి పట్నంలో హైస్కూలులో చేర్పించారు. వుళ్ళో ప్రవేటు మాస్టారిని ఇంట్లో వాడికి బస ఏర్పటు చేశారు. ఆ మేస్టరు ఓ కర్కోటకుడు. వాళ్ళ ఇంట్లో చలపతి నానా కష్టాలు పడుతున్నాడు. చలపతి బాస్కరం దగ్గర పెట్టి చదివించొచ్చు. ఈరెండు కుటుంబాల మధ్య సంబధాలు సజావుగా వుంటే అదే జరిగేది. తనని కొడుకుగా పెంచి పెద్దచేసిన అన్నగారి కొడుకుని తన కొడుకుగా చూసుకొని దగ్గర పెట్టుకొని చదివించి తను తృప్తి పడగలడు భాస్కరం. ఆ తృప్తి భాస్కరానికి లేకుండా చేశారు పద్మనాభం.

భాస్కరానికి తండ్రి స్థానంలో వున్నారు. తన కొడుకు లాంటి భాస్కరం తన ఇష్టాని కాదని రాఘవిని పెళ్ళి చేసుకోవడం ఆయన భరించలేని సంఘటన. అలా తన మీద తిరగబడ్డ కొడుకు మీద అతని తగని కక్ష. అది ఆయన వొప్పుసుకుంటే దాని నుంచి ఆయన విముక్తి అయ్యేవాడు కానీ అభిమానం పేరుతో ఆ కక్షను ఆయన అణగదొక్కు కుంటాడు. తీర్చుకోలేని బయట పెట్టుకోలేని ఈ కక్ష ఆయన్ని జంతువుగా మారుస్తుంది. నిస్సహాయుడుగా వున్న తన సొంత కొడుకు మీద ఆయన కసి తీర్చుకోవడం మొదలు పెడతారు. మళ్ళీ ఇది కూడా ఆయన అభిమానం పేరుతో చేస్తాడు.

తరతరాలుగా వస్తున్న ఆస్తుల్ని, వాటి హక్కుల్ని ఒక పద్ధతిలో రక్షించడం కోసం ఏర్పడిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వ్యక్తి చైతన్యం ఆరోగ్యకరమైన పద్ధతిలో ఎదగదనీ, బోనులో పెట్టిన జంతువుల్లా మనుషులు ప్రవర్తిస్తారని రామారావుగారు గుర్తించారు. ఆ భయంకర పరిస్థితిని చిత్రించిన బలీయమైన కథ ఇది. కేవలం మధ్య తరగతి కుటుంబాలలో అభిమానాలు చిత్రిస్తున్నట్లు అమాయకంగా కనపడే ఈ కథలో అంతర్గతంగా ఒక సామాజిక స్వరూపం వుంది. ఆ సమాజంలో వ్యక్తులు అంతరంగాలను నిర్మించే, నిర్ణయించే భావజాల వ్యవస్థ స్వరూపం వుంది. ఆ కథల్లో గొప్ప కథలు చాలా వున్నాయి. యజ్ఞం, ఆర్తి, భయం, చావు, నో రూమ్. కాశీపట్నం రామారావు కథ మనకి చెప్పరు. కథ జరుగుతుంటే ఆ జరగుతున్న క్రమంలో జరుగుతున్న సంఘటనలే మనకి కథ చెప్పేలా చేస్తారు. కాశీపట్నం రామారావు కథలు ప్రపంచ సాహిత్యంలో గొప్ప స్థానం

పొందాయి. ఆయన తొలి కథల్లో చాలా భాగం మధ్య తరగతి కుటుంబాల గురించి రాసినవి. "యజ్ఞం" కథతో ఆయన పల్లెటూళ్ళ పేద రైతుల నిరుపేద కుటుంబాల జీవితాల గురించి రాయటం మొదలు పెట్టారు. ఇవి మనం భరించలేని అశాంతిని మనలో కలిగించి మనకి ఏమితంగా నిద్రపట్ట కుండా చేస్తాయి. మనకి ఎడతెలియకపోవడం వల్ల మన జీవితాల్లోనూ, సమాజంలోనూ వున్న పరిస్థితులతో సర్దుకుపోతూ. బతుకుతున్నామో అది తెలియజెప్పిస్తాయి. ఇంక తర్వాత మనం నిబ్బరంగా వుండలేం. వున్న పరిస్థితులకి మనం కారణమనేనా ఒప్పుకోవాలలేదా అని మార్చడానికి బార్యలేనా వహించాలి. గొప్ప పుస్తకాలు మనకి హాయి కలిగించవు. నిలదీని ప్రశ్నిస్తాయి ? నిలబెట్టి నడిపిస్తాయి. ఇక కథానిక లోనికి వెళ్తే

వ్యాపారం పేరుతో తమ వద్దకు చేర్చుకొని హరిజనునికి అప్పు మోపిన సవర్ణుల కథ. సుందరపాలెంలో అప్పల్రాముడు మాలకులస్థుడు. డెబ్భై సంవత్సరాల వృద్ధుడు. రెండెకరాల పొలం ఉన్న పేదరైతు ! అతనికి నలుగురు కొడుకులు. ఆ ఊళ్ళోనే గోపన్న అనే రైతు. ఒకప్పుడు బాగా బతికి ప్రస్తుతం పూర్తిగా చితికి పోయి నిరుపేద స్థితిలో వున్న పాతషావుకారు. అతని కొడుకులంతా పొట్టచేత పట్టుకొని ఊరొదిలి వెళ్ళిపోయారు. గోపన్న ఒక విధవ కూతుర్ని, ఐదుగురు మనుషుల్ని పోషిస్తూ, వుండీ, లేక కాలం గడుపుతున్నాడు. అప్పల్రాముడు గోపన్నకి కొంత అప్పు పడ్డాడు. ఆ అప్పు తీరడానికి అప్పల్రాముడు మూడేళ్ళ గడువు అడిగాడు. ఆ గడువు తీరిపోయి ఆ రోజు పెద్దలందరూ న్యాయమంటపంలో పంచాయితీ పెట్టారు. అప్పల్రాముడు అప్పు క్రింద పొలం అమ్మాలని అప్పల్రాముడు కుటుంబానికి ఐదెకరాల బంజరు భూమి నిప్పిస్తామని, కూలీకి నాలీకి కూడ మున్ముందు అప్పల్రాముడు కుటుంబాన్నే పిలిపించి సహాయం చేస్తామని ఈ తీర్పుకు ఒప్పుకోమని పెద్దలు చెప్పారు. అప్పల్రాముడు తను చెప్పుకోవలసింది చెప్పుకొన్నాడు. అసలు తన అప్పే అన్యాయమైందని అయినా తీర్చక తప్పదంటే భూమి అమ్ముకోవడం తప్ప ఇంకో విధమైన తీర్పు చెప్పమని, తమకు ఇస్తామన్న బంజరుభూమిని గోపన్నకే ఇప్పిస్తే అందులో తమ కుటుంబం వాళ్ళంతా పని చేసి అప్పు తీర్చుకుంటామన్నారు. పంచాయితీ పెద్దలు తమ తీర్పు మార్చుకోలేదు. అప్పల్రాముడు చివరిగా ఆ తీర్పునే అంగీకరించి పొలం అమ్మేశాడు. అతని కొడుకుల్లో ముగ్గురు ఆ తీర్పుకే కట్టుబడ్డారు. కాని చివరి కొడుకు సీతారాముడు మాత్రం పొలం వదలడానికి ఒప్పుకోలేదు. ఒప్పుకోనని ఇది వరకే తండ్రికి చెప్పాడు. ఇప్పుడు తండ్రి పొలం వదలడాన్ని చూసి సీతారాముడు ఉగ్రుడైపోయాడు పురోణి పత్రం మీద వేలు ముద్రవేయడం మానేసి గిరుక్కున వెనక్కు తిరిగి మాలపేటవైపు వెళ్ళిపోయాడు. ఏం జరుగుతుందోనని అందరూ సీతారాముడు వెళ్ళినవైపే చూస్తున్నారు సీతారాముడు ఒక ఐస్తామూట భుజాన వేసుకుని అందరి మధ్య బస్తాగుమ్మరించాడు. అందులో నుంచి పసిబిడ్డ మొండెం, తల, కిందపడ్డాయి. సీతారాముడు తండ్రితో " నాకొడుకు మీద నాకాశక్కువ. నా కొడుకు బానిస బతుకు బతకడు. నా కొడుకు కంబారికాడు." అన్నాడు. అంతేకాక భూమి వదలద్దంటే విన్నాడవు కావు, మేమందరం ఎలాపోయినా సరే అప్పల్రాముడు మాత్రం ధర్మం తప్పని వాడనిపించుకోవాలనే గొప్ప కోసం పొలం అమ్మేశావు నా కొడుకు బానిసగా ఉండటం కన్నా చావటం నయమన్నాడు. ఇంతటితో కథ ముగుస్తుంది.

ఈ కథలో 'తిండి లేకపోతే, నేను నా మనవలు నా కూతురు పస్తులుండి చస్తాము. కాని ఇక్కడ న్యాయం దొరకలేదని మిమ్మునెపం పెట్టం. పది కాలాలపాటు యీ న్యాయమండపం వర్ధిల్లి నాకు నా మనవలకూ కాకపోయినా, తక్కిన వారికైనా యిక్కడ న్యాయమన్నది దొరకడమే నా కోరిక. అంటూ కూర్చుండి పోయాడు గోపన్న." చివరిలో గోపన్న వూపిన పూపు సభవారి గుండెలు కదిపింది. తరువాత

అప్ప్రలాముడు కూడ తాను చెప్పుకోవలసింది చెప్పుకొంటూ చివరగా తన కొడుకు తనతో అన్నమాటలు వినిపించాడు. "ఓరయ్యా ! నేనిన్ని మాట్లాణ్ణి గాను. ఆ తరువాత సెప్పలేదనకు. బూవమ్మావా నిన్ను నిరికిపోగులెట్టి నన్ను నేను నరుక్కుసస్తాను. ఇది నిజం. ముమ్మాటికి నిజం." అన్నాడు. అప్ప్రలాముడు తన కొడుకు వైఖరి స్పష్టంగా పంచాయితీ ముందు పెట్టినా, ఏ ఒక్కరి సానుభూతి లేదు. కారణం అప్ప్రలాముడు ఒక దళితుడు, వాడు సచ్చినా, ఒకరి నొకరు సంపుకొన్నా పరవాలేదు. ఇది పరిస్థితి. గోపన్న దయనీయమైన స్థితిలో వున్నాడు. నిజమే. అతనికి రావలసిన వడ్డీల మీద వడ్డీని సమర్థించేది మానవత్వానికి చెందిన న్యాయం కాదు. ఎందుకంటే అసలు అప్పు న్యాయమైంది కాదు. కనుక "ఆ బాబు నోటి మీదుగా యిది న్యాయమైన అప్పేనని ఒకసారి సెప్పించు. అణా పైసలతో ఒక్క ఎర్రని ఏగానీ మాఫీ అడక్కుండా నానీ అప్పంతా, తీరుస్తాను. అలా తీర్చన్నాడు యీ మాలాయాదవ ఓ అమ్మా అబ్బలకు పుట్టలేదు." అని తీవ్రస్వరంతో అప్ప్రలాముడు మాటలివి.

దళితుల అజ్ఞానం, అమాయకత్వం, విద్యావిహీనత ద్వారా జరిగే అన్యాయం చాలా స్పష్టంగా యీ కథలో కనబడుతుంది. దళితులు దైన్యస్థితికి లోను గావలసి వచ్చింది. ఈ విషయం అప్ప్రలాముడు స్పష్టంగా అంటాడు. "బాబయ్యా నీవు కోపం తెచ్చుకోకు నువ్వూరికుపకారం సేసినవన్నీ మాకొంపలు ముంచడానికొచ్చినట్లు మాటడ్నారు. నువ్వు రోడ్డేయించినావు నువ్వేయించిన రోడ్డడ మాబళ్ళ మీదే మాసేతులతోనే రాళ్ళు సేరిసినాము, ఆసేతులతోనే ఆట్నే పేర్చి పట్టిమోసి నునుపు జేసినారు. దానిమీద జీపులోస్తున్నాయ్ కార్లోస్తున్నాయ్, లారీ బస్సులు తిరుగుతున్నాయి. గాని మా బళ్ల బరాలన్నీ పడిపోయినాయి. సక్కిరాయికీ సరక్కు సప్పరకూ పయనాలకీ అన్నిటికన్ని సవగ్గ అవురుకొంటున్నాం. యెనక పాతిక ముప్పైదాకా కుటుంబాలీ వూర్లో ఒక్క బళ్ళ బేరాలమీదే బతులుండేవి. నువ్వెలట్రిసిటి వేయించినావు, పంపింగ్ మిషన్లొచ్చిసినాయ్ ఏతాలుతోడే మా కూలోళ్ల బుగ్గడింది. సూరెంబాబు రైసుమిల్లెట్టినాడు. కలిగినోళ్ళ యిల్లల్లో కూలికి దంచే జనంకూళ్ళ పోవడం మాటటుంచు కూల్లు సేసుకుబతికే మాయాడజనం కూడ కూలీ తెచ్చుకున్న గింజలుపుట్టెడు పందుంకూలిచ్చి మిల్లు కేస్తున్నారు. అని జరిగిన అభివృద్ధి కారణంగా దళితుల జీవనవిధానం ఏ రకంగా హీనస్థితికి చేరుకుందో వివరించాడు.

దళితుడు మాట్లాడలేకపోతే అంగీకారం కాదు. మౌనం ఎవరి విషయంలోనైనా అర్థాంగీకారం కావచ్చేమో గాని, దళితుల విషయంలో మౌనం తిరస్కారమే. దళితుడు ఎందుకు మౌనంగా వుండవలసి వస్తుందంటే మాట్లాడి బ్రతకలేక పోవటం వల్ల, వాడికి ఇష్టమైతే అంగీకరిస్తాడు. ఇష్టం కాకపోతే చాలా సందర్భాలలో మౌనవ్రతం పూనుతాడు. వీళ్ళు మౌనంగా వుండటానికి వీళ్ళ బలహీనతలు. సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా వున్న బలహీనతలు కారణం. ఈ విషయం యజ్ఞం కథలో స్పష్టంగా కనబడుతుంది. కథలో గోపన్న తాను చెప్పుకోవలసింది చెప్పాడు. అందరి సానుభూతిని చూరగొన్నాడు. అప్పుడు అందరి చూపు అప్ప్రలాముడివైపు పడింది. కాని అప్ప్రలాముడు మాట్లాడడు. అదికాదు రాముడు నువు సెప్పవలసిందేదో సెప్పేసుకోవాలా అన్నాడు. అప్పటికి రాముడు కదల్లేదు. ఇంకా కొంత సేపూరు కొని వాకిట నించున్న జనంలోంచి ఒకాయన అడిగాడు. "అవునా మమ్మల్నెంత సేపు ఇలా నిలబెడతారు ? అనువులలో మినువులనో, అప్పువున్న దనో లేదనో ఏదో ఒకటి అనాలిగాని అలాగ మన్నుదిన్న పాముల్లోగా కూకొవడం బాగులేదు. ఇవ్వగలిగితే బాబూ ఇది ఇస్తానవాల. లేకపోతే అంతిచ్చుకోలేదనాల. అదీఇదీ కాకపోతే మరిమేమివ్వం మీకిష్టమొచ్చింది చేసుకోండనాల అంతేగాని ఏమాట అనకుండా కూచోవడం మీకు వోబస్కరం కాదు. పాపం అప్ప్రలాముడు బాకీ అన్యాయం అనే విషయాన్ని ఖచ్చితంగా

చెప్పడానికి చేతకాక మౌనం వహించాడు. సంఘంలోని ఒక వర్గం దళితుల్ని ఆలోచనలేని వాళ్ళనుగా చేసి ఉంచే ప్రయత్నం చేస్తుంది.

ఇంకో వర్గం వీళ్ళను శాశ్వతంగా ఆర్థికంగా లేని వాళ్ళనుగా చేసి వుంచే ప్రయత్నం చేస్తుంది. అప్పల్రాముడు వృద్ధుడు, అనుభవజ్ఞుడు. సవర్ణుల మనస్తత్వం బాగా తెలిసినోడు. పంచాయతీ తీర్పు అన్యాయమైందని తెలిసినా ఎదిరించి, సవర్ణులతో విభేదించి సవర్ణుల సమాజంలో బ్రతకలేమని తెలిసినోడు. అందుకే తాను నమ్మిన సవర్ణుడైన శ్రీరాములు నాయుడు పై భారం వేసాడు. అయినా తనకు అన్యాయమే ఎదురైంది. అందుకే పొలం అమ్మడానికి సిద్ధ మయ్యాడు. కానీ అప్పల్రాముడి చిన్న కొడుకు సీతారాముడు సమాజాన్ని ఎదిరించి స్వేచ్ఛగా బ్రతకాలంటాడు. బానిసత్వంతో బతకటం కంటే చావటం మేలంటాడు. అందరితో సమానంగా జీవించాలంటాడు. ఆత్మాభిమానం చంపుకొని బ్రతకటం చేతకాని వాడు. అందుకు తన సోదరులు ముగ్గురూ పత్రం మీద సంతకాలు చేసినా తాను వ్యతిరేకించాడు. సంతకం చేయటం బానిసత్వాన్ని అంగీకరించటమే అనే భావనతో వ్యతిరేకిస్తాడు. బానిసత్వాన్ని ఎవరైనా అంట గట్టడానికి పూనుకుంటే వారిని చంపి తాను కూడ సస్తానంటాడు. ఒరే నాయనా ! అప్పల్రాముడా ! నువ్వాకాయితం మీద ఏలుముద్రెట్టిన్నాడు. నీకూ నాకూ తండ్రీ కొడుకుల రుణం సెల్లిపోద్దని సెప్పినాను. సెల్లిపోనాది. "అభ్యుదయ భావాలతో నిండిన సీతారాముడు తనకు బానిసత్వం తన తండ్రి అంటగట్టడానికి చేసే ప్రయత్నాన్ని వ్యతిరేకించడమే కాక రాబోయే తరం కూడ బానిసత్వానికి దూరంగా ఉండాలంటాడు. ఈ మార్పు సమాజంలో జరగాలని ప్రతి ఒక్కరు తనలాగే మెలగాలని ఆకాంక్ష కలవాడు. ఇది సాధించటానికి ఎంతటి త్యాగానికైనా వెనుకాడడు. "ఒరేయ్! ఓరికొడకా ! నీవు బానిస బ్రతుకు బ్రతుకుతావా ? లేకపోతే సస్తావా ? ఈయాల సస్తే రేపటికి రెండు రా నిను సంపుతాను. ఆడు పరుగెత్తుకొచ్చినాడు. నాను పట్టుక్కున నరికేసినాను''. అని తాను నిర్వహించే నరమేధానికి తన కొడుకు సహకరించిన వైనం తెలిపాడు. ఇది ఒక నరమేధం. స్వార్థం కోసం జరిగిన నరమేధం కాదు. ఒక వర్గం కోసం ఓ తండ్రి నిర్వహించిన నరమేధం, తండ్రీ కొడుకులిద్దరు కలిసి కట్టుగా నిర్వహించిన యజ్ఞం. యజ్ఞఫలం భావితరాలకు చెందలనే ఆకాంక్ష.

'యజ్ఞం'లో, ఉదాహరణకి, రచయిత చెప్పినట్లు కనిపించే మాటలన్నీ ఇవే. ఈ కథ జాగ్రత్తగా చదివి చూడండి. మనం పూర్తిగా కొత్త వాళ్ళంగా సుందరపాలెంలో ప్రవేశిస్తాం. ఆ పూరు గురించి తొలిగా మనకి తెలియవలసిన సంగతులు ముందు తెలుస్తాయి. ఆ తరువాత అప్పల్రాముడిని గురించి నాలుగు మాటలు తెలుస్తాయి. మాటకు నిలబడేవాడూ, మర్యాదగా బతకాలనుకునే వాడూ మాలల్లో అతనొక్కడేనని అందరూ చెప్తారు. ఆ తరవాత మాజీ షావుకారైన గోపన్న గురించి తెలుస్తుంది. "అతను పరమ సాత్వికుడు. గొప్ప ఓర్పు కలవాడు. ఒకప్పుడు ఘనంగా బతికి ఇప్పుడు చితికిపోయిన పెద్ద మనిషి, వీళ్ళిద్దరూ తుమ్మకొయ్యల్లా వుండేవారట

పూర్వం.ఈనాటికి పేదతనం వాళ్లను రచ్చకెక్కించింది అని నొచ్చుకుంటున్నారు తెలిసిన వాళ్ళంతా. శ్రీరాములు నాయుణ్ణి గురించి, అతను ఆ ఊరికి తెచ్చిన కొత్త న్యాయ వ్యవస్థని గురించి, "పదిహేనేళ్ళ క్రితమైతే ఆ తగువు తీర్చడానికి వాళ్ళకింత సేపు పట్టదు. శ్రీరాములు నాయుడు వచ్చి అంతా మార్చేశాడు. ఈయన అన్నింటికీ శాంతమే నంటారు''. అంటే పదిహేనేళ్ళ క్రితం ఊరి షావుకార్లు నాలుగు తన్ని మాలవాడి దగ్గిర్నుంచి అప్పు వసూలు చేసేవారు. అప్పుడు మాలవాడికి తెలిసిపోయేది ఆ వూళ్ళో తన స్థానం ఏమిటో, కాని శ్రీరాములు నాయుడు స్థాపించిన న్యాయవ్యవస్థ అదంతా మార్చి మాలవాళ్ళని ఒక మాయలో పెట్టింది. అయితే ఈ సంగతి పాఠకుడికి వెంటనే

తెలియదు. శ్రీరాములు నాయుడు పెట్టిన మాయలోనే పాఠకుడు కూడా వుంటాడు. అప్పటి వరకూ. క్రమంగా కథ నడుస్తుండగా తెలుస్తుంది. శ్రీరాములు నాయుడు ప్రవర్తన అక్షరాలా ఆ నాటికి పెద్ద మనిషి తరహా అనిపించుకునే మాటల్లో పాఠకుల్ని కూడా ఆకట్టుకుంటుంది. ఆయన వ్యక్తిగత జీవితాన్ని, సంఘ బాధ్యతల్నీ క్లిష్ట పరిస్థితుల్లో సమన్వయించుకుంటూ "ప్రజాభిమానమా, సీతాదేవా అంటే తడుముకోకుండా జవాబిచ్చిన ఆనాటి శ్రీరామ చంద్రుడిని ఆదర్శంగా పెట్టుకుని అందుకు తూగలేక పోయినందుకు గ్రామ ప్రజలకు క్షమార్పణ చెప్పుకునేటంతటి ఉన్నత వ్యక్తి, క్రమంగా తెలుస్తుంది. శ్రీరాములు నాయుడు కట్టించిన న్యాయ మండపం సంగతీ, ఆ వూరు ఆదర్శ పంచాయతీ అవడం ఇలాంటి సంగతులు. ఇవీ పాఠకుడికి చాలా గౌరవకరమైన భావజాలపు ఉచ్చుల్లో వున్న మాటలే. కథ చివరి వరకూ చదివిన పాఠకుడికీ తెలుస్తుంది. ఇవన్నీ రచయిత ఒక ఉద్దేశంతో చెప్పిన మాటలేనని. కాని ఆ క్షణానికి ఇది పాఠకుణ్ణి కూడా ఆ ఉచ్చులో అట్టే పెడతాయి. రామారావు గారి కథల్లో సమాజంలో మనుషులు - ప్రవర్తించే తీరు కేవలం నిజంగా వుండడమే కాదు, సమాజపు భావజాల వ్యవస్థ దాని బరువు కింద కనిపించకుండా అణిగివున్న సామాజిక వ్యవస్థా వ్యక్తమవుతాయి. అంత గాఢంగా సమాజం అడుగున వున్న నిజాన్ని చూపిన రచయితలు ఏ సాహిత్యంలోనూ ఎంతో మంది వుండరు.

**ఆధార గ్రంథాలు:**

1. కాశీపట్నం రామారావు రచనలు- మనసు ఫౌండేషన్, బెంగుళూరు
2. కథా వార్షిక సంకలనాలు 2007 నుండి 2012 వరకు మధురాంతకం రాజారాం సాహితీ సంస్థ, మునిరెడ్డి నగర్, తిరుపతి
3. కథానిక స్వరూప స్వభావాలు- పోరంకి దక్షిణామూర్తి

❖ ❖ ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253
భావవీణ
UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కారా వారి 'ఇల్లు' కథ - సామాజికాంశాలు

- **శ్రీమతి నెమ్మలూరి భవాని**, తెలుగు అధ్యాపకురాలు, సి. హెచ్.ఎస్.డి.
సెయింట్ థెరిసా మహిళా డిగ్రీ కళాశాల, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా. సెల్: 8143877881

శ్రీకాకుళంలోని పొందూరు గ్రామంలో భ్రమరాంబ - షేర్రాజు గార్ల మొదటి సంతానంగా జన్మించిన కాళీపట్నం రామారావు గారు, బాల్యంలో వివిధ ప్రాంతాలలో విద్యనభ్యసించి చిత్రకళపై ఆసక్తిని పెంపొందించుకుని, టైపు నేర్చుకోవడం, పిల్లకు పాఠాలు చెప్పడం, కథలు చదవటం లాంటి ఎన్నో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించే అంశాల సమ్మేళనంతో రచయితగా మహోన్నత స్థాయికి చేరుకున్నారు. వస్తువు, పాత్రచిత్రణ, చిన్న చిన్న వర్ణనలు, ఎత్తుగడ ముగింపు శైలి ప్రధానాంశములను కథలో పాటిస్తూ, సంక్షిప్తత, ఏకాగ్రత, సమగ్రత, నిర్భరత సమగ్ర లక్షనాలకు కథానికను నడిపించారు కాళీపట్నం రామారావు గారు. సామాన్య కథకులకు భిన్నంగా ఆద్యంతం కథపై ఆసక్తిని పెంపొందించే విధంగా వారి రచనా శైలి కొనసాగింది. "కారా"వారు రచించిన యజ్ఞం, తీర్పు, భయం, ఇల్లు, స్నేహం, జీవ ధార రాగమయి లాంటి రచనలలో సైతం ఎన్నో సామాజిక అంశాలకు ప్రాధాన్యతనిచ్చి అద్భుతమైన రచనాపటిమను కనబరచారు.

"కారా" వారి "ఇల్లు" కథ సామాన్య కుటుంబీకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. చాలిచాలని జీతాలతో "ఇల్లు" గడుపుతూ సొంతింటిని ఏర్పరుచుకున్న, సామాన్య మానవుడి జీవనాన్ని ప్రతిబింబించే విధంగా కథను నడిపించారు "కారా" మాస్టారు. కథలో సుబ్బారాయుడు, పావనరామయ్య, నీలవేణమ్మ పాత్రలను పాఠకుల మనసులను హత్తుకునే విధంగా చిత్రించారు. ఎన్నో కష్టాలు పడి కుటుంబాన్ని పోషిస్తూ, జీవితంలో ఎదురయ్యే ఎన్నో కష్టసుఖాలను బాధ్యతతో భరిస్తూ, వారు కనే కలలు ఎప్పటికి నెరవేరుతాయో తెలియక, అరకొరగా బ్రతుకులను ఈడ్చే ప్రతి మధ్యతరగతి మానవుల కుటుంబ పరిస్థితులను రచించారు 'కారా' వారు.

జీవిత సుడిగుండంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, ఆఖరికి అరవై ఏళ్ళ వయసులో సొంతింటిని కొనుక్కున్న పావన రామయ్య లాంటి వ్యక్తులు నేటి సమాజంలో ఎందరో ఉన్నారు. జీవితాంతం పిల్లలు, బంధువులు వాళ్ల కష్టసుఖాలు, కొన్ని భరించలేని దుఃఖాలతో సాగిపోయిన పావనరామయ్య జీవితంలో ముసలితనంలో ఏర్పరుచుకున్న "ఇల్లు" ఆనందాన్నివ్వకపోయినా, కొంత 'భరోసా'నిచ్చింది. అప్పుల బాధలు, వయస్సుకొచ్చిన కూతురు పావనరామయ్యను కొంత ఆలోచనకు గురిచేశాయి. సమాజానికి అనుగుణంగా మలిచిన ఇటువంటి సన్నివేశ చిత్రణ, రచయితకు సమాజంపై గల సూక్ష్మ దృష్టిని తెలియజేస్తుంది.

ఇంటి గృహప్రవేశం అనగానే ఆనందించే బంధువర్గంతో పాటు, బాగానే సంపాదించారనుకునే బంధుత్వాలు సహజంగానే నేటి కాలంలో ఉన్నాయి. ఇంటిని చూసి బాగుందనుకునేవాళ్ళు, పర్వాలేదు. అనుకునేవాళ్ళు, ఇరుకుగా ఉందనే రకరకాల మనస్తత్వాల బంధుమిత్రులు ప్రతి కుటుంబంలో సరిపడగానే ఉంటూ ఉంటారు. పావనరామయ్య ఇంటి గృహప్రవేశానికి విచ్చేసిన బంధుమిత్ర వర్గంలోనూ అలాంటివాళ్ళు ఉన్నారు. ఇల్లు చిన్నగా ఉందని ఒకరంటే, బొమ్మరిల్లులా ఉందని మరొకరు ప్రశంసించారు. వాటితో పాటు ఆడవాళ్ళ ముచ్చటై మాటలను, మూతి విరుపుడు మాటలను రచయిత సామాజిక కోణంలో పరిశీలించి కథలో వినిపించారు. ఇంటి గృహప్రవేశానికి విచ్చేసిన బంధుమిత్రుల వ్యక్తిత్వాన్ని "కారా"వారు సహజమైన శైలిలో చిత్రించారు. గృహప్రవేశ వేడుక ముగిసాక భోజనాలు చేసి కూర్చున్న పెద్ద మనుషులు ఏవిధంగా మాటల వాగ్వివాదంలోకి మళ్ళుతారో తెలియజేసే విధంగా ఐదుగురు

పెద్ద మనుషుల పాత్రలు వారి భిన్నాభిప్రాయాల ద్వారా ఆసక్తికరమైన సామాజిక వ్యక్తిత్వాలను కథలో చిత్రించారు. వ్యక్తుల యొక్క పరిస్థితులు, వ్యక్తిత్వాలు, కష్టసుఖాలను బట్టి వారి అభిప్రాయాలుంటాయని కథలో వారి దీర్ఘదృష్టిని ప్రదర్శించారు రచయిత.

'ఇంటికి దీపం ఇల్లాలు' కాని ఆ ఇల్లాలు పడే పాట్లు, భర్తతో కలిసి బాధ్యతలు పంచుకునే తీరు స్పష్టమయ్యే విధంగా, ఓర్పు గల గృహిణిగా నీలవేణమ్మ పాత్ర కన్పించింది. సమాజంలో ఎందరో ఆడవాళ్ళు పుట్టింటి వాళ్లను అత్తింటివాళ్ళను, కన్నబిడ్డలను, బంధుమిత్రులను తృప్తిపరచడం కోసం ఆ బంధాలను నిలబెట్టుకోవడం కోసం ఎన్నో బాధలు భరిస్తూ, అవస్థలు పడుతూ తిని తినక సాగించే జీవన ప్రయాణాన్ని స్పష్టంచేసే విధంగా నీలవేణమ్మ కన్పిస్తుంది. నీలవేణమ్మ అనుభవించిన కడుపుశోకాన్ని అతి దీనంగా వర్ణించారు రచయిత. సమాజంలో ఏ ఆడది భరించలేనిది కడుపుశోకం. నీలవేణమ్మ మందు సకాలంలో అందక మూడవ ఏటనే పోగొట్టుకున్న బిడ్డనుంచి, పరీక్షలు - ఫస్టుక్లాసు హైరానాతో పోయిన బిడ్డ వరకు అరుగురి బిడ్డల చావును చూసింది. ఎన్నో కష్టాలను భరించింది. గృహప్రవేశం తంతు ముగిసాక నీరసంగా పడుకొని బిడ్డలను తలచుకోవడం ఆడపడుచు విడ్డూరంగా మాట్లాడినా మారు మాట్లాడకుండా తన సహనాన్ని చాటుకుంది నీలవేణమ్మ. సొంతింటిలో తన బిడ్డలందరూ లేరనే నీలవేనమ్మ బాధ దీపాల వేళ దాకా కొనసాగిందనే సంభాషణ కథలో నీలవేణమ్మపై సానుభూతిని కల్పించి సమాజంలో స్త్రీలకు నీలవేణమ్మ పాత్రను దగ్గర చేసింది.

తన బాధనంతా చెప్పలేక చెప్పలేక బావమరిదికి చెప్పుకున్న పావనరామయ్య దీనస్థితి, గౌరవంగా బతకాలనుకుని దారిద్ర్యాన్ని అనుభవించిన రోజులు, కనీస ఆస్తి లేక పిరికితనంతో బతికిన పావనరామయ్య జీవనం సమాజంలో ఎందరో యజమానులకు ప్రతిబింబం. పావన రామయ్య పరిస్థితి తనకు తెలిసినా తను చెప్పిందంతా విన్నాక సుబ్బారాయుడుకి జాలి కలిగింది. పావనరామయ్య చెప్పకపోయినా అతని మనస్తత్వాన్ని అర్థం చేసుకోగల సహృదయునిగా సుబ్బారాయుడు పాత్ర చిత్రించబడింది.

తన లేమితనం కారణంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, బిడ్డపై మోయలేని భారాన్ని వేసి బిడ్డను పోగొట్టుకున్న పావనరామయ్యకు జీవితంలో "భరోసా" అవసరమని, ఆలోచించే విధంగా చేసింది. బిడ్డల చదువులు, ఉద్యోగ బాధ్యతలు, బంధుమిత్రుల మర్యాదలతోనే వృద్ధాప్యానికి చేరుకుని కనీసం నివాసానికి "ఇల్లు" కూడా ఏర్పరుచుకోలేకపోయినా ఎన్నో సామాన్య కుటుంబాలకు పావనరామయ్య ఇంటిపై చేసిన ఆలోచన చక్కని స్ఫూర్తిని, ధైర్యాన్ని అందిస్తుంది. జీవితానికి భరోసా లేనినాడు వ్యక్తి పాతాళానికి పడిపోతాడని, తనకు తన కుటుంబ సభ్యులకు 'ఇల్లు' ఒక ఆసరానిస్తుందని సామాజిక సందేశాన్నందించే విధంగా కథను నడిపించారు 'కారా'వారు. సమాజ స్థితిగతులను పరిశీలించి చేసే ఇలాంటి రచనలు సమాజంలో సాదాసీదాగా బ్రతికే ఎన్నో కుటుంబాలకు ఆదర్శంగా నిలిచి, వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు ఎంతగానో దోహదపడతాయి.

**ఆధార గ్రంథాలు :**

1. కాళీపట్నం రామారావు రచనలు - మూర్తి, రచన శాయి
2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య
3. శబ్దరత్నాకరం - బహుజన పల్లి సీతారామాచార్యులు

# 'భయం' కథ ద్వారా రచయిత సమాజానికిచ్చిన సందేశం

**- డా॥ ఒ. రామారావు**, సంస్కృత అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం

కాళీపట్నం రామారావు మాస్టారు రచనలు సరళమైన తెలుగు వ్యవహారం భాషలో వ్రాయబడి సందేశాత్మకంగాను, ఉత్తేజపరిచేవిగాను, స్ఫూర్తినిచ్చేవిగాను ఉన్నాయి. వీరు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన వీరు శ్రీకాకుళం జిల్లా, పొందూరు గ్రామంలో 1924 నవంబరు 9న జన్మించారు. వీరి తల్లిదండ్రులు భ్రమరాంబ పేర్రాజులు.

హైస్కూలు చదివే రోజులలోనే 14వ ఏటనే ముద్దు అనే కథా, ఒకటి రెండు పద్యాలూ వ్రాసినా అవి ప్రస్తుతం అలభ్యాలు, ప్లాటు "ఫారమో అనే శీర్షికతో రచించిన దానిని 'చిత్రగుప్త ' అనే పత్రిక ప్రచురించినటువంటిదాయన మొదటి రచన వీరు తొలిరోజులో కొంతకాలం కోర్టు ఉద్యోగిగా పనిచేసి, అటు పిమ్మట ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఉపాధ్యాయుడుగా పనిచేసిన కారణంగానే వారితో సుపరిచయం ఉన్నవారందరూ వారిని 'కారా మాస్టారు' అని అభిమానంతో పిలుస్తారు.

రాగామయి, యజ్ఞం, జీవధార, ఋతుపవనాలు, అభిమానాలు, మహదాశీర్వచనం ,తీర్పు, హింస, అప్రజ్ఞాతం, సంకల్పం, భయం మొదలైనవి వీరి ప్రసిద్ధమైన రచనలు.

కథారచనలో, నవరా రచనలో రామారావుగారి ప్రతిభను గురించి అనేక ప్రముఖ సంస్థలు వారిని సత్కోరించాయి. వారి 'యజ్ఞం' కథను 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకుంది / అందించింది. ఎన్.టి.ఆర్. జాతీయ పురస్కారం, లోకనాయక్ ఫౌండేషన్
సన్మానం, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డు, కొండెపూడి శేషగిరిరావు సాహితీ పురస్కారం వంటివెన్నో వారిని వరించాయి. అవార్డుల ద్వారా ఆయన పొందిన డబ్బును ఆయన స్వంతానికి ఖర్చు చేసుకోకుండా శ్రీకాకుళంలో 'కథానిలయం' పేర ఒక సాహితీ సంస్థను ఏర్పాటు చేయడం విశేషం. ఈ విధంగా ఆధునిక కథారచయితలను ఎంతగానో ప్రోత్సహించారు.

**సాహిత్యం పరిచయం :**

సాహిత్యం అనే మాటలోనే కొంత ప్రత్యేకమైన భావన ఉంది ప్రత్యక్షంగా ఉన్న శబ్దము, అర్థము జన సముదాయానికి సుకుమార ధోరణిలో హితాన్ని చేకూర్చేపద్ధతిలో నిబద్ధమైతే అట్టి శబ్దాల సముదాయానికి సాహిత్యం అని పేరు. హితం అంటే పథ్యం. రోగ లక్షణాన్ని
దూరం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించేది పద్యం అనగా శాశ్వతమైన సుఖానికి దారి చూపేది హితమన్నమాట.

సాహిత్యం హోరీమియోపతి మాత్రలాంటిది అందులో మనకు ప్రత్యక్షంగా కనబడేది పంచదార మాత్రా, దాన రుచీ, మందు ఉందో లేదో కూడా సాధారణంగా గుర్తించలేము. రసాదులు చక్కెర వంటిదయితే హితం మందువంటిది నిజానికి మందు కోసమే కదా పంచదార.
ఏతావతా తేలిన సారాంశం, మానవుని హృదయక్షేత్రంలో సత్సంస్కార బీజాలు ఏపుగా మొలకెత్తటానికి దోహదం చేసేది సాహిత్యం. ఈ లక్షణం పుష్కలంగా భారతీయ సాహిత్యంలో ఉంది.

ప్రస్తుతం నేను ఎంచుకొన్న కథ 'భయం' అనేది మహాభారతంలోని జనమేజయుడు మరియు రురువు మరియు ప్రమద్వర కథను ఆధారం చేసికొని రచించబడింది. ఇది కరుణరసం ప్రధానమైనది. భయం వలన మనిషికి కలిగే ప్రమాదం కంటే మనుషుల గుండెల్లో ఉండే ద్వేషం పాము విషం కంటే భయంకరమైనది.

ఇందులో మానవ సంబంధాలు నైసర్గింకంగా మనుషుల్లో

ఉండే ప్రాణ భీతి ప్రాణభయంవల్ల కలిగే మూఢ నమ్మకాలు, వాటి వల్ల పర్యవసానాలు, ఆధునిక వైద్యం అందని కుగ్రామాలలో పురుగం, కుట్ర వలన పడే యాతన మొదలైన విషయాలు చాలా చక్కగా కవి ఆవిష్కరించారు.

**'భయం' అనే కథలో పాత్రధారులు**

1. పారమ్మ = తల్లి
2. గౌరేసు = తండ్రి
3. సత్తెయ్య = కొడుకు
4. రత్నాలు = సత్తెయ్య భార్య
5. సొమ్ములగురవడు = పశువుల కాపరి 12 యేళ్ళ అబ్బాయి
6. పావుల రావులయ్య = పాముకరిచిన వారికి మంత్రం వేసి వైద్యం చేయడం వృత్తి
7. సుబ్బాయమ్మ = మూర్తీభవించిన స్వార్థానికి ప్రతీక ఏభైయేళ్ళ ఆమె

తల నుండు విషము ఫణికిని
వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్
దలదో క యనకనుండును
ఖలునకు నిలువెల్ల విషముగదరా సుమతీ !

పామునకు తలయందు, తోకయందు తేలునకును విషముండును, దుర్మార్గునకు, తల, తోక అను నియమము లేక శరీర మంతట విషముండును అని అన్నాడు సుమతీ శతక కర్త. పాము కంటే విషపూరాతమైన మనుషులు / వ్యక్తులు ఉంటారనే నగ్న సత్యాన్ని ఆవిష్కరిస్తుంది కాళీపట్నం రామారావు గారి 'భయం' అనే కథ. "పాము మనిషిని కుడుతుంది. మనిషికి చావంటే భయం. పామును చూస్తే చావును చూచినంత భయం. చావుకి భయపడనివాడు పాముకి భయపడడు. పాము కాటేస్తుందో, వెయ్యదోకాని దాని భయం మనిషిని తినేస్తుంది. పురుగులాగ ఎదురు తిరిగితే ఏమి ఉండదు. నీ చేయేపైన అప్పుడు చావు, పావు చీమల్లా చిన్నవైపోతాయి'' అన్న సత్తెయ్య మాటలు - పాఠకుడిని ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. ధైర్యంగా ఉండేవాడు ఒకసారే చస్తాడు. భయపడేవాడు రోజూ అనునిత్యం చేస్తూనే ఉంటాడనే భావాన్ని సత్తెయ్య మాటల ద్వారా రచయిత స్ఫురింపచేశాడు.

'భయం' కథ ప్రధానంగా పాముకు సంబంధించిన కథను ఆశ్రయించుకొని తిరుగుతూ ఉంటుంది. పామును చూస్తే మనిషికి ఎంత భయమో మనిషిని చూస్తూ పాము కూడా అలాగే భయపడుతుంది. ఆ భయంతోనే మనిషిని కాటు వేస్తుంది. ఆ భయంతోనే మనిషి చనిపోతాడు పిరికివాడయితే ఏవేవో కథలు చెబుతూ పామును ఆరాధిస్తాడు. మనిషిలోని పాము భయాన్ని కొందరు ఆదాయంగా మార్చుకుంటూర వ్యాపారం చేస్తుంటారు. కథను నిశితంగా పరిశీలిస్తే పాము భయంతో మనుషులు ఎలా ప్రవర్తిస్తారో తెలుసుకోవచ్చు.

ఎవరికైనా తన కుటుంబంలో పాము వలన ప్రమాదానికి గురికావచ్చనే భయం సత్తెయ్య తల్లి పారమ్మలో ఉంది. అందుకే తమ ఇంటిలో పాము కనిపించినప్పుడు ఆమె సత్తెయ్యను కదలనీయలేదు. కదిలితే వీపుపై కొట్టింది. "ఇప్పుడు పాముని స్పష్టంగా చూసింది పారమ్మ ముందు ముందుకి వంగి చూస్తున్న కొడుకు రెక్క అందుకొని ఒక్క గుంజు గుంజింది సత్తిగాడు తేరుకొనేలోగానే వాడి వీపు మీద ఒక్క చరుపు చరిచిందామె'' పారమ్మ భర్త గౌరేసుకు కుటుంబంలోని వారికెవరికైనా ప్రమాదముందనే భయం ఉంది కాని పామంటే భయంలేదు. గౌరేసు తల్లి దండ్రులకు పామంటే భయం ఉంది గాని తెగింపు లేదు. వారికి విశ్వాసాలు ఎక్కువ కోడలు గర్భవతిగా ఉండగా పాముని చంపితే కోడలికి ఏమైనా జరుగుతుందని వారికి నమ్మకం సత్తెయ్య భార్య రత్నాలుకి పాముకంటే మంత్రిగాళ్ళంటే భయం ఎక్కువ మంత్రగాళ్ళు తమకు గిట్టనివాళ్ళ వాకిట్లో పాముల్ని వదులుతారని, అర్ధరాత్రి ఒంటేలు కోసం బయటికి వస్తే ఆ పాము వారిని కాటువేసి చంపుతుందని ఆమె భయం

తన భర్త సత్తెయ్య ఊరికే పాముల్ని చంపి వ్యాపారాన్ని దెబ్బ తీస్తున్నాడని పావుల రావులయ్యకు కోపం అది మనసులో పెట్టుకొని తమకు అపకారం చేస్తాడని రత్నాలు భయం. అలాగే మంగలి చెంచయ్య భార్యకు పామంటే భయంకాని వాళ్ళ కోళ్ళకు ఆ భయంలేదు.

తమ పిల్లలను పాము పొట్టన పెట్టుకుంటే అవి / ఆ కోళ్ళు పాముతో పోరాడాయి మానవులు ఆపడానికి ప్రయత్నించిన అవి ఆగలేదు. ఆవేళే పొదిగిన కోడి పిల్లలు అక్కడ బుట్టలో మూసివున్నాయి. ఎలా దూరిందో ఎన్నింటిని పొట్టబెట్టుకొందో నిగనిగలాడుతున్న బారెడు పై నున్న పాము ఒకటి, తాజుగా కంతలోంచీ బైటికొచ్చేస్తోంది.

మంగలమ్మి కెవ్వునకేకేసి బిడ్డని చంకకెత్తుకుంది అప్పుడే పరుగెత్తుకొచ్చిన కోడిపెట్ట 'కొక్కు' పెడుతూ, పాముని సమీపించి ఒకటి రెండుకేరులతో పోటాటకు దిగింది. గోళ్ళ గాట్లనీ, ముక్కు పోట్లనీ తప్పించుకోడానికి, పాముదగ్గరగా చుట్టచుట్టుకొంది కోడి లాఘవంగా ఎగిరినప్పుడల్లా, పాము 'బస్సు ' మంటూ పడగ విప్పుతోంది. పెట్ట పిలుపు విని, ఒకటి రెండు కోళ్ళూ, మనిషి మొఱ విని నలుగురైదుగురు మనుషులు పరిగెత్తు కొచ్చేరు. అసలే దోసెడు జాగా పాము బుసలతోనూ, కోళ్ళ కొక్కరింపులతోనూ రణరంగంలా మారింది.

బర్మానుంచి వచ్చిన దంపతులకు పాముల గురించి బాగా తెలుసు. వాళ్ళకు మంతాలన్నా నమ్మకం లేదు. అందుకనే వాళ్ళకు పామంటే అస్సలు భయంలేదు. అన్ని పాములు ప్రమాదకారమైనవి కావని. డజనో, అరడజనో పాములు ప్రమాదకరమైనవీ వారికి తెలుసు మరియు పాములను పట్టే మెలకువలు కూడా వారికి బాగా తెలుసువారు పాముల్ని పట్టి వాటి చర్మాలు ఒలిచి అమ్ముకుంటారు మరియు వాటి మాంసం తింటారని నమ్ముతుంటారు. ఇవన్నీ చిన్న పాత్రల . ఈ పాత్రలతో పాటు ప్రముఖ పాత్రలు పాముల విషయంలో ఎలా ప్రవర్తిస్తారో తెలిస్తే రచయిత సందేశం తెలుస్తుంది. సుబ్బాయమ్మకే కాదు ఆమె కొడుకుకి/కుమారునికి పామంటే తగని భయం. గురవయ్య రెచ్చగొడితే పౌరుషంగా కర్ర తీసుకున్నాడేగాని, తీరా పాము ఇంట మధ్య చూసేసరికి దానిని కొట్టవలసి వచ్చేసరికి పిరికితనంతో భయపడ్డాడు. అది పిరికితనం. కాని సుబ్బయమ్మది పిరికితనం కాదు. ఆమెది మహాస్వార్ధంతో కూడిన భయం. తన కుటుంబంలో ఉన్న వారికి ఆపద కలగకూడదనుకుంటుంది దానితో పాటు తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ఎవరినైనా బలిచేయడానికి కూడా ఆమె వెనుకాడదు. తన ఇంట్లో పామును తన కుమారుడు కొట్ట కూడదని సత్తెయ్యగాని, గురవడుగాని చంపాలని ఆమె అభిప్రాయం. ఏదైన పొరపాటు జరిగితే తమకు ఎటువంటి హాని కలగకూడదని, ఇతరులే దాని ఫలితం అనుభవించాలని ఆమె అనుకుంటుంది.

- ఇలా తన కష్టాలన్నీ సత్తెయ్యకి చెప్పుకొని, చివరికి - ఎలాగో ఓలాగ, ఏం సుళువు చేస్తాడో తనకు తెలీదు, ఆ పాము పని పట్టీ మంది సుబ్బాయమ్మగారు'.

"ఒక్క సుళువుంది'' నసుగుతూ అన్నాడు సత్తెయ్య అని ఆ పక్కనే వున్న పెద్దబ్బాయి కేసి అంచనాగా చూసేడు ఒక్క క్షణం.

"ధయిర్యంవైనోడు యింకొక్క మనిషి దొరికినా బాగుణ్ణు " అన్నాడు సత్తెయ్య నేనేం చేతునన్నట్టు.

"మరి అత్తల (అవతల) పడితేనో అన్నాడు గురవడు "అత్తల పడ్డా, యిత్తల (ఇవతల) పడ్డా నువ్వే కొట్టాల అన్నాడు సత్తెయ్య.

"నాను కొట్టను. నానెందుక్కోట్టాల''

"ఓయే ఊరుకోవయ్యా! పాంవు దూరింది ఆళ్ళ యిరకలోనా సాయానికి నువ్వూ, నేన్నా చెయ్యి సాయం, తోడుండమంటే ఎలాగ సస్తారో మీరిద్దరూ సావండిగాని, నా కొడుక్కి దాని గాలి కూడ తగల్నానికి బల్లకాదంటుంది ఆయమ్మ! యీాయిడే కన్నాదేటి, కొడుకుని ! నిన్నూ నన్నూ

అమ్మకన్లేదేట్కీ నానుండను అంటూ వాడు వెళ్ళిపోబోయేడు.

తమ ఇంట్లో సత్తెయ్య పామును చంపిన తర్వాత పాము కాటుకు గురైన సత్తెయ్య ఇంటికి వెళ్తుంటే కనీసం పరామర్శ కూడా చేయకుండా పాము ఇంకా కొన ఊపిరితో ఉందేమో చూడమని అడిగే సుబ్బాయమ్మ కంగారు పడాడం ఆమె స్వార్థానికి పరాకాష్ఠ. తనకు హాని చేస్తేనే పాము కరుస్తుందిగాని, తనకు సాయం చేసిన సత్తెయ్య తన వలన ప్రమాదానికి గురైతే పట్టించుకోని సుబ్బాయమ్మ పాముకన్నా భయంకరమైనది. తమ సుఖం తప్ప ఇతరులు సుఖం పట్టని తత్త్వం / స్వభావం ఆమెది.

రావుల రావులయ్యకు పాముల గురించి తెలుసు ఏ పాము కరిస్తే మరణిస్తారో ఏ పాములు కానికావో బర్మా దంపతులు లాగా పావుల రావులయ్యకు కూడా బాగా తెలుసుకానీ జనం పామును చూస్తే భయపడతారు. కనుక వారి భయాన్ని తనకు సంపాదనగా చేస్తాడు. పాము కరిచిందని అంటే మంత్రం వేస్తానంటాడు. ఇంటిని అష్టదిగ్బంధనం చేయాలంటాడు. బూడిద చాల్లాలంటాడు. ఇల్లంతా తిరిగి హడావుడి చేస్తాడు. ప్రతిదానికి డబ్బు వసూలు చేస్తాడు. నమ్మకం లేని వాళ్ళకు మంత్రం వేసినా పనిచేయదని తన శత్రువులకు వైద్యం చేయడు. అతనికి పాములంటే భయం లేదుగాని, భయపడే వారిని ఇంకా ఇంకా భయపెడతాడు. పాము కరిచిన వ్యక్తి బ్రతికిన తర్వాత కూడా వైద్యం పేరుతో అతని నుండి డబ్బు గుంజు కుంటాడు. సత్తెయ్య పాములను చంపడం వలన తన ఆదాయం తగ్గిందని అతనిపై అక్కసు / పగవూని, అతడు చావుబతుకుల్లో ఉన్నాడని తెలిసినా కూడా అతని దగ్గరకు వెళ్ళడానికి నిరాకరించిన దుర్మార్గం అతనిది. అందుచేత అతడు పాము కంటే భయంకరమైనవాడు.

సొమ్ముల గురవడు మానవత్వం కలిగినవాడు నిస్వార్థపరుడు మంచి మనసున్నవాడు. సుబ్బాయమ్మ పిలిస్తే వస్తాడు. సత్తెయ్యకు తోడుగా నిలబడ్డాడు. పామును నడుమును విరగ్గొట్టాడు. సూటిగా మాట్లాడేతత్త్వం కలిగినవాడు కాబట్టి సుబ్బాయమ్మ కొడుకు పామును కొట్టడంలో సాయం చేయకపోతే తాను ఎందుకు కొట్టాలని ఎదురు ప్రశ్నిస్తాడు. సత్తెయ్యను పాము కరిచిన తర్వాత అతనిని బ్రతికించమని రావులయ్యను మరీ మరీ ప్రార్థించాడు/స్తాడు. తనలో ఉన్నవారు కూడా తనలాగే సుఖంగా ఉండాలనే తాపత్రయం అతనిది. కానీ రావులయ్య సత్తెయ్య దగ్గరకు రావడానికి నిరాకరించడంతో నిరాశపడ్డాడు. సుబ్బాయమ్మ ప్రవర్తన, రావులయ్య మాటలు అతనికి మనుషుల పట్ల నమ్మకాన్ని సడలించాయి. అందుకే అతడు పశువులశాలకు వెళ్ళినా, ఆ పశువుల్లో అతనికి మానవ మనస్తత్వాలే కనిపించాయి. పామంటే భయంలేదు. పాములకన్నా భయంకరమైన మనస్తత్వం కలిగిన సుబ్బాయమ్మ, రావులయ్య వంటి మనషులంటేనే అతడు భయపడ్డాడు. మానవత్వాన్ని గుండెలనిండా నింపుకున్నా గురవడి వంటి వారే సమాజాన్ని బాగుపరుస్తారు.

“అంతకో జెబ్బా, యింతకో కాలూ జండా కొయ్యలా వుంటాడేగాని, ఆడి మనసు ఎన్నపూస! “ అంటారు ఆడవాళ్ళు సత్తెయ్య గురించి. సత్తెయ్యకు పామంటే అసహ్యం తప్ప భయం, భక్తి లేవు. పామును గురించిన కథలు నమ్మడు.

మాటాలే కొంచెం కరుగాని పరచ్చుకుంటే ఇది ఎవళి నాబం అని ఎనక్కి తిరిగి సూడ్డు. సొంతంగా సేసిన్దానికేనా సొడ్డంటాదిగాని, ఆడసేస్తే అడ్డే నేదు “ అంటారు. ఆవూరి జనం. పాంపు మీకు బగవంతుడితో సమానంవా ? సెప్పండి దండా లెట్టుకుందాం. పాము దేవుడంటే నమ్మడు. అదొక విషపు పురుగన, అది కనిపిస్తే చంపాలని అతని అభిప్రాయం పామును పట్టుకోవడం, కుండలో పెట్టుకొని ఊరికి దూరంగా విడిచి రావడం వంటి దోవకారుణ్య సిద్ధాంతాలు అతడు వ్యతిరేకిస్తాడు. పామును చంపడంలో అతనికి నియమ నిబంధనలు లేవు. ఎవరు పిలిచినా, ఏ వేళలో పిలిచినా వెళ్ళి పామును చంపుతాడు.

పాము కరవా కూడదు, పాపమూ రాకూడదు అనే మంచి వాళ్ళేక్కడైనా వుంటారు. కదా. వాళ్ళకి ఈ ధోరణి నచ్చేదికాదు. "పోనీ" అని పాంవుల రాంవులయ్యకి కబురంపుదాంవంటే, అందులో బోలెడు చిక్కులున్నాయి. అందుకు రావులయ్య లాగా సొమ్ము కూడా తీసుకోడు అందుచేతనే అతడు ఆ కారణంగా రావులయ్యకు శత్రువయ్యాడు. సత్తెయ్య మనసు వెన్న. అతనిది విశాల దృష్టి. ఇతరులు అడిగితే కాదనలేని జాలిగుణం అతని సొంతం.

తన ఊరును, తన కుటుంబం లాగా భావించేతత్వం అతనిది ఊర్లో ఎవరికి అపకారం జరిగినా అది తనకు అపకారం లాగా భావిస్తారు. ఊరందరూ సుఖంగా ఉండాలని ఆశిస్తాస్తాడు. తన చుట్టూ ఉండేవాళ్ళందరూ సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య దేవుడితో సమానం. కాని ఇతరుల స్వార్థం వలన ఆ దేవుడే ప్రమాదానికి గురయ్యాడు.

కొందరు భయపడతారు. కొందరు భయపడేవారితో వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తాడు. కొందరు భయపడుతూ తాము సుఖంగా ఉండాలనుకుంటూ తమ సుఖం కోసం ఇతరులను బలిచేస్తారు. కొందరు భయాన్ని దరి చేరనీయకుండా సమాజం సుఖంగా ఉండాలని ఆశిస్తారు. తన చుట్టూ ఉన్నవారు సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య, గురవయ్య వంటివారు సమాజానికి అవసరం అలాంటి వాళ్ళవల్లనే సమాజం బాగుపడుతుంది అప్పుడే

7 సర్వే చ సుఖినస్సంతు, సర్వే సంతు నిరామయా:
7ఏ సర్వే భద్రాణి పశ్యంతు, మాకశ్చిద్ దఃఖభాగ్ భవేత్.

వసుధైవ కుటుంబంగా మానవ సమాజం వర్ధిల్లుతుంది.
అయం నిజ: పరోవేతి గణనా లఘుచేతసామ్.
ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకమ్.

రావులయ్య, సుబ్బాయమ్మ వంటివాళ్ళ వలన సమాజం నష్టపోతుంది. "భయం" కథలో రామారావుగారిచ్చిన సందేశం ఇదే!

**భయం కథలో ఆదర్శనీయాంశాలు :**

1. ప్రజల భయాన్ని అడ్డం పెట్టుకొని వారిని మభ్యపెడుతూ పబ్బం గడుపుకునే మోసగాళ్ళకు ప్రతీకగా పావులరావులయ్య పాత్రను రచయిత మలిచాడు. ఇటువాళ్ళ పట్ల మనం జాగ్రత్తగా ఉండాలని కవి సందేశం.

2. సొమ్ముల గురవడు పాత్ర చిన్నదేవాని అతని మనసు మాత్రం దొడ్డది. మంచి మనసు ఇతరులకు సాయం చేయాలనే తపన ఇతరుల కష్టాలను తన కష్టాలుగా భావించే మంచి సంస్కారం కలవాడు.

3. సుబ్బయమ్మ మూర్తీభవించిన స్వార్థానికి ప్రతీక తాను, తన సంసారం బాగుంటే చాలు ఇతరులు ఎలాపోతే నాకేం అనుకునే మనస్తత్వం.

అందరికీ సహాయం చేసే సత్తెయ్య మరణానికి కారణమైన సుబ్బయమ్మ పాముకన్నా విషపూరితమైనది. కాబట్టి ఇటువంటి వాళ్ళ పట్ల మనం మిక్కిలి జాగ్రత్తగా ఉండాలని కవి సందేశం.

4. చావుకు భయపడని వాడు. పాముకు భయపడవలసిన అవసరం లేదనేది సత్తెయ్య తీర్మాణం. ఊరంతా తన కుటుంబంలా భావించడం అతని స్వభావం ఊర్లో ఎవరు పిలిచినా వెళ్ళడం. పామును చంపినా డబ్బు తీసుకోకపోవడం వల్ల అందరూ అతడినే పిలిచేవారు. ఆ కారణంగా పావులు రావులయ్య వ్యాపారం దెబ్బతిని రావులయ్య పత్తెయ్య మీద ద్వేషం పెంచుకున్నాడు. కనుక మనం సత్తెయ్యలాగ మనం సమాజానికి నిస్వార్థ సేవ చేయాలని కవి సందేశం.

పాము వలన సత్తెయ్య తల్లిదండ్రులు ఎంత నరక యాతన పడ్డారో స్వయంగా సత్తెయ్యకు అసహ్యం కలిగింది. 15 యేళ్ళ వయస్సున్నప్పుడు మొదటిసారి పామును చంపవలసిన పరిస్థితి వచ్చింది. మంగలి చెంచయ్య ఇంట్లో కోడి పిల్లల్ని పాము తింటూవుంటే కోళ్ళు సహించలేక పోయాయి. మనుషులు భయపడుతున్నో కోళ్ళు మాత్రం పాము మీదకు దూకాయి. అక్కడున్న మనుషులు కోళ్ళను ఎంత ఆపాలని చూసినా అవి ఆగిలేదు. ఆ దృశ్యాన్ని చూసిన

సత్తెయ్య ఆగలేక పోయాడు. మనుషులు పామును చంపకపోగా కోళ్ళ నుండి పామును రక్షించాలని చూడడం. తమకు హాని చేసిన పామును చంపడానికి ప్రయత్నిస్తున్న కోడికి మరికొన్ని కోళ్ళు సహాయం చేయడంతో మనుషుల్ని కోళ్ళను పోల్చి చూసుకున్నాడు సత్తెయ్య. అతనికి కోళ్ళు చేస్తున్న పనే మంచిదనిపించింది. వెంటనే లోపలికి వెళ్ళి కర్రను తెచ్చి పామును చంపాడు. అపట్నించి సత్తెయ్య పాముల్ని చంపడం మొదలు పెట్టాడు.

**మాండలిక పదాలకు అర్థాలు:**

మందడి = రెండిళ్ళ మధ్య ఉండే ఉమ్మడి గోడ

చీడి = బయట ఉండే అరుగు

ముంజూరు = ఇంటి కప్పు ముందు భాగం (వాన కురిసినప్పుడు) ఇంటి ముంజూరు నుంచి నీటి ధారలు పడుతుంటాయి.

కరదూపం = పొయ్యి వెనుక గోడకున్న మసి

పిడకల కుచ్చిలి = పిడకలతో పేర్చిన పోగు

మెరమెదలు = అనుమానాలు, సందేహాలు

గోర్జి = సన్నగా ఇరుకుగా ఉండేదారి

గూన = మట్టితో చేసిన పెద్ద కుండ

జంతి = సందు

మండ = అరచేయి వెనుకభాగం

ఎత్తరిల్లు = అభివృద్ధి చెందు

గొప్పులు = మొక్కలు పెరిగే సమయంలో ఆ మొక్క చుట్టు ఉండే నేలను గుల్ల చేస్తారు.

❖ ❖ ❖

# కా.రా. కథల్లో కుటుంబ విలువలు

**- డా॥ బి. చక్రవర్తి,** కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు. చరవాణి : 9666454688.

కాళీపట్నం రామారావు సమకాలీన రచయితల్లో ప్రత్యేకంగా కనిపిస్తారు. తాను చిత్రించిన జీవితం, వస్తువు, శిల్పం మొదలైన అంశాల్లో మరే రచయిత పోనన్ని పోకడలు పోయారు. ప్లాట్ఫారమో అనే ఒక కార్డు కథతో మొదలైన కా.రా. సాహితీ వ్యాసంగం నలభై ఎనిమిది కథలతో ముగిసింది. శ్రీకాకుళ రైతాంగ పోరాటం, సామాజిక న్యాయం మొదలైన అంశాలు కా.రా. కథల్లో చోటు చేసుకున్నాయి. కా.రా. కథలను విమర్శకులు తొలి - మలి కథలుగా విభజించారు. తొలికథల్లో కుటుంబ జీవితాన్ని చిత్రిస్తే, మలికథల నాటికి పరిణామం చెంది సామాజిక వ్యవస్థ వైపు తన రచనను మళ్ళించాడు. రచయిత అనే వ్యక్తి సమాజంలోని విషయాలను తాను గమనించి, తనలో తాను విశ్లేషించుకుని, తనదైన శైలిలో రచన చేస్తాడు. ఎందుకంటే రచయితకు సమాజానికి అవినాభావ సంబంధముంటుంది. రచయిత కూడా సమాజంలో వ్యక్తే అయితే రచయితకు సామాన్య మానవునికి తేడా ఉంటుంది. సామాన్యుడు ఏదైనా సంఘటన జరిగినప్పుడు, దాన్ని చూసి స్పందించగలడే కానీ, తిరిగి తన భావాన్ని వ్యక్తపరచలేడు. కానీ రచయిత సమాజంలో తాను గమనించిన సంఘటనల పట్ల ప్రతిస్పందించి తనలో ఇముడ్చుకొని, దానికొక కళాత్మక రూపమిచ్చి, తనదైన దృక్పథంతో రచన చేయగలడు. ఆ రచనలో జీవితానుభవం తాను పెరిగిన సమాజం ప్రతిబింబిస్తాయి.

ఆధునిక తెలుగుసాహిత్యంలో కుటుంబ వ్యవస్థకు మానవతావాదానికి ప్రత్యేక స్థానం ఉంది. అందులోనూ కథ, కథానిక అనే ప్రక్రియలో మానవీయ కుటుంబ విలువల ప్రతిపాదనే పరమలక్ష్యంగా కనబడుతుంది. గురజాడ అడుగుజాడలో మొదలై, వడివడిగా నడకలు వేసిన తెలుగుకథ వందేళ్ళు పూర్తిచేసుకుంది. నేడు కథ ఆధునిక తెలుగు సాహితీ సామ్రాజ్యాన్ని ఏలుతుందనడంలో సందేహం లేదు. వస్తువులో, శైలిలో, శిల్పంలో ఎంతో నేర్పుచూపిన సృజనాత్మక ప్రతిభాసమర్థులైన రచయితలెందరో వున్నారు. విశ్వనాథ, శ్రీపాద, కొడవటిగంటి, చలం, చింతాదీక్షితులు మునిమాణిక్యం, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, కా.రా., తిలక్, గోపీచంద్, రావిశాస్త్రి మొదలైన కథానికా రచయితలు తమ కథలో విశ్వసాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

**ప్లాటుఫారమో :** కా.రా. కథల్లో మొదట అచ్చయిన కథ. ఉత్తమపురుషలో నడిచిన ఈ కథ చిత్రగుప్తలో 'కార్డుకథల' శీర్షికన ప్రచురించబడింది. గ్రామీణ ప్రాంత నేపథ్యంలో, ఒక యువకుని అంతరంగ చిత్రణ ఈ కథలో కనిపిస్తుంది. వివాహితుడైన కథకుడు పొరుగింటి పదహారేళ్ళ అమ్మాయిని చూసి ఆకర్షితుడు కావడం కథలో ప్రధాన వస్తువు.

దీపావళి పండుక్కి అత్తవారింటికి వచ్చిన కొత్త పెళ్ళికొడుకు కథకుడు. ఒక రోజు సాయంత్రం కథకుని భార్య అతనికి తల దువ్వుతుంటే పొరుగింటి అమ్మాయి వస్తుంది. కథకుని మదిలో ఆకర్షణ మొదలవుతుంది.

ఉబుసుపోకకు కథకుడు అరమైలు దూరంలోని రైల్వేస్టేషన్కు వెళ్ళడం, ప్లాటుఫారాన్ని, రైలునీ, రైలుశబ్దాన్నీ ఏ దృశ్యాన్ని చూసినా కథకునికి ఆ అమ్మాయే గుర్తుకు రావడం - ఇలా ఆ అమ్మాయి కేంద్రంగా కథ సాగుతుంది. తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు ఆ అమ్మాయి తన ఇంటి అరుగు మీద ప్రియుని కోసం నిరీక్షించడం, అప్పుడే వచ్చిన ఆమె తమ్ముడు ఆగి, తను రాలేదని చెప్పడం, ఆమె నిరాశ, కథకునిలో రకరకాల భావాలు - ఇలా కథ ముగుస్తుంది.

**వెళ్ళిపోయింది :** నాటి గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబ వాతావరణాన్ని చక్కగా వర్ణించిన కథ ఇది. పూర్తిగా కథ అంతా 'పండగ నాటి కుటుంబాల్లోని వ్యక్తుల ఆనందాలూ,

ఆడవాళ్ళ ఆచారాలు, పిల్లల ఆటలూ, ప్రకృతి పరవశం, పిల్లగాలులు, దేవాలయం సన్నాయి, మేలుకొలుపు పాటలూ, తెల్లారి తలస్నానాలూ, పేరంటాలూ, తాంబూలాలూ, భోజనాలూ, కొత్తబట్టలూ, పిల్లల మీది భోగిపళ్ళూ, సాయంకాలపు పిల్లల ఆటలూ, మాటలూ, కన్నెపిల్లల చూపులూ, కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలు భర్తమీద చూపే ప్రేమా .. ఇలా వర్ణన ఆద్యంతం అద్భుతంగా సాగుతుంది.

**అదృశ్యము :** ఆనాటి బ్రాహ్మణ కుటుంబాల్లో వివాహాలు ఎలా సాగేదీ ఈ కథ వర్ణిస్తుంది. 'లలిత' అనే యువతికి వివాహం నిశ్చమవుతుంది. వరుడు అంతకుముందే తాను అక్కగారి ఊళ్ళో గమనించిన, కలెక్టర్ ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్న అబ్బాయేనని లలిత తెలుసుకుంటుంది. తన అక్కగారి పొరుగింట్లో ఉంటున్న వివాహిత అనూరాధను రోజూ ఆ ఆబ్బాయి చూపులతో పలకరించడం, ఆ విషయంపై అనూరాధకు, లలితకూ వాదన జరగడం, ఆ అబ్బాయికి అనూరాధకు మధ్య వున్న ఆకర్షణను గూర్చి చర్చ - వీటిపై లలితకున్న నిశ్చలమైన అభిప్రాయాల నేపథ్యంలో లలిత అతనితో వివాహాన్ని తిరస్కరిస్తుంది.

రచయిత (కథకుడు) అదృశ్యరూపంలో ఉండి అన్నీ వివరించినట్లు ఈ కథ నడుస్తుంది. ప్రధానంగా అనూరాధ - లలితల మధ్య జరిగిన వాదనలూ, వారి హావభావాలూ, చదువు కారణంగా అనూరాధ అవినీతి మార్గాన పడిందనీ, శారీరక వ్యభిచారం కన్నా, మానసిక వ్యభిచారం నీచమనే స్థిరాభిప్రాయం కలిగిన లలిత ఉద్దేశాలు - ఇలా కథకుడు, మారుతున్న కాలంతో పాటు 'ప్రేమ' పట్ల యువత ఆలోచనల్లో వస్తున్న మార్పులూ, చలం 'మ్యూజింగ్సు' ప్రస్తావనా, కథలో చాలా విషయాలు చెప్పకనే చెప్తాయి. గుణశీలాలకు ప్రాధాన్యతనిచ్చే భారతనారి 'లలిత' ఆ యువకుని దుర్మార్గునిగా, రౌడీగా నీచునిగా భావించి 'తిరస్కరిస్తుంద'ని కథకుడు ముగింపులో సూచిస్తాడు.

**పెంపకపు మమకారం :** కుటుంబ జీవితంలో ప్రతిఇంటిలోను సాధారణంగా జరిగే కథలాగే 'పెంపకపు మమకారం' కథ. ఇందులో ప్రధాన పాత్రలు పార్వతమ్మ, ఆమె భర్త, ఆమె కొడుకు సుదర్శనం, కూతురు సుబ్బులు. పార్వతమ్మ మరిదిగారి కూతురు సరస్వతికి పుట్టినప్పుడే తల్లిపోయింది. సరస్వతి తండ్రి పార్వతమ్మ దగ్గరకు వచ్చి పిల్లని పెంచమని ప్రార్థించడంతో పార్వతమ్మే సరస్వతిని కన్నకూతురిలా పెంచింది. పెద్దయ్యాక మంచి సంబంధం చూసి పెళ్ళిచేసింది. పెళ్ళైన తర్వాత సరస్వతి భర్తకు ఆ ఊళ్ళోనే ఉద్యోగం వేయించి, సరస్వతి కుటుంబాన్ని ఇంట్లోనే పెట్టించారు. అప్పటినుండి తల్లీకూతుళ్ళ మధ్య చిన్నచిన్న విషయాలకు రగడ మొదలయ్యేది. ఎవరి ఆరోపణలు వారివి. ఎవరి సమాధానాలు వారివి.

ఈ గొడవల వల్ల, ఇంట్లో కల్లోల పరిస్థితులు ఏర్పడడం వల్ల సరస్వతి తండ్రి ఆమెకు ఆ ఊర్లోనే వేరే ఇల్లుచూసి కాపురం వేరుపరచాడు. ఈ విషయం తెలిసిన పార్వతమ్మ బాధపడుతుంది. సరస్వతి ఇంటికి తరచూ ఆమె తండ్రి, అన్న సుదర్శనం వెళ్ళి వచ్చేవారు. చిన్నప్పట్నుంచి కలిసి పెరిగిన చనువుతో సుదర్శనం సరస్వతి ఇంటికి వెళ్ళడం తటస్థిస్తూ కొంతకాలానికి అమ్మను చూడాలన్న సరస్వతి కోరికతో సుదర్శనం ఇంట్లో అందరిని సినిమా చూడడానికి ఏర్పాట్లు చేస్తాడు. అలా సినిమాహాల్లో చిన్నచెల్లెలు సుబ్బులు ఈ విషయం గమనిస్తుంది. రెండోసారీ ఇలానే సినిమాకు వెళితే అక్కడ మనవడు శ్రీపతి అమ్మమ్మ పార్వతమ్మను గుర్తుపట్టడంతో, సరస్వతి శ్రీపతి నోరునొక్కి ఒళ్ళోకి అదుముకుంటుంది. ఇది గమనించిన పార్వతమ్మకు సరస్వతిపై మరింత కోపం వస్తుంది. ఒకరోజు గుడిలో పార్వతమ్మకు గుళ్ళో శ్రీపతి కనబడి వెంటపడతాడు. నిజానిక శ్రీపతి తల్లిదండ్రులే వాణ్ణి అమ్మమ్మ వద్దకు వెళ్ళమంటారు. ఇంటికి వచ్చిన మనవడి ద్వారా అమ్మమ్మ అన్ని సంగతులు తెలుసుకుంటుంది.

సరస్వతి కొడుకు శ్రీపతి ఒక్కడే ఆ కుటుంబాన్ని కలిపి

ఉంచగలిగాడని చివరకు రచయిత నిరూపిస్తాడు. పెంపకపు మమకారం ఎంత గట్టిదో, రక్తసంబంధాల కంటే పెంచిన బంధం ఎంత గట్టిదో కూడ రచయిత ఈ కథలో స్పష్టంగా చూపగలిగారు.

**అభిమానాలు :** మధ్యతరగతి కుటుంబాల్లో అభిమానాల పేరుతో ఎంత 'హింస' నడుస్తున్నదీ ఈ కథ తెలియజేస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్రలు పద్మనాభం, ఆయన తమ్ముడు భాస్కరం, పద్మనాభం భార్య లక్ష్మమ్మ, భాస్కరం భార్య రాఘవి, పద్మనాభం కొడుకు చలపతి, పద్మనాభంగారి ఆడపిల్లలూ, భాస్కరం కూతురూ చిన్న పాత్రలు. పద్మనాభం దంపతులు భాస్కరాన్ని చిన్నప్పటి నుండి కొడుకులా పెంచి పెద్దచేస్తారు. తండ్రిలాంటి అన్నగారిని కాదని, భాస్కరం రాఘవిని పెళ్ళి చేసుకోవడంతో అన్నగారు కక్షకట్టి భాస్కరాన్ని వెలివేస్తాడు.

కొంతకాలానికి పద్మనాభంగారు తన కొడుకు చలపతిని పట్నంలో చదువుకు హైస్కూలులో చేర్పించాడు. ఊళ్ళోనే ప్రైవేటు మాస్టారి ఇంట బస ఏర్పాటు చేశాడు. కర్కోటకుడైన ఆ మాస్టారి ఇంట్లో చలపతి చాలా కష్టాలు పడతాడు. నిజానికి పద్మనాభంగారితో భాస్కరానికి సత్సంబంధాలు ఉండిఉంటే తన కొడుకును తమ్ముడి ఇంట పెట్టి చదివించేవాడు. తనని కొడుకుగా పెంచి పెద్దచేసిన అన్నగారి కొడుకును తన కొడుకుగా చూసుకొని చదివించే అవకాశం, తృప్తి భాస్కరానికి లేకుండా చేశాడు పద్మనాభం.

చలపతి మాష్టారియింట పడే కష్టాలను చూసినా, పద్మనాభం దాన్ని క్రమశిక్షణగానే భావిస్తాడు. తల్లిదండ్రులపై బెంగతో రెండురోజులు సెలవులకి ఇంటికి వచ్చినా, వాడిని ఆదరించక వెనక్కి పంపించేస్తాడు. చివరికి వాడు జబ్బుపడతాడు. సరిగ్గా ఆ సమయంలో పద్మనాభం భార్యకు పురిటిరోజులు. ఈ క్లిష్టపరిస్థితిలో భాస్కరం భార్యతో సహా వెళ్ళి చలపతిని ఆదుకుంటాడు. అప్పటికి పద్మనాభంగారికి తన తమ్ముడి భార్య మంచితనం తెలుస్తుంది. చలపతిని భాస్కరం దంపతులు తమ ఊరికి తీసుకెళ్ళడంతో కథ ముగుస్తుంది.

కథ చెప్పిన విధానంలో పాత్రల సంఘర్షణలు, వారు జీవిస్తున్న కుటుంబవ్యవస్థలోని లోపాలు, అభిమానాల పేరుతో దాగిన క్రౌర్యం - స్పష్టంగా కనిపిస్తాయి. మధ్య తరగతి కుటుంబాల్లో బైటికి కనిపించని 'హింస'ను సమాజం గుర్తించాలనేది రచయిత ఉద్దేశంగా తెలుస్తుంది.

**అశిక్ష - అవిద్య :** కుటుంబ జీవనంలోని 'హింస'ను మరోకోణంలో ఆవిష్కరించిన కథ ఇది. కా.రా అనే లెక్చరర్, అతని భార్య శ్రీదేవి, కా.రా తమ్ముడు సూర్యం, తల్లి వెంకటనరసమ్మ, చెల్లెలు విశాలాక్షి ప్రధానపాత్రలు. మొదటి నుంచీ పట్టణంలో చదవడం, ఉద్యోగం కారణంగా కుటుంబంలోని వ్యక్తుల పట్ల అంటీ ముట్టనట్లు వ్యవహరించాడు రామారావు. పెళ్ళి తర్వాత అతని భార్య శ్రీదేవి పట్టణనాగరికురాలు కావడంతో ఆ దూరం మరింత పెరిగింది. తమ్ముడు సూర్యం పెళ్ళికి కుటుంబమంతా వెళ్ళడం, పెళ్ళి ముహూర్తపురోజున శ్రీదేవి బంగారు గొలుసు కనబడకపోవడం, తన ఆడబిడ్డ విశాలాక్షిని ఆమె అనుమానించడం - వరుసగా జరిగిపోయాయి. పెళ్ళి పూర్తయిన మధ్యాహ్నం నుంచి గొడవ జరిగి, విశాలాక్షి అవమానభారంతో బావిలో పడి చనిపోతుంది. కుటుంబసభ్యుల్లో పరస్పరం గౌరవాభిమానాలు లోపించినప్పుడు వారి మధ్య దూరం పెరిగి, ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయో ఈ కథ వివరిస్తుంది.

**అభిశప్తులు :** మధ్యతరగతి కుటుంబాల్లోని వ్యక్తుల మధ్య ముఖ్యంగా అత్తాకోడళ్ళ మధ్య గొడవలు, మానవసంబంధాల మధ్య అపార్థాలు, స్వార్థాలూ, గొడవలూ వీటి మధ్య నలిగిపోతున్న శాపగ్రస్తమైన స్త్రీల బ్రతుకులు ఈ కథలో చిత్రించబడినాయి. రాఘవమ్మ, ఆమె కొడుకు సోమప్ప, సోమప్ప భార్య నారాయణి - వీరి మధ్య తగాదా ఈ కథలో ప్రధానాంశం. తల్లిని తనతో ఉండడానికి, గ్రామస్తుల

ఓదార్పు, ఫలితంగా రాఘవమ్మ దుఃఖం. తర్వాతి కాలములో నారాయణికి ఇలాంటి పరిస్థితే ఎదురుకావడం, కూతుళ్ళ కాపురాలు కష్టాలపాలై, కొడుకు వర్తకంలో విఫలమై దేశాలు పట్టిపోవడం - ఇలా రాఘవమ్మ, నారాయణిల శాపగ్రస్త జీవితం ఈ కథలో ప్రధాన వస్తువు.

కా.రా. తన తొలికథల్లో ఉన్నతవర్గం వైపు ఎగబాకాలనుకునే ప్రతి మధ్య తరగతి యజమాని ఎలా కష్టాలపాలయ్యేదీ వివరించారు. అందుమూలంగా మధ్యతరగతి జనం అట్లు పైకిపోలేక, సుఖాలను పొందలేక, ఇటు క్రింది వర్గంవారితో తమ కష్టనష్టాలను పంచుకోలేక త్రిశంకుస్వర్గంలో ఉండిపోవలసిందేనని నిరూపించారు.

"ఏ తరగతిలో విప్లవం నిక్షిప్తమై ఉందో, ఏ తరగతి భుజస్కంధాలపైన ఈ భూమి గుండ్రంగా తిరుగుతోందో"... ఆ దిగువతరగతి మీద కా.రా. దృష్టి మరలినట్లు విమర్శకులు భావించారు. పీడితుల, తాడితుల, నిరుపేదల, నిర్భాగ్యుల కన్నీళ్ళను, గాథలను, వారి అతుకుల బతుకులను తన మలికథల్లో కా.రా. మనకు సాక్షాత్కారింపజేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. కా.రా. కథలు - సామాజిక విశ్లేషణ
2. కాళీపట్నం రామారావు సమగ్ర రచనలు
3. కథాయజ్ఞం - దేవి వరప్రసాద్
   మనసు ఫౌండేషన్ ప్రచురణ
   సం. చేకూరి రామారావు హైదరాబాదు బుక్ ట్రస్టు ప్రచురణ.

❖ ❖ ❖

# కాళీపట్నం రామారావు కథలు - సామాజిక దృష్టి

**- డా॥ ఎల్. కస్తూరి,** తెలుగు అధ్యాపకులు, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

కాళీపట్నం రామారావు గారు శ్రీకాకుళం జిల్లా, పొందూరులో 1924 నవంబరు 9న భ్రమరాంబ, పేర్రాజు దంపుతులకు జన్మించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఆధునిక కథానిక రచయితల్లో కాళీపట్నం రామారావు గారు ముఖ్యులు. కోర్టులో ఉద్యోగిగా, ఉపాధ్యాయునిగా పనిచేశారు.

రావిశాస్త్రిగారితో పరిచయం, మార్క్సిస్టు మిత్రుల వాదోపదానలు వినడంతో గాంధీ, నెహ్రూల రాజకీయ చాతుర్యం గురించి తెలుసుకోగలిగారు. 1964-67 తీర్పు, ఇల్లు, వధ, యజ్ఞం, మహదాశీర్వచనం అనే కథలు రాశారు. 1967లో బెంగాల్లో మొదలైన నక్సల్బరీ ఉద్యమం ప్రభావంతో శ్రీకాకుళంలో రైతాంగ పోరాటం మొదలైంది. 1968లో శ్రీకాకుళం జిల్లా కమ్యూనిస్టు కమిటీ సాయుధ రైతాంగ విముక్తి పోరాటాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. 1967-72 సంఎలలో వీరుడు-మహా వీరుడు, హింస, నోరూమ్, స్నేహం, ఆర్తి, భయం, శాంతి, చావు, జీవధార, కుట్ర కథలు రాశారు. వీటిని కా.రా. కథలు పేరుతో ప్రచురించారు. 2008లో 'కాళీపట్నం రామారావు రచనలు' అనే పేరుతో ఆయన రచనలన్నీ ప్రచురించబడ్డాయి. ఆయన రాసిన కథల్లో తీర్పు, హింస, భయం, యజ్ఞం, మహదాశీర్వచనం, సంకల్పం వంటి కథలు ప్రసిద్ధమయ్యాయి.

కథా, నవలా రచనల్లో ఆయన ప్రతిభకు మెచ్చి 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ వారు ఉత్తమ కథగా యజ్ఞం కథను గుర్తించి అవార్డునిచ్చారు. ఎన్.టి.ఆర్. జాతీయ పురస్కారం, లోకనాయక్ ఫౌండేషన్ సన్మానం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డు, కొండేపూడి శేషగిరిరావు సాహితీ సత్కారం మొదలైన ఎన్నో పురస్కారాలను అందుకున్నారు.

ఈ అవార్డుల ద్వారా పొందిన డబ్బును ఆయన ఖర్చు చేసుకోక శ్రీకాకుళంలో కథానిలయం పేరుతో ఒక సాహితీ సంస్థను నెలకొల్పడం విశేషం. ఆ కథానిలయంలో కథలకు, కథానిక రచయితలకు సంబంధించిన వివరాలను పొందుపరిచారు. ఆంధ్రభూమి దినపత్రికలో 'నేటికథ' పేరుతో ఒక శీర్షికను నిర్వహించి ఎంతోమంది యువకుల్ని పరిచయం చేశారు. వారి భావప్రభావాలు ఆధునిక కథానిక రచయితలపై కన్పిస్తుందని చెప్పవచ్చు.

కాళీపట్నం వారు 30 దాకా కథలు రాశారు. 'అభిమానాలు, అభిశప్తులు, అశిక్ష-అవిద్య, పలాయితుడు' వంటి కథల్లో గ్రామీణ జీవితం కన్పిస్తుంది. రోజుల్లో గ్రామాల్లో భూములు చేతులు మారడం, పంటల్లో మార్పు రావడం, సమాజంలో చెడిపోతున్న వారు కొందరైతే, బాగుపడుతున్నవారు మరొకొందరు. ఆ విషయాలపట్ల కారా గారికి ఆసక్తి కలగడానికి కారణం గ్రామీణ వాతావరణంలో పెరగడం, తన తండ్రి కరణీకపు లెక్కల్లో సాయపడడం కూడా కారణమని చెప్పవచ్చు. పలాయితుడు, భయం, జీవధార, చావు కథల్లో సామాజిక దృష్టిని తెలియజేయడం ఈ వ్యాసోద్దేశం.

**1. పలాయితుడు:**

పలాయితుడు కథలో రాజశేఖరం పాత్ర ప్రధానమైంది. దాదాపు 25 ఏళ్ళ తెలుగుదేశపు చరిత్ర చెప్పిన కథ ఇది. సహాయనిరాకరణోద్యమంలో జైలుపాలై, దిక్కులేని చావు చచ్చిన ఒక స్వాతంత్ర్య సమర యోధుని కొడుకు రాజశేఖరం. అక్కడక్కడా పనిచేసుకుంటూ ఓ ఇంటివాడవుతాడు. క్షణంలో ఇంటిని నరకంగా మార్చే భార్య, చాదస్తులైన ఇంటి పెద్దలు. బ్లాక్ మార్కెట్ మింగేసే జీతం, అప్పులూ-వీటితో నరకయాతన అనుభవిస్తాడు. అన్ని కష్టాలూ అతనితో బాటే నడిచాయి. నిజానికి రాజశేఖరం పిరికివాడు కాదు.

అప్రయోజకుడు అంతకన్నాకాదు. ఆలోచనాపరుడు. కానీ తన జీవితంలో మాత్రం పలాయితుడవుతాడు. తన పరాజయానికి కారణం జూదగొండి ఆర్థిక విధానమనీ, దీని కబంధ హస్తాల్లో చిక్కుకొని ఉన్నంత కాలం మన జీవితాలను బాగుచేసుకోలేమని స్నేహితునికి ఉత్తరం రాస్తాడు.

ఈ కథలో రాజశేఖరం పాత్రద్వారా రచయిత ఆశించిన సామాజిక ధర్మాన్ని సూచించారు. ఇందులో ప్రస్తుత ఆర్థిక విధానం పట్ల వ్యతిరేకతా ఆలోచనాశీలురైన బాధితులపట్ల పక్షపాతం మనకు స్పష్టంగా కన్పిస్తాయి.

**2. భయం:**

భయం కథలో సత్తెయ్య, గౌరేసు, పావుల రామయ్య, సొమ్ములగురవడు పురుష పాత్రలైతే, పారమ్మ, రత్నాలు, సుబ్బాయమ్మ మొ॥ స్త్రీ పాత్రలు కన్పిస్తాయి.

సమాజంలో మనిషికి భయమనేది మానసిక దౌర్భల్యం. ఈ దౌర్భల్యం ఉన్నవాళ్ళు తమకేదో జరుగుతుందని ఊహించుకోవడమే భయం. మనిషి ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయపడుతుంటే ఒక్కోసారి జరుగుతుంది, ఒక్కోసారి జరగదు. భయంలేని వారికి కూడా వాళ్ళకు తెలియకుండానే ప్రమాదం జరగవచ్చు.

భయం కథ ప్రధానంగా పాముకు సంబంధించిన కథ. పామును చూస్తే మనిషికి ఎలా భయమో, మనిషిని చూస్తే పాము అలానే భయపడుతుంది. ఆ భయంతోనే కాటువేస్తుంది. ఆ భయంతోనే మనిషి చనిపోతాడు. పిరికివాడైతే ఏవేవో కథలు చెప్పి పామును పూజిస్తాడు. పాముపట్ల మనిషికున్న భయాన్ని కొందరు ఆదాయంగా మర్చుకుంటారు. దానితో వ్యాపారం చేస్తారు.

మనిషిలో మార్పుకు అనుభవం కారణమని నిరూపించిన కథ భయం. నాటుమంత్రసాని మోటు సులువులకు బలైపోయిన పారమ్మ, విషవైద్యుల ప్రయోగాలకు ఏళ్ళతరబడి బాధపడుతున్న గౌరేసు, పాముల గురించి, పాము మంత్రాల గురించి భ్రమలు పోగొట్టుకొని బర్మావాడి వద్ద పాముల్ని ఎలా పట్టుకోవాలో మెలుకువల్ని నేర్చుకొని, అజ్ఞానాన్ని సమాజం పరంచేసిన సత్తెయ్య, అజ్ఞానం మీద వ్యాపారం చేసే పాముల మంత్రగాడు, వైద్యుడు రావులయ్య, మంచిని వాడుకునే సుబ్బాయమ్మ, పదమూడేళ్ళ సొమ్ముల గురవడూ వీళ్ళ మధ్య జరిగిన కథే 'భయం'.

ఎవరింట్లో పాముకనబడినా దాన్ని పట్టుకొనే సత్తెయ్య, తానే పాముకాటుకు గురైనప్పుడు ఏ మనిషి సాయం చేయడానికి ముందుకురాలేని దుస్థితిని గమనించిన సొమ్ముల గురవడిలో మార్పురావడం మొదలవుతుంది. అలాంటి ఆలోచన ఆచరణలోకి వచ్చినప్పుడు అసలు నిజం అందరికీ కనబడుతుంది. సంఘర్షణ మొదలై సామూహిక చైతన్యానికి నాంది అవుతుందన్న సామాజికతను రచయిత చెప్పడం విశేషం.

**3. జీవధార:**

సమాజంలో ప్రతివ్యక్తికి నిత్యావసరాలతోబాటు దాహార్తిని తీర్చుకోవడానికి నీళ్ళు చాలా అవసరం. ప్రకృతిలో దొరికే వనరుల్లో ఒకటి నీళ్ళు. అలాంటి నీళ్ళు దొరకడంలో కూడా పేద, ధనిక తేడాలుంటాయని జీవధార కథ నిరూపిస్తుంది. యం.పి. రామారావు ఒక కంపెనీలో మేనేజరుగా ఉద్యోగం చేస్తున్న ఆ ఊరిలోని బంగళా యజమాని. బంగళాకి చుట్టపక్కల ఉన్న కాలనీల్లో నివసించేవారికి మున్సిపాలిటీ నీళ్ళ కొళాయి, వీధిదీపాలు వంటి సదుపాయాలను సమకూర్చిన పెద్దమనిషి. సత్యవతి, అమ్మాజీ, తవిటమ్మ, పాపాయమ్మ వంటి స్త్రీ పాత్రల చుట్టూ కథ నల్లూరు రచయిత.

యం.పి.రామారావు బంగళాలోని తోటలో ఉన్న కొళాయిలో నీళ్ళెప్పుడూ జీవధారలా పారుతూ ఉంటుంది. కనుక సత్యవతి, అమ్మాజీ, తవిటమ్మ నీళ్ళకోసం మున్సిపాలిటీ వారి పబ్లిక్ కొళాయి దగ్గరకెళ్తే నీళ్ళు సరిగా రాకపోవడంతో నీళ్ళు పట్టుకోవడానికి రావుగారి బంగళా గేటు దగ్గర నిలబడి వాళ్ళని పిలవడం, వాళ్ళు కొళాయిలో నీళ్ళు పట్టుకోవడానికి ససేమిరా అంటారు. మేము పన్ను కడతాము

మీకెందుకు నీళ్ళివాలని బంగళాలోని ముసలావిడ అంటుంది. అంతటితో ఊరులేక కుక్కల్ని మీదికి వదులుతామని బెదిరిస్తే, సత్యవతి కూడా పోలీసుల్ని పిలుస్తామని బదులిస్తుంది. సాటి మనుషులు నీళ్ళ కోసం పాట్లు పడుతుంటే, చెట్లు చేమల్లో వృధాగా పొయ్యే నీళ్ళు మనుషుల అవసరాలను తీర్చుకోవడానికి ఇవ్వకపోవడం వంటి ధారణమైన దృశ్యాలను కళ్ళకు కట్టినట్లు చూపించి సామాజికతను సాటుకున్నారు రచయిత. కొళాయిల్లోంచి నీళ్ళు పట్టుకోబోతే వాళ్ళు ఒప్పుకోరు. తిరగబడకపోతే గంజినీళ్ళేకాదు మంచినీళ్ళు కూడా దొరకవని తెల్పే కథే జీవధార. కలిమిలేమిలు కావడికుండలన్నట్లు కుబేరులు - కుచేరులుగా చీలిపోయిన సమాజంలో తిరుగుబాటు తప్ప గత్యంతరం లేదని జీవధార కథ నిరూపిస్తుంది.

**4. చావు:**

ఒక దళితవాడలో ఒక ముసలామె చనిపోతే ఆమెకు క్షితిని పేర్చడానికి ఎక్కడా కట్టెలు దొరకదు. ఎవ్వరూ ఇవ్వరు. ఆముసలావిడ చనిపోవడంతో ఎదుర్కొన్న సమస్య, దాని పరిష్కార మార్గం గురించి, దళిత వాడల్లోని వాస్తవిక జీవిత సమస్యల్ని పాఠకుని కళ్ళముందు కదలాడినట్లు చిత్రించిన కథే చావు. పేట జనమంతా పక్క ఊరి పొలం పనుల్లో ఉన్నారు దళితవాడలో ఎరకయ్య తల్లి చనిపోయిందని తెలిసి దళితులందరూ ఊరు చేరారు. రాత్రికి రాత్రే శవ సంస్కారం పూర్తి కావాలనుకుంటారు. చలికాలం కనుక పొద్దున్నే నాలుగు రూపాయలు వచ్చే రోజు వృధా పోకూడదని వారి బాధ. ఆమెను గుంతతీసి పాతిపెట్టడం కుదరదు. ఎందుకంటే ఆమె బతికున్నప్పుడు కొడుకుతో 'ఒరే ఏదో రోజు నేనీ సలికీ సచ్చిపోతానా. శీతాకాలం కర్రల్దారకవని కప్పెట్టకుమీ - ఎక్కడేనా కొనో, కసింత అడుక్కునో, సివరికి దొంగతనం సేసినా సరే నన్ను కాల్సియాల. నాయిన్నాళ్ళ సలీ కాష్టం మీనైనా కాలిపోవాల' అని అనేది. శవాన్ని కాల్చాలంటే మోపెడు కట్టెలు కావాలి. రాత్రిపూట ముష్టికుదరదు. కట్టెలు ఎత్తుకురావడం ఒకటే మార్గం. ముసలావిడ కాష్టం కాల్చే మోపెడు కట్టెలకు కొడుకు పడరాని పాట్లుపడిన తీరుని, సామాజిక దుస్థితిని రచయిత చక్కగా వర్ణించారు.

కారా మాస్టారుగా పేరుగాంచిన వీరి కథల్లో సమాజంలోని పేద ప్రజల సమస్యలు, దానికి గల కారణాలు, వాటి పరిష్కార మార్గాలను చూపడం కనబడుతుంది. అట్టడుగు వర్గాలకు చెందినవారిని కథా వస్తువుగా తీసుకొని భౌతిక అవసరాలకు సమాజానికి గల సంబంధం, సమాజంలోని ముఖ్యమైన ఆర్థికస్థితిగతుల్ని, పాత్రల మధ్య కలిగే ఘర్షణలకు గల కారణాలు కూడా కథల్లో కన్పిస్తుంది అంతేకాక వీరి రచనల్లో నిరాడంబరత, సంయమనం, నీతి నిజాయితీ, సాదాసీదాతనం, మానవీయ విలువలు కన్పిస్తాయి. సామాజిక దృష్టిని కలిగి శ్రామికుల జీవన సౌందర్యాన్ని కాంక్షిస్తూ రచన గావించారని చెప్పవచ్చు. వీరి రచనలు పేదలబతుకులను పట్టి చూపుతుందనుట అతిశయోక్తికాదు.

**ఆధార గ్రంథాలు:**

1. వివినమూర్తి, రచనశాయి (సంపాదకులు) - కాశీపట్నం రామారావు రచనలు, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాదు.

❖ ❖ ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కాళీపట్నం రామారావు గారి కథల్లో సామాజిక సందేశం

**– డా॥ పి. కమలసుధారాణి,** తెలుగు అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ సిటీ కాలేజ్, హైదరాబాద్

కథ అనగానే అందరికీ ఆసక్తి కలుగుతుంది. అందుకే చెట్టుకో కథ, పిట్టకో కథ అంటారు. అయితే ఈ కథాసాహిత్యానికి మూలాలు మహాభారతంలో, రామాయణంలో, భాగవతంలో అనేక సందర్భాల్లో అపూర్వంగా ఉండటం గమనార్హం. ఏదైన విషయ వివరణ చేయాలన్నా, సూచనప్రాయ జ్ఞానం కలిగించాలన్నా, దిశానిర్దేశం చేయాలన్నా, జ్ఞానాన్ని కలిగించాలన్నా కథా ప్రక్రియను మించింది లేదనడంలో అతిశయోక్తిలేదు. ఎందుకంటే ఒక కథ ఆద్యంతం చదివితేనే దానిలోని సారం పట్టుపడుతుంది. ఆధునిక, తెలుగు కథా సాహిత్యానికి గురజాడ వేసిన బాట చాలా విశాలమైంది. అందుకే తర్వాతి కాలంలో బలమైన కథా సాహిత్యమే వచ్చింది. అందుకే అడుగుజాడ గురజాడ అన్నారు పెద్దలు.

ఆధునిక తెలుగు కథాసాహిత్య ప్రపంచంలో కాళీపట్నం రామారావు గారిది ప్రత్యేకముద్ర. అందుకే ఆయన కథలు గొప్పస్థానం పొందాయి. కాళీపట్నం రామారావు గారి కథల్లో మొదట్లో అంటే తొలి కథల్లో చాలా భాగం పై కులాల్లోని మధ్యతరగతి కుటుంబాల గురించి రాసినవే ఉండేవి. తర్వాత అంటే దాదాపు 1964 నుండి ఆయన కథల్లో వస్తువు మారట ప్రారంభమైంది. పేదరైతులు, నిరుపేద కుటుంబాల జీవితాల గురించి వ్రాయటం ప్రారంభించారు. తొలి కథల్లో గాని, తర్వాతి కథల్లో గాని మన మనస్సులకి ఆహ్లాదం కలిగించే విషయాలకన్నా, ఆలోచింపచేసే విషయలే ఎక్కువగా ఉన్నాయి.

గొప్ప పుస్తకాలు మనకి హాయి కలిగించవు. మనని మనకి విప్పిచెప్పేసి అల్లరి పెడతాయి, అలజడి కలిగిస్తాయి. అలాగే నిలదీసి ప్రశ్నిస్తాయి? నిలబెట్టి నడిపిస్తాయి. ఏదయినా చివరికి అశాంతే ఫలితం. అలాంటి విప్లవకరమైన అశాంతికి కారకులైన రచయితలలో రామారావు గారు ఒకరు. అయితే ఈ అలజడి కలిగించే పనిని ఈయన చాలా నిదానంగా చేస్తారు. ఆయన కథలు బహు నెమ్మదిగా నడుస్తాయి. ఏ మాటా దూకుడుగా ఉండదు. ఏ వాక్యమూ కోపంగా నడవదు. మొత్తం కథంతా నిండా నీళ్ళున్న లోతైన చెఱువులా నిశ్చలంగా ఉంటుంది. కథ చదివిన పాఠకులు మాత్రం విపరీతంగా అలజడికి లోనవుతారు.

రామారావుగారు జీవిత సంఘటనల్ని, పాత్రల ప్రవర్తనల్ని, వాళ్ళ మాటల్ని వున్నవి వున్నట్టుగా ఎంతో వాస్తవికంగా రాశారు. రామారావు గారికి మనుషుల నైజాల్ని నిశితంగా పరిశీలించే నేర్పు ఉంది. ఆ గొప్ప లక్షణమే ఆయనకు అనేక కోణాల్లో సామాజిక జీవన సందేశాన్ని ఇచ్చే కథల్ని రచించటానికి దోహదకారి అయింది. అందుకు తార్కాణంగా కొన్ని కథల్ని చూస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

**1. అదృశ్యము** - అనే కథలో నాలుగు ప్రధాన పాత్రలు. ముఖ్యంగా ఇద్దరమ్మాయిలు వారి మధ్య స్నేహసంభాషణ వింటే పవిత్రత, గుణశీలాలు ఎంతలా ఆడపిల్లల మనసుని ప్రభావితం చేస్తాయో తెలుస్తుంది. ఇందులో ప్రధాన నాయిక వయస్సు 15. పేరు లలిత. అక్కతో కలిసి విశాఖపట్నం వెళు తుంది. కానీ తన పల్లె రుచులు బాగున్నాయని అభిప్రాయ పడుతుంది. కారణం అక్కడ దొరికే పల్చని మజ్జిగ, కల్తీ నెయ్యి, ఇక మానవ సంబంధాల్లో అక్క పక్కింట్లో ఉండే అనురాధ పరిచయం, స్నేహంగా మారటం మొదలైన విశేషాలు చూస్తే కాళీపట్నం రామారావుగారి నిశిత పరిశీలనా దృష్టి తెలుస్తుంది. పవిత్రత మనసుకా, శరీరానికా అని లలిత అడిగితే, అనురాధ మాట్లాడే మాటల్లో మనసుకి కూడా అవసరం అని లలిత, అనురాధ మాట్లాడే మాటల్లో మనసుకి కూడా అవసరం అని చెప్పడం గమనార్హం. అనురాధ

ఎదురింట్లో కుర్రాడితో కళ్ళతోనే మాటల స్నేహం చేయడం లలితకు నచ్చలేదు. అనురాధ బి.ఏ. దాకా చదువుకున్న పట్నవాసపు యవతి. అయినా ఆడదే కదా అని లలిత అభిప్రాయం. చివరికి అదృష్టం ఎలా తిరిగిందంటే ఆ కుర్రాడే లలితకు పెళ్ళికొడుకుగా తటస్థపడటం. ఇలా కథ మలుపు తిప్పిన కాళీపట్నం రామారావు గారు మానవ సంబంధాలకుండాల్సింది అవగాహన అని చెప్పటం అపూర్వంగా ఉంది.

**2. రేవతి -** నుంచి ఈ కథలో ఇద్దరు ఎక్కువ చదువులేని స్నేహితురాళ్ళు వ్రాసుకునే ఉత్తరాల ద్వారా కాళీపట్నం రామారావు మానవ సంబంధాలు కలకాలం నిలవడానికి కావల్సిన విషయాలు చెప్పారు. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా వారి జీవితం, జీతం, హోదా, పిల్లలు, సమస్యలు మాట్లాడుకోవడం సహజం. కానీ ఇందులో ఇద్దరి మధ్య సాగే ఉత్తరాల్లో సహజపూల పరిమళాలు విరుస్తుంటాయి. సీత, రేవతి. సీతకు ఉత్తరం వ్రాసే రేవతి తన బిడ్డని చూస్తూ భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండటానికి ఏ తల్లి అయినా ఎంత తపించి ఉంటుందో కదా అంటూ ప్రహ్లాదుడు, గాంధీ, హిట్లర్ వాళ్ళను తలుచుకోవటం విచిత్రం. ఊహ తెలియని తన బిడ్డ చేష్టలతో అతడి భవిష్యత్తు గురించి ఊహలు ఉత్తరంగా వ్రాయడం విశేషం. ఈ కథ ద్వారా కాళీపట్నం రామారావు చెప్పేదేమంటే ఆనందాన్ని పంచుకొంటేనే జీవితం ఆహ్లాదంగా ఉంటుంది. ప్రతి వ్యక్తికి, కుటుంబానికి కొన్ని సర్వసాధారణం. వాటిని మరో కోణంలో చూస్తే విసుగు, విరక్తి ఉండదు. చక్కని కుటుంబవ్యవస్థ, ఆ ద్వారా ఆరోగ్యకర సమాజం నిర్మించబడతాయి. ఇదే రేవతి నుండి నేర్చుకోవాలి రచయిత అభిప్రాయం.

**3. బలానికి లక్ష్యం -** ఈ కథలో కాళీపట్నం రామారావు యువత ఎలా ఉండాలో చెప్పడానికి ఒక సంఘటనని కథారూపంలో చెప్పారు. పేరులేని ఒక వ్యక్తి పాత్ర ఒక హోటల్కి తరచు వెళుతుంటాడు. ఆ హోటల్లో అన్నీ ప్రత్యేకంగా అలంకరించి ఉండటం అతడ్ని ఆకర్షిస్తుంటుంది. ఒకనాడు ఒక సర్వర్, ఒక రైతుని అవమానించాడు. అక్కడే ఉన్న ఒక పెద్దమనిషి ఎ సర్వరుని, హోటల్ యజమాని దగ్గరకు తెచ్చి క్షమాపణ చెప్పమని అడిగితే జరిగే గలాటాలో విద్యార్థులు కూడా పెద్దమనిషి పక్షాన నిలబడటం గమనార్హం. చివరికి సర్వరు, యజమాని క్షమాపణ చెప్పగా విద్యార్థులు హర్షధ్వానాలు చేశారు. ఆ సందర్భంలో పెద్ద మనిషి విద్యార్థులతో ఎప్పుడూ ఇలాగే చైతన్యంగా ఉండండి అనడం గమనించదగ్గ విషయం. ఆనాడే కాళీపట్నం రామారావు యువతరం ముఖ్యంగా విద్యార్థులు ఎలా ఉండాలో ఈ కథ ద్వారా చెప్పడం ప్రేరణాత్మకంగా ఉంది.

విద్యార్థులు చైతన్యవంతంగా ఉంటేనే సమాజం తద్వారా దేశం వృద్ధి చెందుతుందని, పక్కవారినంటే నాకేంటి అనుకోకుండా మానవ సంబంధాలు కలిగి ఉండాలనే గొప్ప సామాజిక సందేశం ఈ కథ ద్వారా కాళీపట్నం రామారావు అందించారు. అంతే కాదు సహకారం, ఐక్యత, ముందంజ ప్రతి విద్యార్థిలో ప్రేరేపించేలా ఉందీ కథ. ఇదే ఈ కథలో బలానికి లక్ష్యం.

**4. రేవతి నుంచి నవచైతన్యం -** ఈ కథ నాడు - నేడు కూడా ఆడపిల్లల దుస్థితికి అద్దంలా ఉంది. సీత, రేవతి మంచి స్నేహితులు. వారి ఉత్తరాల్లో ఉల్లాసమైన కబుర్లే కాదు సమాజాన్ని మార్చాలనే తపన కనిపిస్తుంది. ముఖ్యంగా రేవతి నిత్య చైతన్యం గల పాత్ర. చుట్టూ ఉన్న విషయాలను అన్ని కోణాల్లో చూసి స్పందిస్తుంది. ఈ కథలో రేవతి ఎదురింటి అమ్మాయికి పెళ్ళి చూపులు. రోజా లేగదూడలా ఎగురుతూ, సీతాకోక చిలుకలా పరికిణీ, ఓణీలతో తిరిగే పిల్లకి పెళ్ళి చూపులు. అప్పుడు ఆ పిల్ల బెదిరిన లేడిలా ఉంది. చుట్టిన పట్టుచీర, ఆమె తల్లిదండ్రులు చేసే హడావుడి, మగపెళ్ళివారి ప్రశ్నలు, చూపులు, ప్రవర్తన చూస్తే జీవితానికి పెళ్ళి వద్దు అనిపిస్తుందని రేవతి ఉత్తరం వ్రాసింది సీతకు. అంతేకాదు సంతలో పశువులా ఆడపిల్ల ఇంకా ఎన్నాళ్ళు ఈ మూర?

సంప్రదాయాంలో బ్రతకాలని ప్రశ్నిస్తూ దీనికి స్వస్తి చెప్పాలని అంటుంది. కాళీపట్నం రామారావు గారు రేవతి పాత్ర ద్వార యువతుల్లో నవచైతన్యం కలగాలని అప్పుడే వారిపట్ల జరిగే దురాచారాలు సమసిపోతాయని చాలా బాగా కథ ద్వారా చెప్పటంలో గొప్ప సామాజిక సందేశం సమాజంలో స్త్రీ, పురుషులు కలిసి బ్రతకటం అవసరమైతే స్త్రీలే ఎందుకు ఈ అవమానాలు భరించాలి అనే ప్రశ్నతో స్త్రీలలో నవచైతన్యం కలగాలని కాళీపట్నం రామారావు ఈ కథ ద్వారా ఉద్ఘాటించారు.

**5. రాగమయి -** ఈ కథలో ఒక సమిష్టి కుటుంబంలో ఉండే ఆనందాలు, బంధాలు, అనుబంధాలు, అనుకోని సమస్యలు ఎదురు నిలబడి చెప్పలేని పిల్లలు, వారి బాధలు. ఇంటి కోడలి నేర్పు, ఓర్పు అన్నీ చక్కగా విభిన్న పాత్రల్లో జీవం పోసి రచించారు. కాళీపట్నం రామారావు ఈ కథ భారతీయ జీవనవిధానానికి, కుటుంబ వ్యవస్థకు చక్కని తార్కాణం.

ఒక స్త్రీ ఎన్ని రకాలుగా కుటుంబాన్ని తీర్చిదిద్దుతుందో ఈ కథలో "ఉమ" అనే కోడలి పాత్రలో చూపించారు. అలిగో, అవమానపడో ఆడపిల్ల పుట్టింటికి వస్తే తల్లికన్నా వదిన బాధ్యత వహించి, మళ్ళీ ఆడపిల్లకు భర్తతో సహజీవనం కలిగించే తీరు ఆద్యంతం సమిష్టి కుటుంబవ్యవస్థకు చిహ్నంగా ఉంది. ఏ సమాజానికైనా పునాది కుటుంబవ్యవస్థ. ఆ వ్యవస్థకు మూలం వివాహం. ఆ వివాహబంధం సఫలం కావాలంటే ఆలుమగల మధ్య ఉండాల్సిన అవగాహన, ఆకర్షణ ఎంత అవసరమో ఆనాడే చెప్పిన కాళీపట్నం రామారావు గొప్ప తాత్వికుడు.

తరాలు మారినా మారని, మారకూడని వివాహబంధాన్ని, కుటుంబ జీవనాన్ని, మానవతా విలువలను, స్త్రీలకున్న గౌరవాన్ని గుర్తించేలా ఈ కథ సాగటం గమనార్హం. ఈ విధంగా కాళీపట్నం రామారావు గారు వ్రాసిన అన్ని కథల్లో సామాజిక జీవన మూల్యాలు ఎన్నెన్నో ఉన్నాయి. ప్రతి కథ ఏదో ఒక సామాజిక సందేశాన్నిచ్చేదిగా ఉండటం హర్షదాయకం.

**మనం మనం కలిస్తే జనం**
**జనం జనం కలిస్తే సమాజం**

ఆ ఆదర్శ సమాజనిర్మాణంలో కవులు, రచయితలు నిరంతర శ్రామికులు. వారి శ్రమని, ఆ పనిని గుర్తించి సమసమాజాన్ని నిర్మించటానికే కాళీపట్నం రామారావు వంటి మహానుభావులు రచనలు చేశారనడంలో అతిశయోక్తిలేదు. వారి ఆశలు, ఆశయాలు నిజమయ్యేలా అంతా జీవనం సాగించాలని ఆకాంక్షిద్దాం.

❖ ❖ ❖

# కారా కథలు - చైతన్య చంద్రికలు

**- డా॥ సూరపరాజు వసంత కుమారి,** తెలుగు అధ్యాపకురాలు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

సుప్రసిద్ధ కథా రచయిత కాళీపట్నం రామారావు, కారా మాస్టారు అని ఆప్యాయంగా పిలుచుకొనే వీరు ఎన్నో కథలను రచించారు. అవి ఎన్నో బాషలతోపాటు ఆంగ్లము, రష్యన్ భాషల్లోకి కూడా అనువాదము అయ్యాయి.

ఉపాధ్యాయ వృత్తితో పాటు, కార్యనిర్వాహక కమిటి మెంబర్ విప్లవ రచయితల సంఘానికి కూడా తన సేవలను వీరు అందించారు. 1924వ సంవత్సరం నవంబరు 9న శ్రీకాకుళం జిల్లా, పొందూరులో కాళీపట్నం రామారావుగారు భ్రమరాంబ, పేర్రాజు దంపతులకు జన్మించారు.

కథే తన శ్వాసగా ఎన్నో అద్భుతమైన కథలను రచించి తెలుగు కథలన్నింటిని ఒక చోటకు కథానిలయాన్ని చేర్చడానికి కథానిలయాన్ని స్థాపించి, లక్షకు పైగా కథలన్నీ ఒకచోటకు చేర్చిన వీరి సంకల్పం, కృషి అమోఘం. 2009లోనే కథల పుస్తకాల డిజిటలైజేషన్కు వీరు శ్రీకారం చుట్టి ఎవరు ఎక్కడి నుంచైనా కథా నిలయం. కామ్ వెబ్సైట్లోకి వెళ్ళి నచ్చిన కథను డౌన్లోడ్ చేసుకొని చదువుకొనేలా చేసిన చదువుకునేలా చేసిన వీరి కృషి బహు ప్రశంసనీయం. 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోవడంతో పాటు, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ లాంటి ఎందరో రచయితలకు రామారావు గారు గురువుగా నిలిచారు.

సాహిత్యం యొక్క ప్రధానమైన ప్రయోజనం సమాజ హితమే. ప్రజల ఆనాటి సామాజిక స్థితిగతుల్లోని ఆర్థిక సాంఘిక తేడాలు, కొందరికి జరుగుతున్న అన్యాయాలు తెలియజేస్తూ వారిలో చైతన్యం కలిగి ముందుకు కదిలేలా కారాగారు ఎన్నో కథలను రచించారు, అన్న విషయాన్ని కాళీపట్నం రామారావు రచనలలోని కొన్ని కథల విశ్లేషణతో నిండిన ఈ పరిశోధన పత్రం ద్వారా మనం దర్శించవచ్చు.

'చావు' అనే కథలో ఎరకయ్య సావాలు కూలినాలి చేసుకొని జీవించే నిరుపేద ఎరకయ్య ముసలి తల్లిని ముగ్గురు చిన్న పిల్లల్ని వదిలేసి, ఇంకో ఇద్దరు పిల్లలతో కలసి కూలిపనికి ఆ దంపతులు వెళుతారు ఇంట్లో వున్న ఇద్దరాడ పిల్లల పేర్లు సిమ్మాది, దాలి. వాళ్ల తమ్ముడి పేరు పెంటిగాడు. సిమ్మాద్రి నూకల జావ వాళ్ళ నానమ్మకు తాగించడానికి తీసుకెళు తుంది. ఆ సమయానికి ఆ ముసలామె చలికి వజవజ వణికిపోతు వుంటుంది. ఇంట్లో వున్న గుడ్డలు, పాతగోనెలు, చింకి బొంతలు అన్ని కప్పినా ఆ ముసలమ్మకు చలి ఆగదు. అలా 15 నిమిషాలు కొట్టుకొని తర్వాత చనిపోతుంది. వేరే వూరికి కూలికోసం పని కోసం వెళ్ళిన ఎరకయ్య దంపతులు ఆ విషయం తెలిసి వాళ్ళ ఇల్లు చేరే సరికి రాత్రి అవుతుంది. అప్పటికే ఆ ముసలి ఆమె శవం నుండి నీళ్ళు కారుతూ దుర్వాసన వస్తూ వుంటుంది. అందుకని శవాన్ని ఆ రాత్రికే దహనం చేయాలనుకొంటారు. చనిపోయిన వారిని కాల్చడమే వారి ఆచారం. ఆచలికాలంలో శవాన్ని కాల్చడానికి సరిపడ కర్రలు అణగార్చిన సాంఘిక కులంలో పుట్టిన పేదవాళ్ళ దగ్గర వుండవు. అందుకోసం వారు ఆ రాత్రి వేళ రైతులు, కరణం, పెద్దనాయుడి ఇండ్లకెళ్ళి ప్రయత్నం చేస్తారు. వాళ్ళు ఎవ్వరూ కథలు ఇవ్వరు అప్పుడు వాళ్ళు ఎంతో బాధపడి, చివరకు కాల్చడం అన్న ఆచారాన్ని విధిలేని పరిస్థితుల్లో ప్రక్కన పెట్టి, శవాన్ని పూడ్చి పెట్టడానికి నిర్ణయించుకొని, ఆపనిలో నిమగ్నమై వుంటారు. ఆ రిలోని వాళ్ళలో చైతన్యం ప్రారంభమై, కొందరు వెళ్ళి కట్టెల మోపులను, వున్న వాళ్ళ ఇండ్ల నుండి దొంగతనంగా తీసుకొని వచ్చి ఆ శవాన్ని అందరూ కలసి దహనం చేస్తారు.

పేద ధనిక వ్యత్యాసాలు, కులాంతరాలు, తక్కువ కులంలో పుట్టిన పేదవారి బాధలు, చివరకి వారిలో చైతన్యం

కలిగి ఆ సమస్యని పరిష్కరించుకొన్న తీరు ఎంతో హృద్యయంగా ఈ కథ ద్వారా కారాగారు తెలియజేశారు.

'అప్రజ్ఞాతం' అనే కథలో ఒకనాడు జగన్నాథస్వామి ఆలయం దగ్గర కాలక్షేపం కోసం ఆ వూరి జనం కబుర్లు చెప్పుకొంటు వుంటారు. రాజకీయాల గురించి కమ్యూనిజం గురించి, చర్చసాగుతూ వుంటుంది పట్నంలో బి.ఏ. చదువుతున్న సుదర్శనం మాట్లాడుతూ ఈ దేశంలోనే కాక దాదాపు అన్ని దేశాల్లోను తినడానికి ఉన్నవాళ్ళు తక్కువ, తిండిలేని వాళ్ళే చాలా ఎక్కువ, ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే పెట్టుబడిదారులు పట్టణాల్లో పెద్దపెట్టున చేస్తున్న పారిశ్రామిక దోపిడి జరుగుతూవుందని, పల్లెల్లో భూస్వామ్య దోపిడి వలననే, అదే విధంగా, జరుగుతూవుందని వివరిస్తూ వుంటాడు. ఆ వూర్లో వున్న భూస్వాములు, సంపన్నులు అది కరెక్ట్ కాదని, వాదనకు దిగుతారు. పాలేర్లు కూలీల చేత పని చేయించుకుంటే వాళ్ళకు జీతాలు, కూలీలు ఇస్తున్నాం కదా ! అందులో దోపిడీ ఎక్కడుంది. పైగా వాళ్ళకు గింజలు, బట్టలు వగైరాలన్నీ ఇస్తున్నాం, లేని పాలేర్లు వున్న రైతులను దోచుకుంటున్నారంటూ వివరిస్తారు. అందుకు సుదర్శనం దోపిడీ వేరు దొంగతనం వేరు. పట్టపగలు అందరూ చూస్తుండగానే భుజబలంతోనో ఆయుధ బలంతోనో, సంఘ బలంతోనో ప్రతి ఘటించడానికి ఎదుటివాడిని అసమర్థుడిని చేసి దౌర్జన్యంగా విలువైన వాటిని స్వంతదారునిచేతే తెప్పించి పుచ్చుకొంటే అది దోపిడి. భూస్వాములు పేదవారైన పాలేర్ల, కూలీలకు ఆకలి రాక్షసి కోరలను చూపి, వారి విలువైన శ్రమ శక్తిని తక్కువ డబ్బుకు దోచుకుంటున్నారని విధిలేని పరిస్థితుల్లో వారు తక్కువ డబ్బుకే తమ శ్రమను పేదవారు అమ్ముకొంటున్నారని రచయిత సుదర్శనం పాత్ర ద్వారా తెలియజేస్తాడు.

అంతేగాక ఆవూరిలోని రైతులకు ఏ అవసరం వచ్చినా అప్పు ద్వారా షావుకారు సూరప్పడు లాంటి వారి దగ్గర ఆ అవసరాలను తీర్చుకొంటారు. దఫ దఫాలుగా చేసే ఆ అప్పులన్నింటి మీద వడ్డీలు కట్టి షావుకార్లు వసూలు చేస్తారు, అ వడ్డీ సంవత్సరానికి లెక్కవేస్తారు. సంవత్సరం మొదటి రోజు తీసుకొన్నా చివరి రోజు తీసుకున్నా ఒక సంవత్సరకాలానికి వడ్డీ వసూలు చేస్తారు. ఇలా పేదవారిని వడ్డీ వ్యాపారులు దోచుకుంటున్నారని వివరిస్తాడు.

వ్యాపారస్తులు కూడా పేదవారిని అనేక విధాలుగా దోచుకుంటున్నారని, అప్పుతీసుకొన్న రైతు తన పంటను అప్పు ఇచ్చిన షావుకారికే అమ్మాలని, దానికి తక్కువ రేటును నిర్ణయించడం, తేడాలున్న కొలతలతో మోసం చేస్తూ పంటను తీసుకోవడం ఇలా అనేక విధాలుగా పేదవారిని దోచుకుంటు వున్నారని సుదర్శనం పాత్ర ద్వారా కారా ప్రజల్లో చైతన్యం కలిగేలా కథను రచించి కొంత నాటకీయతతో ఈ కథను ముగిస్తాడు.

"అర్థం కాని మానవగాథ" అనే కథలో నారాయణ తన భార్య ఇద్దరు కొడుకులతో ఒక వూరిలో జీవిస్తూ వుంటాడు. అతని చరిత్ర తెలుసుకోవడానికి ఆవూరి జనాలు ఎన్నో ప్రయత్నాలు చేసినా, వారు ఇంటి నుండి బయటకు రాకపోవడం, వచ్చినా ఏ విషయాలకు సమాధానం చెప్పకుండా "ఏమందండీ" అంటూ వెళ్ళిపోతుండడంతో వారిది అర్థంకాని మానవగాధగా ఆ వూరి జనానికి మిగిలిపోతుంది. వారికి తోచిన విధంగా రెండు విధాలుగా వారు వీరి కథను ప్రచారం చేసుకొంటూ వుంటారు. తరువాత శ్రీరాములు నాయుడుతో కలసి వ్యాపారం చేసి నారాయణ బాగానే సంపాదిస్తాడు. తరువాత అతనితో విడిపోయి తనే స్వంతంగా వ్యాపారం చేస్తూ బాగానే సంపాదిస్తున్నాడు. ఖర్చు విషయంలో పిసినారని, భార్య జబ్బుతో బాధపడుతూవుంటే హాస్పిటల్కు కూడా తీసుకెళ్ళకుండా ఏవో మందులు మాకులు తానే తెచ్చి ఇచ్చాడని చివరకా యిల్లాలు అలాగే చనిపోయిందని అందరూ చెప్పుకొంటూ వుంటారు.

పెద్ద కొడుకు స్కూల్ ఫైనల్ అవ్వగానే చదువు మానిపించేస్తే ఆ కుర్రాడు ఒక ప్రైవేటు ఉద్యోగం చేస్తూ

జీవిస్తూ తమ్ముడిని తానే చదివించుకుంటు వున్నాడు. నారాయణ చనిపోయేముందు కొడుకులకు టెలిగ్రాం ఇస్తే, వాళ్ళు వచ్చేలోగా అతను చనిపోతాడు. పిల్లలు డబ్బులు అవసరమయ్యి ఇనుప బీరువా తలుపులు తీస్తే అందులో ఒక్క యాభై రూపాయలు, ఒక చీటి మాత్రమే వుంటుంది ఆ చీటిలో కర్మకోసం వృధావ్యయం చేయవద్దని, వీలునామా వ్రాసి శ్రీరామ నాయుడు దగ్గర వుంచానని వ్రాసి వుంటుంది. వీలునామా తెప్పించుకొని చూసి పిల్లలు ఆశ్చర్యపోతారు. నారాయణస్వార్జితం బ్యాంకులో వున్న 18 వేల రూపాయలు ఆ వూరిలో వున్న పాఠశాల పునర్నిర్మించడానికి విరాళంగా ఇస్తున్నట్లు అందులో వ్రాసి వుంటుంది. పిల్లలు పేరుమీద ఒక్క పైసా కూడా వ్రాసి వుండడు. పెద్దకొడుకుకు అతని తండ్రి నారాయణ ఒక ఉత్తరం వ్రాసి పెట్టి వుంటాడు. అందులో నారాయణ ఒక లక్షాధికారి, జ్ఞానం లేని వ్యక్తి కడుపులో తను పుట్టాను అని, తను లక్షాధికారి పుత్రుడును కాబట్టి జీవితాంతం కూర్చోని తిన్నా ఉన్న డబ్బులు సరిపోతాయని చదువు మానివేశాను అని, తరువాత తల్లిదండ్రులు చనిపోవడంతో పాటు ఉన్న డబ్బులు అన్ని కూడా అయిపోయాయి అని, దీనికంతటికీ కారణం మా నాన్న డబ్బు సంపాదించి ఇచ్చాడే కానీ దానిని ఎలా ఖర్చు పెట్టాలో, ఎలా సక్రమమైన మార్గాల్లో వినియోగించాలో తనకు నేర్పకపోవడం అని వ్రాసి వుంటాడు. తర్వాత, గుర్రప్పందాలు, జూదం, తాగుడు ఇతరత్రా చెడు అలవాట్లకు బానిసై పుట్టెడు జబ్బులతో ఆరోగ్యాన్ని పాటుచేసుకొని పశ్చాత్తాపంతో మళ్ళీ నేను కష్టపడి డబ్బును సంపాందించ గలిగాను. కానీ అతని ఆరోగ్యం అతని ఇల్లాలి ఆరోగ్యం పాడు అయ్యాయి అని, కాబట్టి తన తండ్రి చేసిన పొరపాటే నేను చెయ్యదలచుకో లేదు. మిమ్మల్ని మీ అంతట మీరు బ్రతికే స్థితికి తెచ్చాను. అంతే మీకు నేను చేయవలసింది. యీ పాఠం నేను తదితర జీవాలనుండి నేర్చుకున్నాను. అని నారాయణ ఆ ఉత్తరంలో వ్రాసి వుంటాడు.

ఈ కథ ద్వారా కష్టపడి సంపాదిస్తేనే డబ్బు విలువ తెలుస్తుందని, స్వార్జితం కానీ డబ్బు వలన మంచి కంటే చెడే జరుగుతుందని, తల్లిదండ్రులు పిల్లల్ని ఎలా పెంచాలో ఎలా పెంచకూడదో ఇత్యాది అనేకమైన విషయాల పట్ల పాఠకుల్లో చైతన్యం కలిగించారు కారాగారు.

"అదృశ్యము" అనే కథలో లలిత విశాఖ పట్నంలో వుంటున్న తన అక్క బావ ఇంటికి కొంతకాలం వుండటానికి వెళుతుంది. అక్కడ వాళ్ళ ప్రక్కింటిలో వున్న వివాహిత అనురాధతో లలితకు పరిచయం అవుతుంది. ఒక రోజు అనురాధ వాళ్ల ఎదురింటిలో వున్న పెండ్లికాని కుర్రాడికి ఏవో సైగలు చేస్తూ వుండగా లలిత చూస్తుంది. పెండ్లి అయిన నీవు అలా ఎందుకు చేస్తున్నావు అని అనురాధను లలిత అడిగితే, అతను నేను ఎప్పుడూ నేరుగా కలుసుకోలేదు. కేవలం మేము అలా చూసుకోవడం, పాటలు పాడుకోవడం, సైగలు చేసుకోవడం వలన మాకు రోజంతా ఆనందంగా గడుస్తూవుంది, దీని వలన కలిగే నష్టమేమీ లేదు, మేము ఒక విధమైన ఆట సాధరణంగా ఎవరూ ఆనందించని ఆట ఆడుకుంటున్నాము, అని సమాధానమిస్తుంది అనురాధ. ఈ విధంగా మీ శీలం చెడటం లేదా ! అని ప్రశ్నిస్తుంది, లలిత, ఎలా ! నేనిక్కడా! అతనక్కడా ! ఒకసారి అతను నన్ను ముద్దుపెట్టుకున్నట్లు అభినయించాడు, నేను కోపంగా చూసాను, తర్వాత ఎప్పుడూ అతను అలా చేయలేదు, అని సమాధానం ఇస్తుంది అనురాధ.

శరీరాలు దూరంగా వుంటే చాలా ? మనసులు కూడా పవిత్రంగా వుండవద్దా ? అన్న లలిత ప్రశ్నకు, అనురాధ నూటికి తొంభై తొమ్మిది మంది విభిన్న పద్ధతుల్లో మానసికంగా ఆనందాన్ని పొందుతున్న వారే కదా! అంటూ సమాధానం ఇస్తుంది. ఆ తర్వాత కొద్ది రోజులకు లలిత బావ అనురాధ వాళ్ళ ఎదురింటి అబ్బాయినే లలితకు వరుడుగా పెండ్లి సంబంధం తీసుకొస్తాడు. గుణశీలానికి ప్రాధాన్యతనిచ్చే లలిత ఆ సంబంధాన్ని తిరస్కరిస్తుంది.

అస్సలు విషయం తెలియకపోవడంతో ఎందుకు వద్దన్నది అన్న కారణం మాత్రం ఎవ్వరికీ అంతు చిక్కదు.

ఈ కథలో శారీరక పవిత్రతయే కాదు, మానసిక పవిత్రత కూడా కలిగి మంచి గుణశీలాన్ని మనుష్యులు కలిగి వుండాలనే చైతన్యాన్ని కారా తెలియజేసారు.

"ఆహ్వానం" అనే కథలో నిర్మాతలు మంచి సినిమాలు తీయడం లేదని చక్కటి రిక్రియేషన్ కోసం, మా కష్టార్జితంలో కొంత వెచ్చించి మీరు తీసి పంపుతున్న చిత్రాలు చూస్తున్నాం, కానీ అవి బాగలేకపోవడంతో అసంతృప్తి వస్తూవుందని. తెలియ జేస్తాడు. మా కష్టార్జితం మీరు తింటున్నప్పుడు మా అభిరుచులను తెల్సుకుంటూ వాటి కనుకుణంగా సినిమాలను మీరు తీయాలని రచయిత ఈ కథలో ఇచ్చే సలహాలు, మంచి చిత్రాలను నిర్మించాలనే చైతన్యాన్ని చిత్ర పరిశ్రమకారుల్లో నింపుతుంది.

"జన నిష్టురులు" అనే కథలో కలెక్టరు ముందు భార్య చనిపోతుంది. తర్వాత రెండవ వివాహంగా ఇందిరను తన భార్యగా చేసుకుంటాడు. దేశంలోను సమాజంలోను విప్లవాగ్ని జ్వలించాలంటూ, అది స్త్రీల హస్తాలలోనే సులభ సాధ్యమంటూ, సామాజిక సేవా విధిని నిర్వర్తించలేని విద్యాధికులు శుష్క జీవితాలను గడేపేకన్నా ఆత్మహత్య చేసుకోవడం ఎంతో నయమని వేదిక లెక్కి ఉపన్యాసాలిచ్చిన ఆదర్శమూర్తి ఇందిర.

ఆమె గతంలో లంచగొండియై, అధికార, ధన గర్వాంధుడైన కలెక్టరుకు రెండవ భార్యగా వెళ్ళడానికి అంగీకరించ వద్దని ఆమెకు తన మిత్రులు బంధువులు తెలిపినా కూడా, వినకుండా అతనిని వివాహమాడి, అతనిలో మార్పును తీసుకు వస్తుంది. కలెక్టరు పనివేళల్ని చక్కగా పాటిస్తూ తను సత్ప్రవర్తన కలిగి, మిగిలిన ఉద్యోగస్తుల్లో మంచి ప్రవర్తన తీసుకు వస్తాడు. పోలీసులు, తాలూకాఫీసులు ఉద్యోగులు అందరిలో నిజాయితి, బస్సుల్లో ప్రయాణించే టప్పుడు పాటించవలసిన పద్ధతులను అందరూ పాటించడం లాంటి ఎన్నో మంచి మార్పులు, మారిన కలెక్టరు వలన సమాజంలో చోటు చేసుకుంటాయి.

అధికారులు, మనుషులు అందరూ మంచిగా మారాలని, తద్వారా ఎన్నో మించి ఫలితాలు లభిస్తాయి, సమాజానికి మించి జరుగుతుందనే చైతన్యాన్ని ఈ కథలో కారా కలిగించారు.

ఇలా ఎన్నో కథల ద్వారా కాళీపట్నం రామారావు గారు పాఠకుల్లో ఎన్నో మంచి విషయాలపై చైతన్యాన్ని కలిగించి సమ సమాజ నిర్మాణానికి, సమాజహితానికి తనకలం ద్వారా ఎంతో కృషి చేసి, కథా సాహిత్యంలో అజరామరంగా నిలిచారు. వారి కథా సాహిత్యం పై నేడు సెమినారు నిర్వహించడం ఎంతో ప్రశంసనీయం, దీనిద్వారా పాఠకలోకంకు మరింత ప్రయోజనం కలుగుతుంది.

**ఆధార గ్రంథాలు :**

కాళీపట్నం రామారావు రచనలు
(2008 వరకు లభ్యరచనల సంగ్రహం)
సంపాదకులు : వివిన మూర్తి, రచన 'శాయి'

❖ ❖ ❖

# కారా వారి 'భయం' కథ - పరిశీలన

**- డా॥ పి. వెంకటరమణ,** ఎం.ఏ., పి.హెచ్.డి, తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం.

ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రముఖ కథారచయిత కాళీపట్నం రామారావు గారు. శ్రీకాకుళం జిల్లా, పొందూరు గ్రామంలో 1924 నవంబరు 9వ తేదీన జన్మించితిరి. విద్యాభ్యాసం చేసుకునే రోజుల్లోనే 'ప్లాణ్బారమో, అనే కథారచన చేసిరి. ఉపాధ్యాయ వృత్తిని విడిచిపెట్టి జీవితాంతము తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేసిరి. 2008లో కారా రచనలు అనే పేరుతో ఆయన రచనలు అన్నీ సంపుటిగా ప్రచురింపబడ్డాయి. ఆయన 'యజ్ఞం' కథకు 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించి కారా పేరును సాహితీ లోకంలో శిబిరాలకు చేర్చినది. తనకు వచ్చిన అవార్డుల సొమ్ముతో శ్రీకాకుళంలో 'కథా నిలయం' స్థాపించి కథా సాహిత్య ప్రక్రియకు అమోఘమైన సేవ చేసిరి.

కాళీపట్నం రామారావు గారి 'భయం' కథలో ఉత్తరాంధ్ర మండలిక పదసంపద విరివిగా వాడబడెను. ఇందులోని పాత్రలు నిత్యము మన మధ్యలో సంచరించే వ్యక్తులుగా అనిపించును. భయం కథలో ప్రధానంగా పారమ్మ, గౌరేసు, సుబ్బాయమ్మ, పాముల రాములయ్య, సొమ్ముల గురవడు, రత్నాలు మున్నగు పాత్రలు నిత్యము మన మధ్యలో తారసిల్లువల్లు అనిపించును.

"పాము మనిషిని కుడుతుంది. మనిషికి చావంటే భయం. పామును చూస్తే చావును చూచినంత భయం. చావుకి యభపడనివాడు పాముకు భయపడడు. పాము కాటేస్తుందో, వెయ్యదో కాని దాని భయం మనిషిని తినేస్తుంది. పురుగులాగ, ఎదురు తిరిగితే ఏమి ఉండదు. నీ చేయేపైన. అప్పుడు చావు. పావు చీమల్లా చిన్నవయిపోతాయి. ఇవి కథలో సత్తెయ్య మాటలు. ఇవి నిజానికి అక్షర సత్యాలు.

భయం అనేది మానిసక దౌర్బల్యం. ఈ దౌర్బల్యం ఉన్నవాళ్లు తమకేదో జరుగుతుందని ఊహించుకోవడమే భయం. మనిషి భయపడునట్లు ఒక్కోసారి జరగవచ్చు. ఒక్కోసారి జరగకపోవచ్చు. భయం లేనివారికి కూడా తెలియని ప్రమాదం కలగవచ్చు. కాని ఏదో జరుగుతుందని ఊహిస్తూ, భయపడడం చావుతో సమానంగా చెప్పుకోవచ్చు.

'భయం' కథ ప్రధానంగా పాముకు సంబంధించిన కథను ఆశ్రయించుకొని తిరుగుతూ ఉంటుంది. పామును చూస్తే మనిషికి ఎలా భయమో, మనిషిని చూస్తే పాము అలాగే భయపడుతుంది. ఈ భయంతోనే మనిషిని పాము కాటు వేస్తుంది. ఆ భయంతోనే మనిషి చనిపోతాడు. పిరికివాడయితే ఏవేవో కథలు చెప్పి పామును పూజిస్తాడు. మనిషిలోని పాము భయాన్ని కొందరు ఆదాయంగా మార్చుకుంటారు. దానితో వ్యాపారం చేస్తారు. కథలో ఉన్న మనుషులను గమనిస్తే పాము భయంతో మనుషులు ఎలా ప్రవర్తిస్తారో స్పష్టమవుతుంది.

తన కుటుంబంలో ఎవరికియనా పామువలన ప్రమాదం కలుగుతుందేమో అనే భయం సత్తెయ్యతల్లి పారమ్మలో ఉంది. అందుకే తమ ఇంటిలో పాము కనిపించనపుడు ఆమె సత్తెయ్యను కదలనీయలేదు. కదిలితే వీపుపై కొట్టింది. పారమ్మ భర్త గౌరేసుకు కూడా కుటుంబంలో ఎవరికయినా పాము వలన ప్రమాదం జరుగుతుందని భయం ఉంది. కాని పారమ్మలాగా పిరికితనం లేదు. పాము కనిపిస్తే దాన్ని చంపాలనుకుంటాడు. చంపకపోతే అదే తమను చంపు తుందని అనుకుంటాడు. ఆ ఇంట్లో గౌరేసు తల్లిదండ్రులు కూడా ఉంటారు. వారికీ పామంటే భయం. కాని గౌరేసులో ఉండే తెగింపు వారికి లేదు. వారికి విశ్వాసాలు ఎక్కువ. పామును చంపితే పాపమని, దానివలన గర్భవతిగా ఉన్న

కోడలికి ఏమన్నా జరుగుతుందని వారికి నమ్మకం.

సత్తెయ్య భార్య రత్నాలుకి పాము కన్నా మంత్రగాళ్లంటే భయం ఎక్కువ. మంత్రగాళ్లు తమకు గిట్టని వాళ్ల వాకిట్లో ఏ అర్ధరాత్రి పామును వదలి వెళతారని, ఒంటేలుకి లేచి బయటకు వచ్చిన వాళ్లను అది చంపుతుందని ఆమె భయం. అలాగే మంగలి చెంచయ్య భార్యకు పామంటే భయం. కాని వాళ్ల కోళ్లకు ఆ భయం లేదు. తమ పిల్లలను పాము పొట్టన పెట్టుకుంటే అవి పాముతో పోరాడాయి. మానవులు ఆపడానికి ప్రయత్నించినా అవి ఆగలేదు.

పావులు రావులయ్యకు పాముల గురించి తెలుసు. ఏ పాము కరిస్తే మరణిస్తారో, ఏ పాములు హానికాదో బర్మాదంపతుల లాగా రావులయ్యకు కూడా తెలుసు. పామును చూచి జనం భయపడతారు. కనుక ఆ భయాన్ని తనకు సంపాదనగా చేసుకున్నాడు. పాము కరిచిందని అంటే మంత్రం వేస్తానంటాడు. ఇంటిని అష్టద్బంధనం చేయాలంటాడు. బూడిద చలాల్లంటాడు. ఇల్లంతా తిరిగి హడావుడి చేస్తాడు. ప్రతిదానికి డబ్బు వసూలు చేస్తాడు. నమ్మకం లేని వాళ్లకు మంత్రం వేసినా పనిచేయదని తన శత్రువులకు వైద్యం చేయడు. అతనికి పాములంటే భయం లేదుగాని, భయపడేవారిని ఇంకా ఇంకా భయపెడతాడు. పాము కరిచిన వ్యక్తి, బ్రతికిన తరువాత కూడా వైద్యం పేరుతో అతని నుండి డబ్బు గుంజుకుంటాడు. సత్తెయ్య పాములను చంపడం వలన తన ఆదాయం తగ్గిందని అతనిపై పగపూని, అతడు చావుబతుకుల్లో ఉన్నాడని తెలిసికూడా అతని దగ్గరకు వెళ్లడానికి నిరాకరించిన దుర్మార్గం అతనిది. అతడు పాముకన్నా భయంకరమైనవాడు.

సొమ్ముల గురవడు మానవత్వం కలిగినవాడు. నిస్వార్థపరుడు మంచి మనసున్నవాడు. సుబ్బాయమ్మ పిలిస్తే వచ్చాడు. సత్తెయ్యకు తోడుగా నిలబడ్డాడు. పాము నడుమును విరగగొట్టాడు. సూటిగా మాట్లాడేతత్వం కలిగినవాడు కాబట్టి సుబ్బాయమ్మ కొడుకు పామును కొట్టడంలో సాయం చేయకపోతే తాను ఎందుకు కొట్టాలని ఎదురు ప్రశ్నించాడు. సత్తెయ్యను పాము కరిచిన తరువాత అతనిని బ్రతికించమని రావులయ్యను మరీమరీ ప్రార్థించాడు. తనతో ఉన్న వారు కూడా తనలాగే సుఖంగా ఉండాలనే తాపత్రయం అతనిది. కానీ రావులయ్య సత్తెయ్య దగ్గరకు రావటానికి నిరాకరించడంతో నిరాశపడ్డాడు. సుబ్బాయమ్మ ప్రవర్తన, రావులయ్య మాటలు అతనికి మనుషుల పట్ల నమ్మకాన్ని సడలించాయి. అందుకే అతడు పశువులశాలకు వెళ్లినా, ఆ పశువుల్లో అతనికి మానవమనస్తత్వాలే కనిపించాయి. పామంటే భయం లేదు. పాములకంటే భయంకరమైన మనస్తత్వం కలిగిన సుబ్బాయమ్మ రావులయ్య వంటి మనుషులంటేనే అతడు భయపడ్డాడు. మానవత్వాన్ని గుండెల నిండా నింపుకున్నా గురవడి వంటివారే సమాజాన్ని బాగుపరుస్తారు.

సత్తెయ్యకు పామంటే అసహ్యం తప్ప భయం, భక్తి లేవు. పామును గురించిన కథలు నమ్మడు, పాము దేవుడంటే నమ్మడు. అదే విషపురుగని, అది కనిపిస్తే చంపాలని అతని నిశ్చితాభిప్రాయం, పామును పట్టుకోవడం, కుండలో పెట్టుకొని ఊరికి దూరంగా విడిచి రావడం వంటి జీవకారుణ్య సిద్ధాంతాలు అతడు వ్యతిరేకిస్తాడు. పామును చంపడంలో అతనికి నియమనిబంధనలు లేవు. ఎవరు పిలిచినా, ఏ వేళలో పిలిచినా వెళ్లి పామును చంపుతాడు. అందుకు రావులయ్య లాగా సొమ్ము కూడా తీసుకోడు. అందుచేతనే అతడు ఆ కారణంగా రావులయ్యకు శత్రువయ్యాడు. సత్తెయ్య మనసు వెన్న అతనిది విశాల దృష్టి, ఇతరులు అడిగితే కాదనలేని జాలిగుణం అతని సొంతం. తన ఊరును, తన కుటుంబం లాగా భావించేతత్వం అతనిది. ఊర్లో ఎవరికి అపకారం జరిగినా అది తనకు అపకారం లాగా భావిస్తాడు. ఊరందరూ సుఖంగా ఉండాలని ఆశిస్తాడు. తన చుట్టూ ఉండేవాళ్లందరూ సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య దేవుడితో సమానం. కాని ఇతరుల స్వార్థం వలన ఆ దేవుడే ప్రమాదానికి

గురయ్యాడు.

కొందరు భయపడతారు. కొందరు భయపడేవారితో వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తారు. కొందరు భయపడుతూ తాము సుఖంగా ఉండాలనుకుంటూ తమ సుఖం కోసం ఇతరులను బలిచేస్తారు. కొందరు భయాన్ని దరిచేరనీయకుండా సమాజం సుఖంగా ఉండాలని ఆశిస్తారు. తన చుట్టూ ఉన్నవారు సుఖంగా ఉండాలని ఆశించే సత్తెయ్య, గురవయ్య వంటివారు సమాజానికి అవసరం. అలాంటి వాళ్ల వల్లనే సమాజం బాగుపడుతుంది. రావులయ్య, సుబ్బాయమ్మ వంటివాళ్లవలన సమాజం నష్టపోతుంది. 'భయం' కథలో రామారావు గారిచ్చిన సందేశం ఇదే!

బర్మా నుంచి వచ్చిన భార్యభర్తలకు పాముల గురించి బాగా తెలుసు. అన్ని పాములు ప్రమాదకారులు కాదని, డజనో ఆరడజనో కరిస్తేనే ప్రమాదమని వారికి తెలుసు. పాములను పట్టే మెలకువలు కూడావారికి తెలుసు. వారు పాములను పట్టి, చర్మాలు ఒలిచి అమ్ముకుంటారు. వాళ్లు పాము మాంసం కూడా తింటారని కొందరు నమ్ముతారు. వాళ్లకు మంత్రాలన్నా నమ్మకం లేదు. వాళ్లకు పామంటే అసలు భయం లేదు. ఇవన్నీ చిన్న పాత్రలు. ఈ పాత్రలతో పాటుప్రముఖ పాత్రలు పాముల విషయంలో ఎలా ప్రవర్తిస్తారో తెలిస్తే రచయిత సందేశం తెలుస్తుంది.

సుబ్బాయమ్మకే కాదు, అతని కుమారునికి కూడా పామంటే తగని భయం. కుమారునికి భయమయినా గురవయ్య రెచ్చగొడితే పామును చంపడానికి కర్ర తీసుకున్నాడు. కర్ర తీసుకున్నా తీరా పాము ఇంట మధ్య చూసేసరికి దానిని కొట్టడానికి భయపడ్డాడు. అది పిరికితనం. కాని సుబ్బాయమ్మది పిరికితనం కాదు. ఆమెది మహాస్వార్థంతో కూడిన భయం. పామువలన తన కుటుంబంలో ఉన్నవారికి ఆపద కలుగకూడదనుకుంటుంది. దానితోపాటు తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ఎవరినయినా బలిచేయడానికి కూడా ఆమె వెనుకాడదు. తన ఇంట్లో పామును తన కుమారుడు కొట్టకూడదని, సత్తెయ్యగాని, గురవడగాని చంపాలని ఆమె అభిప్రాయం. ఏదైనా పొరపాటు జరిగితే తమకు హాని కలుగకూడదని, ఇతరులే దాని ఫలితం అనుభవించాలని ఆమె అనుకుటుంది. తమ ఇంట్లో సత్తెయ్య పామును చంపిన తరువాత పాము కాటుకు గురైన సత్తెయ్య ఇంటికి వెళుతుంటే కనీసం పరామర్శించాలన్న జ్ఞానం కూడా ఆమెకు లేదు. ఇంకా పాము పూర్తిగా చనిపోయిందా కొన ప్రాణంతో ఉందా? అంటూ కంగారు పడడం ఆమె స్వార్థానికి పరాకాష్ట తనకు హాని చేస్తేనే పాము కరుస్తుంది గాని, తనకు సాయం చేసిన సత్తెయ్య తన వలన ప్రమాదానికి గురయితే పట్టించుకోని సుబ్బయమ్మ పాము కంటే భయంకరమైనది. తమ సుఖం తప్ప ఇతరుల సుఖం పట్టని తత్వం ఆమెది.

ఈ విధంగా కాళీపట్నం రామారావు భయం కథలో ఉత్తరాంధ్ర మాండలిక పదజాలాన్ని విరివిగా వాడి తెలుగు భాషకు ఒక వన్నె తెచ్చెను.

**ఆధారగ్రంధాలు:**

1. కాళీపట్నం రచనలు
2. కారా వారి భయం కథ.

# కా.రా. శ్రామిక వర్గ జీవిత కథలు - పరిశీలన

**- ఆర్.యన్. రవి కుమార్,** తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బుక్కపట్నం.

సారాంశము: రచయిత తాను నిత్యం చూస్తున్న సంఘటనలను ప్రతిస్పందిస్తూ ఇతరులు కూడా తనలాగే స్పందించేట్లు చేయగలిగేది కథాప్రక్రియ. ఆయా సంఘటనలను భాషారూపంలో వ్యక్తం చేసే పద్ధతుల్లో కథాప్రక్రియ చాలా శక్తివంతమైనది. ఈ రచనలలో సన్నివేశాల బాహ్యస్వరూపవర్ణన కొన్నింటిలోనూ, బాహ్యస్వరూపం అలా ఉండడానికి గల కారణాలను వెల్లడి చేయడం మరి కొన్నింటిలోనూ కనిపిస్తుంది. ఇలాంటిది రచనలు చేసిన కొద్దిమంది కథకుల్లో కా.రా. ఒకరు.

కారా కథల్లో ఇతివృత్తాన్ని బట్టి ఆర్థిక సంబంధమైన కథలు, కుటుంబ సంబంధమైన కథలు, మధ్యతరగతి జీవిత కథలు, శ్రామిక వర్గ జీవిత కథలు, అని విభజించడం జరిగింది. వీటిలో శ్రామిక వర్గ జీవిత కథలను గురించి పరిశీలిద్దాం.

**శ్రామిక వర్గ జీవిత కథలు :**

కా.రా. రాసిన అత్యంత ప్రసిద్ధమైన కథల్లో బడుగువర్గాల ప్రజలవేదనే ప్రధానంగా కనిపిస్తుంది. తొలిదశలో మధ్యతరగతి ప్రజలజీవితం, కుటుంబనేపథ్యం ఉన్న కథలు రాసిన కా.రా. మలిదశలో శ్రామికులు జీవితాలను అత్యంత శ్రద్ధాసక్తులతో చిత్రించారు. అలాంటి కథల్లో 'హింస', 'నో రూమ్', 'భయం', 'యజ్ఞం', 'మహదాశీర్వచనం', ముఖ్యమైనది.

**యజ్ఞం :**

కా.రా. రచనాజీవితంలో ఈ కథ ప్రధానమలుపని చెప్పవచ్చు. ఈ కథ నుంచే కా.రా. రచనల్లో బడుగుజీవుల పట్ల పక్షపాతం తీవ్రంగా మార్పు చెందిందని కేతు విశ్వనాథ రెడ్డి గారి అభిప్రాయం. ఈ కథ ఒక గ్రామానికి చెందిన రాక్షసాన్ని చిత్రించింది. న్యాయం కోసం 'చైతన్యం' పెద్దఎత్తున తల ఎత్తలేని స్థితిలో ఒకరిద్దరు తమ తీవ్ర అసంతృప్తిని, అసమ్మతిని తెలియజేసేందుకు బానిసబతుకును ధిక్కరించే పరిస్థితి ఏర్పడవచ్చు. సరిగ్గా అలాంటి బీభత్సస్థితికి రూపకల్పనే యజ్ఞం. ఈ కథ రాసిన కొద్దికాలానికి శ్రీకాకుళం పోరాటం నడిచింది. పెట్టుబడిదారీవ్యవస్థ చేతిలో గ్రామీణప్రాంతాల్లోని అట్టడుగువర్గాలు, సామాన్యులు ఏ రకమైన దోపిడీకి గురవుతున్నారో, దోపిడీ వర్గాలు వీరిని ఎలా ఇబ్బందులకు గురి చేస్తున్నారో ఈ కథ ద్వారా భూస్వామ్యవ్యవస్థ నుంచి పెట్టుబడిదారీవ్యవస్థలోకిట పరివర్తన చెందిన వైనం చక్కగా వర్ణించబడింది. అభివృద్ధి పేరుతో జరిగే అన్ని అంశాలను చర్చకు పెట్టి, అది అందరి అభివృద్ధి ఎలా కాలేకపోయిందో ఈ కథలో చూపబడింది. మారుతున్న పరిస్థితుల్లో 'ఆర్థికాభివృద్ధి' పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు బడుగువర్గ ప్రజలకు ఉపయోగ పడకపోగా, వారి పతనానికి కారణమౌతోందని ఈ కథ ప్రతిపాదించింది. పైకిమాత్రం ధర్మాలఊబిలో, ఎవరికీ కనబడకుండా, ఈ విధ్వంసం అందరినీ ముంచేస్తుంది. తాము గ్రహించిన వాస్తవాల కోసం యువతరం ఆవేశంతో ఆత్మ త్యాగాలకు వెనుకాడరని ఈ వ్యవస్థను హెచ్చరిస్తుంది.

**మహదాశీర్వచనం:**

ఇంట్లో అనారోగ్యంతో నాలుగేళ్ళుగా మంచంలో పడి ఉన్న భర్తకు మంచివైద్యం చేయించలేక, పిల్లలతో ఒక్కతే సంసారాన్ని ఈదుతూ ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్న గృహిణి సత్యవతమ్మ. తమ భర్త కామేశం రిటైరైనప్పుడు, అతని దాయాది ఇచ్చిన సలహాను పెడచెవిన పెట్టి, పల్లెటూళ్ళో స్థిరపడ్డాడు ఆనాటి పట్నవాసపు ఉద్దేశాలు, ధరల పెరుగుదల మొదలైన ఆధునిక ఆర్థిక సూత్రాలను గుర్తెరిగి బ్రతకడం అతనికి తెలియలేదు. క్రమంగా రూపాయి విలువ తగ్గడం,

రేషనింగ్ అమల్లోకి రావడం, గ్రామాల్లో ఖర్చులు పట్నాలతో పోటీ పడడం గమనిస్తూ వస్తున్న సత్యవతమ్మకు తన భర్త చేసింది మంచోచెడో అర్థం కాలేదు. అన్నీపోగా, ఆమె మెళ్ళో మిగిలిన ఏ మారకపు విలువాలేని పసుపుకొమ్ము, ముత్తైదువతనం వెయ్యేళ్ళు వర్థిల్లాలని ఓట్ల లెక్కింపు రోజున ఆశీర్వదించిన పోలింగు ఉద్యోగి 'మహదాశీర్వచనం' గూర్చి రచయిత చూపిన వ్యంగ్యం ఈ కథలో అందరి గుండెల్ని కోస్తుంది.

**హింస:**

గుండెల్ని పిండే కరుణ రసాత్మకతమైన కథ 'హింస' ఆవాల జగ్గమ్మ కూతురు ఆవాల పైడెమ్మ. కూతురికి తల్లి పాతూరిలో సంబంధంచేసింది. అత్తింటి వారు పైడెమ్మకు పొగాకు పనులకు పంపారు. పొగాకు పందిళ్ళలో పైడెమ్మ దారి తప్పి, చెడిపోయిందని అందరూ గమనించారు. కాపురం చెడి, భయపడి, పట్నం పారిపోయి, దిగజారి దిగజారి సుబ్బారావు కంపెనీలో తేలింది. ఒకసారి తల్లిని, చెల్లినీ చూద్దామని పుట్టింటికి వచ్చింది. అది చూసి ఊరు ఊరంతా నానాయాగి చేసి, తల్లీ కూతుళ్ళను పీక్కుతిన్నారు. తల్లిపేగు తెంచుకోలేని జగ్గమ్మ తనూ పట్నం వస్తానంటే, పైడెమ్మ వద్దంది. రెండో కూతురు 'సంగి' భవిష్యత్తును తల్చుకుంటూ జగ్గమ్మ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లింది. తర్వాత పైడెమ్మను పట్నం తోసింది.

ఓ రోజు ఏడుస్తున్న తల్లిని చూడలేక, చిన్నకూతురు 'సంగి' శలక (గడ్డిబీడు) కేసి వెళ్ళింది. అక్కడ గడిమధ్యలో, ఒక మేకపిల్లను నక్క తీసుకుపోతోంది. సంగికి అదిచూసి చెప్పరాని ఆవేశమొచ్చింది. ఎక్కడాలేని ధైర్యం కూడా తోడైంది. ఒక చేత్తో కొడవలిని, మరోచెత్తో రాయిని తీసుకొని శలకుకు అడ్డంగా పరిగెత్తింది. "ఆ నక్క తనకు చిక్కుతుందా? చిక్కితే తనేం చేస్తుంది?" అంటూ రచయిత సంగి ఆవేశానికి, గుండెమంటకూ కారణాలను ఈ కథలో చిత్రించారు.

జరిగిన దానిలో అన్యాయాన్ని గుర్తించగలిగిన యువతరం ఒంటరిగానైనా ఆ అన్యాయాలకు కారకులెవరో వెతుకుతుందనీ, దాని ఆవేశం అర్థం కావాలంటే ఆస్థానంలో మనం ఉండాలని' ఈ కథ స్పష్టం చేస్తుంది.

**నోరూమ్ :**

పేదరికాన్ని విశ్వరూపంలో చూపించిన కథ 'నో రూమ్' ఉమ్మడికుటుంబాల్లో జీవించే పేదలు ఒకే ఒక్క రాత్రియినా మనసుతీరా భార్యాభర్తా సుఖంగా గడపలేని దుఃఖమయ జీవితం ఈ కథలో ఉంది.

పూరి గుడిసెల్లో పుట్టిన నూకరాజుకు మధ్యతరగతి, సంపన్నవర్గాల జనంతో బాగా పరిచయం ఉంది. చదువు సగంలో ఆగింది. మెట్రిక్ పరీక్షకు కూర్చోబోతున్నాడు. అతని స్నేహితుల్లో క్లబ్బు మెంబర్లు, లోకల్ పొలిటీషియన్లూ, హొటల్ ప్రొప్రయిటర్లూ ఇలా చాలామందే ఉన్నారు. పట్నంలోని ఫ్యాక్టరీలో చిన్న ఉద్యోగముంది. ఊళ్ళో భార్యా, ఉమ్మడి కుటుంబం ఉన్నాయి. మూడు నెలల క్రిందట కార్యం జరిగిన రోజు నుంచి శుభ్రమైన లాడ్జింగ్ హౌస్లో భార్యతో రాత్రి ప్రశాంతంగా గడపాలనుకున్నాడు. టౌనులో ఒక్క లాడ్జీలోనూ రూము దొరకలేదు.

ఈ కథలో రచయిత "మధ్యతరగతి బూరుగదూది సంస్కారం ఏ స్థాయి మనుషులకు అచ్చివచ్చినా, బడుగు జనాలకు పనికిరావు" అని చెప్పదలచినట్లు అనిపిస్తుంది. మధ్యతరగతి సంస్కారం అబ్బుకున్న అట్టడుగుజీవి నూకరాజుకు ప్రతిచోటా అవమానమే మిగలడం ఇందుకు ప్రజలమైన ఉదాహరణ. ఈ సంస్కారప్రభావ ఫలితంగానే, లాడ్జింగ్లో 'దేవుడు' అనే ముసలాయన, తన భార్యను ఆత్మీయంగా పలకరించి నప్పుడు, కోపంతో నూకరాజు అతన్ని ఎడాపెడా బూటుకాలితో తంతాడు. నూకరాజు చెడ్డవాడు కాకపోవచ్చు. కానీ తానెక్కడి నుంచి వచ్చిందీ మర్చిపోయి లేనిపోని వేషాలకు బలి అవుతున్నాని రచయిత ఉద్దేశం. కనీస సౌఖ్యాలకు సైతం నోచుకోని అట్టడుగు వర్గపు

యువతరం ఆవేశాన్ని ఈ కథ ప్రధానంగా వ్యక్తం చేస్తుంది. జీవితం మీద కాంక్ష పెరగడానికి కూడా ఈ కథ ప్రకటిస్తుంది.

**భయం :**

యుగాల ఆలోచన కన్నా క్షణకాలపు అనుభవం మనిషిని మారుస్తుందని ఈ కథ తెలియజేస్తుంది. మనిషిలో మార్పుకు 'అనుభవమే' కారణమని నిరూపించిన కథ 'భయం'. భయం యొక్క భయంకరమైన రూపాన్ని రచయిత పాఠకుల ముందుంచారు. ప్రతీకలను ఈ కథలో ఎక్కువగా చూపడం మనం గమనిస్తాం. పారమ్మ, గొరేసు, పాముల సత్తెయ్య, మంత్రగాడు వైద్యుడు రావులయ్య, సుబ్బాయమ్మ, సామ్ముల గురవడు ఈ పాత్రల మధ్య జరిగిన కథే "భయం".

పారమ్మ నాటుమంత్రసాని దెబ్బలను బలైపోయింది. విషవైద్యుల ప్రయోగాలకు ఏళ్ళ తరబడి అనంతమైన బాధలను అనుభవిస్తున్న వాడు గొరేసు, పాముల్ని గురించీ, పాము మంత్రాల గురించీ భ్రమలూ, భయాలు పోయి బర్మా వాడిదగ్గర పాముల్నిపట్టే ఒడుపులూ మెళకువలూ నేర్చుకొని అజ్ఞానాన్ని సమాజపరం చేసినవాడు సత్తెయ్య. ప్రజల అజ్ఞానం మీద వ్యాపారం చేసేవాడు పాముల మంత్రగాడు.

ఎవరింట్లో పాము పడ్డా, మగాడిలాగా దాని అంతం చూస్తూ ఊరందరికీ తన ధైర్యంతో ఉపకారం చేసిన నోరులేని శ్రమజీవి పాముల సత్తెయ్య, తాను ఆ పాముకాటుకే గురైనప్పుడు తనతో సాయం పొందిన మనుషులు తనను పట్టించుకోలేదు. మంత్రగాడు పోటీపీడ విరగడ అయ్యిందనుకున్నాడు. సామ్ముల గురవడు పిలిచినా, సాయానికి రాలేదు. ఈ దారుణ అనుభవం సామ్ముల గురవడిలో మార్పుకు కారణమైంది. వాడు ఊరివాళ్ళ నోరులేని జీవాలనుకాసస్తూ చూసస్తూ, దొంగకళ్ళేవో, పాముకళ్ళేవో, మంచి కళ్ళేవో ఆలోచించడం మొదలు పెట్టాడు. ఆ రకం ఆలోచనలో ముందుకు సాగినపుడు లోకంలో అన్యాయం కనిపించక తప్పదు. ఈ వ్యక్తి సాముహిక చైతన్యానికి దారి తీస్తుందని రచయిత ఉద్దేశం.

భయంకన్నా భయభావన కలిగించే అనర్థాన్ని మనిషి 'అనుభవం' తో తెలుసుకుంటాడని ఈ కథ స్పష్టం చేస్తుంది.

**ఆధార గ్రంధాలు :**

1. వరప్రసాద్, దీవి - కా.రా. కథల సామాజిక విశ్లేషణ
2. దక్షిణామూర్తి, పోరంకి - తెలుగు కథ - వ్యాసం
3. కేతువిశ్వనాధరెడ్డి - యజ్ఞం కథావ్యాసం

# యజ్ఞం కథ - పాత్రల పరిశీలన

**- డా॥ ఎం.లక్ష్మయ్య,** సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ & పి.జి కళాశాల, కమలాపురం, కడప జిల్లా. సెల్:94925437

కాళీపట్నం రామారావు 1924 నవంబరు 9 న మురపాక గ్రామంలో జన్మించాడు. ఆ గ్రామం శ్రీకాకుళం జిల్లాలోనిది. కాబట్టి 'కారా' శ్రీకాకుళం జిల్లావాసి అని చెప్పవచ్చు. ఆయన శైలి సరళమైనదిగా, భావప్రధానం కలిగి ఉంటుందని ఈ కథ వల్ల తెలుస్తుంది. కారా వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రచనలు చేయడం. అతడు కథకుడిగా, విమర్శకుడిగా ప్రసిద్ధి పొందారు. కాళీపట్నం రామారావు రాసిన కథలు, నవలలు తక్కువే. అతని రచనలు అన్ని కూడా ప్రసిద్ధమైనవిగానే చెప్పవచ్చు. ఆయన రచనలు సామాన్య జనులకు సహితం అర్థమయ్యేటట్లు సరలంగా ఉంటాయి. యండమూరి వీరేంద్రనాథ్, కాళీపట్నం రామారావు రచనల ద్వారా ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించేవారు.

కాళీపట్నం రామారావు 1966లో రాసిన 'యజ్ఞం కథ' బాగా జనాదరణ పొందింది. అందులో దోపిడి గురించి తెలియజేశాడు. ఆయనకు బొమ్మిడాల కృష్ణమూర్తి వారి స్ఫూర్తి పురస్కారం, ఎన్.టి.ఆర్. జాతీయ పురస్కారం, కొండేపూడి శ్రీనివాస రావు పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు పొందారు.

కాళీపట్నం రామారావుకు పురస్కారాల ద్వారా వచ్చిన డబ్బుతో శ్రీకాకుళంలో "కథానిలయం" అనే గ్రంధాలయాన్ని 1997 ఫిబ్రవరి 22 న ప్రారంభించాడు. ఆ గ్రంధాలయాన్ని కథల సేకరణ కోసమే ఏర్పాటు సేసినట్లు తెలుస్తుంది. తెలుగు కథకు అత్యుత్తమమైనటువంటి ఇలాంటి గ్రంధాలయం ఇంతకు ముందు ఎక్కడా లేదని ప్రొఫెసర్ గూటాల కృష్ణమూర్తి తెలిపారు. ఆనాటి నుండి కథానిలయంలో నేటికి దాదాపుగా 4500 వార పత్రికలు, మాస పత్రికలు, జ్యోతి, ఆంధ్ర పత్రిక, ఆంధ్రజ్యోతి, భారతి జాతీయ పత్రికలున్నాయి. 2 వేలకు పైగా కథల సంపుటాలు, కథా రచనలకు సంబంధించి మరో 40 వేల కథలు ఉన్నాయి. కథానిలయం స్థాపించినప్పటినుండి 'కారా' కథారచనకు దూరంగా ఉండి, గ్రంధాలయం కోసమే ఎక్కువగా శ్రమించి దాని అభ్యున్నతి కోసం కృషిచేసినట్లు తెలుస్తుంది.

యజ్ఞం కథ సుందరపాలెం గ్రామంలో ప్రారంభ మవుతుంది. ఆ గ్రామంలో 400 ఇళ్లు ఉన్నాయి. అవి అక్కడి దేవాలయాన్ని చుట్టి ఉంటాయి. మిగిలినవి కొత్తగా ఏర్పాటు చేసిన హైస్కూలు చుట్టూ నిర్మించుకున్నారు. కొత్త ఇళ్ళలో ఒక భాగం షాపులు, హోటళ్ళు ఉన్నాయి. జనాభా పెరిగేకొద్ది ఇళ్ళు కూడా పెరిగాయి. కోస్తాలో సుందరపాలెం పలువురు అనాదల మధ్య సనాధలా కనిపిస్తుంది. దాన్ని గ్రాండ్ ట్రంక్ రోడ్డుతో కలిపే ఆరు మైళ్ళ పక్కా రోడ్డూ, దేశమంతటా చిక్కంలా పరుచుకుంటున్న విద్యుత్ కాంతులతో నిండిన విద్యుద్వాహకాలు ఆ ఊరి సౌభాగ్యాలని చెప్పవచ్చు.తెలకరి వీధిలో పంచాయితీ కార్యదర్శి ఆఫీసు, ఇల్లు ఉన్నాయి. హైస్కూలు వీధిలో ఆసుపత్రి, మెటర్నిటీ సెంటరును ఏర్పాటు చేశారు. మాల పేటకు, ఊరికి మధ్య కోపరేటివ్ వారి గోడౌన్లు ఉన్నాయి. మునసబు గారి వీధిలో గ్రంధాలయం. కరణం గారి వీధిలో విద్యుత్ శాఖ ఆఫీసు ఉన్నాయి.

అప్పల్రాముడు కుటుంబం , గోపన్న, శ్రీరాములు నాయుడు గురించి తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

అప్పల్రాముడు ఆ ఊరి పంచాయితీలో హరిజన మెంబరుగా ఉంటాడు. ఆ గ్రామంలో హరిజన కులంలో అప్పల్రాముడి కంటే పెద్దవారు ఎవరు లేరు. కాబట్టి ఆ కులానికి అతడు కులపెద్దగా కూడా వ్యవహరిస్తుంటాడు. అతడు మాటమీద నిలబడేవాడు. మర్యాదగా బతకాలనుకునే వాడు. మూడు సంవత్సరాల క్రితం అప్పల్రాముడు తన పొలం పనుల కోసం షావుకారు గోపన్నతో రెండు వేల రూపాయలు అప్పుచేస్తాడు. ఇప్పుడు దాని కాలం

తీరిపోతుంది. వడ్డీతో సహా కలిపి రెండు వేల ఐదు వందల రూపాయలు అవుతుంది. అప్పు ఇచ్చిన షావుకారి గోపన్న కాలంలో వచ్చిన మార్పుల వల్ల తాను కూడా చితికిపోయి అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. కాబట్టి అప్పల్రాముడికిచ్చిన అప్పును రాబట్టుకోవాలనుకుంటాడు. మూడు నెలల నుండి ఈరోజు, రేపు అంటు కాలం గడిపాడు. గోపన్న పంచాయితీ పెట్టాలనీ శ్రీరాములు నాయుడు ఇంటి దగ్గరకు వస్తాడు.

ఆ గ్రామానికి ప్రసిడెంటు శ్రీరాములు నాయుడు. అతడు చిన్నతనం నుండే గాంధీజీ భావాలను అలవరుచుకున్నాడు. హైస్కూల్లో చదివేటప్పుడు ఒక సారి "ఉన్న ఊరు కన్న తల్లి" అనే శీర్షికతో రాసిన వ్యాసానికి అతడు బంగారు పతకం పొందుతాడు. అదే అతని హృదయంలో మొదటి వెలుగు రేఖ అని చెప్పవచ్చు. కాలేజిలో చేరాక అది ఒక జ్యోతిగా వెలుగొందింది. ఆ తర్వాత అతడు 'లా' చదువుతాడు. 1947 లో శ్రీరాములు నాయుడు చదివే లా కాలేజీ పత్రికలో అతడు "భారతదేశం 1960" అనే శీర్షికతో రాసిన వ్యాసం వెలువడింది. చదివే వారిపైన దాని ప్రభావం రచయితను పొగడడంతో అంతమయినా క్రియాశీలియైన రచయితపై దాని ప్రభావం పడింది. అదే అతనిని స్వగ్రామానికి చేర్చిందని చెప్పవచ్చు. ఆ రోజుల్లో అతనిలాగానే దేశభక్తితో ఉ గ్రూతలూగుతున్న తన తోటి స్నేహితులు 'లా' పట్టాలు పొంది. నేడు శాసన సభలలో మంత్రులుగా కొలువుదీరారు. కాని శ్రీరాములు నాయుడు సొంత ఊరికే తన సేవలను చేయాలని వచ్చేస్తాడు. కాని శ్రీరాములు నాయుడి పెద్ద మామ అతన్ని ఎం.పి.గానో ఎమ్మెల్యే గానో చూడాలనుకుంటాడు. కాని శ్రీరాములునాయుడు రాజకీయాలకు దూరంగా ఉ ండేవాడు. అవి తనకు అవసరం లేదని తన ఊరికే సేవ చేస్తానని చెబుతాడు. శ్రీరాములు నాయుడుకు తన పెద్ద మామ కూతురినిచ్చి పెళ్లి చేస్తాడు. కూతురునిచ్చిన బాధ్యతతో అప్పుడప్పుడు శ్రీరాములు నాయుడుతో వాదులాడుతుంటాడు.

శ్రీరాములు నాయుడు సుందరపాలెం గ్రామంలో ప్రసిడెంట్గా గ్రామ పెద్దగా ప్రజల సమస్యలను దేవాలయం దగ్గర ఉన్న మండపంపై కూర్చొని పరిష్కరిస్తుంటాడు. గ్రామంలో అతని చొరవతోనే స్కూల్ని కట్టిస్తాడు, రోడ్డు వేయిస్తాడు. ఇప్పుడు అప్పల్రాముడి అప్పు సమస్యను గోపన్న శ్రీరాములు నాయుడితో చెప్పి పంచాయితీ చేయమంటాడు. కానీ తన పెద్ద మామకు ఆరోగ్యం బాగలేక శ్రీరాములు నాయుడు విశాఖపట్నంకు వెళ్ళాడు. దాదాపు 15 రోజులు గడిచిపోయాయి కాని నాయుడు గ్రామానికి రాలేదు. గోపన్న చివరకు లక్ష్యం నాయుడు మరో ఇద్దరు పెద్దలతో పంచాయితీ పెట్టిస్తాడు. లక్షుంనాయుడు అన్న లాగా 'లా' చదవలేదు. కానీ న్యాయం గురించి, ధర్మం గురించి అతనికి తెలుసు. ఆ రోజు సభ అర్థంతరంగా మధ్యలోనే ముగుస్తుంది. రెండవరోజు కూడా అలాగే జరుగుతుంది. మూడవరోజు ఉ దయం శ్రీరాములు నాయుడు గ్రామానికి చేరుకుంటాడు. ఉదయం 10 గంటలకు దేవాలయం దగ్గర ఉన్న మండపం పైకి వస్తాడు. అప్పటికే ప్రజలందరూ వచ్చింటారు.

రెండు రోజుల నుండి ఏమి తేలని పంచాయితీ ఈ రోజు శ్రీరాములు నాయుడు తీరు చెబుతాడని జనం తండోపతండాలుగా వస్తారు. శ్రీరాములు నాయుడు సభలో తనకు కేటాయించిన స్థలంలో కూర్చుంటాడు. తన తమ్ముడు లక్షుంనాయుడు కుడివైపున, సూర్యం ఎడమవైపున కూర్చున్నారు. అప్పల్రాముడికి న్యాయం జరగదనేది అతని మనస్సులో సందేహం కలుగుతుంది. ఎందుకంటే గోపన్న కూడా ఇంతకుముందు న్యాయ నిర్ణేతలలో ఒకడుగా ఉండేవాడు. గోపన్నకు, శ్రీరాములు నాయుడు మంచి స్నేహితుడు కూడా. పంచాయితీ సభ్యుల్లో కొందరటు, కొందరిటు కూర్చున్నారు. మునసబు, కరణం అక్కడే కూర్చున్నారు. నాయుడు అప్పల్రాముడి వైపు చూశాడు. అప్పల్రాముడు మండపం మెట్ల ముందు ఎప్పుడూ కూర్చునే

చోటుకు కొంచెం దూరంగా కూర్చున్నాడు. అతనికి డెభై సంవత్సరాలు ఉంటాయి. అతన్ని ఉర్లోవారందరు ఒరేయ్ అని పిలుస్తారు. కాని నాయుడు ఏమయ్యా అని పిలుస్తుంటాడు.

అప్పల్రాముడికి దగ్గర్లోనే అతని కుమారులు నలుగురు, మనవళ్ళు మనవరాళ్ళు వారి బంధువులు గుంపుగా కూర్చున్నారు. వాళ్ళందరికీ దూరంగా నాల్గవకొడుకు సీతారాముడు కూర్చున్నాడు. మండపంలో మరొక పక్కన కూర్చున్న గోపన్నకు బంధువులు ఎవరూ రాలేదు. అతనికి కూడా నలుగురు కొడుకులున్నారు. కాని బతుకు తెరువు కోసం రెక్కలొచ్చిన పక్షుల్లాగా నలుగురు నాలుగు దిక్కులకు వెళ్ళారు. గోపన్న దగ్గర భర్తను పోగొట్టుకున్న కూతురు, ఆమె కొడుకులు ఐదుగురు ఉన్నారు. గోపన్న మొట్టమొదట వ్యాపారం ప్రారంబించినది అప్పల్రాముడి దగ్గరనే. అతని మొదటి రైతు చివరి రైతు కూడా అప్పల్రాముడే. మొదట్లో వ్యాపార లాభాదేవీలు బాగుండడం వల్ల గోపన్న షావుకారవు తాడు. కానీ రోజు రోజుకు వ్యాపారం తగ్గిపోవడంతో ప్రస్తుతం అతని పరిస్థితి కూడా అగమ్య గోచరంగా ఉంది. నాయుడు అప్పల్రాముడిని అప్పు తీసుకున్నావా అంటే పలుకడు, ఉలుకడు. వారి కుమారులు కూడా ఎవ్వరూ మాట్లాడలేదు. చివరకు లక్ష్మంనాయుడు బావమరిది అన్నమయ్య అప్పల్రముడు కుటుంబాన్ని తిడుతాడు. మండపం దగ్గర ఉన్న వారు కొందరు అప్పులు తీసుకున్నవారు, ఇచ్చినవారు వాదులాడుకుంటారు. అప్పుడు శ్రీరాములు నాయుడు జోక్యం చేసుకుని అందరిని శాంతపరుస్తాడు.

అప్పల్రాముడు తండ్రికి 12 ఎకరాలు ఉండేది. అతనికి ఇద్దరు కొడుకులు. కావున అప్పల్రాముడు భాగానికి 6 ఎకరాలు వస్తుంది. దానిని తర్వాత అతడు 9 ఎకరాలకు చేరుస్తాడు. తర్వాత కాలంలో పంటలు పండకపోవడం వల్ల అప్పుడింత, అప్పుడింత అమ్ముకుంటాడు. అప్పల్రాముడు దగ్గర చివరకు 2 ఎకరాలు మాత్రమే మిగిలింది. రెండు ఎకరాల భూమిని అమ్మినా అది అప్పుకు సరిపోదని ఇరుగుపొరుగు వారు మండపం దగ్గర అనుకుంటున్నారు. శ్రీరాములు నాయుడు కూడా భూమిని అమ్మి అప్పు తీర్చమంటాడు. కాని అప్పల్రాముడు భూమి అమ్మితే తన కుటుంబం రోడ్డున పడుతుందని చెబుతాడు. రైతుగా బతుకుతున్న తాను కూలీగా 365 రోజులు పని చేసుకుని బతకాల్సి వస్తుందని చెప్తాడు. తనకు ఇంకొక మూడేళ్ళు గడువు ఇస్తే తమ కుటుంబం మొత్తం కష్టంచేసి అప్పుతీరుస్తామంటాడు. తన మనవళ్ళు కూడా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారు కాబట్టి ఒక్కోక్కరొక్క పని చేసి వడ్డీతో సహా తీరుస్తామంటాడు.

గ్రామ పెద్దలు అప్పల్రాముడితో పొలం పోయిన తర్వాత పని చేసుకోవడానికి ఊరికి దగ్గరలో 5 ఎకరాల పోరంబోగు పొలం ఉంది దాన్ని సాగుచేసుకోమని చెబుతారు. మీ ఇంట్లో అందరూ కష్టపడి పనిచేస్తారు కాబట్టి ఆ పొలాన్ని మీరైతేనే సాగుచేయగలరని చెప్తారు. పోరంబోకు పొలాన్ని సాగు చేయాలంటే సాగుభూమికంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని అప్పల్రాముడి కొడుకు సీతారాముడు గ్రామ పెద్దలతో చెబుతాడు.

ఆ భూమినే గోపన్నకు ఇవ్వమంటాడు. నాయుడు అప్పల్రాముడితో పొలాల్లో పనులకు మొదట మిమ్మల్నే పిలుస్తారు, మీ తర్వాతనే ఇతరులకు అవకాశం ఇస్తామని చెబుతాడు. కాని అప్పల్రాముడి కుటుంబం వారి మాటను వినరు. సీతారాముడు కోపంతో మండపం దగ్గర నుండి ఇంటికి పరుగెత్తుతూ వెళ్లి తన కొడుకుతో కూలీగా బతుకుతా లేక చస్తావా అంటాడు. అభం శుభం తెలియని వాడు. అమ్మను పోగొట్టుకున్న వాడు. వానికి కష్టం అంటే ఏమిటోకూడా తెలియదు. తండ్రితో చస్తానంటాడు. అప్పుడు సీతారాముడు ఇంట్లో ఒక మూలన ఉన్న కొడవలి తీసుకుని తన కొడుకు తలను నరికేస్తాడు. ఒక గోనె సంచి తీసుకొని దానిలో వేసుకొని మండపం దగ్గరకు వస్తాడు. అది చూసిన

జనం గోనె సంచిలో సీతారాముడు ఏదో తెస్తున్నాడని దూరం నుంచి ఎదురుచూస్తున్నారు. మండపం ముందు భాగంలో గోనె సంచిలో తెచ్చిన కొడుకు శవాన్ని కిందకు వేస్తాడు. అప్పుడు జనం భయభ్రాంతులకు గురవుతారు. అమాయకుడైన కొడుకును ఇలా చేశాడని, ఎంత క్రూరత్వంగా ప్రవర్తించాడని జనం సీతారామున్ని తిడతారు. అప్పుడు తండ్రితో సీతారాముడు గొంతులో ప్రాణం ఉన్నంత వరకు భూమిని అమ్మడానికి వీల్లేదంటాడు. అలా చేస్తే నీ ప్రాణం తీస్తానంటాడు.

అప్పుతీసుకున్న అప్పల్రాముడు ఎటూపోలేని పరిస్థితిలో ఉంటాడు. ఆవేశం అనర్థాలకు దారితీస్తుందని ఈ వ్యాసం ద్వారా తెలుసుకోవచ్చు. కొడుకును తిరిగి తెచ్చుకోవాలంటే సీతారాముడికి సాధ్యంకాదు. తలకొరివి పెట్టడానికైన కొడుకుండాలంటారు పెద్దలు. "పున్నామనరకం నుండి రక్షించువాడు కొడుకు" అటువంటి కొడుకుని పోగొట్టు కుంటాడు సీతీరాముడు. అప్పల్రాముడు చేసిన అప్పుకు మనవడు బలికావడం జరుగుతుంది. ఆ రోజు అలా జరగడం అప్పల్రాముడుకు కొంతవరకు అవమానం జరిగినట్లుగానే భావించవచ్చు.

**ఆధార గ్రంథాలు:**

1. కథాయజ్ఞం కాళీపట్నం రామారావు

❖ ❖ ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

భావవీణ

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కారా కథలు-సామాజిక దృక్పథం

**- డా॥ మల్లెపోగు మాదన్న,** తెలుగు శాఖాధ్యక్షులు, యస్.జి.యస్. ఆర్ట్స్ కళాశాల, తిరుపతి, చరవాణి: 9966063428

కారా మాస్టారుగా పేరుగాంచిన కాళీపట్నం రామారావు గారు శ్రీకాకుళం జిల్లా, మురపాక గ్రామంలో 1924వ సంవత్సరం, నవంబరు 9న భ్రమరాంబ, పేర్రాజు దంపతులకు జన్మించారు. కారా వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృతి రచనలు చేయడం, అతడు కథకుడిగా, విమర్శకుడిగా ప్రసిద్ధి పొందాడు. ఆయన శైలి సరళమైనదిగా, భావప్రధానంగా కలిగి ఉంటుందని ఈ కథ వల్ల తెలుస్తుంది. తెలుగు కథల్లో సామాజిక వాస్తవికతకు సముచిత స్థానం కల్పించిన ఉత్తమ రచయితల్లో కారా గారు ముఖ్యులు. తాను నమ్మిన మార్క్సిస్టు రాజకీయ సిద్ధాంతాల్లో తనకున్న నిబద్ధతను తన కథల ద్వారా తెల్పారు. సాదాసీదాగా నడిపే తన కథల్లో పాత్రల స్వరూప స్వభావాలను, వారి పరిసరాలను, వారి సమస్యలను ప్రస్తావించి వాటికి పరిష్కార మార్గాలను చూపడానికి ప్రయత్నించారని చెప్పవచ్చు.

కాళీపట్నం రామారావు రాసిన కథలు, నవలలు తక్కువే. అతని రచనలు అన్ని కూడా ప్రసిద్ధమైనవిగానే చెప్పవచ్చు. ఆయన రచనలు సామాన్య జనులకు సహితం అర్థమయ్యే టట్లు సరళంగా ఉంటాయి. యండమూరి వీరేంద్రనాథ్, కాళీపట్నం రామారావు రచనల ద్వారా ప్రేరణ పొంది ఆయనకు గురువుగా భావించేవారు. కారాకు బొమ్మిడాల కృష్ణమూర్తి వారి స్ఫూర్తి పురస్కారం, ఎన్.టి.ఆర్ జాతీయ పురస్కారం, కొండేపూడి శ్రీనివాస రావు పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు పొందారు.

కారా గారు శ్రీకాకుళంలో 'కథానిలయం' అనే గ్రంథాలయాన్ని 1997 ఫిబ్రవరి 22న పురస్కారాల ద్వారా వచ్చిన డబ్బుతో ప్రారంభించాడు. ఈయన కథా రచనలకు దూరంగా ఉండి, గ్రంథాలయం కోసమే ఎక్కువగా శ్రమించి దాని అభ్యున్నతికోసం కృషిచేసినట్లు తెలుస్తుంది. ఈ కథానిలయంలో దాదాపు 4500కు పైగా పత్రికలు, మాస పత్రికలు, జ్యోతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక మరియు భారతి జాతీయ పత్రికలున్నాయి. రెండువేలకు (2000) పైగా కథలు, కథారచనలు, సంపుటాలకు సంబంధించిన మరో 40వేలు కథలున్నాయి. ప్రొఫెసర్ గూటాల కృష్ణమూర్తి, తెలుగు కథకు అత్యుత్తమమైనటువంటి ఇలాంటి గ్రంథాలయం ఇంతకు ముందు ఎక్కడా లేదని తెలిపారు.

**కారా రచనలు :**

అభిమానాలు, అభిశప్తులు, అశిక్ష అవిద్య, పలాయితుడు, తీర్పు, ఇల్లు, వధ, యజ్ఞం, మహదాశీర్వచనం, వీరుడు-మహావీరుడు, హింస, నోరూమ్, స్నేహం, ఆర్తి, భయం, శాంతి, చావు, జీవధార, కుట్ర మొదలైన 30దాకా నవలలు రాశారు. ఇందులో ఆర్తి, యజ్ఞం కథలను విశ్లేషించడం ద్వారా సామాజిక దృక్పథాన్ని తెల్పడం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

**వస్తుస్వీకారం :**

కాళీపట్నం రామారావు కథల్లో చాలా వరకు పీడిత వర్గాల ప్రజల సమస్యలను గుర్తించడం, దానికి గల కారణాలను వెతికి, వాటికి పరిష్కార మార్గాలను చూపడం స్పష్టంగా కనబడుతుంది. తాను ఏ అంశం గురించి రాయాలను కుంటారో దాని మీద దృష్టిపెట్టి, దాని బాగా పరిశీలించి, కథలో తాను చెప్పదలచుకున్న అంశాన్ని అన్ని కోణాల నుంచి పరీక్షించి, రచయితగా తన సామాజిక బాధ్యతను గుర్తెరిగి రచనలు చేశారు. కారా గారు. తాను చెప్పదలచుకున్న ముఖ్యమైన విషయాలను దేన్నైనా విడిచిపెట్టినట్లుగాని, సంకుచితమైన అంశాలను ఆకర్షవంతంగా చెప్పినట్లుగాని కథలో మనకు ఎక్కడా కనిపించదు. కారా కథలు పేదల

బతుకులను పట్టి చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

**కారా కథలు-సామాజిక దృక్పథం**

**ఆర్తి కథ**

పైడయ్య, సన్ని భార్యాభర్తలు, సన్ని తల్లి ఎఱ్ఱమ్మ, పైడయ్య తల్లి బంగారి వీళ్ళ మధ్య ఏర్పడిన తగాదా భార్యాభర్తల్ని విడిదీసే పరిస్థితికి దారి తీస్తుంది. పైడయ్య పట్నంలో రోజువారీ కూలీగా పనిచేస్తూ నెలకొకసారి ఇంటికొచ్చేవాడు. పుట్టింట్లో ఉన్న సన్నిని తన ఇంటికి తీసుకొని వెళ్ళలేని నిస్సహాయస్థితి పైడయ్యది. పెద్దావిడైన నరసమ్మ ద్వారా రాయభారం జరిపిస్తారు. సన్ని తన ఆత్మాభిమానాన్ని చంపుకొని భర్తపైడయ్యతో వెళ్ళడానికి నిరాకరిస్తుంది. ఊరిపెద్ద అసిర్నాయుడు తీర్పు ద్వారా వియ్యపురాళ్ల తగదాను పరిష్కరించి భార్యభర్తల బంధం నిలిపేలా తీర్పునిస్తారు. ఇది తాత్కాలికమా, శాశ్వతమా అనే అనుమానాలతో కథ ముగుస్తుంది.

ఈ కథలో రచయిత చెప్పదలచుకున్న అంశం ఒక్కటే. అదేమిటంటే నిరుపేద కూలీలైన భార్యభర్తలు కలిసి జీవించాలంటే ఆర్థిక స్థితిగతులపైన ఆధారపడి ఉంటుందనీ, పేదవాళ్ళ ఇండ్లల్లో గొడవలన్నింటికీ మూలకారణం ఆర్థిక సమస్యలే అన్న విషయం తేటతెల్లమవుతుంది. పుట్టింటికి తీసికెళ్ళి కూలీకి పంపించి నాలుగు రూపాయలు వెనకేసుకొని దానితో కూతురికి ఏమైనా కొనిపెట్టాలన్న తల్లి మనసూ, కోడలు కూలిచేసి తెచ్చిన డబ్బులతో కొడుకు కోడలూ తన దగ్గర సుఖపడాలనుకునే అత్తమనస్సూ, ఈ ఇద్దరూ ఎంత పోట్లాడుకున్నా బిడ్డలు సుఖంగా ఉండాలన్నదే వాళ్ళు కోరుకున్నట్లు మనకు అర్థమవుతుంది. ఆ ఆడకూతురు దేనికైనా సిద్ధమే. కానీ ఆమె సంపాదించిన కూలీ డబ్బుల్ని ఏ ఇంటికి చేరాలన్నదే 'ఆర్తి' కథలోని సారాంశం.

సమాజంలో పేదజనం, కూలీజనం, కష్టపడే జనం ఇలా దిగజారుడు బతుకులు బతకకూడదన్న సామాజిక సందేశానివ్వడమే రచయితకున్న 'ఆర్తి' అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**యజ్ఞం కథ**

యజ్ఞం కథలో అప్పల్రాయుడు, గోపన్న, శ్రీరాములునాయుడు, సీతారాముడు పాత్రలు ప్రధానంగా కనిపిస్తుంది. అప్పల్రాయుడు సుందరపాలెం గ్రామ పంచాయితీకి హరిజన మెంబరుగా, వయస్సులో అతనికంటే పెద్దవా ఎవరు లేకపోవడంతో కులపెద్దగా వ్యవహరిస్తుంటాడు. మాటమీద నిలబడేవాడు. మర్యాదగా బతకాలనుకునేవాడు. మూడు సంవత్సరాల క్రితం తన పొలం పనులకోసం షావుకారు గోపన్న దగ్గర రెండు వేలు రూపాయాలు (రూ.2000/-) అప్పుచేస్తాడు. కాలం చెల్లడంతో వడ్డీతో కలిపి రెండువేల ఐదువందల రూపాయాలు (రూ.2500/-) అవుతుంది. కాలక్రమంగా మార్పులు చేర్పులతో షావుకారు గోపన్న బతుకు భారమై అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పల్రాయుడి దగ్గర డబ్బులు రాబట్టు కోవాలనుకుంటాడు. మూడు (3) నెలల నుండి ఈ రోజూ, రేపు అంటూ కాలం గడుపుతూ ఉంటాడు అప్పల్రాయుడు. గోపన్న గ్రామ ప్రెసిడెంటు అయిన శ్రీరాములునాయుడు దగ్గర పంచాయితీ పెట్టాలనుకుంటాడు.

శ్రీరాములునాయుడు చిన్నతనం నుంచీ గాంధీజీ భావాలను అలవర్చుకున్న గాంధేయవాది. హైస్కూల్లో చదివేటప్పుడు 'ఉన్న ఊరు కన్నతల్లి' అనే వ్యాసాన్ని రాసి బంగారు పతాకం పొందినవాడు. 'లా' చదువుకున్నవాడు. 1947సం౹౹ఎలో తాను చదువుకునే 'లా' కాలేజీ పత్రికలో 'భారతదేశం 1960' అనే శీర్షికతో రాయడం, ఆ వ్యాసాన్ని చదివేవారిపై దాని ప్రభావం చూపడం, పాఠకులు రచయితను

పొగడ్తలతో ముంచెత్తడం జరుగుతుంది. రోజుల్లో అతనిలాగే 'లా' చదివి పట్టాలు పొందిన కొంతమంది శాసనసభల్లో మంత్రులుగా కొలువుదీరారు. కానీ శ్రీరాములునాయుడు మాత్రం సొంత ఊరికి సేవలు చేయాలన్న దృఢసంకల్పంతో ఊరు చేరుతాడు.

గోపన్న, శ్రీరాములునాయుడు మంచి స్నేహితులు. అప్పలాయుడికి నలుగురు కొడుకులు, మనవళ్ళు, మనవరాళ్ళున్నారు. అతని నాల్గవ కొడుకే సీతారాముడు. అందరూ పంచాయితీ దగ్గరకు వస్తారు. కానీ గోపన్నకు నలుగురు కొడుకులున్నా నాలుగు దిక్కుల్లో ఉన్నారు. భర్తను పోగొట్టుకున్న కూతురు, ఆమె ఐదుగురు కొడుకులున్నా వాళ్ళెవరూ అక్కడికి రారు. గోపన్న మొదట వ్యాపారం మొదలు పెట్టింది అప్పలాయుడి దగ్గరే. మొదటి రైతు చివరి రైతు కూడా అప్పలాయుడే. వ్యాపారం బాగా జరగడం వల్ల గోవన్న షావుకారవుతాడు. రానురాను వ్యాపారం జరగకపోవడంతో దివాలాదీసి అప్పుల పాలవుతాడు.

అప్పలాయుడి తండ్రికి 12 ఎకరాల భూమి ఉండేది. ఇద్దరు అన్నదమ్ములు కావడంతో సరి ఆరు (6) ఎకరాలు పంచుకుంటారు. అప్పలాయుడు దాన్ని తొమ్మిది (9) ఎకరాలు చేస్తాడు. పంటలు పండకపోవడం వల్ల కొంచెంకొంచెంగా పొలాన్ని అమ్ముకుంటూ వస్తాడు. చివరకు రెండు (2) ఎకరాలు మిగులుతుంది. శ్రీరాములు నాయుడుతో పాటు ఆ ఊరి పెద్దమనుషులు కలిసి అప్పలాయుడికి రెండెకరాలు (2) పొలమమ్మి అప్పుతీర్చమంటారు. అప్పలాయుడు మాత్రం భూమిని అమ్మితే తన కుటుంబం రోడ్డున పడుతుందనీ, కూలీలుగా బతకాల్సి వస్తుందనీ మూడు (3) సంవత్సరాలు గడువిస్తే అప్పటిలోగా అప్పుతీరుస్తానంటాడు. గ్రామపెద్దలు ఒప్పుకోరు. అప్పలాయుడ్ని పొలం పోయిన తర్వాత పనిచేసుకోవడానికి ఊరికి దగ్గర్లో ఐదు (5) ఎకరాలు పోరంబోకు పొలం ఉంది కదా, దాన్ని సాగుచేసుకోమని సలహా ఇస్తారు. పోరంబోకు భూమిని సాగుచెయ్యాలంటే డబ్బులు ఎక్కువగా ఖర్చు అవుతుందని ఆ భూమిని గోపన్నకు ఇవ్వమంటాడు అప్పలాయుని కొడుకు సీతారాముడు. శ్రీరాములునాయుడు అప్పలాయుడితో పొలాల్లో పనులకు మొదట మిమ్మల్నే పిలుస్తారు. తర్వాతే వేరేవాళ్ళని పనికి పిలుస్తామనడంతో వాళ్ళ మాటల్ని వినని అప్పలాయుని కొడుకు సీతారాముడు కోపంతో ఇంటికెళ్ళి తన కొడుకుతో కూలీగా బతుకుతావా, చస్తావా అని అడిగితే అభం శుభం తెలియనివాడు అమ్మను పోగొట్టుకొని, కష్టమంటే ఏమిటో తెలియని ఆ పిల్లవాడు తండ్రితో చస్తానంటాడు. అప్పుడు సీతారాముడు కొడవలి తీసుకొని కొడుకు తలను నరికి ఒక గోనెసంచిలో తీసుకొని పంచాయితీ మండపం దగ్గరికి వచ్చి మూటను విప్పి కొడుకు శవాన్ని వాళ్ళముందర వేస్తాడు. అక్కడున్నవాళ్ళందరూ భయపడిపోతారు. ఎంత క్రూరత్వానికి ఒడిగట్టాడని ఊరి జనం తిట్టుకుంటారు. సీతారాముడు ఇంత దారుణానికి పాల్పడడమే కాకుండా 'భూమిని అమ్మడానికి వీల్లేదనీ, అలా చేస్తే నీ ప్రాణం తీస్తానని' అప్పలాయుడ్ని బెదిరిస్తాడు. అప్పు తీసుకున్న అప్పలాయుడికి ఏమి చెయ్యాలో పాలుపోక అయోమయంగా ఉంటాడు. ఆవేశం అనర్థాలకు దారి తీస్తుందన్నట్లు సీతారాముడు తన ఆవేశానికి కొడుకును బలితీసుకుంటాడు. అప్పలాయుడు చేసిన అప్పుకి తన మనవడు బలికావడం మొదలైన సామాజిక అంశాలకు సంబంధించిందే యజ్ఞం కథా సారాంశం.

రచయిత జీవితంలో మేలిమలుపు యజ్ఞం కథ నుంచే వచ్చిందని చెప్పవచ్చు. మధ్య తరగతి జీవిత చిత్రణ నుంచి అట్టడుగు వర్గాల మీదికి కారా రచనా విధానం ఈ కథ నుంచే మారిందని చెప్పవచ్చు. యజ్ఞం కథా సంపుటానికి

కొడవటిగంటి కుటుంబరావు ఉపోద్ఘాతం రాస్తూ "యజ్ఞం కథ ఒక గ్రామానికి సంబంధించిన రాక్షసాన్ని'' చిత్రించిందన్నారు. తమకు న్యాయం జరగాలని ఎంత గొంతుచించుకున్నా ఫలితం లేకపోగా, ఒకరిద్దరి చైతన్యవంతులైనా, కార్యాచరణ పాలుపోని స్థితిలో తమ అసమ్మతిని, నిరసనను తెలిపేందుకు తమ జీవితాలను బలిచ్చే సాహసం చేయవచ్చుననే సందేశాన్ని తెల్పే కథా రూపమే యజ్ఞం అని చెప్పవచ్చు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును పొందిన ఉత్తమ కథానిక 'యజ్ఞం' అనీ, కారా గారి కథల్లో మణికిరీటంలా మకుటాయమానంగా నిలుస్తుందనుట అతిశయోక్తికాదు.

కారా గారు ప్రతి రచనలనూ సమాజంలో జరిగే సంఘటనలను వారి ఆర్థిక స్థితిగతులను, మానవీయ విలువల ప్రతిపాదన తొణికిసలాడతాయి. బడుగుబలహీన పీడిత వర్గాల శ్రమను గుర్తించి వారి సౌభాగ్యమే తన సామాజిక దృక్పథంగా కలిగి రచనలు చేసిన కాళీపట్నం రామారావు గారు రాబోయే తరాలవారికి ఆదర్శప్రాయులు.

**ఆధార గ్రంథాలు :**

1. వివిన మూర్తి, రచనశాయి (సంపాదకులు) కాళీపట్నం రామారావు రచనలు, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాదు.
2. పోరంకి దక్షిణామూర్తి - కథానికి స్వరూపస్వభావాలు (ప్ర.ము.) 1988, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# ఫలించని 'సంకల్పం'

- **శ్రీ బండారి ప్రేమ్ కుమార్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్
email : bandari.premkumar2014@gmail.com

కథకుడిగా, విమర్శకుడిగా తనదైన రచనా పరంపరను కొనసాగిస్తున్న కాళీపట్నం రామారావుగారు 1924 నవంబర్ 9న శ్రీకాకుళం జిల్లా మురపాక గ్రామంలో జన్మించారు. వృత్తిరీత్యా వైజాగ్లో లెక్కల మాస్టారుగా జీవితాన్ని ప్రారంభించి ప్రవృత్తిరీత్యా రచయితగా తన రచనా వ్యాసంగాన్ని మరోవైపు కొనసాగించేవారు. కారాగారి కథలు వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. విరసం ఉపాధ్యక్షుడిగా పనిచేయడంతో ఆ భావాలు కొన్ని వారి కథల్లో వ్యక్తమవుతాయి. తన జీవన గమనం నుంచి తొంగిచూసిన అనుభవాల సారాన్ని కథకు వేదికగా ఎంచుకున్నాడు. సాహిత్యానికి సాంకేతికను జోడించి, ప్రపంచంలోని నలుమూలల కథలు సేకరించి, కథకు విస్తృతమైన వ్యాప్తి కలిగించడానికి 1997లో శ్రీకాకుళంలో కథానిలయం ఏర్పాటు చేశారు. తద్వారా ఎంతోమంది రచయితల కథలు కథానిలయంలో భద్రపరచబడి భావితరాల వారికి ఎంతో ఉపయుక్తం అవుతున్నాయి. తన రచనల్నే పాఠకులు ఆదరించాలనుకునే పోటీ ప్రపంచంలో సాహితీవేత్తల అందరి కథలను పాఠకులందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, వీరందరికీ భిన్నంగా ఆలోచించే కారాగారు కథల సామాజిక ప్రయోజనాన్ని గుర్తించి, కథలను పాఠకులందరికీ చేరవేయాలని సదుద్దేశంతో కథానిలయాన్ని స్థాపించారు.

బడుగు బలహీనవర్గాల వారి వెతలు వీరి కథల్లో ఎక్కువగా కనిపిస్తాయి. సమాజంలోని కొన్ని వర్గాలను ప్రభావితం చేస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు తన కథల్లో చిత్రికకడతాయి. వీరి కథలకు వైశిష్ట్యాన్ని కలిగించే అంశాల్లో భాష ప్రధానమైంది. కళింగాంధ్ర మాండలికం, శ్రీకాకుళం యాసలో సహజత్వాన్ని జోడిస్తూ, కాల నేపథ్యాన్ని అనుసరించి రచనలు చేస్తారు కాబట్టే వీరి రచనల్లో వాస్తవికత ఉట్టిపడుతుంది.

సమాజంలో తాను చూసిన అనుభవాలు సంఘటనలెన్నింటినో కథల రూపంలో అక్షరీకరించి, సామాజిక ప్రయోజనాన్ని ఆశించి, పాఠకులందరికీ సులభంగా అర్థమయ్యేలా కారాగారు సరళభాషను ఎంచుకున్నారు. సరళ భాషలో రచనలు చేయటం ద్వారా పాఠకలోకానికి మరింత చేరువయ్యారు.

విభిన్నమైన కథాంశంతో వినూత్న ప్రయోగం చేస్తూ రచనాశైలికి, ఇతివృత్త వైవిధ్యానికి నిదర్శనంగా 'యజ్ఞం' కథను రాయటం జరిగింది. 'యజ్ఞం' కథకు పాఠకుల నుండి, సాహితీ ప్రియులనుండి, విమర్శకుల నుండి గొప్ప ప్రశంసలు వచ్చాయి. కథా సాహిత్యంలో 'యజ్ఞం కథ' కలికితురాయిగా నిలిచి, కాళీపట్నం రామారావు గారిని ఉత్తమ కథకుడిగా నిలిపింది. కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' కథకు 1996లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

నాలుగు తరాల కుటుంబాల మధ్యగల సంఘర్షణను, అవసరాలకు అనుగుణంగా మారుతున్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా రచయిత అభివ్యక్తీకరించే ప్రయత్నం చేశారు. కథా నేపథ్యాన్ని సంక్షిప్తీకరిస్తే, కథకు ఆలంబన సంఘటన అంటారు. ఇక్కడ 'సంకల్పం' అనే కథలో పాత్రధారి రామభద్రయ్య కాశీక్షేత్రాన్ని సందర్శించటం,గంగలో పవిత్ర స్నానం చేయడం అనేది తనకుగల చిరకాల కోరిక. కానీ అకస్మాత్తుగా దురదృష్టవశాత్తు అతను మరణించడం భార్య సుబద్రమ్మ

భర్త రామచంద్రయ్య అస్థికలను కుటుంబ సభ్యుల సహకారంతో గంగలో కలపటం, ఈ నేపథ్యాన్ని అనుసరించే కథారచన కొనసాగుతుంది. కథ ముగింపులో కూడా రామభద్రయ్య అస్థికలను గంగలో కలవడం ద్వారా అతని సంకల్పం నెరవేరినట్లుగా రచయిత కథను ముగించారు. ఈ కథావస్తువుకు అనుగుణంగా, ఔచిత్యంగా 'సంకల్పం' అనే శీర్షికను ఇవ్వటం జరిగింది. కానీ ఈ సంకల్పం నెరవేరే క్రమంలో కథలో అంతస్సూత్రంగా కొన్ని పార్శ్వాలు ఆవిష్కరించబడ్డాయి.

ప్రధానంగా కుటుంబ సభ్యుల బాంధవ్యాలను, మానవీయ అంశాలు, ఆర్థిక అంశాలను కొన్ని సంఘటనల ద్వారా, పాత్రల మనోభావాల ద్వారా రచయిత వ్యక్తపరిచారు. రచయితే వ్యాఖ్యాతగా మారి తన వ్యాఖ్యానంతో పాత్రల భావాలను విశదపరుస్తాడు. తల్లిదండ్రులుగా రామభద్రయ్య, సుభద్రమ్మ దంపతులు పిల్లల బాధ్యత నెరవేర్చే క్రమంలో తమ సంతోషాన్ని కూడా త్యాగం చేస్తారు. పిల్లలకు కూడా తల్లిదండ్రులంటే భయం, గౌరవం ప్రేమ ఉండాలి. కానీ కాలక్రమంలో దురదృష్టవశాత్తు రామభద్రయ్య వృద్ధాప్యదశలో మంచానికే పరిమితయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. "అప్పట్లో కొడుకు తండ్రి చెప్పాకే ఏ పనన్నా చేసేవాడు. కొన్నాళ్ళు పోయాక ఏ వ్యవహారం గురించైనా అడిగినప్పుడు జవాబిచ్చేవాడు, మరి కొన్నాళ్ళు పోయాక దేన్ని గురించన్నా ఒకటికి రెండుసార్లు అడిగితేగాని జవాబు వచ్చేది కాదు. తర్వాత విసుక్కునేవాడు. (పుట.5 సంకల్పం)"

పై సంఘటన ద్వారా ఒక వ్యక్తి జీవితంలో సంపాదించే శక్తి సామర్థ్యాలు ఉన్నప్పుడే సమాజంలోనైనా, కుటుంబంలోనైనా గౌరవం, మర్యాద, విలువలు దక్కుతాయి. కుటుంబ బాంధవ్యాల మధ్య డబ్బు ఏ విధంగా అడ్డుగోడగా నిలుస్తుందో? బంధాలను ఏవిధంగా బీటలువారుస్తుందో? రచయిత తెలియజేశారు. డబ్బు రక్త సంబంధీకుల మధ్య కూడా అగాధాలను సృష్టించగలుగుతుంది. రామయ్య వృద్ధాప్యదశలో సంపాదించే స్థాయిని కోల్పోయాడు. కాబట్టి కుటుంబంలో తండ్రిగా కూడా కనీస మర్యాద, గౌరవం కుటుంబ సభ్యులు కూడా ఇవ్వడం మానేశారు.

ఇన్నాళ్లు తమ పిల్లలే సర్వస్వం అని జీవించే తల్లిదండ్రులు తమ సంతోషాన్ని, అమూల్యమైన సమయాన్ని వదులుకొని పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేస్తారు. కానీ ఆ పిల్లలు తల్లిదండ్రుల ప్రేమ, అభిమానాలను విస్మరించి డబ్బే ప్రధానమని, చివరకు అవసాన దశలో తల్లిదండ్రుల కనీస అవసరాలు కూడా తీర్చకుండా నిర్లిప్తంగా, నిస్తేజంగా మారిన పిల్లల ప్రవర్తన తీరును రచయిత ఎంతో ఆర్ద్రంగా ఆవిష్కరించారు.

"మొగుడు కొడితే మాధవ కవళం వాడూ కొట్టేడన్నట్టు పాలేరు, పని మనిషీ వ్యవహారం మీద ఇంటికొచ్చే పరాయి వాళ్ళూ కూడా కొడుకాయనకు ఎంత గౌరవం ఇస్తే అంతే గౌరవం ఇస్తుండేవారు"(పుట: 5) రామభద్రయ్యను అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నప్పుడు కొడుకులు సరిగా పట్టించుకోకపోవడంతో అప్పటివరకు కాస్తో కూస్తో గౌరవం, మర్యాదలు ఇచ్చిన పనివారు సైతం రామభద్రయ్యను చులకనగా చూడటం పట్టించుకోకపోవడం వంటి సంఘటనలు గమనిస్తే, ఇంటగెలిచి రచ్చ గెలవాలి అన్నారు పెద్దలు. ఇంట్లో ఒక వ్యక్తికి ఇచ్చే విలువని బట్టే సమాజం కూడా వారికి విలువ ఇస్తుందని, అదే లోపిస్తే ఎటువంటి పరిస్థితులు తలెత్తుతాయో? ఎంత చులకనగా చూడబడతామో? అని సుభద్రమ్మ అంతరంగిక సంఘర్షణ ద్వారా రచయిత ఆవిష్కరించాడు.

తల్లిదండ్రులు పిల్లలకు నైతిక విలువలను వారసత్వంగా అందించాలి. ఆస్తులు, అంతస్తులు వారసత్వాలు కావనే సత్యాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు. పిల్లల భవిష్యత్తుకై తల్లిదండ్రులు ఆస్తులు తాకట్టుపెట్టీ మరీ వాళ్లకు

సుఖమైన జీవితాన్ని ఇస్తూ ఉంటారు. కానీ డబ్బు ఒక్కటే పిల్లల భవిష్యత్తును సుఖమయం చేయగలదా?

డబ్బు వ్యామోహం పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించగలదా? బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చగలదా? తల్లిదండ్రుల పట్ల సమాజంపట్ల బాధ్యతగా ఉండగలరా? అనే ప్రశ్నల్ని లేవనెత్తుతూ కుటుంబ బాంధవ్యాల పటిష్టతలో మెరుగైన సమాజ నిర్మాణంలో వ్యవహరించాల్సిన తీరును రచయిత చెప్పకనే చెప్తూ పాఠకుల్లో సామాజిక స్పృహను కలిగించారు.

ఈ కథలో రచయిత కాళీపట్నం రామారావుగారు ఉత్తమమైన వ్యాఖ్యానంతో కథ నడిపించారు. సంఘటనల తాలూకు బలమైన భావోద్వేగాల్ని కలిగించే సంభాషణలు రాయటంలో సఫలీకృతులు కాలేనట్టుగా అనిపిస్తుంది. కానీ కథావస్తువు వర్తమాన సమాజాన్ని ప్రతిబింబించేటట్టుగా ఎన్నుకుని సామాజిక స్పృహను కలిగించే బాధ్యతగల రచయితగా కృతకృత్యులయ్యారు.

**ఆధార గ్రంథాలు**

1. రామారావు, కాళీపట్నం. కథానిలయం వెబ్సైట్ సంకల్పం కథలు.
2. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం. ప్రథమ ముద్రణ. 1994. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253



UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# అనురాగాల రాగమయి

**- యం. ప్రదీప్,** పరిశోధక విద్యార్థి - తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
చరవాణి : 9100388510, విద్యుల్లేఖ : pradeepvsu@gmail.com

నన్నయ్య భారత అనువాదంతో ప్రారంభమైన తెలుగు సాహిత్య చరిత్ర నేటివరకు విభిన్న ప్రక్రియా భేదాలతో అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వుంది. ఇతిహాసం, పురాణం, ప్రబంధం, యక్షగానం, నాటకం, నవల, వ్యాసం వంటి ప్రక్రియా వైవిధ్యాలతో సుసంపన్నంగా అలరారుతున్న తెలుగు సాహితీ క్షేత్రంలో పూసిన ఒక పువ్వు కథ. ఎందరెందరో మేటి కథకుల కథలతో పరిమళించిన తెలుగు సాహిత్యంలో కారా అని గారంగా పిలపించుకున్న కథకుడు శ్రీ కాళీపట్నం రామారావుగారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ రచనలు చేయడం వీరికి ప్రవృత్తిగా మారింది. రాచమల్లు రామచంద్రారెడ్డి గారిని రా.రా అని, చేకూరు రామారావు గారిని చే.రా. అని పిలుస్తుంటాం. కానీ కాళీపట్నం రామారావు గారిని మాత్రం కా.రా. మాష్టారు అని పిలుచుకోవడం వారి ప్రత్యేకతను తెలియజేస్తుంది. కా.రా. మాష్టారు గారి కథల్లో పలకని భావం లేదు. వీరి కథలు సమాజానికి దగ్గరగా ఉంటాయి.

కా.రా. మాష్టారి రచనలలో మానవత్వాన్ని, మానవ విలువలను, అనుబంధాలను, సహజ మానవ నైజాలను,మానవ మనో ప్రవృత్తులను, సమాజానికి అవసరమైన వ్యక్తిత్వ వికాసాలను తెలియజేస్తూ సాహితీ పాఠక లోకాన్ని తరింపజేశారు. తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్న రచయిత కా.రా. మాష్టారు పూర్వం పెద్దవాళ్ళు కథలు చెప్పి పూర్తయిన తరువాత “ కథ కంచికి - మనం ఇంటికి” అనే వారు కానీ కథలన్నీ కంచి వెళ్ళాయో? లేదో? తెలియదు గానీ కారా మాష్టారి గారి పుణ్యమా అని నేటి కాలంలో కథలన్నీ కథానిలయానికి చేరుతున్నాయి.. కొందరు తమ ఇండ్లకు లక్ష్మీ నిలయం, సాయి నిలయం వంటి పేర్లను పెట్టుకుంటూ ఉండటం మనం చూసి ఉంటాం కానీ కథలకు ఒక నిలయాన్ని ఏర్పాటు చేసిన ఘనాపాటి మన కా.రా. మాష్టారు తెలుగు సాహిత్యంలో ఉన్నటువంటి ప్రక్రియలు మరి ఏ ఇతర భాషా సాహిత్యంలో లేనట్లుగానే - తెలుగు ప్రక్రియల్లో కథలకున్న నిలయం మరే యితర ప్రక్రియకు లేనట్లుంది.

తెలుగు సాహితీపాఠకలోకానికి కథకుని గానే తెలిసిన కా.రా. మాష్టారు గారు కథలనే కాక నవలికలను కూడా రచించారు. నవలిక అంటే కథ కంటే పెద్దది, నవలకన్నా చిన్నది. వీరు రాసిన నవలికల్లో ఒకటి రాగమయి. కా.రా మాష్టారు మీటిన అనుబంధాల తీగలు పలికిన అనురాగాల మయమే ఈ రాగమయి అనే నవలిక.

ఈ రచనను నవరస భరితంగా, మానవ హృదయ దర్పణంగా ఆవిష్కరించారు. మనుషుల కంటికి కనిపించని మనసుతో మాత్రమే చూడగలిగే మమతానురాగాల వలయాన్ని అక్షరీకరించారు. కా.రా. మాష్టారు.

ఈ రాగమయి అనే నవలిక 1950 నవంబరు భారతి పత్రికలో అచ్చు వేశారు. ఈ రచనను కా.రా. గారికే పేరు తెలియని ఒక గుంటూరు వాసికి అంకితం ఇచ్చారు. ఈ విషయాన్ని మష్టారు గారు. ఇదే రచనలోని మొదటి పుట (పేజి)లో ఇలా చెప్పారు “ఒకప్పుడు నేను మద్రాసు వీధులలో దిక్కుతోచక అల్లాడుతుండగా తెలుగువాడినై ఉండటం తప్ప ఇంకే ఇతర యోగ్యతా లేని నాకు ఆయాచితంగా ఎంతో సహాయం చేసిన ఒకానొక గుంటూరు సజ్జనునకు. ఆ తరువాత అతని పేరైనా జ్ఞాపకం ఉంచుకోలేకపోయిన నా

కృతజ్ఞతా హీనతకు శాశ్వత చిహ్నంగా ఇది అంకితం" విశేషం ఏమిటంటే కా.రా. గారి మొత్తం రచనలలో అంకితం ఇవ్వబడిన ఏకైక రచన రాగమయి. ఈ నవలికను తప్ప మరే యితర రచనను కా.రా. మాష్టారు గారు ఎవరికీ అంకితం ఇవ్వలేదు.

కా.రా. మాష్టారు గారు స్త్రీల మధ్య ముఖ్యంగా అత్తా కోడళ్ళు, వదినా మరదలు (ఆడబిడ్డ) మధ్య సాగే పోట్లాటల ప్రేమను తన సంభాషణా చాతుర్యంతో సహజ సుందరంగా చిత్రించారు. ఈ నవలికలోని ప్రధాన పాత్ర ఉమ, కథ మొత్తం ఉమ చుట్టూనే తిరుగుతుంది. ఉమ పుట్టింటి మర్యాదను అత్తింటి గౌరవాన్ని కాపాడుతూ తన మరదలి కాపురం నిలబెట్టే ప్రయత్నం చేయుటయే రాగమయి నవలికలోని కథాంశం.

ఈ నవలలో ఉండే పాత్రలలో ప్రధానంగా కనిపించే పాత్రలు.

1. ఉమ - ప్రధానపాత్ర
2. జానకి - ఉమ మరదలు (ఆడపడుచు)
3. గిరిజమ్మ - ఉమ అత్తగారు
4. సుందరమ్మ - ఉమ పినతల్లి
5. శేఖరం - ఉమ భర్త
6. రాజశేఖరం - ఉమ అన్నయ్య, (జానకి భర్త, సుందరమ్మ కుమారుడు)
7. శేషగిరి - ఉమ మరిది

ఉమ ఆడపడుచు జానకి ఒక్కతే (భర్తతో కాకుండా పుట్టింటికి రావడంతో కథ ప్రారంభమవుతుంది.

జానకి ఎందుకు వచ్చింది? అత్తవారింట్లో ఏమి జరిగి ఉంటుంది? అని మనసును కలవర పెట్టే సంశయాత్మక ప్రశ్నలతో ఉమ చలించిపోతుంది. జానకి తల్లి గిరిజమ్మ గారు, ఉమా పదే పదే అడిగినా జానకి ఎటువంటి జవాబునివ్వక ఏడువునే కొనసాగిస్తుండడం వారిని ఇంకా కలవరపెడుతుంది.

ఈ సందర్భంలో ఉమ మరిది (జానకి 2వ అన్న) శేషగిరి "బాగా డబ్బుందని ఇచ్చి చేశారు.

ఇప్పుడది అనుభవిస్తుంది. దీనితో పాటు మనమూ కలిసి అనుభవిద్దాం. అంతా ఆడపెత్తనం'' అని అనటంతో అభిమానవతియైన ఉమ తన పినతల్లి కుమారుడైన రాజశేఖరాన్ని, పుట్టింటి వారిని అవమానిస్తున్నారని అగ్గిమీద గుగ్గిలం అవుతుంది. తన మరిదిని అత్తగారిని తన మాటల ప్రవాహంతో మౌనం వహించేలా చేసి పుట్టింటికి వెళ్ళి, అక్కడి నుంచి పినతల్లి ఇంటికి వెళ్ళి, పిన్నిని, రాజశేఖరాన్ని (జానకి భర్త) మందలిస్తుంది.

ఇందులో భాగంగా తన అన్న రాజశేఖరాన్ని "నీకు ఆడవాళ్ళంటే ఉంటూ వచ్చిన చులకన భావం యింకా పోలేదు. నీ మాటల్లో, నీప్రతి వాక్యంలో అదేకానవస్తుంది. నీవేదో గొప్ప పండింతుడవని అనుకుంటున్నట్టున్నావ్. నలుగురూ ఉత్తముడనే సరికి అందరూ నీ కంటికి హీనంగా కానవస్తున్నారు.

నిజానికి నీ వంటి మూరు?డు ఇంకొకడు లేదు'' అని అంటూ "నువ్వు చదువుకున్నావనే అనుకున్నావ్ కానీ నీ ఛాందసపు చదువు నిన్నిలాఛాందసుణ్ణి చేసి విడుస్తుందనుకోలేదు'' అంటూ అకస్మాత్తుగా ఆవరించినకోపంతో " ఆమె వల్ల ఏం నేరముందని ఇలా శిక్షిస్తావూ? మగవాడినని కదా...? అంటూ పిడుగులుపడే మాటల వర్షం కురిపిస్తుంది. ఇలా అంటూనే'' ఆమె వల్ల తప్పుంటే భరించవలసిందెవరూ? నీ భర్తృత్వానికి అర్థమేమి'' అని భార్యాభర్తలన్న మాటలకు గల అర్థాన్ని ధ్వన్యాత్మకంగా చెప్తుంది.

ఇదిలా ఉండగా ఒకసారి ఉమ అక్కడ మెట్టినింట్లో

అత్తగారినీ మరిదిని - ఇక్కడ పుట్టింటివారైన పినతల్లి, అన్నయ్య రాజశేఖరాన్ని నా ఇష్టం వచ్చినట్లు అనేస్తున్నాను. వాళ్ళు తిరిగి ఏదేనా అంటే? నామర్యాద ఏమవుతుంది? అని తనని తాను ప్రశ్నించుకుంటుంది. ఏది ఏమయినా తనకు తన బిడ్డ వంటి మరదలి కాపురం ముఖ్యం అనుకొని గాంభిర్యంగా వ్యవహరిస్తుంటుంది.

రాజశేఖరం-జానకీలమధ్య ఏకాంతంలో జరిగిన ఒక నరసపుటలుక బయటకు తెలియనీయకుండానే జానకి పుట్టింటికి రావడం - అది చూసినజానకి తల్లీ అన్నయ్యలు, వదిన ఉమ ఏదో జరగరానిదే జరిగి ఉంటుందని అనుమానించడం - ఏ జరిగిందో జానకి చెప్పకపోవడం ఉమ పుట్టింటి వారిని, అత్తింటి వారనే అవమానపు మాటలను భరించలేక పోవడం - పుట్టింటి పట్ల అభిమానం కలిగిన ఉమ వారినిఏ మీ అననీయకుండా మరదలి కాపురం చక్కబెట్టే ప్రయత్నంలో, మెట్టినింటి వారిపై అలకల పర్వం సాగించడం - పుట్టింటికి పోయి తన పిన్ని సుందరమ్మతో అన్నయ్య రాజశేఖరంతో మెత్తని మాటల యుద్ధం చేయడం, తన భర్తని, అత్తగారిని మందలించటం విన్న జానకి ఉమ పట్ల కృతజ్ఞతాహీనంగా ప్రవర్తించడం ఏది ఏమైనా చివరకు జానకి కాపురం నిలవడమే స్థూలంగా ఈ రాగమయి నవలికలోని విషయం. ఇటువంటి విషయాలు నాటికీ, నేటికీ సహజమే కానీ ఈ సహజ విషయాల మధ్య అనుబంధాలకు అక్షర రూపం కల్పించారు కా.రా. మాస్టారు.

కా.రా. మాస్టారు ఈ నవలికలో పలికించిన మమతల మౌణవీణ నేటికీ ఏదో ఒక కుటుంబంలో వింటూనే ఉంటాం. కానీ అటు అత్తింటి వారుగానీ - ఇటు పుట్టింటివారు గానీ ఎటువంటి పంతాలకూ, పట్టింపులకు పోకుండా ఆడపిల్లల కాపురాలను వీలైనంత వరకు చక్కదిద్దే ప్రయత్నం చేయాలనీ, ఈ ప్రయత్నంలో మనం కొన్ని మాటల తూటాలను భరించి, భార్యా భర్తలకు జీవితపు బాటలు వేయాలని, ఈ రచనను చదివిన ప్రతి పాఠకుని మనసును తాకే జీవన మాధుర్యమే ఈ అనురాగాల రాగమయి.

**ఆధార గ్రంథాలు:**

కాశీపట్నం రామారావు - రచనలు
(2008 వరకూ లభ్య రచనల సంగ్రహం)
ప్రచురణ: మనసు ఫౌండేషన్

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

భావవీణ

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# చావు కథ - సామాజిక పరిశీలన

- **శ్రీమతి ఇ.కల్యాణి,** తెలుగు అధ్యాపకులు, యన్.కె.బి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాచర్ల

**ఉపోద్ఘాతం:**

ఉజ్వలమైన తెలుగు సీను రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక చరిత్ర సాహిత్యంలో కథా ప్రక్రియకు గొప్ప ముడి సరుకు. ఆ సారవంతమైన భూమిక మీద అయా ప్రాంతాల జీవితాలతో ఉద్వేగాలతో అసత్తులతో మేళవించి వివరించి విశ్లేషించి మానవతా పరిమళాన్ని వ్యాపింప చేసిన శ్రీ కాళీపట్నం రామారావు గారి కథలలో నాను కథ ఒక ముఖ్యమైన భాగాన్ని సూచిస్తుంది. ఈ కథ సృజన పత్రికలో 1971 న సంవత్సరం మార్చి 1వ తారీఖున ప్రచురించబడింది.

కీలక పదాలు: చావు కట్టెలు కాల్చడం. కుల దురహంతారం. అణచివేత, భయం. ఎదురింపు. ఆత్మగౌరవం. కథ పరిశీలన చాను కథలో చనిపోయిన ముదువల్ పేరు మారెన్ను మనూచి సోకి ఆమె ఇద్దరు పిల్లలు ఒక కొడుకు చనిపోగా ఇద్దరు మగ పిల్లలు ముగ్గురు ఆడపిల్లలు. ఆమె ముగ్గురు ఆడపిల్లలకి పెళ్లి చేసి పంపించింది. అందరికన్నా పెద్దవాడు చిన్నప్పుడే ఎక్కడికో పారిపోయాడు. అల్లా భర్త చనిపోయిన తర్వాత ఆ చిన్న కొడుకు ఎరకయ్య కోడలు సానాలు దగ్గరే ఉండిపోయింది. మనూచి తో అత్తకి రెండు కాళ్లు భర్తకు రెండు కళ్ళు పోయిన వారు ఇరువురు ఒకప్పుడు తనను ఎంతో ఇలచ్చింది పెట్టిన వారికి కష్టం వచ్చినప్పుడు ఆమె వారిని వదిలేసి తన బాధ్యతలను విస్మరించక ఒంటరిగా బతుకు పోరాటం చేస్తూ రోజలకార్డ్ వస్తే అందించే సగలు రాత్రి కూలీ పనులు చేసిందో ఎన్ని పాట్లు పడించే భగవంతుడికి తెలియాలి. అంటూ వాథలన్నీంటిని ఒపిగ్గా భరిస్తూ చిన్నపిల్లల్ని పెంచుకుంటూ కళ్ళు లేని మొగుడికి కాళ్లు లేని అత్తకి చాకిరి చేస్తూ సంసారాన్ని నడిపిన కష్టజీవినిగా ధీరురాలిగా మారెమ్మ పాత్ర ఔనత్యాన్ని తులపెద్ద నూరయ్య తాత మాటల్లో ఆవిష్కరించారు కారా మాస్టరు సూరెన్ను వలికి అస్సలు ఉండలేదు. తన కొడుకు ఎరకయ్యతో 'అయ్యా నా నెపుడైనా ఈ వలి సంతకంతోనే చచ్చిపోతాను'. కక్షలు ఎక్కడ దొరకను శిక్షలు దొరకవని తప్పెట్టికిమి ఎక్కడైనా కొనోకసంతా అడుక్కొనా ఎవరికి చెంగతనమే వేసిన సరే నన్ను కాల్సియాలి. బండెడు కలు తెచ్చి కాల్చి నా ఇన్వాళ్ల సలీ రాష్ట్రమనైనా అయినా కాలిపో అంటూ ఉండే మారెస్సు ఆమె ఊహించినట్లే చలికాలంలోనే చనిపోతుంది. ఆ చుట్టుపక్కల నదులు లేవు.

వర్షం కురిస్తే చెరువులు నిండాలి. ముందు రెండు సంవత్సరాలు వంటలు లేకపోవడం. ఆ ఏడాది కాలం కలిసి వచ్చి వయలు బాగా పండడం కానం అంతా సౌలం పనుల్లో ఉన్న సమయంలో మధ్యాహ్నం వేళలో చనిపోతుంది. ఈ విషయాన్ని ఆమె కొడుకు ఎంకయ్యకి ఎలా వేరవేయాలో తెలియక చిన్న పిల్లలు ఇచ్చింది పడుతూ ఉండడంతో కథ ప్రారంభం అవుతుంది. ఎలాగైతేనే మారెమ్ము చనిపోయిన విషయం ఆమె కొడుకు కోడలికి పేట తానానికి తెలిసి వచ్చేసరికి రాత్రి అవుతుంది. ఆ రాత్రి సమయంలోనే శవాన్ని దహనం చేసి వాళ్ళు పొద్దున్నే కూలికి వెళ్లిపోవాలి అని నిర్ణయించుకుంటారు. ఎందుకంటే ఆ మర్నాడే పేట కానం కూలీకి వస్తామని కాపులకి మాట ఇచ్చి ఉన్నారు. ఆ మాట పోతుంది అన్న భయం వారికి అలాగే చెప్పిన సమయానికి వెళ్లకపోతే వేరే కూలీలు ఆ పనిని సొంతం చేసుకుంటారు. ఎంత మిగిల్చుకున్నా వారం రోజులే పని దొరుకుతుంది. ఆ పనులు పోయాలంటే వారికి కూలీలు దొరతను కాబట్టి

అందరూ మారెమ్మని ఆ రాత్రి సమయంలోనే దహనం చేయడానికి నిర్ణయించుకుయారు. మారెమ్మదహనం కోసం కర్రల అవసరమవడం ఆ చలిలో అర్ధరాత్రి వేళ నిద్రపోయిన వాళ్ళు లేవకపోవడం. లేచిన వాళ్లు రతుశాలైన సాకులు చెప్పడం. వాళ్లు అవసరాన్ని ఆ సారి పెద్దలు ఎవ్వరు తీర్చకపోగా వారు నానా విధాలుగా దూషించే సందర్భంలో కారా మాస్టారు 'ఆ శాతే చూపణ భూషణలకు అతీతులు అన్నమాటలు అనాటికి ఈనాటికి సమాజంలో ఉన్న అంటరాని తనాన్ని హృద్యంగా ఎత్తిచూపుతుంది. రోజులు తరాలు మారిన మారని మనిషి ఆలోచన సరళికి అద్దం పడుతుంది. కథలోని ప్రధాన పాత్రల్లో ఒకటి అయినా అప్పారావు కజ్జల్ని ఎక్కడ నుండి అయినా తీసుకువద్దాం అంటే దొంగతనం నర్ణయారు. పోన్ అందుబాటులో ఉన్నది తీసుకువచ్చి మరుసటి రోజు వారితో మాట్లాడుకుందాం అంటే చౌరతనం కూడదంటారు. బీసీ పూర్తి వేద్దాం అంటే ఆత్మ శాంతించదు అని అంటారు కర్రలు కొనడానికి ఖరీదుకు దొరుకుతాయా అంటే ఆ అవకాశం లేదు. ఇప్పుడు ఏమి చేయాలని అనుకుంటున్నారు ఆయూ నిష్కర్షగా ప్రశ్నిస్తూ వంద తరాలే అయ్యిందో వెయ్యి తరాలే అయ్యిందో ఇన్ని తరాల నుండి మనం ఇక్కడ వాళ్ళు అక్కడ ఉండడానికి కారణం నాకు ఈరోజు అర్థమైంది ' అంటాడు.

అప్పారావు పెద్దలను ప్రశ్నిస్తూ ఎప్పుడో పెద్దలు చెప్పారయ . అప్పటికి ఇప్పటికీ అదే పట్టుకు వేలాడుకారయ అంటే రేహిద్దున్నే వెళ్లి వాళ్ళు పాదాల మీద నడి వాళ్ళు కాళు ్లపట్టుకొని బ్రతిమలాడాలి. వాళ్లు ఛీ పో అంటే పడాలి. వాళ్ళ మనను కరిగేదాకా దయ తలచించారా వాళ్ళు ఇళ్ళ ముందు వాచ్చాయ్ని. నాయన్నాయన అంటూ బ్రతిమలాడాలి. అలా కాకుండా ఇంకోలా మనకు కర్మలు దొరకను. మంచికి చెడుకి రోజుల తరబడి వాళ్ళ కాళ్లు పట్టుకొని వేలాడితే గాని పనులు కావుమనకు. ఈ వేళ ఈ అవసరం ఇలా వచ్చింది ఇలా ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని అప్పుడు వాళ్ళు ఏమంటారు అని అయిన వాడి దగ్గర కాని వాడి దగ్గర అదుగుతూనే బ్రతకాలి. ఎన్ని సంవత్సరాల నుండి మనం అలాగే బ్రతుకుతున్నప్పటికీ వాళ్లు మనల్ని ఎప్పటికీ రెంచుతారు. ఇన్నాళ్ళ నుండి ఇంత కష్టితగా వారి అడుగులకు మడుగులు ఒత్తుతూ ప్రతికారు కదా మరి అది మీ అనేదకీ పనికొచ్చించా అంటూ వారిని నిల తీస్తాడు అప్పారావు సూటల్ని నిశితంగా పరిశీలించినట్లయితే భారత గ్రామీణ సామాజిక చిత్రం భూస్వామ్య వస్త్రానికి రంగులద్దినట్లుగా కనబడుతుంది. గంభీరమైన రాజకీయ అనన్యాసాలలో సమానత్వం నమన్యాయం. కులరాహిత్యం వంటి ఆదర్శ దృశ్యం నుండి ఉండగా సామాంత వాస్తవంలో మాత్రం కుల వ్యవస్థకు చెందిన నిర్బంధం అకావివేత మరింత కొనసాగింపుగా ఉంచడం అనే నిమ్వార వాస్తవం మనకు అప్పారావు వాదనలో సుస్పష్టంగా అవగతం అవుతుంది. నాయురాలు ఏముందో తెలుసా అయూ అన్నింటికీ మా మీదనే వచ్చి పడతారు. వివరికి మీరు వచ్చినప్పుడు కర్రలు మామే నపిలిసేయాలా అంది ఆయమ్మ మనిషి అంత మనిషి వై కాళ్లు చేతులు ఉన్న నేను గొడ్డును కాను చెట్లు పైన పిట్టతన్న అన్యాయమైన కృతుకు నాది అని చెప్పింది ఆ తల్లి. కుక్కలు నక్కలు ఒక్కసారే వస్తాయి. మనం పుట్టిన దగ్గర నుంచి బ్రతికినవారా వస్తూనే బ్రతుకుతున్నాం. ఒక్కసారి చావడం అంటే మనకు భయం కొంచెం కొంచెంగా వస్తూ వావడం మనకు వాగుంటుంది. అలాగే కానివుండి అయూ అక్కడ నుండి వెళ్లిపోతాడు.

ఎవడైతే న్యాయం ధర్మం అని పెద్దలు చెప్పిన మాటలు కట్టువాట్లను వదలకుండా నడుస్తాడో వాడు పేదవాడు గానే ఉండిపోతున్నాడు. పెద్దవాడు అవ్వడానికి 10 మందినైనా

ముంచడానికి వెనుక ఆడడం లేదో వాడు పెద్దవాడు అవుతున్నాడు పెత్తనం వరాఇస్తున్నాడంటూ సనకాను ధోరణిని విమర్శిస్తాడు. ఈ వచ్చిన శవాల కోసం నేను ఏడనను నా ఏడును అంతా బతికున్న శవాల గురించి అనడం అనాటి సమాణంలో నిన్ను కులస్తులుగా ముద్రించబడిన వారు వలనం లేని జీవచ్ఛవల్లాగా బ్రతికారాన్ని నిరవాస్తనం కళ్ళ ముందు రూపు కడుతుంది ఈ మాటల లోతులను అనగతంచేసుకుంటే సమాజంలో అభివృద్ధి క్రమం సమాజం మొత్తం అభివృద్ధిగా సాగలేదని. సాక్షిక అభివృద్ధిగా సాగిందని. అది వెలుగు వెంట సీడను తెప్పిందని ఒక వర్గను సంపదను అధికారాన్ని వివరీతంగా పెంచుతూనే మరొక వర్గాన్ని నిరాకృతులను. అభాగ్యులను చేసిందని కాలు చెల్లిన సంప్రదాయాలను దురాభిప్రాయాలను కుల దురహంతారాన్ని తొలగించవలసిన అభివృద్ధి క్రమం వాటిని బలోపేతం చేసిందని ముందుకు పోతున్నట్లుగా కనబడుతున్న సమాణం నిలువ నీటి కుయలాగా అగిపోవడం కొన్ని విషయాల్లో వెనక్కి పోవడం కూడా జరుగుతుందని వాస్తవం అర్థమవుతుంది. నాకు బాగా కాసేశం అయూ కుల పెద్ద నూరయ్య తాత చెప్పిన మాటలను అవలోకనం చేసుకుంటే ఒకప్పుడు కావు. కన్ను కోసుటి. గొల్ల, గిడి మాల మాదిగ ఇలా అన్ని కులాల వారికి ఎంతో కొంత సొలం ఉండేది. పెద్దవాడిని పెత్తనం అను ధన బలం మందబలం. అధికార బలం ఉన్నవాళ్ల అవకాశాలు చూపిస్తూ అవసరాన్ని ఉపయోగించుకుని అడ్డగించో బెదిరించే మొత్తం భూమిని వాళ్ళు పెత్తనం కిందకి లాక్కొని మిగిలిన వారికి భూమి మీద హక్కు లేకుండా చేశారన్నది చరిత్రపుటల్లో మరుగున పడిన నిజాలు. దున్నేవాడిచే భూమి అన్న ఆదర్శవాదం నుండి అధికారం బలం ఉన్నవాడిచే అవనిపై హక్కు అన్న ప్రస్తుత సమాజ పరిస్థితిని ఎన్నో సంవత్సరాల క్రితమే జ్ఞాపకాల గుర్తుల్లో నుండి చక్కగా చెప్పారు కారా మాస్టారు పెద్దలు చెప్పినట్లు ఎవరికి వారు ధర్మంగా నడుచుకుంటే ఏది ఎలాగ జరగాలో అలాగే జరుగుతుంది. మనుషుల్లో పాపం పెరిగిపోయిన నాడు దేవుడు మనిషి రూపంలో వస్తాడంట అంటూ వారిత కన్నయ్య పాత్ర ద్వారా చెప్పించారు. సమాజంలో ఇప్పటికీ భగవంతుడు లేదని వాదించే నాస్తితులు ఉన్నారు. అన్నింటికి దేవుడే దిక్కు అనే ఆస్తికులు ఉన్నారు.

అయితే దేవుడు ఉన్నాడా లేదా అనే ప్రశ్నకు కథలో రెండు పాత్రల మధ్య నాగ్యుద్ధం జరిగినప్పటికీ భగవంతుడు ఉన్నాడు భూమి మీద పానం పెరిగిపోయినప్పుడు భగవంతుడు తప్పకుండా వస్తాడు. అయితే ఆయన మనిషి రూపంలో వస్తాడు అన్న వాద నిరూపేకాకు ప్రాముఖ్యతనిస్తూ భగవంతుడు అనే వాడు ఎక్కడో ఉండడు కష్టాల్లో ఇతరులకు సాయం చేసే గుణమే వైనత్వం' సత్యాన్ని స్థాపించడం కోసం. ధర్మాన్ని నిలబెట్టడం కోసం నుంచి కారగడం కోసం ప్రయత్నించే మానవుడే దేవుడు అన్ని సత్యం కథలోని పాత్రల సంధానకాల ద్వారా మనకు అవగతం అవుతుంది. మరి ఈ కలికాలంలో దైనం అవతారం చాలి రాగలడా అన్న సందేహానికి మనిషి తన స్వార్థం కోసం స్వలాభం కోసం నరహితాన్ని వివరణను మరవి వేసి ఎన్నో పనులు సమావానికి కాదు కాని మనుగడకే ఆధారమైన ప్రకృతికి కూడా ఎంతో హానికరంగా పరిశామిస్తున్న తరుణంలో ప్రకృతి వైనరీత్యాల పేరుతో సంభవించే ఆనదలకు అల్లకల్లోలం కాక తప్పదని ఆ నివత్తులు కూడా మానవుని ఆగడాలకు దైనం విధించే శిక్షగా ఈ కథ తెలియపరుస్తుంది. కనిపించని దేవుడు ఉన్నాడో లేదో తెలియదు కానీ కనిపించి కాపాడేది ఈచ్చితంగా చైనం అని చెప్పవచ్చు. సకల జీవకోటికి ఆయువులూబ్' గాలి' వైనం.' అవసరాలను తీర్చే' నీరు 'దైనం అక్కరకు వచ్చే 'సెన్సు 'టైనం చరాచర జీవరాశుల

మనుగడకు మూలమైన భూమి 'దైనం.

ఎన్నో అద్భుతాలను రహస్యాలను తనలోయు ముడుచుకొని ఉన్న 'ఆకాశం' దైనం. అందుకే పెద్దలు నిగ్గులు నతల ప్రాణికోటి మనుగడకు మూలమైన ఈ ఐదింటిని పంచభూతాలు అని అన్నారు. మానవ తప్పిదాలకు ప్రకృతి విధించే శిక్షే ప్రళయం అన్న విషయాన్ని కారా మాస్టారు చాలా అద్భుతంగా చెప్పారు. నేడు సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు ఈ విషయాలను అద్దం పట్టి చూపిస్తున్నాయి. కథలోని పాత్రలు ఇలా పాపపుణ్యాల పరిశీలనలో ఉండగానే కుర్రాళు ళ కట్టెలమోనులను తీసుకువస్తారు. నీ భక్తులు ఎక్కడిని అన్న పెద్దల ప్రశ్నకు ఎక్కడవైతే ఎందుకు ఎత్తుకొచ్చినం పని కానివ్వండి అంటూ ఇవాబు ఇస్తాడు ఎరశయ్య పెద్ద కొడుకు. అయోమయంలో అలోచిస్తున్న పెద్దవాళ్లతో ఏమయ్యా నిండా తాగినట్లున్నారు తాగినప్పుడైనా ధైర్యం చాలదా అంటూ ప్రశ్నించడం కుల పెద్దల ఆలోచన సమాణంలో పెద్దవాళు ల్గా చలామణి అయ్యే వారితో వచ్చే సమస్యల తీవ్రత పట్ల వారికున్న స్పష్టతను ఎరుత పరుస్తుంది. ఆలోచిస్తున్నారు అన్న జవాబుకు ఆలోచన లేదు సాలోచన లేదు శవాన్ని అందులో వేసి కాలుస్తారో లేకపోతే వాళ్లనే అందులో వేసి కాల్చుకుంటారో అడగండి అంటూ యువత ప్రశ్నించడం తరతరాలుగా భరించిన అణిచివేతను ఎదురిస్తూ ఉచికి వస్తున్న ఆత్మాభిమానాన్ని మన కళ్ళ ముందు చూపిస్తుంది. వివరికి భగభగ మంటల్లో ఆ శబ్దం కాలిపోయినట్లే వాళ్ళు భయాలు అనుమానాలు. అత్మనూన్యత ధానం అన్ని కాలి బూడిన అవ్వడంతో ఈ ముగుస్తుంది.

**ముగింపు :** ఏ విషయంలో అయినా ఏ వ్యవస్థలో అయినా మార్పు అనివార్యం. ప్రవాహ సదృశ్యమైన సమాజాన్ని. కాలాన్ని ఎవరు అసలేరు. అలా ప్రయత్నిస్తే వారు దాని కింద నలిగిపోవడమే. రాజులు పోయాయి. రాజ్యాలు పోయాయి.చరిత్రలో మార్పు అనివార్యం అన్న విషయాన్ని కారా మాస్టరు ఈ కథలో అద్భుతంగా రక్త మాంసాల మనుషులతో వారి సంధానకాలతో విభిన్న సన్నివేశాలతో కళాత్మకంగా ఆవిష్కరించారు.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగులో కవితోద్యమాలు- తెలుగు అకాడమీ ప్రచురణ.
2) ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు ప్రయోగాలు- సినారె.
3) కారా మాస్టారు కథలు - యజ్ఞంతో పదిహేను.

❖ ❖ ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కారాగారి కథలు - కుటుంబ విలువలు

**- యస్. రజిత,** తెలుగు అధ్యాపకురాలు, పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండ, తెలంగాణ, సెల్ నెం. 7013319771

కుటుంబం సమాజానికి ఆధారం. ఈ కుటుంబ విలువలను పిల్లలు తమ తల్లితండ్రుల నుండి, ఇంట్లో ఉన్న పెద్దవారి నుండి నేర్చుకుంటారు. ప్రతి కుటుంబంలో విశ్వాసం, ప్రేమ, గౌరవం, మాతృత్వం యివి సహజంగా కుటుంబంలో ఉంటాయి. కుటుంబ విలువలు అంటే వివరణమైన అర్థం ఉంది. కుటుంబంలో వివాహం అనునది సరైన రూపంగా ఉంటూ విశ్వాసం మరియు ప్రేమను ఒకరిపై ఒకరు చూపించుకుంటూ వారి సంతానాన్ని పెంచుతారు. ఈవిధంగా కుటుంబం అనునది విస్తరిస్తుంది.

కారా మాష్టారుగా ప్రసిద్ధి పొందిన కాశీపట్నం రామారావు కథకుడు, విమర్శకుడు. కారా గారి రచనాశైలి సరళంగా ఉంటుంది. సామాన్య జ్ఞానం కలిగిన వారు కూడా ఆ కథలలో లీనమయ్యేలా భావ ప్రాధాన్యత ఉన్న రచనలు చేస్తారు. కారా గారి కథలలో కుటుంబం విలువలను చూపించడానికి నేను ఎంచుకున్న కథలు.

1) రాగమయి, 2) పెంపకపు మమకారం, 3) సంకల్పం, 4) అశిక్ష - అవిద్య

**రాగమయి:**

రాగమయి కథలో జానకి ఉమ మరదలు. జానకికి వివాహం అయిన నెలరోజులకే తల్లిగారింటికి వస్తుంది. జానకి పుట్టింటికి రావడంతో ఇంట్లో వాళ్లేకాక, చుట్టు ప్రక్కల వాళ్లు ఆశ్చర్యపోతారు. జానకి తన చిన్నక్కతో చనువు ఎక్కువ. ఆమె వచ్చి ప్రయత్నించిన విషయమును తెలుసుకోలేకపోయారు. ఉమ మరిది అయిన శేషగిరి, జానకికి వివాహం ఉమ బంధువుల అబ్బాయితో జరిగింది. ఆ తప్పుడ మదే అన్నట్లుగా ఏ ఇంట్లో ఆడదాని పెత్తనం ఉంటుందో ఆ ఇంట్లో సుఖ సంతోషాలు ఉండవు అని ఉమ వల్లనే జానకి వివాహం జరిగిందని, జానకి యిలా కావడానికి ఉమ తెచ్చిన సంబంధం చేసుకోవడం వలనే అని అతని ఆరోపణ చివరికి ఉమనే జానకి కాపురం చక్కదిద్దటం ఈ కథ.

ఈ కథలో కుటుంబ వ్యవస్థలో ఒకరిపై ఒకరికి ఉండవలసిన అభిమానం, ప్రేమ, తప్పును ఒకరిపై నెట్టి వేయడం యివ్వన్ని కన్పిస్తాయి. ఉమ అభిప్రాయం ప్రకారం తన మరిది శేషగిరి అలా పెడసరిగా మాట్లాడడానికి కారణం తల్లి చేసిన గారాబం అని, శేషగిరి చేసే పనులన్నీ మామగారికి తన అత్త తెలియనివ్వడం లేదని తెలిస్తే ఎప్పుడో అతనిని సరిదిద్దే వారని, అత్తపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తుంది. ఇలా చేసేటప్పుడు పెద్ద వారైన అత్తగారిని మాటలు అనడం తప్పు అని తన మనస్సు హెచ్చరిస్తున్న తన కోపాన్ని అణచుకోలేక పోయింది. ఉమ భర్త శేఖరం తల్లిని ఎదిరించినందుకు చెయ్యి ఎత్తడంతో తండ్రి కొడుకునే మందలిస్తాడు. ఇక్కడ పెద్దవాళ్ళను గౌరవించాలి. అని తెలిసిన తన అంతరంగం హెచ్చరిస్తున్నా తన కోపాన్ని ఆపుకోలేక పోయినందుకు ఉమ పశ్చాత్తాప పడుతుంది. ఉమ మామగారు కూడా తన చిన్న కొడుకుదే తప్పని అతనికి అహంకారం పెరిగింది అని కోడలునే సమర్థిస్తాడు. కోడలు పుట్టింటికి వెళుతున్నదని తెలిసి పంతులుగారు కోడలు వస్తే 'ఒక ఇల్లు నాలుగిళ్లు' అవుతాయని కాని ఉమ వచ్చిన తర్వాత పట్టిందల్లా బంగారమై ఇల్లు ఏకసూత్రంగా నడుస్తున్నది. అని అనడంతో ఆ యింట్లో ఒకరిపై ఒకరికి ఉన్న గౌరవాభిమానాలు మన కండ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.

ఉమ కూడా అత్తగారిని ఎదిరించి మాట్లాడినందుకు

బాధపడుతుంటే ఆమె వదిన ఓదారుస్తూ నీవు మందలించగలిగావంటే వారిని కూడా నీ బిడ్డలను చూసినట్లు చూసుకోవడం వల్లనే అది సాధ్యమయినది అని అంటుంది. ఉమ సుందరమ్మ గారితో జానకి తన ఆడపడుచు కాదని 'కూతురు' అని అనడం వారి మధ్య ఉన్న అభిమానాన్ని తెలియచేస్తుంది.

కుటుంబంలో ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకోవడం, ఒకరిపై ఒకరికి ఉన్న గౌరవాభిమానాలు, ప్రేమలాంటివి అన్నీ కన్పిస్తాయి.

**పెంపకపు మమకారం:**

సరస్వతికి తల్లితండ్రులు చనిపోవడంతో పార్వతమ్మ పెంచుతుంది. పార్వతమ్మకు సుదర్శనం, సుబ్బులు అనే ఇద్దరు పిల్లలు ఉంటారు. సరస్వతికి వివాహం అయిన తర్వాత, ఆమె వేరు కాపురం పెట్టడంతో పార్వతమ్మ పడే సంఘర్షణ, మనకు ఈ కథలో కన్పిస్తుంది. పార్వతమ్మ సరస్వతికి వివాహం చేసిన తరువాత మారిపోయిందని ఊరికే భర్త చుట్టు తిరుగుతుందని భావిస్తుంది.

సరస్వతి పన్నెండు రోజుల పసిగుడ్డులా తన చేతులోకి ఎలా వచ్చిందో గుర్తుచేసుకుంటూ మరిది తన దగ్గరికి వచ్చి మీరు కాదంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటాను అనడంతో తనకు జాలి వేసి సరస్వతిని పెంచానని, సరస్వతి కూడా ఆ అభిమానాన్ని నిలబెట్టుకుంది కాని ఎప్పుడు అయితే సరస్వతికి వివాహం అయ్యిందో అప్పటినుండి సరస్వతి మారిపోయిందని భావిస్తుంది. మధ్యతరగతి కుటుంబంలో ఉండే కోపతాపాలు, ప్రేమ, మమకారం, సంబంధ బాంధవ్యాలకు ప్రతీకగా ఉంటుంది ఈ కథ కుటుంబంలో వచ్చే మనస్పర్థలు నీటి మీద బుడగలాంటివి అని, మనుష్యులలో అంతర్గతంగా ఉండే ప్రేమ, అభిమానం వారిని ఒకటి చేస్తుందని ఈ కథ నిరూపిస్తుంది.

**సంకల్పం:**

ఈ కథలో రామభద్రయ్య గారికి కాశీకి వెళ్లాలని కోరిక. కాని ఆ కోరిక ఆయన జీవించినంత కాలం తీరలేదు. ఆయన చనిపోయిన తర్వాత అతని భార్య సుభద్రమ్మ, పిల్లలు కలిసి అస్తికలను కాశీలో కలపాలని అనుకోవడం కాశీకి వెళ్లిన తరువాత సుభద్రమ్మ పడే మానసిక వ్యధ ఈ కథ.

రామభద్రయ్య గారు చనిపోయిన తరువాత వారి సంతానం, రామభద్రయ్య గారికి కాశీకి వెళ్లాలని అనే కోరిక తీరలేదు, కాబట్టి కనీసం వారి అస్తికలు అయిన కాశీ గంగలో కలపాలి అని తల్లిని ఒప్పిస్తారు. కాశీలో అస్తికలు కలపడానికి ఒప్పందం మీద ఒప్పుకుంటుంది. కాశీకి వెళ్లిన తరువాత "అర్రులు చాచినంత కాలం అందని కాశీ యాత్ర'' వద్దు మొర్రో అన్న తను మెడకు చుట్టుకోవడం ఏమిటని ఆలోచనలో పడుతుంది.

తాను అత్తగారింటికి వచ్చినప్పుడు ఉన్న పరిస్థితులకు యిప్పుడు తన కోడళ్ళు వచ్చిన తర్వాత పరిస్థితులకు పోల్చుకుంటుంది. కాశీలో గంగలో మునగాలని అనుకుంటుంది గాని కోడలు అప్రమత్తత వలన ఆ నిర్ణయం విఫలమవుతుంది.

కుటుంబ వ్యవస్థలో అత్త ఉండగా కోడలు, తండ్రి ఉండగా కొడుకు ఇంటి యజమానుల్లా వ్యవహరించడం ఇంటిలోని పెద్ద వారికి నచ్చదని పిల్లలు బాధ్యత వహించడం లేదు అనుకుంటారు. కాని నిజంగా వారు పెత్తనం చేస్తే పెద్దవాళ్లు సహించరని యింటి పెత్తనం కావాలనుకుంటే వారికి అప్పగించడం మంచిది అని, కొడుకులకి సంపాదన, కోడలుకు ఇల్లు దిద్దడం నేర్పడమే 'గృహస్థాశ్రమం' అని ఆ తర్వాత వానప్రస్థానికి వెళ్లడమే మంచిది అనే విషయాన్ని కూడా ఈ కథ ద్వారా మనకు తెలియచేస్తారు.

తరాల మధ్య ఉండే అభిప్రాయాలు, ఉమ్మడి

కుటుంబంలో ఉన్న అవగాహనలు, అనాలోచిత నిర్ణయాలు, ఒకరి అభిప్రాయాలు ఒకరు ఏవిధంగా గౌరవిస్తారనే విషయాలను కూడా ఈ సంకల్పం కథలో మనకు కన్పిస్తాయి. కుటుంబాలు ఏర్పడిన తరువాత తరం మారి కొత్త తరం వచ్చినప్పుడల్లా పెద్దరికం కోసం నాయకత్వం కోసం యువతరం పాత తరాన్ని సవాలు చేస్తూనే ఉంటుందని, కుటుంబంలోని తండ్రి, కొడుకు లేదా అన్నా తమ్ముడు అయినా, చిరకాలంగా ఒకే ధ్యేయం కోసం భుజం కలిపిన ఆప్తమిత్రులైన, ఎవరు అయినా ఆ ముందు క్షణం వరకు ఎవ్వరి మధ్య ఎంతటి ప్రేమాభిమానాలు ఉన్నా ముఖాముఖి నిలిచినా ఇద్దరిలో ఎవరో ఒకరు ఓడవలసినదే అని అనాధిగా వస్తున్న ఈ తరాల ఘర్షణను అర్థం చేసుకోవడమే గాని దానిని నివారించే మార్గం లేదని, ఏతరమైనా అధికారానికి, అవి ఇచ్చే సౌకర్యాలకి అలవాటు పడ్డవారు తమంత తాము అధికారాన్ని వదులుకోరని, పాత తరంలో అడుగంటుతున్న ఉత్సాహం సామర్థ్యం చూసి కొత్తతరం అధికారం చేతులలోనికి తీసుకోవాలని చూస్తుందని దీనికోసమే కుటుంబంలో ఘర్షణ అన్నవి తప్పకుండా ఉంటుందని సుదర్శనం మాటల ద్వారా ఈ కథలో తెలియపరుస్తారు.

**అశిక్ష-అవిద్య:**

అశిక్ష-అవిద్య కథలో రామారావు చదువుకున్న వ్యక్తి, అతని భార్య శ్రీదేవి పట్నం నుండి వచ్చిన అమ్మాయి, రామారావు స్వార్థపరుడు అనే అభిప్రాయం తల్లితో సహా ఆ ఇంట్లో అందరికి ఉంటుంది. రామారావు తమ్ముడు సూర్యం తన అన్న మేకవన్నె పులిగా, చెడు స్వభావాలు కలవాడని భావించేవాడు. కష్టం అంతే తనపై ఉంచి ఫలితం అన్న అనుభవిస్తున్నాడని, 'కోతి పిల్లి, జీడి పిక్కల కథ'లో పిల్లిని కోతిలా తనను ఉపయోగించుకుంటున్నాడు అని అనిపించేది సూర్యంకు. చివరకు ఈ కథలో రామారావు భార్య శ్రీదేవి తన నగ పోయిందని ఆ దొంగతనం రామారావు చెల్లెలు విశాలాక్షి చేసిందని అనడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది.

ఉమ్మడి కుటుంబంలో ఉండే రాగద్వేషాలు, అభిప్రాయాలు మనకు ఈ కథలో కనిపిస్తాయి. అంతేగాక కుటుంబంలో ఒకరిపై ఒకరికి ప్రేమ కన్నా ఈర్ష్య, అసూయ వంటివి మనకు ఎక్కువ కనిపిస్తాయి. కుటుంబంలో ప్రతి ఒక్కరు ఒకరిపై ఒకరు నమ్మకం, ప్రేమ, అనురాగం పెంచుకోవాలని, ఈర్ష్య, అసూయ, ద్వేషము యివన్ని ఉన్న కుటుంబంలో అందరు కలిసి ఉండలేరని ఎప్పుడు ఒకరిని ఒకరు కించపరుచుకోవాలనే చూస్తారని దానివలన ఆ కుటుంబం నలుగురిలో పలుచనవుతుందని, చివరకు ప్రాణాలు తీసుకొనే పరిస్థితి కూడా వస్తుందని మనకు ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఈ కథల ద్వారా కుటుంబం అంటే ఒకరిని ఒకరు గౌరవించుకోవడం, పెద్ద వారి మాటలను గౌరవించాలని ఒకరిపై ఒకరు విశ్వాసం, ప్రేమను కలిగి ఉండాలి అనే విషయాలు మన కళ్లకు కట్టినట్లు ఆవిష్కృత మవుతాయి.

**ఆధార గ్రంథాలు:-**

కాళీపట్నం రామారావు రచనలు.

❖ ❖ ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253
భావవీణ
UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కాళీపట్నం రామారావు కథలు - సాంఘింకాంశాలు

- **లలిత మేరి దాసరి**, పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వ కళా పరిషత్
విశాఖపట్నం - 530003. సెల్ నెం. 9849895025, ఇ మెయిల్ : lalithamary86@gmail.com

**ఉపోద్ఘాతం :-**

సామాజిక పరిస్థితి జీవితంలో ఎదురైన కొన్ని సంఘటనల నుండి రచయిత కథా వస్తువును ఎన్నుకొని దాన్ని చిత్రీకరించడంలోను అతని మేధాపరమైన విజ్ఞాన ప్రభావం తప్పకుండా ఉంటుంది. కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన కాళీపట్నం రామారావు గారు ఉపాధ్యాయుని వృత్తిని అంకిత భావంతో చేస్తూ కూడా కథకుడుగా,విమర్శకుడుగా సాహిత్యం రాయడం కత్తి మీద సాము వంటి కఠినమైన విద్యఅయినా అంతటి విశాల ధృక్పధంతో కథలు, వ్యాసాలు, నవలలు, నవలికలను కథకధనం అమర్చి సాహిత్యం రాయడంలో కాళీపట్నంరామారావు గారు చాలా ప్రసిద్ధులు. తక్కువ రచనలు రాసిన గాని ఎందరో ప్రముఖ రచయితలతో పాటు గొప్ప పేరు ప్రఖ్యాతలు పొందిన వారు కారా గారు కూడా ఒకరు. ఈయన సంఘ విద్రోహులు చేసే దోపిడి స్వరూప స్వభావాలను దేశం కోసం పోరాడే విప్లవ సంఘ నాయకులను ఉత్తేజ పరిచే విధంగా యజ్ఞం కథల సంపుటిని రాశారు. అలాగే''అలిశెట్టి ప్రభాకర్'' గారు విప్లవ భావాలను వెలిబుచ్చారు.

1. "చిందించిన నెత్తుటితో
   చీకటి కోణాలన్నీ వెలిగించగల యోధుల్ని
   గుండె గుండెకీ మధ్య
   విప్లవ వారధుల్ని నిర్మించలేవా''

ఏకథలను అయినా చదవవలసిన రీతిగాచదవడం వాటిలోని కథాంశాన్ని గ్రహించడం చాలా కష్టం.

సామాన్య జ్ఞానం గల ప్రజలకు కూడా అర్ధమయ్యేలా సరళమైన శైలీలో ఆలోచింపచేసేలా, భావప్రాధాన్యం కలిగి ఉంటాయి రామారావు గారి కథలు.

మానవుని జీవనశైలీ సమాజంలో ఉన్నత స్థాయికి కేంద్రమన్నా దృక్పధాన్ని మానవతావాదం ప్రచారంలోకి తెచ్చి మధ్యతరగతి కుంటుంబ సామాజిక జీవనవిధానాన్ని వాటి అడుగునా ఉన్నా సమస్యలను,సంతోషాలను, మానవ సంబంధాలను దేశ కాల పరిస్థితులను పరిశీలించి అక్షరాలను కూర్చి రచనల రూపంలో మనముందు ఉంచారు. కారా గారు ఎంత పెద్ద విషయాన్ని చెప్పదలచినా కూడా క్లుప్తంగా కుదించి కథానిక రూపంలో మలచి గొప్పగా రాయడం ఆయన విశేషం. ఉత్తమ సాహిత్య వేదిక పై ప్రపంచ స్థాయిలో ఈయన కథలు ఉండడం విశేషనీయం.

1వ పాదసూచిక - తెలుగు సాహిత్య చరిత్ర
ద్వానా శాస్త్రి గారు
సంఖ్య - 535

"వెళ్ళిపోయింది''అనే కథలో తెలుగు ప్రజల గుండెల్లో అనురాగ, అప్యాయతలను, సరదాలు సంతోషాలను నింపే సంక్రాంతి గురించి చెప్పారు. వివాహం అయినా తరువాత కూతురు కన్నవారు దగ్గర అచ్చట,ముచ్చట తీర్చుకొనే మధురమైన జ్ఞాపకాల పండుగ. రాత్రివేళ విందును పూర్తి చేసుకొని ఇంటిల్లాపాది వెన్నల వెలుగులో మనసులోని ఊసులు పంచుకొనే మంచి పండుగ, అలాగే తెల్లవారు జామున దేవాలయంలో సన్నాయి మేలుకొలుపు పాటల అనుభూతి, ఇంటి దగ్గర దాసి చేసే గిన్నెల శబ్దాల సందడి, తలుపు సందులో నుంచి చల్లగాలి ముసుగులోకి దూరి అల్లరి చేస్తూంటే అందరు లేవండి తలంటు స్నానం చేయాలి అనే మేలుకొలుపు మాటలుతో అమ్మ చేత తలంటు స్నానం చేయించుకొని కొత్తబట్టలు ఎత్తి పట్టుకొని వాకిట అలంకరించిన రంగవల్లులు చుట్టూ పిల్లలు అల్లరి చేస్తూ అడుగుల సందడి, కుర్రవాళ్ళకొంటె చూపులు కన్నెపిల్లల

మూసి,మూసి నవ్వులు, లాగా బాపిరాజు గారు ప్రేయసి కోసం అన్వేషణ చేసి వెన్నెల బాల శశికళామూర్తిని కనిపెట్టారు ఊహల్లో బాపిరాజు గారు ఆమెతో ఆడారు, పాడారు, మాటలాడేవారు. అటువంటి కవితని ఒకటి ఊహ ప్రేయసి కోసం చెప్పారు.

2. **"కన్నులు కానని రూపం పిలిచీ**
   **కౌగిలి కందని భావం తలచీ**
   **తెరవైపున నా చేతులు మోడ్చీ**
   **ఆరమూతలు నాతరగనికలలై"**

అలాగే చిట్టి పాపాయిలను కుర్చీలలో కూర్చోబెట్టి భోగిపళ్ళు పోసి వారి నవ్వులను అందరూ ఆశ్వాదించడం అల్లుళ్ళుకు మర్యాదలతో పెట్టిపోతలు, పండుగ కానుకలు, బావబావమరిది ఆటపట్టింపుల సందళ్ళు, కొత్తగా పెళ్ళియినా కన్నెపిల్ల భర్తను దొంగతనంగా చూస్తూ సిగ్గుతో పరవశం పొందడం, కాపురానికి రాని భార్య తన ప్రతి కదలికలో తన ప్రేమను తెలియచేయడం. ఇలాంటి మధురానుభూతి అందరూ హృదయాలలో నింపుకొని పండుగ తరువాత వెళు తుంటే చిన్న తమ్ముడు దిగులుగా అప్పుడే వెళ్ళిపోయింది పెద్దపండుగ అని భాదపడడం. సామాజికంగా, కుటుంబ పరంగా ఆనందాన్ని అందరికి పంచే సంక్రాంతి పండుగ గురించి కారా గారు అద్భుతంగా వర్ణించారు.

భాయిజాన్ అనే కథలో పల్లె వాతావరణంలో ఉండే అందచందాలు, పచ్చని పొలాల పైరుగాలి, ఖమ్మని పెరుగు, నెయ్యితో కూడిన ఆహారం, స్వచ్ఛమైన మనసులతో కూడిన మనుషులు ఉంటారు అని అలాగే పట్టణంలో ఉండే ఇరుకు గదులు, స్వార్ధపూరితమైన మనుషుల స్వభావాలు, శ్రమను దోపిడి చేసే యాజమాన్యం, రుచిలేని భోజనం గురించి ఇద్దరు స్నేహితుల మధ్య లేఖ ద్వారా జరిగిన సంభాషణ జరిగింది. పట్టణంలో తన స్నేహితుడు బొగ్గుగనుల ఫ్యాక్టరీలో కూలీ. నీ దగ్గరకు వచ్చి రెండు రోజులు హాయిగా గడపాలని ఉంది అని లేఖ రాశాడు. దానికి ప్రత్యుత్తరముగా బావా నేను ఇక్కడ చాలా దుర్భర పరిస్థితిలో ఉన్నాను యజమాన్య వర్గాలు మా శ్రమను దోచుకుంటారు తమ అనుమతి లేనిదే నేను అక్కడ నుండి బయటకు రాలేను. సేచ్ఛగా నీతో ఆనందంగా ఉ ండే అవకాశం కూడా లేదు. అందు వలననువ్వు ఇక్కడకు రావద్దు. అని మరల లేఖ లో పట్టణం లో ఉన్నా పరిస్థితిని తన మిత్రుడికి తెలియజేశాడు.

ఈ కథ ద్వారా దోపిడి యజమాన్యం గురించి కవి గారు మనకు తెలియ జేశారు.

**2 వ పాద సూచిక - తెలుగు సాహిత్య చరిత్ర ద్వానా శాస్త్రి గారు - పుటసంఖ్య - 486**

అదృశ్యము అనే కథకు స్త్రీ పాత్రల స్వభావాలు వన్నె తెచ్చి పెట్టాయి. మనసు మాటున ఉన్నా భావాలు, ఉద్వేగాలు అదృశ్యము గా ఉంచబడినవి.

**"నా ప్రియ సఖి, అనురూపగు**
**ణ ప్రచురణ ! ప్రసన్నశీల! నవనీత శిరీ**
**ష ప్రణయ మృదుల హృదయ"**

ఇటువంటి స్త్రీ వర్ణనలతో ఆధునిక కవిత్వంలో చైతన్యం కలిగించిన కావ్యం తృణకంకణం. ఇలా మృదు స్వభావ, చైతన్య భావాలు గల స్త్రీలు ఈ కథలో కూడా ఇద్దరు ఉన్నారు లలిత, అనూరాధ. లలితకు 15 సంవత్సరాలు 5వ తరగతి చదివి పచ్చని పల్లెలో ఆడుతూ పాడుతూ కాలం గడుపుతూ ఉంటుంది. ఆమె తండ్రి గ్రామ కరణం ఆమెకు పెళ్ళి వయస్సు వచ్చింది. అని లలితకు సరిపోయే ఇంకా అంతకు మించి మంచి ఉద్యోగము చేస్తూన్న అబ్బాయిని పెళ్ళిసంబంధానికి తీసుకు వస్తే ఆ సంబంధాన్ని తిరస్కరిస్తుంది. ఇక్కడ ఆమె అయిష్టం, పెంకితనం, ముర?త్వం అందరికి కనిపిస్తాయి కానీ తన మనోభావాలు అదృశ్యముగా ఉంచబడ్డాయి.

అనూరాధ 25 సంవత్సరాల వివాహిత గల స్త్రీ ఆమె బి.ఏ చదివింది. ఆమెకు మంచి మనసు,సహనం ఎక్కువే. చిన్న పిల్లలతో కూడా చలాకీ గా ఆడగలదు, పాడగలదు

అందరితో కలివిడిగా మాట్లాడుతుంది. ఆమె భర్త ఆఫీస్ కి వెళ్ళాకా ఏమి తోచక ఇంట్లో కిటికి దగ్గర కూర్చొని అలా బయటకు రోజూ చూస్తూ ఉంటుంది. అలా చూస్తూడడంతో అనూరాధ కన్నా వయస్సులో చిన్న వాడు అయినా బ్రాహ్మణ యువకుడు ఆమె అందానికి ఆకర్షితుడు అవుతాడు. అది తెలుసుకున్నా అనూరాధ కిటీకి దగ్గర ఉండడం మానేసింది. తరువాత ఆమె కనిపించక పోవడంతో ఆ యువకుడు మాసిన బట్టలతో, గడ్డం బాగా పెంచుకొని తిరుగుతూ ఉంటే ఆవిధంగా చూడలేకపోయి అతనిని బాధ న్న ఇష్టం లేక దూరంగా ఉండి అతని మనసుకు సాన్నిహిత్యంగా ఉండేది. అలా చేయడం సమాజం దృష్టిలో తప్పు అయినా ఆమె వలన ఒకరు బాధ పడకూడదు అని అనుకున్నా ఆదర్శ మహిళ అనూరాధ. ఇలా భిన్న ఆలోచనలు గల స్త్రీ పాత్రల ద్వారా ఈకథను మనకు అందించారు రామారావు గారు.

**ముగింపు :-**

కాళీపట్నం రామారావు తీసుకున్న కథాంశాన్ని బట్టి తాను ఎన్నుకున్నా పాత్రల స్వభావానికి అనుగుణమైన రూపురేఖలను, నామాకరణాలు, సన్నివేశరూపకల్పన చేసి ఆ పాత్రలకు జీవాన్ని కల్పించి ఆరంభిస్తారు. అవి చేసే పనులు, పరస్పరం ఘర్షించే తీరును, దానికి అనుగుణంగా సంభాషణల్ని వాటి వెనుక ఉన్న అంతరంగాల్ని సహజంగా పరీక్షించి వాటి ముగింపు పర్యవేక్షిస్తారు. అయన తీసుకున్న కథా వస్తువు ను అక్షర సంకేతాలుగా మలచి రచనలుగా రూపాన్ని కల్పిస్తారు. 1966లో ఈయన వ్రాసిన 'యజ్ఞం' కథ తెలుగు పాఠకుల విశేష మన్ననలు పొందింది. దీనికి 1995 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు'' లభించింది.

**3 వ పాద సూచిక- తెలుగు సాహిత్య చరిత్ర ద్వానా శాస్త్రి గారు - పుట సంఖ్య - 352**

గొప్ప కథలు రాయడానికి, గొప్ప కథల్ని చదవడం తప్పకుండా దోహదం చేస్తుంది. గొప్ప రచయితల్ని, రచనల్ని చదవడం చేత మనమనసులో మనకే తెలియకుండా గొప్ప ఆలోచన ప్రమాణాలు ఏర్పడతాయి. ఏం రాయాలి అని జీవితాన్ని చూసి నేర్చుకుంటాం అలాగే ఏలా రాయాలి అని గొప్ప రచయితల్ని చదివి నేర్చుకుంటాం. అలాంటి గొప్ప ఆలోచన దృక్పధ భావాలు కలిగిన వ్యక్తి కాళీపట్నం రామారావు. ఈయన భారతీయ కవి మరియు రచయిత గా పేరు పొందారు. ప్రసిద్ధ నవలా రచయిత అయినా యండమూరి వీరేంద్రనాథ్ రామారావు గారి రచనల నుండి ప్రేరణ పొంది ఆయనను గురువుగా భావించేవారు. ఈయన రాసిన రచనలు తక్కువైన సుప్రసిద్ధాలు.

**ఆధార గ్రంధాలు:-**

1. కాళీపట్నం రామారావు రచనలు
   - వివిన మూర్తి రచన 'శాయి'
2. తెలుగు సాహిత్య చరిత్ర
   - డాక్టర్ ద్వానా శాస్త్రి గారు
3. కథా శిల్పం
   - వల్లంపాటి వెంకట సుబ్బయ్య.

# కా.రా. సాహిత్యంలో "యజ్ఞం" - పరిశీలన

- **కె. రంగనాయకులు,** ఎం.ఏ., బి.ఎడ్., ఎపి.సెట్, యుజిసి.నెట్,
పాఠశాల సహాయకులు (తెలుగు), జి॥ ప॥ ఉ॥ పాఠశాల, చిప్పగిరి (గ్రా & మం.), కర్నూలు జిల్లా.
చరవాణి : 9052964954, E mail: kranganayakulu36@gmail.com

**కాళీపట్నం రామారావు గారు :**

ఈయన ది. 9-11-1924న శ్రీకాకుళం జిల్లాలోని 'పొందూరు' గ్రామంలో జన్మించారు. ఈయనగారి తల్లిదండ్రులు భ్రమరాంబ, పేర్రాజులు.

కాళీపట్నం రామారావు గారు కా.రా. గా సుప్రసిద్ధులు. సాహిత్యంలో కా.రా. కథలు అంటే పాఠకులు చాలా ఆసక్తి చూపుతారు. ఈయన సాహిత్య సేవ అజరామరం అనడంలో అతిశయోక్తి లేదు. 'కథానిలయం' పేరుతో సాహిత్య సంస్థ స్థాపించి కథల పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయులు అయినా ప్రవృత్తి రచనా వ్యాసంగం. ఈయన రచనలలో పేరుతెచ్చిన కథ మాత్రం 'యజ్ఞం'. ఈ కథకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటిస్తే తిరస్కరించారు.

యజ్ఞం కథ ఈనాటి పల్లె వాతావరణానికి ఓ ఆదర్శం అని చెప్పవచ్చును. కథను చదువుతున్నంత సేపు గ్రామ ఐక్యత కోసం పాటుపడే వారు ఈ రోజులలో కరువయ్యారని తెలిసి బాధేస్తుంది. కుటుంబంలో అభిప్రాయ భేదాలు సహజం. కానీ కుటుంబానికి ఎదురయ్యే సమస్యలను ఇంట్లో అందరం కూర్చొని ఎలాగైతే చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామో! అదేవిధంగా మన గ్రామ సమస్యలకు కూడా గ్రామ ప్రజలందరూ కూర్చొని పరిష్కార మార్గాలను అన్వేషించడం కూడా అంతే ముఖ్యం అని నా అభిప్రాయం.

ఈ యజ్ఞంలో కా.రా. మాష్టారు గారు విజయవంత మయ్యారు. ఎందుకంటే కథలో సమతూకంగా పాత్రలను పోషింపచేశారు. గ్రామాలలో తగువు లుండడం సహజం. వాటిని పరిష్కరించే వారు సహృదయులు అయి ఉంటే సమస్యను సమస్యగా కాకుండా చేయగలరు. అచ్చం ఇలాంటి సంఘటనను కా.రా. గారు తన యజ్ఞం కథలో గ్రామ సమస్యల పరిష్కారానికి యజ్ఞం చేశారని చెప్పవచ్చును.

కథలో మూడు సంవత్సరాల నుంచి వస్తున్న సమస్య మూడు రోజులనుంచి బాగా నలుగుతున్న ఈ తగువును ఎలాగైనా పరిష్కరించాలని నిర్ణయానికి వచ్చారు. సుందరపాలెం అనే గ్రామంలో అప్పల్రాయుడు అనే వ్యక్తి గ్రామ పంచాయితీలో హరిజన మెంబరు. ఈయన మాలలకు కులపెద్దే కాక వారందరిలో వయసు మళ్ళినవాడు. ఊరి జనాలకు కూడా ఆయనంటే సదాభిప్రాయం కలదు. ఈయన మాటకు నిలబడే వాడనీ, మర్యాదగా బ్రతకాలనుకునేవాడనీ అంటుంటారు. తగువులేవయినా వస్తే అందులో పేద, రోదా అంటే సానుభూతి గలవాడని కొందరికి అభిమానం.

అప్పల్రాయుడుది రైతు కుటుంబం. తాను అవసరాల నిమిత్తం గోపన్న దగ్గర రెండు వేలు (రూ.2000) అప్పు చేసి మూడు సంవత్సరాలవుతుంది. కానీ బాకీ తీర్చలేక పోయాడు అప్పల్రాయుడు. దీనిని పంచాయితీ పెట్టాడు గోపన్న. గోపన్న బాగా బతికిన కుటుంబం. ఇప్పుడేమో చితికిపోయాడు. పేదతనంతో ఈ పంచాయితీ రచ్చకెక్కింది.

ఆ ఊరి పంచాయితీ ప్రెసిడెంటు శ్రీరాములు నాయుడు గారు. మధ్యవర్తిత్వంతో పంచాయితీ జరుగుతూ వస్తోంది. ఈయనకు మరో ఇద్దరు మధ్యస్థులుగా పెద్దలు చేరారు. మొత్తం ముగ్గురు పెద్దమనుషుల ద్వారా ఈ తగువును తీర్చడానికి సిద్ధమయ్యారు. రెండువేల రూపాయలకు వడ్డీ కలిపితే రెండువేల ఐదొందలయ్యింది. శ్రీరాములు నాయుడు వడ్డీలు అన్యాయం అన్నారు. మిగతావారు ఈ ప్రాంతంలో వడ్డీ ఇదేనన్నారు. శ్రీరాములుప్రభుత్వంవారు ప్రకటించిన వడ్డీనే కట్టాలన్నారు. లెక్క కూడా తేల్చి చెప్పాడు ప్రెసిడెంట్ శ్రీరాములు నాయుడు. మిగతావారు మారు మాట్లాడలేకపోయారు.

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253

UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

అప్పలాయుడు అప్పు కట్టాలంటే తన రెండెకరాల ముప్పై సెంట్ల మడిని ఆపాటి ధరకు అమ్మినా తీరదు. అప్పలాయుడు గోపన్నకు ఇంకో మూడేళ్లు సమయం ఇవ్వాలని దీనంగా అడగడం, తన కొడుకులు, మనుమలు కష్టపడైనా నీ ఋణం అలాగే ఉండనీయక తీరుస్తారని బ్రతిమాలడం జరుగుతుంది. మూడేళ్ళనాటి అప్పుడు తీర్చలేదు, ఇంకో మూడేళ్ళలో ఎలా తీరుస్తాడని పెద్దలు అంటే, శ్రీరాములునాయుడు గడువిచ్చి తీరాలన్నాడు. మూడేళ్ళ గడువు రేపటితో తీరుతుంది. మూడు నెలల నుంచి పంచాయితీ పెద్దల వెంట తిరిగిన గోపన్నకు 'ఇదిగో' 'అదిగో' అంటూ తిప్పేశారు. ఇప్పుడేమో నోటికి కాలదోషం పడుతున్నా కూడా శ్రీరాములు నాయుడు గారు ఊర్లో లేరన్నారు.

శ్రీరాములు నాయుడిని ఎవరు విమర్శించలేరు. ఊరు కట్టడికి కట్టుబడి ఉండాల్సిందే. కానీ గోపన్న బాకీ వసూలు ఊరి పంచాయితీలో తేలలేదు. గోపన్నకు అంగబలం లేదు. అర్ధబలం ఉండేది గానీ పోయింది. ఎలాగో ధర్మబలం ఉంది కదా అంటే అదికూడా సందేహంలో పడిపోయింది. ఊరి కట్టడి తప్పి కోర్టుకైనా పోదామంటే ఊర్లో వారంతా ముఖం మీద ఉమ్మేస్తారు. ఎలా? నా అప్పు వసూలు చేసుకునేది? మీరే చెప్పండంటూ పెద్దలు లక్ష్యంనాయుడికి మొరపెడితే ఆరోజు పంచాయితీకి కదలక తప్పలేదు లక్షుంనాయుడికి. ఆరోజు శ్రీరాములునాయుడు తప్ప అంతా పెద్దలు వచ్చారు. పెద్దలు అప్పలాయుడిని పలికించినా పలుకడు. అతని కొడుకులు కూడా మాట్లాడరు. అందులో నాల్గవ కొడుకు సీతారాముడు మాట్లాడాడు. వీరి వ్యవహారం ఎంతకూ తేల కానీ కాలం కర్మం కలిసి వచ్చినపుడు ఎవ్వరు చెయ్యగలిగేది ఏమీ ఉండదు.

హరిశ్చంద్రుడంతటి వాడు ఋణం తీర్చడానికి కాటికాపరయ్యాడు కదా! అంటారు పెద్దలు. అప్పలాయుడి కొడుకు సీతారాముడు అప్పు వడ్డీలతో పెరిగిపోతుంది. మా పొలం ఆ గోపన్న బాబుకే ఇప్పించండి ఆ అప్పు తీరేదాకా మేం అక్కడ కూలికి ఉంటాము అన్నాడు సీతారాముడు. ఈ పంచాయితీలో శ్రీరాములునాయుడు మాత్రం రాలేదు. అందుకు శ్రీరాములు నాయుడు పెద్దల సభలో అందరికి క్షమాపణలు చెప్పారు. వ్యక్తిగత పనుల వలన పంచాయితీకి రాలేకపోయానన్నారు. అక్కడున్న వారందరూ "ఛా ఛా" అదేం మాటండీ మిమ్మల్ని ఎవరూ తప్పుపట్టలేదు. ఎవరో బుద్ధి తక్కువవాళ్లు ఏదైనా అన్నారేమోనని వాటిని పట్టించుకోకండి అన్నారు. జనాల హృదయాలలో తొందరపాటుతనానికి పశ్చాత్తాపం చెందారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించిన శ్రీరాములు నాయుడికి తన మేనమామలు పట్నం చదువులు బాగా చదివించి ఓ ఎం.పీ.నో కనీసం ఎమ్మెల్యేనైనా చేయాలని వారి ఉద్దేశ్యం. కానీ నాకు పదవులు వద్దు నా గ్రామానికి నేనేమైనా చేయగలిగితే నాకదే పదివేలని శ్రీరాములు నాయుడన్నారు.

శ్రీరాములు నాయుడిలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఊరందరిని ఒకే తాటిపైకితేగల నాయకుడు. పంచాయితీ మండపం గురించి శ్రీరాములునాయుడు ఒక ప్రతిజ్ఞ ఊరందరికి ఒక జ్ఞాపకం చేశారు. మనం ఇకనుండి ఈ మండపమే మన న్యాయ మండపం. ఈ మండపం ఉన్నంత కాలం న్యాయం కోసం మనం పరాయి ఊళ్ళకి పోరాదు. ఎప్పుడైతే ఈ మండలంలో న్యాయం దొరక్కపోదో ఆరోజు దీన్ని కట్టిన మన చేతులతోనే కూల్చివేద్దాం అన్నారు. ఈ సుందరపాలెం గ్రామంలో ఈ ప్రతిజ్ఞ బాగా గుర్తుంచుకోండి. సాటి గ్రామాలలో బోర విరుచుకొని తిరుతోందంటే మన గ్రామ ఐక్యతే కారణం అన్నారు.

ఆ తర్వాత గోపన్న నిలబడి సభకు తను చెప్పేది ఏమైనా ఉందంటే చెపుతున్నాడు. జనం తమలో తాము ఈ పంచాయితీలో అప్పలాముడికే శ్రీరాములునాయుడు వత్తాసు పలుకుతాడని చెవులు కొరుక్కుంటున్నారు. గోపన్నకు న్యాయం దొరకదన్నారు.

ఒకప్పుడు ఆ ఊళ్ళో దెయ్యాలు తిరిగేవని. పట్టపగలు హత్యలు జరిగినా హంతకులు పట్టుబడేవారు కారని కట్టుగా కలిసి ఉంటే జనమని ఉద్యోగులు, కొత్తవారు ఆ ఊరికి ఒంటరి ప్రయాణం చేసేవారు కారు. ఈ రోజు ఆ ఊరు

అభివృద్ధిలో దూసుకుపోవడం, ప్రభుత్వోద్యోగుల ముద్దుబిడ్డయిందంటే అందుకు ఎంత 'యజ్ఞం' జరిగిందో జరుగుతోందో చూడరు.

పదిహేనేళ్ళ క్రితం శ్రీరాములునాయుడు ఆ ఊరు వచ్చినప్పుడు ఊరు నిస్తేజంగా నిర్వీర్యంగా ఉండేదని అంటారు. అలాంటి పరిస్థితిలో నాయుడు వచ్చినప్పటికి అతనికి పాతికేళ్ళయినా లేవు. ఆరోజులలో ఊళ్ళో అనైక్యత చాలా ఉండేది. ఆపదలలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముదుకొచ్చేవారు కారని, ఎవడి బతుకు వాడిదన్నది ఆనాటి ప్రజల సిద్ధాంతం. దానికి విరుద్ధంగా నాయుడు అందరిని ఏకతాటిపై నడిపించారు. ఒక సంఘటనను ఉదహరించు కోవాలి. సూర్యం గారి దగ్గర నుంచి రూ.20,000/- రూపాయలు విరాళంగా హైస్కూలు కోసం ఇప్పించారు. సూరంగా డబ్బున్న నిక్కచ్చి మనిషి. ఎవరికి దమ్మిడి కూడా కదపని మనిషి. అలాంటి వాడిని ఎలాంటి మాటలతో మార్చి విరాళం ఇప్పించాడోనని ఊరంతా అంటుంటారు.

గోపన్నగారి అప్పు తీర్పుని శ్రీరాములు నాయుడు గారు ఇలా అన్నారు. అప్పల్రాయుడూ, నువ్వు ఈనాటి నుండి గోపన్నగారికి ఒక్క నయాపైసా కూడా అప్పు లేవు. నువ్వు హాయిగా ఇంటికెళ్ళొచ్చును.

గోపన్నగారూ మీరు ఎల్లుండి కనపడండి. మీ నోటు చెల్లు బెడతానన్నారు. శ్రీరాములు నాయుడు గారు ఈ తీర్పు జనానికి అర్థం కాలేకపోయింది. అక్కడున్న ముసలయ్య బాబుని అప్పల్రాయుడు నా రెండెకరాల ముప్పై సెంట్లకు భూమికి ఎంత ఇస్తావో ఇవ్వు నీదయ అని దోసిలి పట్టి అడిగాడు. అంతలోనే కరణంగారికేసి చూస్తూ పత్రం రాయమన్నాడు అప్పల్రాయుడు. కరణం పత్రం రాయడం ఆరంభించారు. జనాలు కూడా ఒకరికొకరు గోణుగుడు ఆరంభించారు. కొందరైతే అప్పుకి గడువు ఇప్పించమంటే ఇప్పించగలిగాడు కానీ అసలప్పే లేదనడం ఎంత ధర్మరాజైనా అన్నాడో పెద్దమనిషి.

భూమిని అమ్మడం అసలే ఇష్టంలేని సీతారాముడు పత్రం మీద వేలిముద్ర వేయడకుండా ఇంటి దారికేసి పరుగులు పెట్టాడు. ఇక్కడ తల్లిదండ్రులు, అన్నదమ్ములు అంతా పత్రం మీద వేలిముద్రలు వేసేశారు.

అంతకు ముందు రాత్రి తండ్రికి ఎంత చెప్పినా వినలేదని తన కన్నకొడుకుని బానిస చేయలేనని కొడుకు తల వేరుచేసి గోనెసంచిలో వేసుకొని వచ్చాను. నాకు నా కొడుకుమీద ఆశక్కువ. నా కొడుకు బానిస కాకూడదు. కంబారి కాడు అని సీతారాముడు అన్నాడు.

ఇలా మాటలు వింటూ అప్పల్రాయుడు మనవడి దగ్గర చతికిల బడిపోయిన అప్పల్రాయుడు చూపులను తిప్పుకోవడానికి ముందే సీతారాముడు జనం కేసి చూసి ఇలా అన్నాడు. బాబుల్లారా! జడవకండి. జనం మీద చెయ్యెత్తగల వాడినే అయితే ఈ సీతారాముడు కన్నబిడ్డను సంపుకోడు అని అంటూంటే జనమంతా చెదిరిపోయారు. కర్రలను బట్టి నిల్చున్న వారితో బాబు మీరూ తొందరపడకండి. నేను ఉరికే సిద్ధం అయ్యాను. చావు లెక్కకాదు. నన్ను కొడితే మీరు ఉరిలో పడతారు. మీ బిడ్డ పాపల ఉసురు నాకెందుకు తగలాల? అన్నాడు.

ఆ తర్వాత మండపం కేసి చూసి శ్రీరాములునాయుడిని చూసి బాబుగారు నువ్వంటే నాకు మాసెడ్డకసి, ఎప్పు? ఇంతకు పూరవం. ఇప్పుడో - లేదు. ఎందో తెలుసా? లోకమంతా నువ్వు చెప్పినట్లే వినాలంటావు. వింటారని నీ మనసులో ఓ ఉద్దేశం. ఈ రాజ్యాన్నీ నిన్నూ ఏలే దొరలెవరో తెలుసా అంటూ కరణాన్నీ, మునసబుని చూపించాడు సీతారాముడు. ఇలా వెర్రినవ్వుతో బాబు మునసబు బాబు! చాలాకాలానికి నీకు పనికల్గింది. శ్రీరాములు బాబు మండపం తెరిచిన రోజు ఓ మాట అన్నావట కదా! ఇప్పుడు చెప్పు అచ్చు రిపోర్టు కొస్తావా! నాకూనీని మాఫీ చేస్తావా? అంటూ న్యాయ మండపం కేసి చూస్తూ చతికిల బడిపోయాడు సీతారాముడు.

ఇలాంటి కథలను లోకానికి అందించిన కా.రా. మాస్టారు గారు చిరస్థాయిగా నిలిచారు.

**ఆధార గ్రంథాలు :**

1. యజ్ఞం కథ - కాళీపట్నం రామారావు గారు

# కారా కథాసాహిత్యం - సమాలోచనం

**- డా. పెద్దింటి ముకుందరావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆర్.జె.యు.కె.టి - శ్రీకాకుళం.

**పరిచయం:**

తెలుగు కథల బాండగారానికి పాతిక సంవత్సరాలు కంచెకి వెళ్లే కథలను కళ్లెం వేసి లాక్కొచ్చిన 'మాష్టారు దీనిని ఒక యజ్ఞం లాగా చేపట్టి సిక్కోలు ప్రాంతానికి ఎనలేని పేరుతెచ్చిన సాహితీ ప్రియుడు.

నిరంతరం సాహితీ సృజన తపస్సు సమాజంలో తానొకరుగా ఉంటూ సమూహంతో కూడిన సామాజిక చైతన్యానికి తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించగల సాహితీమూర్తులు ఎంతోమంది ఉన్నారు.

ఇజాల చట్రం నుంచి నిజాలను నిర్భయంగా సాహిత్యాన్ని చొప్పించాలి. కథలు రచించిన గొప్ప కథా శిల్పి కారా మాష్టారు. ఆయన వ్యక్తిత్వం దేశ దేశాలలో శ్రీకాకుళం కీర్తికేతనం ఎగుర వేసిన హంసా పురస్కార గ్రహీత.

కారా గొప్ప కథలు రాసేవాళ్లను లెక్కించడానికి ఒక చేతి వేళ్లే ఎక్కువ. వారిలో కాళీపట్నం రామారావు ఒకరు. మంచి కథలు రాసేవాళ్లు చాలామంది ఉన్నారు. గొప్ప కథకు గొప్ప లక్ష్యం ఉండాలి. మంచి కథలు కాకతాళీయంగా రావచ్చు. గొప్ప కథలు గొప్ప కథకులు రాస్తే తప్ప రావు. అటువంటి గొప్ప కథలు రాసే ఘనత ఒక రాచకొండ విశ్వనాథశాస్త్రికి, ఒక బీనాదేవికి, ఒక కాళీపట్నం రామారావుకీ దక్కింది. తెలుగు కథకి గూడు కట్టించి తెలుగు సాహితీ స్రవంతిలో కథకు పట్టాభిషేకం చేయించి కథా ప్రాధాన్యతను నలుదిశలా వ్యాపింప చేసిన సాహితీ యోధుడు మూల్యం లేకుండా జ్ఞానార్జన అందించే ఆరాధ్యుడు. అందుచేతనే అనేక దశాబ్దాలపాటు కథకులు మధ్యతరగతి జీవితాన్ని మధించినా, దాని అడుగున దాగి ఉన్న సత్యాలను పూర్తిగా పైకి తేలేకపోయారు. ఈలోగా కాలస్వభావం మారి మధ్యతరగతి జీవిత సత్యాలు చరిత్ర గతికి పెడ అయిపోవటం కాబోలు సినిమా కథలను పోలిన సాహిత్యం బయలుదేరింది. ఈ పిప్పిరమెంటు సాహిత్యం చాటున కొత్తరకం సాహిత్యం, అట్టడుగు ప్రజల జీవితాలకు సంబంధించినది పుట్టుకొచ్చింది. గొప్ప పుస్తకాలు మనకి హాయి కలిగించవు. మనల్ని మనకి విప్పి చెప్పేసి అల్లరి పెడతాయి.

అలజడి పెడతాయి. మనని నిలదీసి ప్రశ్నిస్తాయి. నాలబెట్టి నడిపిస్తాయి. ఏదైనా చివరికి అశాంతే ఫలితం. అలాంటి విప్లవకరమైన అశాంతికి కారకులైన, ప్రమాదకరమైన రచయితలలో చాలా కొద్దిమందిలో ఒకరు కారా మాష్టారు. అయితే ఈ అలజడి కలిగించే పని రామారావు గారు పరమ నిదానంగా చేస్తారు. ఆయన కథలు బహునెమ్మదిగా నడుస్తాయి. ఏ మాటా దూకుడుగా వుండదు. ఏ వాక్యమూ కోపంగా నడవదు. మొత్తం కథంతా నిండా నీళ్లున్న లోతైన చెరువులా, నిశ్చలంగా వుంటుంది. కథ చదివిన పాఠకుడు మాత్రం విపరీతంగా అలజడి పడతాడు.

ప్రతి సమాజంలోనూ ప్రతి దశలోనూ ఒక భావజాలానికి లోబడిన మాటలు గౌరవార్థంలో వాడబడుతుంటాయి. ఆ మాటకి మామూలు మనుషులు లోబడి ప్రవర్తిస్తారు. రామారావుగారి కథల్లో మాటలకి అర్థాలు ఆ భావజాలపు వ్యవస్థని చూపించే పనిలో జాగ్రత్తగా వాడినవి.

**యజ్ఞం కథా పరిశీలన:** సాహిత్యం యొక్క ప్రత్యేకత, విశిష్టత దాని సృజనాత్మకత. అందులోనూ కథా రచనలో ఆవిష్కరింపబడిన జీవితం మన వాస్తవిక జీవితానుభవంగా మనల్ని భ్రమింపజేయగల ఇంద్రజాలం కలిగివుంటుంది. కారా మాష్టారు గారి యజ్ఞం కథ అనే స్పృహ లేకుండా దాని ఆమూలాగ్రం మనచే చదివింపజేస్తుంది. ఆ కథలోని

పాత్రలు, వారున్న పరిస్థితులలో వారికెదురైన సంఘటనలకు వారి స్పందనలు పరిపూర్ణంగా మన జీవితానుభాలవుతావి. కథావేదిక సుందరపాలెం అనే గ్రామం. ఇది ఎక్కడుందో మనకు చెప్పే ప్రయత్నంలో కొంత అతి కొంత డొంక తిరుగుడు, గందరగోళం సృష్టించినా కథ ప్రారంభం అయిన దగ్గరనుండి కథలో మనం పూర్తిగా లీనమవుతాము. మనం పాఠకులం అన్న విషయం మర్చిపోతాము. కథా విషయం అప్పల్రాముడి కుటుంబం గోపన్నకి బాకీగా ఉన్న అప్పుకు సంబంధించి, దేవాలయం దగ్గరి ధర్మమండపం పంచాయితీ వేదికగా జరుగుతున్న సమావేశంలో పడే తర్జన భర్జనలు. మండపానికి ఆ చివర నుండి ఈ చివరి వరకు హాజరై కూర్చున్న జనంలో కలిసిపోతాము. పాత్ర చాలా చక్కగా, సహజంగా సజీవంగా ఉంటుంది. ఇంతకు ముందు చెప్పినట్లు వారిని పాత్రలుగా భావించం. నిజమైన వ్యక్తులుగా వారికి చేరువవుతాము. వారి మనోగతాన్ని అవగతం చేసుకుంటాం.

కథలోని పాత్రలన్నీ ఎవరికి వారే వారి ప్రత్యేకమైన వ్యక్తిత్వాలతో మనం గుర్తుండిపోయేలా మిగిలిపోతారు. చావు కథ పరిశీలన:'' బ్రతుకు పరమార్థాన్ని గూర్చి నాకు చాలా భ్రమలుండేవి. నేను చదివింది ఒకటి విన్నది ఇంకొకటి, చూసింది వేరొకటి నాకు అర్థమయ్యేది మరొకటిగా సమన్వయం లేని సంత నాకళ్ళముందుండేది. నేనే స్వయముగా ఏ దారితెన్ను కనిపించక కొట్టు మిట్టాడుతుంటే నేనింకెవరికైనా ఏం చెబుతాను.'' అని 1967లో కాళీపట్నం రామారావు గారు నేనెందుకు రాస్తున్నాను అనే శీర్షికలో చెప్పారు. 1967 కి పూర్వం ఆయన చాలా కథలు రాశారు. ఆ కథలేవి ఆయనకు సంతృప్తినివ్వలేదని పై మాటల వలన అర్థమవుతుంది.

చావుకథ ఇతివృత్తం కూలిజనమైన హరిజనుల జీవితం. ముసలి స్త్రీ నారమ్మ మరణం కలథలో ప్రధాన విషయం. దాని చుట్టూ విస్తరించిన వారి జీవితం అంధ. ఈ కథా రచనలో రామారావు గారు ఉపయోగించిన శైలి సంపూర్ణంగా శ్రీకాకుళం మాండలికం. కథలో చలి రాత్రి చావు ఈ మూడు ముఖ్యమైన ప్రతీకలు. కథకు వాస్తవికత ప్రాణమైతే దానికి కళాత్మక రూపాన్నిచ్చేటప్పుడు రచయిత కొంత కాల్పానికతను ఆధారం చేసుకోకతప్పదు. ఈ కాల్పనికతే కథా వస్తువును శిల్పదృష్ట్యా పరిపుష్టం చేస్తోంది. కథా ప్రారంభంలో ఆకతాయిలు సాగించే హింసలా చలీ, గాలీ, నిరంతరాయంగా, నిరాక్షేపణంగా తమ కత్తి కోత సాగిస్తున్నాయి.

కథలో ప్రధాన పమస్య ఆర్థికమైనది. ఈ సమస్యే అజ్ఞానానికి, అవిద్యకు, అనాలోచనకు మూలం. ఈ సమస్య పరిష్కారం కాకుండా తక్కిన సమస్యలు పరిష్కారం కావు. ఇది కథలో అంతర్గతంగా ఉన్న అవగాహన మనిషి మరణించినపుడు కూడా పనిమాని ఇంటికి వస్తే కూలిరాదు. కూలిరాకపోతే పూటగడవదు. ముసలవ్వ మరణించింది. కథలో సూరయ్య, బారిక కన్నయ్య మొదలైన వాళ్లంతా ఒక తరుపు ఆలోచనకు సంబంధించినవాళ్లు, అప్పారావు లాంటి యువతరపు ఆలోచన వారికి భిన్నమైనది. వారి తరువాతి తరంలో వస్తున్న భావజాలపు మార్పును పెద్దవాళ్లు గమనించలేదు. గమనించినా దానిని అంగీకరించడానికి సిద్ధపడే వాళ్లు లేరు. అప్పారావు వాదనలో ఉన్న సత్యాన్ని సూరయ్య లాంటి కుల పెద్దలు గ్రహించినా తరతరాల బానిసత్వపు భావాలు వాళ్ళను ముందడుగు వేయ్యనియ్యవు. ఈ కథలో చలి పీడనకు, రాత్రి వ్యవస్థకు, శవం జడత్వానికి గుర్తులు, అప్పారావు. రాబోతున్న తరానికి ప్రతినిధి. విప్లవ చైతన్యంతో ఈ వ్యవస్థను దగ్ధంచేస్తే తప్ప పీడన తొలగదని కథాంతం సూచిస్తుంది. ఇట్లాంటి జీవితం పట్ల సానుభూతిని, పీడన పట్ల అసహ్యతను, ఈ అసమ సమాజంపట్ల ఏహ్యతను

కలిగించి చదువరుని కర్తవ్యం వైపు ఆలోచించేటట్లు చెయ్యడమే ఈ కథ గొప్ప శిల్పం.

సెయింట్ ఆంథోనీ స్కూలులో టీచరుగా పనిచేస్తున్న రామారావు వైవాహిక జీవిత సుఖదు:ఖాల మధ్య పాతికేళ్ల యువకునిగా, ఆలోచన పరునిగా, అంతర్ముఖునిగా సామాజికోద్రేకాలకు లోనవుతూ, పట్టణ వాతావరణపు ఉరవడికి, పల్లె నేపథ్యపు నిదానానికీ మధ్య పరాయీకరణ చెందుతూ బెరుకు బెరుకుగా స్నేహాల కోసం వెదుక్కుంటూ సత్యాన్వేషణ, సహజత్వంతో జీవితార్థాన్ని, జీవిత లక్ష్యాలనూ తలచుకుంటూ చాలా రచనలు చేశారు. కొన్నింటినే ప్రచురించారు.

1949-55ల మధ్య ఆయన రచనా వ్యాసంగం నిరంతర పఠన చింతనలూ ఆయనలో ఒకానొక 'ఎరుకో'కు దారితీసినట్లు కనిపిస్తుంది. సామాజిక సమస్యలు, అంతర్గత ఆర్భాటాలు: శరీరం మీద పీడన మనసు మీద పడుతుంది. మనసుపడే ఒత్తిడి శరీరానికి హాని కలిగిస్తుంది. వ్యవస్థగతి వ్యవస్థది మాత్రమే కాదు. ఆ గతిలో సమాజంలోని ప్రతి పౌరుడు భాగం. ఆ గతి మతి తప్పితే ఆ పౌరుడు బాధితుడౌతాడు. ఆ పౌరుడే ఇంటికొస్తే వ్యక్తిగా మారి తండ్రిగా, భర్తగా, కుమారుడిగా వొత్తిడి ఎదుర్కొంటాడు. ఈ రెండింటినీ కారా మాష్టారు కథగా చేసి తెలుగు పాఠకులకు చూపారు. గుప్పిట విప్పేసినట్టుగా రాయటం ఆయన పద్ధతి కాదు. సూచించినట్లుగా పొరల చాటున దాచినట్లుగా ఆయన పరమసత్యాన్ని నిగుఢపరచి దానిని తానే కనుగొన్న సంతృప్తిని పాఠకునికి ఇస్తారు. పౌరహితం కోరుతున్నట్టు కనిపించే ఈ సామాజిక వ్యవస్థ నిజానికి మేడిపండు. ఇది పైకి మంచిగా కనిపిస్తూ లోపల పీడితుల రక్తాన్ని తాగుతూ ఉంగుందనీ ఆయన రాసిన యజ్ఞం కథ నాటి సామాజిక, ఆర్థిక మూలాల కఠినత్వాన్ని చూపింది. ఈ కథ ముగింపులో నిస్సహాయుని ఆగ్రహ ప్రగటనగా బాధితుడు తన ఇంటి పిల్లాడి తల నరకడాన్ని రచయిత చూపిస్తాడు.

నేటికీ అదే జరుగుతుంది. బలవంతుడైన పీడకునితో పోరాటానికి దిగితే మనకు ఆపద ఎదురవుతుంది. అప్పుడు మనవాళ్ళే వచ్చి మన చెంప మీద ఒక దెబ్బ కొట్టి ఆ పోరాటం నుంచి విరమింపజేస్తారు.

**ఆ భాషా ఆ సొగసు:** కారా కేవలం ప్రగతిశీల కత రాసి ఉంటే ఇంత ఖ్యాతి వచ్చేది కాదు. ఆయన తాను పుట్టి పెరిగిన శ్రీకాకుళం మీద తన కథలను నిలబెట్టి ఆ స్థానికతే విశ్వసనీయత అనే భావనతో కథలు చెప్పారు.

శ్రీకాకుళం భాషను ఆయన సొగసుగా సంభాషణల్లో దించారు. ముఖ్యంగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి లానే ఆయన కూడా స్త్రీల పాత్రలకు ఎంతో సజీవమైన సంభాషణలను సమకూర్చారు. నో రూమ్, ఆర్తి, చావు, జీవధార, భయం..... ఈ కథలన్నీ ఇందుకు ఉదాహరణ. జీవధార కథలో పైకి నీటి సమస్య వస్తువుగా కనబడుతుంది. మురికివాడ వాసులకు తాగునీళ్లు ఉండవు. దాపులో ఒక శ్రీమంతుల ఇంటిలో కావలిసినన్ని నీళ్లు. మురికివాడ ఆదవాళ్లు రోజు శ్రీమంతుల గేటు దగ్గరకు వచ్చి నీళ్లు అడుగుతారు. ఆ శ్రీమంతులు చీదరించుకుంటారు. చీదరించుకుంటుంటే ఆ ఆడవాళ్లు కొన్నాళ్ళు పడతారు, మరికొన్నాళ్ళు సహిస్తారు. దప్పికతో ప్రాణాలు పోతుంటే ఏం చేస్తారు. తిరగబడతారు. అంతమంది తిరగబడితే ఆ శ్రీమంతులు నీళ్లేం ఖర్మ ఏమైనా ఇచ్చి తోక ముడవరు? బాధితులందరూ కలిసి తిరగబడాలి. పీడితులందరూ కలిసి తిరగబడాలి. మైనర్టీ సమూహాలన్నీ కలిసి తిరగబడాలి....... అని రచయిత సూచన ఏదీ ఊరికే రాదు. ''సాధించుకోవాలి''. ఈ వ్యవస్త నుంచి సాధించుకోవటం సాధ్యం కాదు ఎప్పటికి.

కారా మాష్టారు 'విరసం' ఏర్పడినప్పటి నుంచి దాదాపు 15 ఏళ్ళు అందులో క్రియాశీల సభ్యులుగా ఉన్నారు. రావిశాస్త్రి, వరవరరావు, కె.వి. రమణారెడ్డి వంటి ఉద్దండులతో ఆయన కలిసి పనిచేసారు. తెలుగు నాట విప్లవకథ విస్తృతం కావటంలో అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి వంటి రచయితలు సిద్ధమవ్వటం మరో వైపు మధ్యతరగతి కథను ముందుకు తీసుకెళ్లటంలో కారా మాష్టారు స్ఫూర్తిగా నిలిచారు.

కారా మాష్టారును నిబద్ధ రచయితగా చెబుతారు. నిబద్ధతకు ఓ ఉదా. తన చేతిలో ఉన్న కథను, అక్షరాన్ని దేనికి నిబద్ధత చేయాలో ఎంతవరకు చేయాలో ఆయనను చూసి నేర్చుకోవాలంటారు. ఏ మానవుడి జీవితము పుట్టినప్పటి నుంచీ సుఖసంతోషాలలో ఓలలాడదు, ఏ కొందరికో తప్ప. వడ్డించిన విస్తరి అంతకంటే కాదు. ఏదో లోపము, ఏదో అసంతృప్తి, ఎదగటానికి ముందుకు పోవటానికి ఏదో అవరోధము లేక ఉన్నట్లు అనుభూతి, మనసులో వేదన, తీరని ఆరాటము, వీటితో వేగి పోతోంది. ఈ తీరని వేదన కారా కథలలో రసవంతమైన కమ్మటి కథలుగా సాహిత్య చరిత్రపుటలలోకి ఎక్కటం తెలుస్తుంది.

సమాజంలో సాహిత్యాకి ఉన్న స్తానం అపూర్వమైనది. అతి పవిత్రమైనది. ఎంతో శక్తివంతమైనది. సమాజపరంగా రచయిత కాపాడించబడిన బాధ్యతలు గురుతరమైనవి. ఊహాతీతమైనవి. రచయిత తల్చుకుంటే, సాధించదల్చుకుంటే అతని మేధకు గానీ, కలం వేగానికి అడ్డు ఆపు ఉండదు. అవధులనేవి ఉండవు. ఎంతో శక్తివంతమైన కలం సమాజపులోతుల్లోకి చొచ్చుకుపోయి, గూడుగట్టిన కల్మషాన్ని కడిగివెయ్యగలదు.

దేశాభివృద్ధి అంటే సంపద అభివృద్ధి. దానికి మూలవిరాట్లు శ్రామికులు. ఆ శ్రామికులు శ్రమశక్తి దోపిడి కావడంతోపాటు వారిలో శ్రమపట్ల గౌరవం లుప్తమై-లుచ్చాలను వారి జీవితోద్ధారకులూ, ఆటగాళ్లను వారి దేవతలుగా ఆరాధించే విధంగా దిగజారడం నన్ను చాలా బాధిస్తుంది. ఇంతకన్నా గ్రామాలను విముక్తం చేసి నగరాలను ముట్టడించడం విప్లవమార్గమని చెప్పిన 'మావో' సూత్రీకరణను అపార్థం చేసుకుంటున్న ప్రజాపోరాట నాయకులను చూస్తే గుండె చెదురుతుంది అని కారా మాష్టారు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆధార గ్రంథాలు**

1. కాళీపట్నం రామారావు రచనలు - మనసు ఫౌండేషన్
2. వెండి వెలుగులు - రజతోత్సవ సంచిక - యువభారతి
3. ఆధునిక తెలుగు సాహిత్యంలో క్రియలు ధోరణులు - తెలుగు అకాడమి

# కారా సాహిత్యం - కథాంశం

**- శ్రీమతి సుభాషిణి ప్రత్తిపాటి,** తెలుగు ఉపాధ్యాయిని
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాజలి, బాపట్ల జిల్లా. చరవాణి: 8099305303

కారా మాస్టారి సాహిత్యం అంతా సామాన్య ప్రజల కష్టాలను పరిశీలించి, సమాజంలోని దోపిడీని చూసి వ్రాసినవే. చక్కని భావప్రాధాన్యత కలిగి సామాన్య ప్రజలు సైతం చదివి అర్థం చేసుకుని ఆ కథలో లీనమయేవే. అలాంటి వారి కథల్లో ఒకటి రెండు కథాంశాలను వివరించే ప్రయత్నం చేస్తున్నాను. 1953 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రచురితం అయిన పలాయితుడు కథ ఇప్పుడు చదివినా మనసును తడిపే తీరుతుంది.

ఉత్తమ పురుష కథనంలో సాగే ఈ కథాంశం ఆ కాలానికి మాత్రమే చెందినది కాదు, ఇప్పటికీ ఆ కథలో రాజశేఖరం వంటి పలాయితులు కనిపిస్తుంటారు.

ఈ కథాంశం మధ్యతరగతి కుటుంబంలో ఓ వ్యక్తి పరిస్థితులకు రాజీపడలేక, తన ఆర్థిక స్థితి కి అందుకు తగిన కారణాలను వెతుక్కుంటూ, తననుండి తాను తప్పుకోలేక అయినవారికి దూరంగా పారిపోవడం.

మొదటినుంచీ రాజశేఖరం గుంభనైన మనిషిగా నిష్కల్మషమైన వాడిగా రచయిత చూపుతారు. మానవనైజాన్ని ఈ కథలో అంతర్భాగంగా చెప్పిన తీరు ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. కథానాయకునికి, రాజశేఖరానికి అయిన తొలి పరిచయం చిన్న గొడవతో మొదలు... అక్కడంటారు మాస్టారు'' నా వళ్ళు తెగ మండిపోయింది. అయితే అది ఓడిపోతూ.ఓటమితో గెలుపును పొందగల అవతల వ్యక్తి ఔన్నత్యాన్ని గ్రహించటం వలన కాదు, అతని పోకడను ఓడిపోతూ గెలిచిన ధోరణి ప్రదర్శించుకునే ఒక విచిత్ర పద్ధతిగా అపార్థం చేసుకున్న అహంకారం వల్ల'' అని.

ఎంతటి వాస్తవాన్ని చిత్రీకరించారు ఈ మాటలో. ఎన్నో గొడవలకు ఈ భావనే కదా కారణం. అంగీకరించలేని అహం అడ్డుగోడగా నిలుస్తుంది మనిషికి మనిషికి మధ్య. తాను ఓడటం కాదు అవతలి వాడు గెలవడం చాలా మందికి ఇబ్బందిగా అనిపించి కళవళపెడతారు, పడతారు కూడా. నిత్య జీవితంలో ఇలాంటి సంఘటనలు కొల్లలు, ఆ కథను సంభాషణలను మలచిన తీరు అనన్యం.

మనువుకు మనసెంత ముఖ్యమో, మనసుతో బతికే రాజశేఖరం ద్వారా చెప్పిస్తారు, ఆర్థిక లేమి వలన ఆదరించిన మేనమామ పెంచి, అల్లుడ్ని చేసుకోవడం వెనుక తన నిస్సహాయ స్థితిని రాజశేఖరం చెబుతాడు. తన స్వభావానికి విరుద్ధమైన స్త్రీ తో జీవించవలసిరావడం ఎంతటి విషాదమో, దానికి ఎవరు కారణమనే ప్రశ్నను లేవనెత్తుతారు.

పెరుగుతున్న ధరలతో పాటు పెరగని జీతం, తగ్గించుకోలేని ఖర్చులు, పొదుపుతోనూ సాగని సంసారాలు, ఆదాయం పెంచుకునే దారి దొరకక, ఉన్న నగా నట్రా అమ్ముకోవడం, కోరికలు, అసూయ లేకుండటం, అన్నీ మంచి మాటలు వినడానికి బావుంటుంది, కానీ ఆచరణలోనే పెను విషాదం. ఇవన్నీ ఎవరో చెప్పగా విన్న వే. అన్నీ అనుకరణలు/ అనుసరణలే.నీతి, న్యాయం, ధర్మం వీటికి ప్రాతిపదికలేం లేవని ఎవరికి తగినట్లు వాటికి నిర్వచనం ఇస్తారంటారు రాజశేకరం పాత్ర ద్వారా కారా మాస్టారు. ఎన్ని ధర్మాలు తెలిసినా ధర్మాధర్మ విచక్షణ తెలిసినా ధర్మమూర్తులుగా ఉన్నా. ఎందుకో ' అధర్మపక్షం వహిస్తారంటారు. మహాభారత లోనూ ఇదే స్థితి కదా! మనిషి వదిలించుకోలేని సంకెళ్లు, మనిషిని అధర్మం వైపు ఎలా నిలబెడుతాయో !?? అంటారు ప్రపంచంలో ఉన్నవి రెండే శక్తులని బలం, బలహీనం. బలహీనమైనదాన్ని బలవత్తరమైనవి అన్యాయం చేస్తున్నాయని, అన్య జీవరాసుల్లో అతి తక్కువగా కనిపించే ఈ లక్షణం మానవులలో అతి ఎక్కువనే లోక పరిశీలనా దృష్టి ని రచయిత ఇక్కడ వెల్లడి చేస్తారు. నిజమే కదా! ఈ అసమతౌల్యాన్ని, అన్యాయాన్ని సరి చేయాలనే కదా అనేక మతాలు, సిద్ధాంతాలు, రాద్ధాంతాలు, పోరాటాలు, ఉద్యోషలు..

అయినా ఏం, రాజశేఖరం తన దుఃఖ హేతువును కనుగొన్నట్లు సంపద సృష్టికి కండలు కరిగించే వారు, మేధతో సృజన శక్తులను వెలిబెట్టేవారు వీరంతా సమాజ సంపదను పెంచుతూ కోర్కెలనణచుకు జీవిస్తున్నారు. ఇక్కడే శ్రీశ్రీ ప్రతిజ్ఞ గేయం, కవిరాజు వారి కృషీవలుడు గుర్తొస్తారు. సామాజిక అభ్యుదయ దృక్పథంతో వ్రాసిన ఈ కథ మనల్ని చాలా ఆలోచింప చేస్తుంది. సమాజ సంపదలో తానెందుకు భాగస్వామి కాలేడో ఎవ్వరూ ఆలోచించకనే తరతరాల వారసత్వంగా చెప్పే తృప్తి అనే మాటలకు తలొగ్గి జీవితాన్ని గడిపేస్తుంటారని చెప్పగలిగిన రాజశేఖరాన్ని పరిస్థితులు ఎలా ఏతీరానికి చేర్చాయో నంటూ కథ ముగిస్తారు మాస్టారు. ఇప్పటికీ ఎప్పటికీ ఆలోచించాల్సిన విషయం ఈ పలాయితుడు కథాంశం.

నేను ఎంచుకున్న మరో కథ వథ. 1965 విశాఖ రచయితల సంఘం ద్వైమాస పత్రిక లో ప్రచురితమైన కథ. కథాంశం రామాయణం లో వాలి వథ. కథనం వినూత్నం, విలక్షణ ఉపమానాలతో అనుభూతుల ప్రకటన, పాత్రల చిత్రణతో సాగింది ఈ కథ. అత్యద్భుతమైన అనుభూతి కలిగించిన చాలా కథల్లో ఒకటి.

ఎత్తుగడలో మహారణ్యాన్ని వర్ణిస్తారు మాస్టారు. అది మహారణ్యంలా కాక జనారణ్యం అనిపించింది నాకు. కొన్ని చెట్లు కెంపులు పూస్తే, మరికొన్ని పచ్చని పూలు, మరికొన్ని నిర్గంధ తెల్లని పూలు అన్నపుడు కొందరు మంచి మనుషులు, అందంగా ఉండీ మానవతాపరిమళం లేని మనుషులు, కుంటి గుంపులుగా సంచరించే జంతువులు, వేకుంటిభు: కూడాసిగ్గు పడడట, అదను చూసుకుని ఎదిరిని చావబాదుతాడు, ఇన్ని లక్షణాలున్న వాలి ఏ మహాద్రోహం చేయని సుగ్రీవుని తో యుద్ధం చేస్తుంటాడు. ఆటవిక సంబంధమైన సజాతి వైరంగా, మృగ సంబంధిత అహంకృతిగా వారి వైరాన్ని వర్ణించారు రచయిత.

బలవంతునికి బలహీనులతో స్పర్థ ఏమీ ఉండదు. కావాలని తన అహాన్ని సంతృప్తి పరచుకోవడానికి తనదే పైచేయి అనిపించుకోవడానికే వారిని హింసించడం, గొడవ పడడం అని ఈ కథ ద్వారా మనకు జీవితంలో అతి ముఖ్యమైన సందేశాన్ని అందించారు. వాలి లాంటి వానరులు ఎదురై కవ్వించినపుడు, తప్పుకోవడం మనకు తెలియాలి. నాడు సుగ్రీవుని కి రాముని అండ ఉంది, ఈరోజు మనలోనే రాముని నిలుపుకోవాలి.

ఆ రామునికి లోకం ఏమంటుదోనన్న సంశయం లేదు, మూర్తీభవించిన వాలి క్రౌర్యం కనబడగా బాణాన్ని విడిచాడు. వాలి రాముని నిలదీశాడు సీత కోసం ఈ అధర్మం చేశావెందుకని? ఆ మాటతో రాముడు సంచలనానికి లోనై వాలికిచ్చిన సమాధానం "నా బలహీనతను గ్రహించావు వాలి. నీ ప్రాణభయం చేతనే అజేయవరం పొందావు. నీవు అపరాధివి కాదు దుష్టునివి. అందుకు నీ మాటలే నిదర్శనం" అనడంతో వాలి పశ్చాత్తాపంతో "రామా! నిన్ను గ్రహించలేక పోయాను. నీ చేత చంపబడడం వలన నేను లోకానికి దగ్గరయ్యాను. "అంటూ కన్ను మూస్తాడు.

వాలి వథ వరన కాక అతని ఈ పశ్చాత్తాప ప్రకటన వలననే లోకానికి తెలిశాడని అర్థ శతాబ్దం క్రితం వ్రాసిన ఈ కథలో మాస్టారు విస్పష్టంగా ప్రకటించారు. రాముని నిందించాలనుకున్న చాలా చాలా మంది ఎన్ని చిలవలు అల్లినా జేగీయమానంగా వెలుగుతూ మానవ సమాజ అభివృద్ధికి ఉపయుక్తమైన, వ్యక్తిత్వ వికాసం లో తోడ్పడే ఇలాంటి కథ నభూతో నభవిష్యతి.

❖ ❖ ❖

# కాళీపట్నం రామారావు కథలు - సామాజిక స్పృహ

- **డా॥ కడియాల వెంకటరమణ,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-517502, చరవాణి : 9949517591

కారా మాస్టారు గా ప్రసిద్ధి పొందిన కాళీపట్నం రామారావు 1924 నవంబరు 9న శ్రీకారుళం జిల్లా మురపాకలో జన్మించాడు. కాళీపట్నం రామారావు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో సరళమైన భాషలో రచనలు చేస్తూ సామాన్య పాఠకులను సైతం ఆకట్టుకున్నారు. ఈయన భావప్రాధాన్య రచనలు చేసారు. ఈయన రచనా శైలి సరళంగా ఉంటుంది. కారా మాస్టారు తెలుగు కథకు దిక్సూచి. 1966లో ఈయన రాసిన 'యజ్ఞం' కథ తెలుగు పాఠకుల విశేష మన్ననలు పొందింది. దీనికి 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

"గొప్ప కథలు గొప్ప కథకులు రాస్తే తప్ప రావు. గొప్ప కథలు రాసే ఘనత ఒక రాచకొండ విశ్వనాథశాస్త్రికీ, ఒక బీనాదేవికీ, ఒక కాళీపట్నం రామారావుకీ దక్కింది." అని కొడవటిగంటి కుటుంబరావు గారు అన్నారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు కాళీపట్నం రామారావు గురించి ఈవిధంగా అన్నారు. "పురుషులలో పుణ్యపురుషులు వేరయా' అని వేమన గారు కాళీపట్నం రామారావు గార్లాంటి వారిని చూసే చెప్పి ఉంటారు అని అన్నారు.

ఈయన సామాజిక బాధ్యత తెలిసిన రచయిత. సమాజం శ్రమ జీవుల వలన సుఖగా ఉంటుందని, అందువలన అధికారం శ్రమ జీవుల చేతుల్లో ఉండాలని కాళీపట్నం రామారావు గారు భావిస్తారు. కన్నీళ్లు, రక్తపాతం లేనిదే అది సాధ్యం కాదనేది ఈయన భావన. ఈ వ్యాసంలో కూడా 'వీరుడు మహా వీరుడు' 'ఆదివారం' 'హింస' అనే మూడు కథలను తీసుకుని శ్రమ జీవుల గురించి, అలాగే సమాజంలో దోపిడికి గురి అవుతున్న స్త్రీల గురించి రాయడం జరిగింది.

వీరుడు మహా వీరుడు కథలో గంజిపేట రౌడీ, అల్లిపురం వస్తాదు హోరీరాహోరీగా కొట్టుకుంటారు. అయితే గంజిపేట రౌడీ నల్లిక నరంలా పీలగా వుంటాడు. అల్లిపురం వస్తాదు చెట్టంత మనిషి. ఇతను చుట్టూ జనం ఉన్నారు. కాబట్టి గంజిపేట రౌడీని చావబాధడానికి జంకుతున్నాడు. వీరి కొట్లాటను జనం చూస్తున్నారు. కానీ దెబ్బలు తింటున్న గంజిపేట రౌడీ పక్షము వంచించరు. ఈ గొడవ జరుగుతుండగా కొత్తపేట శాండో అనే పెద్ద రౌడీ వచ్చాడు. ఇతని ఆకారం ఆరున్నర అడుగుల పొడవు, అరవై అంగుళాల ఛాతీ. అలాంటి మనిషి ఇండియాలో ఎక్కడ దొరుకుతాడు? సైంటిఫిక్ లైన్లో పెంచిన బాడీ యేమో మోచెయ్యెత్తిగుద్దితే ముప్పై టన్నుల రాయైనా ముగ్గు ముగ్గు అయిపోతాది. కొత్తపేట శాండోని చూసిన వస్తాదు, "రా రా భాడకవ్. నీకు ఏ లంజా కొడుకడ్డు పడతాడో నేనూ సూస్తా" అన్నాడు. అప్పుడు గంజిపేట రౌడీ ''ఈ లంజకొడుకు యిడిపించడానికొచ్చి తంతున్నాడు. ఈడు నన్ను-ఒంటిగాణ్ణి సేసి-తంతున్నాడు. ఈడి వస్తాదు వొడుపులన్నీ సిన్నోణ్ణని నా మీద యిసురుతున్నాడు" అని దూషించాడు. దాంతో అక్కడికి వచ్చిన శాండో గంజిపేట రౌడీ చెయ్యి పట్టుకుని "శాంతించు'' అన్నాడు. ఈ మాట తనను తంతున్న వస్తాదుతో చెప్పమంటాడు అతను "ఆ మాట ఆడితో చెప్పరా శాండో, ఆడితో చెప్పు నువ్వు కొత్తపేట శాండోవని నాకు తెల్సు. నీ వెనక బోర్డు బలగం వుందనీ నాకు తెల్సు. తాపులు తింటున్నది నేను. తంతున్నది ఆడు, ఆడు నన్నేకాదు, నిన్ను

కూడా సవాల్ చేస్తున్నాడ్రా! నీక్కలేజా వుంటే దెబ్బలాడు. నాతో కాదురా ఆడితో, లేదా తప్పుకో!'' అన్నాడు. దాంతో "సరే నీ మాటే కానీ'' అంటూ మెలి తిప్పిన చెయ్యి పట్టుకుని ఒకిసురుడు ఇసిరేడు శాండో. ఆ దెబ్బకు వాడు వస్తాదు కబంధహస్తాల్లో పడ్డాడు రౌడీ. శాండో వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

తర్వాత గంజిపేట రౌడీ అక్కడి జనం తటస్థ వైఖరిని నిరసించాడు. దాంతో జనం రెచ్చిపోయి వాడిని చితకబాదారు. "అవునండీ తనకి తోచైనా తోచాల. ఒకడు చెప్పినప్పుడు యినుకోనైనా యినుకోవాల, శాండో ఎందుకీణ్ణి సైడు చయ్యలేదు? ఈళ్ళిద్దరూ అల్లిపురం వస్తాదును కొట్టలేరనా, ఈడీ సాయం కూడా దేనికి? ఆడు ఊ అంటే ఆడెనకున్న శిష్యులే భక్షించేస్తారు.'' దీన్నిబట్టి ఎవరైనా తమ శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా నడుచుకోవాలి. అలా తమ శక్తి సామర్థ్యాలు గురించి తమకు తెలియకుండా పెద్ద శత్రువుతో తలపడితే గంజిపేట రౌడీకి జరిగిన శాస్తి జరుగుతుందని తెలుస్తుంది. తమను గురించి తమకు తెలియకుంటే ఇతరులు చెప్తే తెలుసుకోవాలని పై వ్యాఖ్యలు వెల్లడిస్తాయి.

" బిగ్ పవర్లో ఉన్న ఆకర్షణే అది. మన వనుకుంటాం గాని యే కాలంలోనైనా, ఏ లెవల్లోనైనా బిగ్గూ,స్మాలూ తేడాలు ఉండనే ఉంటాయి. ఏకాలంలో అయినా గొప్పవాళ్ళు, సామాన్యులు బలవంతులు, బలహీనులు అన్న తేడా ఉంటుంది. ఈ తారతమ్యాలను తెలుసుకోవాలి. లేకుంటే గంజిపేట రౌడీ అల్లిపురం వస్తాదు దగ్గర తన్నులు తిన్నట్లు సమస్యల్లో యిరుక్కుంటారని తెలుస్తుంది. కొందరు "జనం జూస్తూ అన్యాయాలు జరగనిస్తారా? అనుకుంటారు. అనుకుని -న్యాయం ధర్మం అని పెద్ద పెద్ద కబుర్లతో చిక్కుల్లోపడతారు. పడి ఒకళ్ళకి తెద్దునా, అందరికీ తెద్దునా అని క్రైసిసులు సృష్టిస్తారు.'' న్యాయం, ధర్మం అని శక్తికి మించిన పనిచేస్తే బలహీనుడైన గంజిపేట రౌడీ బలవంతుడైన అల్లిపురం వస్తాదుతో తలపడి ఎట్లా సమస్యను కొనితెచ్చుకున్నాడో అలా సమస్యల పాలవుతారని పై వాక్యాలు వెల్లడిస్తాయి.

ఈ కథలో ఎవరైనా సరే ఒక పని చేయడానికి ముందు తమ శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకోవాలని, దానికి అనుగుణంగానే తన కార్యాచరణ వుండాలని, న్యాయం, ధర్మాన్ని రక్షించాలని తమ శక్తికి మించిన పని నెత్తికెత్తుకుంటే సమస్యల్లో పడతారన్న నీతిని ఈ కథ వెల్లడిస్తుంది. ఆదివారం కథలో పల్లె నుండి వచ్చిన సూరమ్మ, వయసు మీద పడడంతో తను పనిచేస్తున్న పెద్దింటి చాకిరీని అంకాలమ్మకు అప్పగిస్తుంది. అంకాలు తనకు ఆదివారాలు సెలవు కావాలంటుంది. అందుకు యజమానురాలు ఒప్పుకోదు. ఒకవేళ సెలవు పెడితే సెలవు రోజులకు 'జీతం కోసేస్తాను' అంటుంది. దానికి అంకాలు "అక్కడలాగ, ఇక్కడిలాగ ఉద్యోగాలు చేసే మీ మొగాళ్ళు ఏ సంకటాలూ లేకుండానే శలవుపెట్టి జీతాలు తీసుకోవడం లేదా? కాఫీ హెూటేళ్ళూ, కొట్లూ కట్టేయాలని గవర్నమెంటు రూలు పాస్చేసింది. పనోళ్ళకు ఒకరోజు శలవుండాలనే కదా?'' అని అంటుంది. అందుకు యజమానురాలు, "అయితే నిన్నుకూడా శలవు తీసుకోమని రూలు ఫేసు చేసే రేవిటే, అలాగని నేనెక్కడా వినలేదు'' అంటుంది. "మాకు వాళ్ళూ వీళ్ళూ రూలు పెట్టేదేవిటి మేవే పెడతాం రూల్సు'' అని అంతేకాకుండా "మీకైతే ఒక రూల్సంటారు. మాకైతే ఒక రూల్సంటారు. లోకవంతా మీలాంటి మనుషులేనని మీరేనాడు ఒప్పుకున్నారు'' అని దెప్పిపొడుస్తుంది.

డబ్బున్న ధనికులు, ఉద్యోగస్తులు, యజమానులకు ఆదివారాలు సెలవు కావాల. అంకాలు లాంటి పనివాళ్ళకు సెలవు అవసరం లేదు. వీరు పనివాళ్లను అసలు

మనుషులుగానే పరిగణించరని అంకాలు ఆవేదన వ్యక్తం చేస్తుంది. యజమానులకు ఒక రూల్సు, పనివాళ్ళకు ఒక రూల్సా అని తన యజమానురాలిని ప్రశ్నిస్తుంది. వారి అమానవీయతను వివక్షను అంకాలు ఎండగడుతుంది. అంకాలు సరైన సమయానికి పనికిరాదని, వేళకాని వేళ వచ్చి తాము విశ్రాంతి తీసుకునే సమయంలో వచ్చి తమ సుఖాన్ని చెడగొడుతోందని యజమానురాలు అంకాలును కోపగించుకుంటుంది. దానికి అంకాలు "ఔనమ్మా! యాళా పాళా నిద్దర్లా సుకాలు మీకే వుండాల. పొద్దుకులూ యండనక, వాననక, రెక్కలు ముక్కలు సేసుకునే వాళ్ళం - మా నిద్దర్ల సంగతేటో మా సాధక బాధకాలేటో మీకు పట్టవు" అని ఎత్తి పొడుస్తుంది.

యజమానులు తమ సుఖాలు సౌకర్యాలు తాము చూసుకుంటారని పని వాళ్ళ కష్టసుఖాల్ని గురించి పట్టించుకోరన్న ఆవేదన అంకాలు మాటల్లో వ్యక్తమవుతుంది. యజమానురాలు అంకాలుతో "మోయలేక నలిగి పోవడం దేనికి? చాతనైన మట్టుకే మాట పడకుండా చేసుకోగలిగే మేరకే పనులు ఒప్పుకోరాదా. డబ్బు చాలకపోతే ఆ ఒప్పుకున్న ఇళ్ళలోనే ఇంకో అర్థో, పావలో అడుక్కోవచ్చు" అనింది. దానికి అంకాలు రయ్........మంది. ''నిన్నూ నిన్నూ అడుక్కోడానికీ, నీ కాళ్ళూ నీ కాళ్ళూ పట్టుకు పిసకరించ డానికీ నాకేం పట్టిందమ్మా. నానేం అవిటిదాన్నా, సెవిటిదాన్నా? నేకపోతే వొళ్ళొంచడానికి కొల్లని సోవారిపోతునా? కష్టపడతాను. తెచ్చుకున్న కూరాకు తింటాను'' అని ఖరాఖండిగా పి. అంకాలు ఆత్మగౌరవం కల పనిమనిషి. తన కష్టంతో తాను బతుకుతానన్నది. ఒకరిని అడుక్కోనని తేల్చి చెప్తుంది. దీన్నిబట్టి అంకాలు లాంటి శ్రమజీవులు తమ శ్రమ మీద జీవిస్తూ ఆత్మగౌరవంతో జీవిస్తారని, ఎవరి వద్దా తలవంచరని వెల్లడవుతుంది. యజమానురాలు అంకాలుకు పోటీగా సూరమ్మను పనికి రమ్మని పిలిపిస్తుంది. సూరమ్మను చూసిన అంకాలు "ముసలి ముండా! నాలి ముచ్చు ఏసికాలూ, నంగిరి పింగిరి మాటలూ ఎక్కణేర్సినావే? పనెయ్యడాని కొచ్చిన లంజవి పన్జెయ్'' అంటూ రెక్క పట్టుకుని తోసింది సూరమ్మను. "యిదేటోలమ్మ! నా మీదడిపోతావ్.

ఆ యమ్మ రమ్మని కబురెడితే అదెందుకోనని నానొచ్చినాను. యిలాగని తెలిస్తే రాకనే పోదును.'' "ఇంటికి బిలిసి యిడువుళ్ళెడతారని నాకేం దెలుసూ'' అంటూ వెళ్ళిపోయింది. పై వాక్యాల్ని బట్టి యజమానులు తమ వద్ద పనిచేసే శ్రామికులను అదుపులో వుంచడానికి, వారినుండి శ్రమదోపిడీని నిరంతరం కొనసాగించడానికి పోటీ శ్రామికులను రంగంలోకి దించుతుంటారని తెలుస్తుంది. అయితే ఈ పన్నాగాన్ని పసిగట్టి శ్రామికులు కట్టుగా వుంటే ఆ కథలోని యజమానురాలి పన్నాగం ఎలా విచ్ఛిన్నం అయ్యిందో అలా యజమానుల మోసాలు చెల్లాచెదురవుతా యన్నది రచయిత ఉద్దేశ్యంగా చెప్పవచ్చు.

అంకాలు "నెలాకరు యీ యాల్టికి సరీగ్గా నాల్రోజులుంది. వొచ్చే నెలకి ఆ సూరమ్మనే యెట్టుకుంటారో యింకో పారమ్మనే యెట్టుకుంటారో నాకు తెల్దు. నాను మాత్రం ఒకటో తారీకునుండి పన్లోకి రాను'' అని వెళ్ళిపోయింది. అంకమ్మ పని నిలిపేసిన తర్వాత ఆ యింట్లో వారు పనిమనిషి కోసం ఎంత వెదికినా దొరకలేదు. అంతా విచారించిన తర్వాత అంకాలే దిక్కుగా తోచింది. అంకాలును గురించి "మనిషి కడిగిన ముత్యంలా ఉంటుంది. ఎక్కడేవస్తువు బడేసినా పూచికపుల్ల పోదు. ఏదో అనుకున్నాం గాని జీతం గూడ తక్కువే లాగుంది.'' అని యజమానురాలు తన యింట్లో వాళ్ళకు చెప్తుంది.

కష్టపడి పనిచేసే అంకాలులాంటి శ్రమజీవులు తమ కష్టం మీదే బ్రతుకుతారు. కాని దొంగతనాలకు పాల్పడరని

తెలుస్తుంది. కాబట్టి యాజమానుల జీవితాలు శ్రమజీవుల శ్రమ మీద ఆధారపడి వున్నాయని వెల్లడవుతుంది. ఆ శ్రమను అగౌరవపరిస్తే యజమానుల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయన్నది పై వాక్యాల్లో రచయిత భావనగా చెప్పవచ్చు. అంకాలును తిరిగి పనిలో పెట్టుకోవాలని ఆమె పనిచేసే కుటుంబం నిర్ణయిస్తుంది. అందుకోసం అంకాలు నెల జీతం ఎనిమిది రూపాయలు అయితే పది రూపాయలు ఇస్తారు. అంకాలు రెండు రూపాయులు చిల్లర లేదంటే పది రూపాయలు వుంచుకోమంటారు. అందుకుఅంకాలు "నాకొద్దమ్మా - నానుంచుకోను.

నాసొమ్మొకళ్ళమీదుండాలగాని నానొకాళ్ళదుంచుకోను" అంది పెళ్ళుమంటూ. శ్రమజీవులు అంకాలు లాగా తమ శ్రమ మీద ఆధారపడి నిజాయితీగా జీవిస్తారని, ఉచితంగా వచ్చే సంపద పట్ల ఆసక్తి చూపరని తెలుసస్తుంది. అదే విధంగా తమ శ్రమ ఫలితమే యితరులు అనుభవించాలని అంకాలు అనదాన్నిబట్టి తనలాంటి శ్రామికుల శ్రమతోనే ఈ సమాజం సుఖశాంతులు అనుభవిస్తోందని వెల్లడవుతుంది.

యజమానురాలు అంకాలుతో "నువ్ కావాలనుకున్న వారం శలవు కూడా నిరభ్యంతరంగా నీ యిష్టం వచ్చిన్నాడు తీసుకో. ఆదివారంనాడు మాత్రం నా చుట్టాలు పక్కాలు మధ్య నా పరువు నిలబెట్టు" అని అంటుంది. ఆదివారం నాడు తనింటికి చుట్టాలు వస్తారని ఆ రోజు సెలవు పెట్టవద్దని యజమానురాలు అంకాలును కోరుతుంది. ఆరోజు యింట్లో పనులు చేస్తే తన పరువు పోతుందని యజమానురాలు భావిస్తుంది. దీన్ని బట్టి యజమానులు, ధనస్వాముల పరువు ప్రతిష్టలు, సంతోషానందాలు శ్రమజీవుల శ్రమ మీద ఆధారపడి ఉన్నాయని తెలుస్తుంది.

ఈ కథలో శ్రమ ప్రాధాన్యతను, శ్రమ సమాజానికి బండికి ఇరుసుగా ఏ విధంగా పని చేస్తుందో అంకాలు పాత్ర కేంద్రంగా రచయిత చక్కగా చిత్రించాడు. హింస కథలో ప్రధాన పాత్ర పైడమ్మ. పైడమ్మ చెల్లెలు అయిన సంగి ద్వారా రచయిత కథను చెప్పిస్తాడు. ఈ కుటుంబాన్ని గురించి రచయిత "సంగికి తండ్రి - సిన్నప్పుడే పోనాడు" పైడమ్మ కాక, "యింక అప్పసెల్లెలు నేరు" అన్న ఒకడున్నాడు కాని "ఆడు ఇల్లరికం పోనాడు" అక్కడ్నిచి వాళ్ళన్న "యేం సాయం సెయ్యడు. సెయ్యడానికి ఆడికే యింకోళ్ళు గంజి పొయ్యాల". దీన్నిబట్టి ఈ కుటుంబాన్ని పోషించడానికి మగవారు లేరని, సంగి, పైడమ్మ వీరి తల్లి కూలి చేసి జీవించాలని విశదమవుతుంది.

వీరి పేదరికాన్ని గురించి "ముందు ట్రోజు కూలాడక, కసిన్ని బియ్యం వుంటే దీపాలెట్టక ముందే, తల్లీ కూతురూ గంజి కాచుకు తాగేశారు. పగలల్లా కంపకోసం యెండలో తిరిగిందేవో, సందేళకే నిద్దరొచ్చింది సంగికి." కూలి దొరికితేనే వీరికి పూట గడుస్తుంది. కూలి లేని రోజు పస్తులే అని తెలుస్తుంది. పైడమ్మకు వివాహమవుతుంది. అయిన తరువాత పొగాకు పనులకు కూలీకి వెళ్ళేది. అక్కడ అక్రమ సంబంధాలకు అలవాటు పడింది. ఇంట్లో ఈ విషయం తెలిసి ఇంట్లో నుండి ఆమెను వెళ్లగొట్టారు. దాంతో పొరుగింటివాళు ళ్నారని పట్నంలో కూలిచేసుకుందామని వెళ్ళింది. అక్కడ పైడమ్మ "పట్నం మట్టితొక్కిన ఒంటరి ఆడది, వయస్సులో వున్నది, ఒకసారి కాలు జారింది - సాయిలా ఫాయిలాగా నెగ్గడవంటే సామాన్యమా? కాదు మొదట మోసానికి లొంగిన మనిషి, బలవంతానికి పడిపోయింది. ఆ పడ్డం, పడ్డం దిగజారి దిగజారిసబ్బారపు సంజీవమ్మ కంపెనీలో తేలింది." పై వాక్యాలను బట్టి పైడమ్మ జీవితం మలుపు తిరిగి భోగం కంపెనీ ఊబిలోకి దిగజారిపోయింది.

పైడమ్మకు ఇష్టం లేకపోయినా తన చుట్టూ ఉన్న మనుషులు తన జీవితాన్ని ఎలా ఛిద్రం చేశారో వెల్లడవుతుంది. భోగం

కంపెనీలో పట్టుబడిన పైడమ్మను పోలీసులు కోర్టుకు తీసుకు వస్తారు. కేసులో సాక్ష్యం చెప్పడానికి పైడమ్మ వూరికి చెందిన కంసాలి గండడు ఆ కోర్టుకు వస్తాడు. పైడమ్మ విషయం తెలుసుకొని ఇతను అది తన వూరి వాళ్లకు చెపుతాడు.

పైడమ్మ భోగం కంపెనీ నుండి తన పుట్టింటికి వస్తుంది. ఈ విషయం తెలిసి బంధువులందరూ చూడడానికి వస్తారు. ఆమె భవిష్యత్తు గురించి చర్చిస్తారు. తల్లి రోదిస్తూ వుంటుంది. అప్పుడు బంధువులు పైడమ్మ గురించి తల్లితో "నయానో బయానో దాన్నుంచుతావనుకో... దాన్నెక్కడెడతాది? యింట్లెట్టగల్గా?... యెట్టి లోకంతో సాలగల్దా? సాల్లెప్పోయినా తప్పుతాదా.. అంటావు. అసలా గుంట లోకంలో తలెత్తుకు తిరగ్గల్దా?... యెత్తుకోనో దించుకోనో తిరుగుతాదందాం. ఈలోకం తిన్నగుడ్నిస్తాదా?.... నీ కళ్ళెదుట అది యింసపడ్డం యేరు కళ్ళ కనబడకండ యెక్కడో దాని పాటది పడ్డం యేరు. అందుకే ఆ గుంట ఒద్దంటోంది. దీనికి బోధపడదు'' అని అంటారు.

జీవితంలో పరిస్థితుల ప్రభావంతో పైడమ్మ లాంటి స్త్రీల జీవితాలు ఏ విధంగా ధ్వంసం అవుతున్నాయో తెలుస్తుంది. అదే విధంగా ఇలాంటి స్త్రీలు తిరిగి సాధారణ జీవితం జీవించాలంటే అందుకు లోకం ఎంత అడ్డంకిగా వుందో పై వాక్యాలు వెల్లడిస్తాయి. వీరు తమకు ఇష్టం లేకపోయినా గాడి తప్పిన జీవితాన్నే బలవంతంగా కొనసాగించే పరిస్థితులు సమాజంలో ఉన్నాయని రచయిత ఆవేదన వ్యక్తం చేశాడు. పైడమ్మ లాంటి స్త్రీలు పరిస్థితుల ప్రభావంతో తప్పు చేస్తే తిరిగి వారి తప్పు వారు తెలుసుకొని తమ జీవితాల్ని సరిదిద్దుకోనే వాతావరణం సమాజంలో వుండాలని రచయిత భావించాడు.

రచయిత కాళీపట్నం రామారావు పై కథల్లో సమాజంలోని స్థితిగతుల్ని చక్కగా చిత్రించారు. సమాజంలో లేనివాళ్ళు, ఉన్నవాళ్ళు బలవంతులు, బలహీనులు వున్నారన్నారు. అయితే సమాజం ఉన్నవాళ్ళు, బలవంతుల పక్షాన్నే వుంటుంది. సమాజంలో యజమానులు నిరంతరం శ్రమజీవుల శ్రమను ఏలా దోచుకోవాలని చుస్తుంటారు. వారి సక్షేమాన్ని గురించి పట్టించుకోరు. అదే విధంగా తమ అమాయకత్వంలోనో, పరిస్థితుల ప్రభావంతోనో ఆడపిల్లలు తప్పు చేస్తారు. అయితే తమ తప్పును తాము తెలుసుకుని సరిదిద్దుకునే అవకాశం తమ చుట్టూవున్న సమాజంలో వుండదు. తప్పు చేసిన అమ్మాయిని వేలెత్తి చూపి వేధించే పరిస్థితులు సంఘంలో నెలకుని వున్నాయి. సమాజంలోని ఈ స్థితిని మార్చాలని రచయిత తపన ఆయన రాసిన కథల వెనుక వున్న చోదక శక్తి.

ఆధార గ్రంథాలు :

1. కాళీపట్నం రామారావు రచనలు - కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్.
2. కాళీపట్నం రామారావు కథలు - నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, పుట: 05

BHAVAVEENA *Spl. Issue*
Vol.19, Issue. 5, May 2022
ISSN No. : 2456-4702 - RNI No.APTEL/2003/12253
భావవీణ
UCC CARE List Group -1 Journal
Under Arts and Humanities Category

# కాళీపట్నం రామారావు కథల్లో మానవ సంబంధాలు

**- శ్రీ పి. నారాయణరావు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం

కాళీపట్నం రామారావు గారు తెలుగు కథలురాస్తున్న వాళ్ళలో అగ్రశ్రేణికి చెందిన రచయిత. రామారావు గారి కథలలులోని పాత్రులు నిజ జీవిత సంఘటనలను తొంగి చూసినట్టుగా ఉంటాయి. అధమ తరగతి జీవితాన్ని ఎరిగిన వాళ్ళు అర్థం చేసుకొన్న వాళ్ళు ఆ తరగతి మీద అభిమానమూ ఆపేక్ష గలవారు మాత్రమే సారా కథలు, హంగామ క్విజ్, యజ్ఞం వంటి కథలు రాయగలరు. గురజాడ మీ పేరేమిటి? కథలో ఒక గ్రామానికి సంబంధించిన మౌఢ్యాన్ని గురించి రాస్తే కాళీపట్నం వారు ఒక గ్రామానికి సంబంధించిన రాక్షసాన్ని గురించి రాశాడు.

గొప్ప పుస్తకాలు మనకి హాయి కలిగించవు. మనని మనకి విప్పి చెప్పేసి అల్లరి పెడతాయి. అలజడి పెడతాయి. మనని నిలదీసి ప్రశ్నిస్తాయి? నిలబెట్టి నడిపిస్తాయి. ఏదైనా చివర్లో అదంతే ఫలితం అలాంటి విప్లవకరమైన అశాంతకి కారకులైన, ప్రమాదకరమైన రచయితలలో చాలా కొంద్ది మందిలో కాళీపట్నం వారు ఒకరు. రామారావు గారు కథలు చాలా క్లిష్టంగా రాస్తారు. అంచేత ఆయన కథల్లిన తిరిగి సొంత మాటల్లో చెప్పటానికి అంతగా వీలుపడదు.

రామారావు గారు మధ్యతరగతి కుటుంబాల్లో చిత్రించిన పాత్రలు అమాయకంగా, గంభీరంగా అంతరంగాలను చిత్రిస్తూ మానసిక పరిపక్వత చెందినట్లుగా కనిపిస్తాయి. రామారావు గారు కథ నిర్మించే తీరులో ఒక ప్రధానమైన క్లిష్టత ఉంది. అది దాదాపు ఆయన కథలకే వర్తించే క్లిష్టత. రామారావు గారు రచయితగా తన కథల్లో తరచు కనిపించరు. 'యజ్ఞం'లో అసలు కనిపించరు. ఆయన తన కథా వివరణ కోసం ఒక వ్యక్తిని వేరే తయారు చేస్తారు. మామూలుగా రచయిత మాటల్లో - తరచూ తెలుగు కథల్లో కనిపించే మాటలన్నీ ఈ వక్తవి. కథలో సంఘటనలనీ ఇతర సమాచారాన్ని మనకి వ్యాఖ్యానించే ఈ వక్తనీ, కథలో ఇతర పాత్రలకే వెనకాతల రచయిత రామారావు గారు ఉంటారు. ఈ సంగతి బోధ పరచుకోకపోదు. ఈ కథలో వక్త మాటలు రచయిత మాటలే అనుకునే ప్రమాదం ఉంది. కథలో పాత్రలకి గాని, ఈ వక్తకి గాని లేని అవగాహన రచయితకి మాత్రం ఉంటుంది. ఈ అవగాహన పాఠకుడికి అందడానికి కథ అంతా సావధానంగా, పూర్తిగా చదవాలి. రెండుసార్లు చదవాలి. మొదటిసారి చదివేటప్పుడు పాత్రల మాటలు, వక్త వ్యాఖ్యానాల పైపై అర్థాలు మాత్రమే. రామారావు గారు కథ మనకి చెప్పరు. కథ జరుగుతుంటే ఆ జరుగుతున్న క్రమంలో జరుగుతున్న సంఘటనలే మనకి కథ చెప్పేలా చేస్తారు.

ప్లాట్‌ఫారం కథలో పక్కింటి అమ్మాయి ఆయనికోసం నిరీక్షించడం ఒక రకమైన మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి కదిలినట్టుగా ఉంటుంది. రామారావు వెళ్ళిపోయింది కథలో సాయంకాలం వేగిరం భో./జనాలు పూర్తి చేసుకుందామని వెచ్చగా కప్పుకు పడుకొని చాలా కాంకు కలిసిన యే కొడుకులూ, తల్లిదండ్రులూ ఒకరితో ఒకరు ఒకరు వడిచి ఒకరూ ఏవేవో తరగతి సంగతులు చెప్పు కుంటారు. అవ్యక్తావస్తలో నిద్రపోయి చక్కని కలలు కంటారు. చిట్టిపాపలను కుర్చీలలో కూచోబెట్టి భోగిపళ్ళు పోస్తారు. టెక్కుగా దిగిన అల్లుళ్ళను ఎదుర్కొని పలుకరిస్తారు. మర్యాదలతో పనులన్నీ సందడిగా, తొందరగా చేస్తుంటారు. భోజనాలు పూర్తిచేసి సంతోషంగా, సుఖంగా, తృప్తిగా నిద్దరపోతారు.

అదృశ్యము కథలో పెళ్ళికూతురు లలిత యేమి చూసుకునే తండ్రి తెచ్చిన పెళ్ళి సంబంధాన్ని త్రోసి పారేస్తోంది. యెందరు ఎన్ని విధాలు చెప్పినా పోనీ కారణం చెప్పు అన్న లలిత మాటాడదు. బలహీనులు కథలో నర్సు

తనని చూసిన వ్యక్తిని చూస్తూ స్థిమితంగా ఉండలేకపోయింది. చదువు చాలించే అప్పుడు స్కూలును యింక శాశ్వతంగా విడిచిపెడుతున్నాం అనుకూంటూ పడే బాధను ఆ నర్సు పడింది. దుఃఖం ఘనీభవించి యాడవలేక, మానలేక ఎంతో యాతన పడింది. అప్పుడప్పుడూ అనుకుంటూ వచ్చేది ఆ అమాయుడిలో యేవేవో కోరికలను లేపి సంతృప్తి పరచకుండా నిర్దాక్షిణ్యంగా తరిమేశాడు పాప మాతడు. పాపం అతడు అని ఎంతో వేదన పడింది.

రేవతి నుంచి.... కథలో సీత అతగాడి ఉత్తరాలను చదువుకుంటుంది. కాని ఆమెకు వచ్చిన ఉత్తరంలో నాకు చాలామంది స్నేహితులు యింకా మనవాళ్ళు ఉత్తరాలు రాస్తుంటారు. కానీ ఉత్తరం చదువుకుంటేనే విసువు వస్తుంది. వాళ్ళ యిబ్బందులు, కష్టాలుతో నిండి ఉంటాయి. ప్రతి సంసారంలోను ఉంటాయి. ఐనా అక్షడకు తాము మహాకష్టాలలో పడి కొట్టుకు పోతున్నట్టు వ్రాస్తారు. మనది కూడా సంసారమే. నదీ, మనం కూడా అటువంటి కష్టాలనూ, యిబ్బందులను ఎదుర్కొంటామని వాళ్ళకు తెలియదు.

అవివాహితగానే వుండిపోతేకాని... కథలో స్త్రీ, చాణుక్య పౌరుషాన్ని మెచ్చుకోటానికి అలవాటు పడ్డ జీవితం. అటువంటావిడ నా వయసు పద్దెనిమిది ఇంకా నాకు భర్త కాదగినవాడు దొరకలేదు. అవసరమైతే ఇంకా ముప్పై ఏళ్ళయినా జీవితాంతం వరకూ కూడా యిలా పడి ఉంటే ఉంటాను. కానీ అనర్హుణ్నికట్టుకొని నా జీవితం బూడిద పోసిన పన్నీరు చేయలేను అనుకుంటుంది.

రేవతి నుంచి... నవచైతన్యం కథలో పెండ్లికొడుకు పిల్లను చూడడానికి నిచ్చి 'సంగీతం నేర్చుకొన్నట్టు చెప్పారు కదూ. మాటల్లో సందేహం తీర్చుకునే ప్రశ్నలూ గోచరించినా ఆ పోజూ ఆ వెధవ గొంతూ, ఏదీ ఒక పాట పాడమనండీ! అని ఆజ్ఞాపించడం... నిర్భాగ్యపు తండ్రి! ఆడపిల్లను కన్న దురదృష్టవంతుడు!! ఏం చేస్తాడు? చచ్చినట్లు కూతురుకు పాడమని తాఖీదు చేయడం ఆ బిడ్డ స్థితి వేరే చెప్పనవసరం లేదు. జరిగిన విషయాన్ని ఒట్టి గ్రహించవచ్చు.

రేవతి నుంచి... తల్లుల ప్రేమకథలో ఒక తల్లికి రాత్రంతా నిద్ర పట్టనీయకుండా నల్లులు కుట్టి బాధిస్తే పగలు బిడ్డ ఆడుకుంటూ, పాడుకుంటూ నిద్రాభంగం చేస్తోందని వీపు వాయగొడుతుంది.అదే పొరుగింటి అమ్మాయి సంగీత సాధన చేస్తే ఆ అమ్మాయి అలా చంరేసుండేది కాదేమో? పిల్లలు పెద్దవారి నిద్ర పాడు చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే అల్లరి చేస్తుంటారు అని నమ్మే మూర్ఖులుకూడా ఉంటారు.

జన నిష్టురాలు కథలో క్రొత్తగా వచ్చి జిల్లా కలెక్టరు శంకర్ నియోగి లంచం కట్టడనీ చాలా ఖచ్చితంగా ఉంటాడని వచ్చిన వార్త తాబేదార్లను గాక చీకటి బజారు వాలాలను, బస్సు కులస్తులనూ, చివరకు పోలీసు వంశీయులను కూడా అసంతృప్తులను చేస్తుంది. అయితే ఒకప్పుడు కలెక్టరు గారి దగ్గర పనిచేసి ఉన్న ఓ గుమస్తా మాత్రం వార్త వినగానే ఓ నిగూఢమైన నవ్వు నవ్వాడు. కాని అతను వచ్చాక అతని వ్యక్తిత్వంలో గుమస్తాకు ఆశ్చర్యం కలుగుతుంది.

అసలు రహస్యం కథలో సుందరానికి పేద్ద పేద్ద, గొప్ప గొప్ప చుట్టాలు వాళ్ళ మేనమామలు ఒకాయన పోలీసు సూపర్నెంటు, ఇంకో ఆయన సబ్ కలెక్టరు. పెత్తల్లి కొడుకు తాయరు, సుందరం ఇతరులతో సంచరించే టప్పుడూ, మాట్లాడేటప్పుడూ కూడా అచ్చా సూపర్నెంటు కలక్టర్ల మేనల్లుడు, తాయరుగారి పినతల్లి కొడుకుతోనే మాట&ఆలడేవాడు. ఎవళ్ళతోనైనా తన్నుతాను పరిచయం చేసుకునే అప్పుడైనా ఫలానావారి మేనల్లుడననీ, ఫలానావారి పినతల్లి కొడుకుననీ చెప్పుకునేవాడు. మిగతావారు మొహమాటానికి ఎవ్వరూ ఏమీ అడిగేవారు కాదు. ఒకవేళ అడిగినా అతడేదో చెప్పగల సమర్థుడే. అందుచేతే అతడికి ఇంకొకళ్ళ పేరు చేప్పుకోలేని ఆ గుమస్తాలకు మధ్య అంతపెద్ద అఖాతం ఉండేది. కీర్తికాముడు కథలో వెంకయ్యనాయుడు గారు ఆలుబిడ్డలనూ తనువునూ నమ్ముకోకుండా ఒక్క యశాన్ని మాత్రమే నమ్మేడు. నాయుడు గారింటికి

భట్రాజులు వచ్చేవారు. ఆయన కీర్తికాంత సౌందర్యాన్ని, లావణ్యాన్ని ఒకటోరెండో పద్యాలతో వర్ణించేనాకు అయిదో పదో జేబులో వేసుకు వెళ్ళేవారు. గంగిరెద్దులు వచ్చేవి. ప్రభువులవారికి దండం పెట్టేవి. ఒకటో రెండు భేషైన పంచలు మూపుమీద వేసుకుపోయేవి. గారడీవాళ్ళు, వాటి వాళ్ళు వచ్చేవారు నాయుడుగారి పేరు చెప్పి డోలు కట్టేవారు. ఇలా నాడూ నేడు వచ్చి పోయే ఆశ్రమాలు, హితువా వారిని ఏదోరకంగా దోచుకుపోయేవారు.

నాయుడుగారు ఆర్థికంగా పతనమైన తమ ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పు వాళ్ళకు చెప్పుకొని ఇప్పటికిలా పుచ్చుకొండని చెప్పడం నాయుడుగారికి చాతనయ్యేదికాదు. అందుచేత ఖర్చులు తగ్గించటం సాధ్యమవలేదు.

రాగమయి కథలో గిరిజమ్మగారు ఇంకొక ప్రశ్నవేసేలోగా వీధిలోనుండి శేఖరం నూతి వద్ద నుండి ఉమ ఒకసారి వచ్చారు. నెల్లాళ్ళ కాపురానికి యిలా ఒరుగైపోతే ముందు ముందు నూరేళ్ళులా గడుపుతావమ్మా అంది నవ్వుతో. నవ్వైతే సహజంగా ముగించింది. కాని తన గుండెలు కొట్టుకో సాగాయి ఉమకి. శేఖరం భార్యనుండి కనీసం ఒక చిరునవ్వైనా లభిస్తుందని ఆశించాడు. కానీ ఉమ ముఖాన అట్టి చిహ్నలేమీ కనిపించలేదు. ఆమె తొందరగా తువ్వాళ్ళు వెదికి తెచ్చి యిస్తూ వేగం రండి మరి అంటూ తను నూతివంక నడిచింది. శేఖరం మనస్సు కాస్త చివుక్కుమంది. జానకిని చూసి ఇంట్లో వేరేకాక ఇరుగు పొరుగుల వారు కూడా ఆశ్చర్యపోయారు. జానకిని రంజింపచేయడానికి తను చేసిన ప్రయత్నాల్నీ వ్యర్థమయ్యాయి. చివరికొక నాడు గిరిజమ్మ విసిగిపోయి ఉత్తేజిత స్వరంతో అత్తమామలు మంచి వారమి ఆడబడుతో కలివిడిగా తిరుగుతుండీ వెలగుడుతోనూ కీచులాటలు లేకపోతే మరి నీకేం మూడిందని ప్రశ్నించింది.

ఇలా కాళీపట్నం రామారావుగారి మానవ సంబంధాలు ఒకదానికొకటి పెనవేసుకుంటాయి. వారి బంధాలకు అతీతంగా ప్రవర్తిస్తూ మంచి, చెడు పెద్ద చిన్న ఎక్కువ, తక్కువ తారతామ్యాలను గరిగేస్తూ ప్రవర్తిస్తుంటాయి. అట్టడుగు వర్గాల్లోని వారి కథలను కళ్ళకు కట్టినట్టు చిత్రకారుడు తన కుంచెతో రంగుల చిత్రం గీసినట్టు రామారావు గారి కథలు ఆబాల గోపాలం మనుష్య మరో లోకంకి తీసుకుపోయి ఆరాత్రులు మనమే అయినట్లుగా భావిస్తూ ఉంటారు. అటువంటి పాత్రలను చిత్రిస్తూ తెలుగు కథా సాహిత్యం లో ఇమడ్చగల గొప్పవాళ్ళు శ్రీకాకుళం కథా రచయిత శ్రీ కాళీపట్నం రామారావు గారు ఒకరు.

❖ ❖ ❖

# కారా మాస్టారి సంకల్పం కథ - ఒక పరిశీలన

- **నండూరి అనంతలక్ష్మి**, సహాయాచార్యులు , తెలుగు శాఖ, ప్రభుత్వ సిటీ కళాశాల, నయాపూల్, హైదరాబాదు

కథలు చాలామంది రాస్తారు. యధార్థ జీవత వ్యధార్త చిత్రాలు రచించేవాళ్ళు వేళ్ళ మీద లెక్కపెట్టేటంత మందే ఉంటారు. అలాంచి వాళ్ళల్లో ఓచూపుడు వేలు సుప్రసిద్ధ కథకుడు కాళీపట్నం రామారావు. కా.రా. మాస్టారిగా కథాభిమానులంతా పిలిచే ఆయన యజ్ఞం కథ అప్పట్లో ఎంతో సంచలనం కలిగించింది. ఎన్నో వాదోపవాదాలు జరిగాయి. అవన్నీ ఒక పెద్ద పుస్తకంగా కూడా వచ్చాయి. కథ **'యజ్ఞం'** చేసిన కాశీపట్నం రామారావుగారు ఆర్తి, చావు, జీవధార, ఆదివారం వంటి కథలు రాసి తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన వారిలో ముందు వరుసలో ఉంటాయి.

రావిశాస్త్రిగారి ప్రసిద్ధ కథ జరీ అంచు తెల్లచీరకు సమాంతరంగా సంకల్పం అనే కథను వ్రాశారు. సమకాలీన రాజకీయాలలోను, అనాదిగా వస్తున్న రాజకీయాలలోను, వడిచిన నడుస్తున్న ఉద్యమాలలోను చివరికి కౌటుంబిక జీవితంలోను 'అధికారమార్పిడి' ఎప్పుడు ఘర్షణతో కూడు

కుంటుందన్న రేడియోలో చదివి, ఆమీదట కద్ది మార్పులతో "రచన' మాస పత్రికలో 1992 అక్టోబరు నెలలో ప్రచురించారు.

రామభద్రయ్య భార్య సుభద్రమ్మ, ఆమె పెద్దకొడుకు సుదర్శనం, కోడలు శకుంతల ఇందులో ప్రధాన పాత్రలు రామ భద్రయ్య అస్థికలను గంగా నదిలో కలపడమనే ఇతివృత్తం నేపథ్యంగా ఒక తరం నుండి ఇంకొక తరానికి జరిగే అధికార మార్పిడిలోని ఘర్షణ ప్రధానాంశంగా వ్రాయబడిన కథ సంకల్పం. రామభద్రయ్యకు పన్నెజోళ్ళ వయసులో తండ్రి చినిపోతే పినతండ్రి ఆ ఇంటికి పెద్ద దిక్కుగా వస్తాడు. నమ్మక ద్రోహియైన పినతండ్రి మైనరుతరపున గార్డియన్‌గా వ్యవహరిస్తూ దొరికినాడికి అప్పులు చేసి కాలం చేస్తాడు. మైనారిటీ తీరిన తరువాత కోర్టులూ, లావాదేవీలు, అప్పిచ్చిన రైతులతో రగడ, రాజీలు, మిగిలిన భూమిలో వ్యవసాయంలాంటి ఘర్షణతో తాత నుండి అధికారం బదలాయింపబడుతుంది. మగపిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్ళిళ్ళు, వెండిబంగారాల అమ్మకం, భూముల తాకట్టు, అమ్మకాలు వంటి వాటితో ఊపిరాడని జీవితం గడుపుతాడు. పెద్ద కొడుక్కి పట్నంలో రెండోకొకుక్కి దూరదేశంలో ఉద్యోగం దొరికితే పరీక్ష తప్పిన మూడోకొడుకు ఊళ్ళో వ్యవసాయం చేస్తూ తండ్రికి అండగా ఉంటాడు. పెద్దవాళ్ళిద్దరూ ఆఖరివాడి చదువు, ఆడపిల్లల పెళ్ళిళ్ళకు ఆదుకుంటారు. ఇంత జీవన పోరాటంలో రామభద్రయ్య బయటి వారితో ఎలా ఉన్నా పిల్లలతో ఘర్షణ పడటంగాని, నోరుజారడంకాన చేసేవాడు కాదు. అందుకే పిల్లలకు ఆయనపట్ల భయంకన్నా గౌరవాభిమానాలే ఎక్కువ.

సుభద్రమ్మ కాపురానికి వచ్చినప్పుడు తన, భర్త అత్తగారు ముగ్గురితో కూడిన కలతెరుగని సంసారం అత్తగారి పెద్దరికంలో సంసారం దిద్దుకుంటూ భర్తతో పాటు అందరి గౌరవం పొందేది. కొడుకుల పెళ్ళిళ్లై కోడళ్ళు వచ్చిన తరువాత తను తన అత్తగారు మనసిచ్చి పుచ్చుకున్నట్ల ఒక్క కోడలూ ఆవెుకు సన్నిహితం కాకపోవడం ఆవెు దురదృష్ట మనుకుంటుంది. యాభయ్యోపడిలో పడినతరువాత రామభద్రయ్యకు కాశీవెళ్ళి గంగాస్నానం చేసి రావాలనే కోరిక కలిగింది. మొదటిసారి కాశీయాత్రా ప్రయాణంపెట్టుకోగానే రామభద్రయ్య తల్లికి పక్షవాతంమొచ్చి ప్రయాణం ఆగిపోతుంది.ఆవిడ పోయిన తరువాత అస్థికలు గంగలో కలపాలనే నెపంతో రెండవసారి కాశీ ప్రయాణం పెట్టుకునే సరికి ఎక్కడో యుద్ధం మొదలైంది. ఏక్షణాన ఎక్కడెక్కడికి యుద్ధ మేఘాలావరిస్తాయనే భయంతో రెండో ప్రయత్నం

కూడా ఆగిపోయింది. మూడవసారి పెద్దకొడుకు యాత్రాస్పెషల్లో టిక్కెట్లు తీసుకుంటే రైలుబోగీ రిపేరు వచ్చి యాత్ర వాయిదా పడుతుండటంతో విసిగిపోసిన రామభద్రయ్య తనకేయాత్ర ప్రాప్తం లేదని కాశీప్రయాణాన్ని విరమించుకుంటాడు. కానీ ఆయాత్ర ప్రాప్తి కానందుకు

చాలా బాధపడతాడు. మూడోసారి కాశీ ప్రయాణం తప్పేక మరికొన్నాళ్ళకు సుదర్శనం రైల్వేలో పనిచేస్తున శకుంతల తరపు చుట్టం కుటుంబంతో తల్లిదండ్రులిద్దరినీ కాశీకి పంపించాలనుకుంటాడు, అయితే సుభద్రమ్మ తిరస్కరిస్తుంది. కానీ తరువాత కాశీ ప్రస్తావన తెచ్చి వెళ్ళలేకపోయినందుకు ఆయన చింతిస్తుంటే దొరికిన అవకాశం పోగొట్టానే అని సుభద్రమ్మ బాధపడుతుంది.

రామభద్రయ్యకు ప్రమాదంలో తుంటిఎముక విరికి నెలల తరబడి మంచాన పడేసరికి చేయిజారిన పెత్తనం మళ్లా ఆయన చేతికి రాలేదు. తండ్రికి చెప్పేకే ఏపనన్నా చేసే కొడుకు తనే వ్యవహారాన్ని నడిపించడం తండ్రి అడిగితే విసుక్కోవడం వరకు వచ్చింది. అధికారం కొడుకులచేతికి మారింది. మళ్ళీ కాలుజారి పడిన రామభద్రయ్యకు విరగిన కాలి ఎముకే మళ్ళీ తునకలైంది. దాంతోమంచానపట్టి సంవత్సరం తిరిగేసరికళ్ళా రామభద్రయ్య మరణిస్తాడు. తన అత్తగారికి తను కడదాకాఎలా ఆదరంతో గౌరవంతో సేవ చేసేదో అలాంటిసేవే తన కొడుకులు, కోడళ్ళ నుండి తన భర్తకుజరగాలను ఆశించింది. కానీ అవేవీ జరగకపోగా తానే తన భర్తకు సేవచేసింది. వయోభారంతో శరీరం సహకరించ నప్పుడు మనిషికాలూ, చెయ్యి బంగేదాకా బతిక్కూడదు. ఏదో ఓదారి చూసుకో వాలనుకునేది. కాని భర్త పోయాక కొడుకుతో, కోడళ్ళూ, సంతానాలు వచ్చాక, వాళ్ళ ఆపేక్ష గమనించాక తన నిర్ణయం మరిచిపోయింది. కాని భర్త అస్థికలతో కాశఈ ప్రయాణం నిర్ణయమైన రాత్రి ఆచిత్తక్షోభా, ఆనిర్ణయం మళ్ళా జ్ఞాపకం వచ్చాయి. మళ్లీ అవే ఊహలు మనసులో మెదులుతున్నాయి. కాశీలోఉండగా సుదర్శనం తల్లిని ఇకపై తనతో ఉండాలని తాను కోరుకుంటున్నాడని అంటాడు. తండ్రి మంచాన పడ్డది లగాయితూ తమ కుటుంబ సభ్యుల మనసుల్లోనూ, ప్రవర్తనలోను వాళ్ళకే తెలియకుండా వస్తున్న మార్పులనూ, ఆమార్పుల కారణంగా తల్లిదండ్రుల చిత్తక్షోభా అతడు గమనిస్తూనే ఉన్నాడు. తన కుటుంబమనే కాదు ఎదిగిన సంతానం, వయసు మళ్ళి తల్లిదండ్రులూ కలిసున్న మరికొన్ని కుటుంబాలూ అంతటా ఇవే మార్పులు. సర్వసాధారణమైన ఈ రకం పరిణామాలూ, సంక్షోభాలు, ఇలాంటి కుంటుంబాలుగా, సమాజాలుగా బతకటం ఆరంభించి నాయకత్వం, యజమాన్యం, పెద్దరికం వంటివి ఏర్పరచు కున్నాక తరంమారి కొత్తతరం తలెత్తినప్పుడల్లా వస్తూనే ఉన్నాయి. పెద్దరికం కోసం నాయకత్వం కోసం పడుచుదనం పాతతరాన్ని సవాలు చేస్తూనే ఉన్నది. ముందు తరంలో లుప్తమైపోతున్న ఉత్సాహం, సామర్థ్యం తమలో ఉరకలు వేసి ఉరికిస్తూ ఉంటే, కళ్లాలు తమ తమ చేతిలోకి తీసుకోవడానికి కత్తతరం ఉద్రేక పడుతుంది. తన కుటుంబంతోకూడా ఇలాంటి ఘర్షణను గుర్తించిన సుదర్శనం పిల్లలు ఇంటిపెత్తనం కావాలను కోకముందే దాన్ని వాళ్ల కప్పగించడం మంచిది అనే అభిప్రాచం సుదర్శనానికి కలుగుతుంది. సుదర్శనం అభిప్రాయం సుభద్రమమ్మను ఆలోచనలో పడవేస్తుంది. ఎదిగిన సంతానాలు, వయసు ముదిరిన తల్లిదండ్రులూ ఉన్న ప్రతి కుటుంబంలోను ఇలాంటి ఘర్షణలుంటాయని ఆలోచినస్తా నిద్రకుకూడా దూరమవుతుంది సుభద్రమ్మ.

❖ ❖ ❖

మే 2022

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

**కాళీపట్నం రామారావు సాహిత్యం - సమాలోచన**

భావవీణ ప్రత్యేక సంచిక






# ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్.